యాభై సంవత్సరాల జ్ఞాపకాలు

డా॥ దేవులపల్లి రామానుజరావు

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాద్

యాభై సంవత్సరాల జ్ఞాపకాలు

(1929 నుంచి 1979 వరకు)

డా. దేవులపల్లి రామానుజరావు

ప్రధాన సంపాదకులు
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా॥ సి. నారాయణరెడ్డి
అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు
డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

ప్రచురణ

ఆంధ్రసారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, ఆబిడ్స్
హైదరాబాద్

YABHAI SAMVATSARALA JNAPAKALU

By **Devulapalli Ramanuja Rao**

First Published 1981

Second Print March 2015

© Andhra Saraswatha Parishath

Pages : 152

Copies : 1000

Price : 100/-

For Copies

Andhra Saraswatha Parishat

Tilak Road,
Abids, Hyderabad
Ph : 040-24753724

DTP : Lakshmi Srinivas
9885021639

Printed of

Sai Likhita Printers

Khairatabad, Hyderabad-4.
Ph: 040-65545979

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road,
Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

అవతారిక

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ కాళోజి నారాయణరావు, శ్రీ బూర్గుల రామకృష్ణారావు, శ్రీ లోకనంది శంకర నారాయణరావు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ వంటి సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943 మే 26న రూపుదిద్దుకుని ఈ రోజు తెలంగాణలో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు డా॥ దేవులపల్లి రామానుజరావుగారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించినారు. పరిషత్తు బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నది. పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద తెలుగు పరీక్షలు జరపడంతోపాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వహిస్తున్నది. పరిషత్తు ఏర్పాటు చేసే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, పరిణతవాణి ప్రసంగాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి తెలంగాణ వైశిష్ట్యానికి అద్దం పడుతున్నవి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం అభిమానించి స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలవరించింది.

2013లో పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది. తెలంగాణ ప్రత్యేకతలోని వివిధ పార్శ్వాలను ఆవిష్కరించే సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నిపుణుల ప్రసంగ వ్యాసాలను "వ్యాసగుళుచ్ఛం" పేరుతో పరిషత్తు రెండు భాగాలు వెలువరించింది. వివిధ రంగాలలో తెలంగాణ వైశిష్ట్యాన్ని విశదీకరించే "తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం"పై సదస్సు వంటి కార్యక్రమాలను పరిషత్తు ఏర్పాటు చేసింది.

తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమై 2014 జూన్ 2వ తేదీన ప్రత్యేక

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణను సర్వతోముఖంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు ఉద్యమస్ఫూర్తితో కృషి చేయడం హర్షణీయం. తెలంగాణ భాషా సాహిత్య కళా సంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం ఏడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో ముందుకు సాగుతున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు బంగారు తెలంగాణ నిర్మాణంలో తన వంతు పాత్రలో భాగంగా విశిష్ట కార్యక్రమాలకు రూపకల్పన చేసి నిర్వహిస్తున్నది. వాటిలో కొన్ని – తెలంగాణ మాండలిక పదాలు – ప్రయోగ వైశిష్ట్యం, ప్రాచీన తెలంగాణ తెలుగు కవుల సాహితీసేవ, తెలంగాణ చిత్రకళ, శిల్పకళల వైభవం, తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలపై సదస్సు, తెలంగాణ కవయిత్రుల, కథయిత్రుల రాష్ట్రస్థాయి సమ్మేళనం.

తెలంగాణ వైభవోన్నతిపై ప్రత్యేక గ్రంథప్రచురణను పరిషత్తు చేపట్టింది. ఈ పరంపరలో ప్రస్తుత గ్రంథం తెలుగు సాహిత్యసేవకు పర్యాయపదంగా నిలిచిన డా॥దేవులపల్లి రామానుజరావు గారు రచించిన "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు". సాహిత్యంతో పాటు భాష, విద్య, గ్రంథాలయాలు, ఉద్యమాలు, పత్రికలు, సహకారం, రాజకీయాది రంగాలలో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో, పార్లమెంటులో విశేష కృషి చేసిన బహుముఖప్రజ్ఞాశాలి ఆయన. పన్నెండేళ్ల ప్రాయం నుంచి అర్ధశతాబ్ది కాలంలో ఆయన జ్ఞాపకాలు, అనుభూతులు, అనుభవాల సమహారమే ఈ గ్రంథం. జాతీయోద్యమం, నిజాంపాలన, రజాకార్ల దౌర్జన్యాలు, తెలుగుకు స్థానం, నాగపూరులో చదువులు, ఆంధ్రోద్యమం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, సాహిత్య సంస్థలు, మహాసభలు, సమావేశాలు, సాంస్కృతికరంగం, హైదరాబాదు సంస్థాన విమోచనోద్యమం, పోలీసు చర్య, కవిపండితులు – మొదలైన అంశాలపై ప్రామాణికంగా పరమ పఠనీయశైలిలో విలువైన వివరాలు, స్పందనలు దీనిలో పొందుపరిచారు. నవ తెలంగాణ నిర్మాణం జరుగుతున్న ఈ దశలో నేపథ్యాన్ని చిత్రించే ఈ గ్రంథం అన్ని వయోవర్గాల పాఠకులకు అత్యంత ప్రయోజనకరమని భావిస్తున్నాను.

పరిషత్తు వెలువరిస్తున్న ఈ గ్రంథం ఎప్పటిలాగే అందరి మన్ననలను పొందగలదని విశ్వసిస్తున్నాను.

హైదరాబాద్
తేది : 24.03.2015

(డా.సి.నారాయణరెడ్డి)
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : 040-24753724

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విభిన్నమైన కార్యక్రమాల్లో పుస్తక ప్రచురణ విశిష్టమైంది. పరిషత్తు ప్రచురించిన గ్రంథాల పట్టికను చూస్తే ఎంత గొప్పవైన ప్రచురణలు వచ్చాయో తెలుస్తుంది. పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు పరీక్షల నిర్వహణ, భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే సదస్సుల నిర్వహణ, పెద్దల పేరిట నిర్వహించే సంస్మరణ ప్రసంగాలు, పరిణతవాణి ప్రసంగ పరంపర కొనసాగుతూ అనుబంధంగా పుస్తక ప్రచురణ జరుగుతున్నది. 2013 సంవత్సరంలో పరిషత్తు అధ్యక్షులు డా. సి.నారాయణరెడ్డి నేతృత్వంలో సప్తతి పూర్తి సందర్భంగా ఏడాది పొడవునా అనేకమైన ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. 'తెలంగాణ తెలుగు సాహిత్య వికాసం', 'తెలంగాణ ప్రాచీన కవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు-ప్రయోగ రీతులు', 'తెలంగాణ ప్రాచీన నృత్య రీతులు', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'తెలంగాణ కవయిత్రులు, కథయిత్రుల సమ్మేళనం' వంటి అనేక సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తరుణంలో తెలంగాణలో సాహిత్య చైతన్యాన్ని పెంపొందించే కృషిలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని పరిషత్తు భావించింది. నవ్య స్ఫూర్తితో ప్రచురణల్ని కూడా వెలువరించాలని నిర్ణయించింది. గత సంవత్సరం పరిణతవాణి ప్రసంగాలతో కూడిన సంపుటి, 'తెలంగాణ సాహిత్య వికాసం', 'వ్యాసగుళుచ్ఛం' రెండు సంపుటాలు ప్రచురించడం జరిగింది. వాటిని పాఠకులు ఆదరించారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ నూతన యుగోదయవేళ తెలంగాణకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధ్యయనం జరగాలి. ఆ అధ్యయనానికి కావలసిన పఠనసామాగ్రిని సమకూర్చుకోవాలి. ఇప్పటివరకు ఉమ్మడి చరిత్రలో అంతర్భాగంగా వుండి తగినంత ప్రాధాన్యం లభించలేదని ప్రజల్లో వున్న అసంతృప్తిని పోగొట్టాలి. ఆ దిశగా ఆంధ్ర సారస్వత పరిషత్తు వెలువరిస్తున్న ఆ

ప్రచురణల్లో 'తెలంగాణ సాహిత్యచరిత్ర', 'తెలంగాణ ప్రాచీనకవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు–కావ్యప్రయోగాలు', 'కుతుబ్‌షాహీల తెలుగు సాహిత్యసేవ', 'మాఊరు మాట్లాడింది', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసావళి', 'తెలంగాణ ప్రముఖుల పరిణతవాణి', 'బంజారాల వివాహ ఆచార పద్ధతులు', 'యాభైసంవత్సరాల జ్ఞాపకాలు', 'తెలంగాణ చరిత్ర', 'తెలుగు జానపద సాహిత్యం–స్త్రీల గేయాల్లో సంప్రదాయం' ఈ సంవత్సరం వెలువుడుతున్నాయి.

'డా.దేవులపల్లి రామానుజరావు యాభై ఏళ్ళ జ్ఞాపకాలు' తెలంగాణ చరిత్ర నిర్మాణానికి ఎంతో ఉపకరించే గ్రంథం. ప్రత్యేక తెలంగాణ అవతరించి వివిధ రంగాల్లో ప్రాచీన కాలం నుంచి తెలంగాణ మూలల్ని అన్వేషించుకొని తనదైన సమగ్ర వ్యక్తిత్వాన్ని లభించుకునే తరుణంలో పరిషత్తు ఈ గ్రంథాన్ని పునర్ముద్రించడం సంతోషదాయకం. డా.దేవులపల్లి రామానుజరావు 20వ శతాబ్దంలో మహెూన్నతంగా భాసించి తెలుగు భాషా సాహిత్య వికాసకృషిని తన కృషితో శాసించిన వారు. ఒక్క భాషా సాహిత్యాలే కాదు విద్యా, సాంస్కృతిక, రాజకీయాది రంగాల్లోనూ చెరగని ముద్ర వేశారు. అన్నిటికీమించి ఆంధ్ర సారస్వత పరిషత్తు మొక్కకు నీరు పోసి పెంచి పచ్చగా కళకళలాడుతూ అక్షరాస్యతవ్యాప్తికి, భాషా సాహిత్య వ్యాప్తికి ఇంత సేవ చేయడానికి కారకులైనవారు. పరిషత్తు ప్రాంగణం ఆయన జ్ఞాపకాలతో నిత్యం పలవరిస్తుంది. మాకు స్ఫూర్తి ప్రదాత వారు. అటువంటి మహనీయుని యాభై ఏళ్ళ జ్ఞాపకాలు కాలారీత్యా ఆనాటి హైదరాబాద్ రాష్ట్ర చరిత్ర, విశాలాంధ్ర నిర్మాణం, అనంతర పరిణామాలు చాలా ముఖ్యమైన కాలం. అటువంటి కాలానికి సంబంధించిన వారి జ్ఞాపకాలతో కూడిన పుస్తకాన్ని వరంగల్లు సాహితీ బంధుబృందం 1981లో ముద్రించింది. ప్రతులు ఈనాడు లభ్యం కావడం లేదు. అందువల్ల పరిషత్తు అధ్యక్షులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు ఆచార్య సి.నారాయణరెడ్డిగారి అధ్యక్షంలోని పరిషత్తు కార్యవర్గసమావేశం నిర్ణయాన్ని అనుసరించి పునర్ముద్రిస్తున్నాం. పాఠకలోకానికి అందిస్తున్నాం.

జె చెన్నయ్య

డా. జె.చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

రెండు మాటలు

భారతదేశ చరిత్రలో 19వ శతాబ్దం తుది సగం, 20వ శతాబ్దం మొదటి సగం చరిత్ర నిర్మాణం జరిగినకాలం. ఇంగ్లీషు ప్రభుత్వం ఏలుబడిలో ఉండిన భారతదేశం 20వ శతాబ్దం మొదటి సగం చివర స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నది; తత్ఫలితంగా ఇంగ్లీషు ప్రభుత్వానికి సామంతులుగా ఉండిన స్వదేశ సంస్థానాలు కూడా అంతరించినవి; పాకిస్తాన్, భారతదేశాలు రెండు అవతరించినవి; భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినవి. భారతదేశం, ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా అందుకు అనుగుణమైన రాజ్యాంగాన్ని సిద్ధం చేసుకొని, సామ్యవాద సరళి సమాజ స్థాపన లక్ష్యంగా ఎన్నుకొని, ప్రణాళికాబద్ధమైన కృషిని సాధనంగా స్వీకరించినది.

1947 ముందు (అనగా భారతదేశానికి స్వాతంత్ర్యము రాకపూర్వము) పరిస్థితులు నేటి పౌరులకు, విశేషించి యువతీ యువకులకు తెలియకపోవచ్చును. ఆ కాలంలో నివసించిన వారు కొందరు ఆనాటి పరిస్థితులను, ఆ పరిస్థితులలోని అనుభవాలను తెలియజేసే ఉద్దేశంతో కొన్ని పుస్తకాలు వ్రాసి ప్రకటించినారు. ఇదికూడా–అదే వరుసలోనే వెలువడుతున్నది.

ప్రస్తుత తెలంగాణా జిల్లాలు అప్పుడు హైదరాబాదు సంస్థానంలో నిజాం పరిపాలనలో ఉండేవి. ఆ కాలంలోని స్వాతంత్ర్య, జాతీయ, విమోచనోద్యమాలను గూర్చి నాలుగైదు గ్రంథాలను పెద్దలు వ్రాసినారు. అయితే ఆ గ్రంథాలలో సాహిత్య, సాంస్కృతిక రంగాల ప్రస్తావన మిక్కిలి తక్కువ. నిజాం పరిపాలనలో తెలంగాణ ఒక ద్వీపకల్పంగా ఉన్నప్పటికిని సకల భారత స్వాతంత్ర్యోద్యమము సమస్త ఆంధ్ర సాంస్కృతికోద్యమము మొదలైన జాతీయోద్యమాలు సహజంగానే యీ ప్రాంతాన్ని ప్రభావితం చేసినవి. ఆ కాలంలో ఒక సంపన్న కుటుంబానికి చెంది, ఇంగ్లీషు ద్వారా ఉన్నత విద్యను ఆర్జించి, దేశ స్వాతంత్ర్యాన్ని కోరి, మాతృభాషల

వికాసాన్ని అభిలషించి సకల భారత జాతీయోద్యమాన్ని; సమస్త ఆంధ్ర సాంస్కృతికోద్యమాన్ని అవగాహన చేసుకున్న ఒక విద్యావంతునికి తాను చూచి, స్వయంగా పాల్గొన్న ఉద్యమాలనుగూర్చిన, విశేషించి సాంస్కృతికోద్యమాలను గూర్చిన జ్ఞాపకాలు ఎన్నో ఉన్నవి. అందులో కొన్నింటిని యీ పుస్తకంలో చదువ వచ్చును. మిత్రుల ప్రేరణయే నన్ను యీ జ్ఞాపకాలను గ్రంథస్థం చేయడానికి ప్రోత్సహించినది.

దేవులపల్లి రామానుజరావు

యాభై సంవత్సరాల జ్ఞాపకాలు

ఒక జాతి చరిత్రలో యాభై సంవత్సరాలకాలం యేమంత యెక్కువకాక పోయినప్పటికిని అంత తక్కువ కాలం కూడా కాదు. ఒకసారి వెనుదిరిగి చూచుకొంటే 1929 నుంచి 1979 వరకు జరిగిన కాలం అయిదు దశాబ్దాలు, అనగా యాభై సంవత్సరాలు, ప్రపంచ చరిత్రలోను, భారతదేశ చరిత్రలోను ముఖ్యాతి ముఖ్యమైన ఘట్టం. అంతకుపూర్వం వలెగాక ఈ అయిదు దశాబ్దాలలో ప్రపంచ దేశాలు ఒకదానికి ఒకటి మిక్కిలి దగ్గరగా వచ్చినవి. ఏ దేశంలో ఏ సంఘటన జరిగినా దానిని గూర్చి ప్రపంచమంతా ఆలోచించడం, ప్రభావితం కావడం జరుగుతున్నది; సైన్సు, టెక్నాలజి ప్రపంచ నాగరికతకు ప్రాతిపదికలుగా స్థిరపడినవి.

భారతదేశంలో యీ యాభై సంవత్సరాలలో వచ్చిన మార్పులు మరే యాభై సంవత్సరాలలోను రాలేదని చెప్పితే అతిశయోక్తి కాదు. ఇంగ్లీషువారి ఏలుబడికిందికి వెళ్ళి తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయిన భారతదేశం ఈ యాభై సంవత్సరాలలో తన స్వాతంత్ర్యాన్ని తిరిగి సంపాదించుకున్నది. ప్రపంచ చరిత్రలో గౌతమబుద్ధుని, ఏసుక్రీస్తుని ప్రక్క నిలువగలిగిన గాంధీమహాత్ముని నాయకత్వ భాగ్యం యీ స్వరాజ్య సముపార్జనకు లభించినది. తత్ఫలితంగా సమస్త భారతదేశం ఒక పరిపాలన క్రిందికి వచ్చినది. రాజరికాలు, సంస్థానాలు అంతరించినవి. ప్రజలకు సార్వభౌమాధికారం సిద్ధాంతరీత్యా సంక్రమించినది. సిద్ధాంతరీత్యా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం దేశాన్ని పరిపాలిస్తున్నది. ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని భారతదేశం చేపట్టినది. సామ్యవాద సరళి సమాజస్థాపన, శ్రేయోరాజ్యం తన ఆదర్శాలుగా లక్ష్యాలుగా స్వీకరించి భారతదేశం ముందుకు పోతున్నది; వ్యవసాయం, పరిశ్రమ, విద్య, ఆరోగ్యం మొదలైన రంగాలలో ప్రగతి సాధిస్తున్నది. ఆచరణలో లోపాలు ఏమి ఉన్నప్పటికిని, ఆశయాలు మహోన్నతమైనవి.

1929వ సంవత్సరంలో అఖిలభారత జాతీయ మహాసభ లాహోర్‌లో, యువకుడైన జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన సమావేశమై బ్రిటిష్ పరిపాలన నుండి దేశం పూర్తిగా విముక్తిపొంది సంపూర్ణ స్వరాజ్యసాధనమే తన ఆశయమని స్పష్టంగా ప్రకటించినది. అందుచేతనే యీ సంవత్సరానికి యింత ప్రాధాన్యం. దాదాభాయి నౌరోజి, లోకమాన్య బాలగంగాధర తిలక్, మహాత్మాగాంధీవంటి మహనీయుల

నాయకత్వంలో నడుస్తున్న భారతజాతీయ కాంగ్రేసుకు జవహర్‌లాల్ వంటి యువకుల నాయకత్వం కూడా యీ సంవత్సరం లభించినది. ఆ రోజుల్లో జవహర్ లాల్‌నెహ్రూ పాశ్చాత్య ప్రజాస్వామిక భావాలచేతను, రష్యన్ విప్లవంచేతను, సామ్యవాదము చేతను, ప్రబోధితుడైన యువకుడు; గొప్ప ఆదర్శాలు కలిగి భారతదేశ భవిష్యత్తును గూర్చి బంగారుకలలుకంటున్న మేధావి; భావుకుడు; స్వాతంత్ర్య యోధుడు, దేశ భక్తాగ్రగణ్యుడు.

1928లో ఆయన తండ్రిగారు మోతీలాల్ నెహ్రూ భారత జాతీయ కాంగ్రేసుకు అధ్యక్షులుగా నుండి 1929లో తన కుమారుడైన జవహర్‌లాల్‌కు ఆ పదవిని అప్పగించడం చరిత్రాత్మకమైన సంఘటన. ఆనాడే జవహర్ లాల్ భావిభారత ప్రధాని అని పెద్దలు ఆశీర్వదించినట్లు యీ సంఘటన రుజువు చేస్తున్నది. 1929-47 మధ్యన సత్యం, అహింస అనే ఆయుధాలతో గాంధీమహాత్ముడు అనేక ఉద్యమాలు నడిపించి మనదేశం నుండి ఇంగ్లీషురాజ్య నిష్క్రమణను సాధించినాడు. ఈ నిష్క్రమణ తర్వాత జవహర్‌లాల్ తొలి ప్రధాని అయినాడు. భారత ప్రజలు ఎన్నుకొన్న రాజ్యాంగపరిషత్తు భారత రాజ్యాంగాన్ని సిద్ధం చేసినది. అందులో ప్రాథమిక స్వత్వాల, నిర్దేశిక సూత్రాల క్రోడీకరణ జరిగినది. రక్తరహిత విప్లవం, సంపూర్ణ ప్రజాస్వామికం, సామ్యవాదం మొదలైన ఆశయాలు జనులను ఉత్తేజపరిచినవి. నూతన రాజ్యాంగం 1952లో అమలులోనికి వచ్చినది. గాంధీ మహాత్ముడు నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యం యిచ్చినాడు. ఆయన అనుచరులు కూడా స్వాతంత్ర్యపోరాటంలో యీ విలువలను పాటించినారు. 1948 జనవరి, 30వ తేదీనాడు గాంధీమహాత్ముని హత్య జరిగినది. క్రమక్రమంగా ఆయన పాటించిన నైతికవిలువల ప్రాధాన్యము తగ్గుముఖం పట్టినది. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా సుస్థిరమైన సమర్థవంతమైన ప్రభుత్వం ఏర్పడినప్పటికిని దేశంలో బలమైన ప్రతిపక్షం రూపొందలేదు. ప్రజాస్వామ్యం ప్రవర్ధమానమగుటకు యిదొక పెద్ద అడ్డంకిగా పరిణమించినది. జవహర్‌లాల్ తర్వాత సుమారు ఒక సంవత్సరము లాల్ బహద్దూర్ శాస్త్రి, ఆ పిమ్మట రెండు సంవత్సరాల అంతరాయంతో యిప్పటి వరకు ఇందిరాగాంధి భారతదేశ పరిపాలనను నడిపినారు. 1977లో ఇందిరాగాంధి ప్రభుత్వం పతనమై జనతాపార్టీ ప్రభుత్వం ఏర్పడి 1979లో ఆ ప్రభుత్వం తొలగిపోయి తిరిగి జరిగిన ఎన్నికలలో ఇందిరాగాంధి అధికారంలోనికి వచ్చినది, ఎవరు ఏమన్నప్పటికిని రాజకీయరంగంలో వ్యక్తిగత ప్రాబల్యం, ప్రజలను

ఆకర్షించగల నైపుణ్యం ఇందిరాగాంధీకి ఒక్కరైకే ఉన్నదని వెల్లడైనది. రాజ్యాంగ స్వరూపం ఏమైనప్పటికిని భారతీయులలో వ్యక్తి ఆరాధన ప్రబలంగా ఉన్నదని 1980వ సంవత్సరము రుజువుచేసినది. అందుచేతనే 1929 నుండి 1979 వరకు గల అర్ధ శతాబ్ద కాలాన్ని నా జ్ఞాపకాల కొరకు నిర్ణయించుకోవడం జరిగింది.

ఈ అర్ధశతాబ్దానికి సంబంధించిన జ్ఞాపకాలు అనేకరంగాలకు సంబంధించినవి; అనేక ఉద్యమాలకు సంబంధించినవి; అనేక వ్యక్తులకు సంబంధించినవి. ఈ జ్ఞాపకాలను ఒక్కసారి తలచుకొంటే, యీనాటి సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొంటే, భిన్నమైన వ్యక్తులలో భిన్నమైన అభిప్రాయాలు ఏర్పడవచ్చును, భావిచరిత్రకు ఏమైన ఉపయోగపడవచ్చును; మనతరానికి ప్రబోధమో, గుణపాఠమో కలుగవచ్చును. ఆ ఉద్దేశంతోనే యీ జ్ఞాపకాలకు అక్షరరూపం ఈయనైనది. ఈ ఉద్దేశం వాస్తవమో, భ్రాంతియో కాలమే నిర్ణయించగలదు.

1929లో జవహర్‌లాల్ లండన్‌లో చదువుకొని వచ్చిన ఉన్నత విద్యాపారీణుడు; సమస్త ప్రపంచాన్ని సందర్శించి నూతనభావాలు కలిగిన యువకుడు. కాంగ్రేసులో యువకులను కొందరిని ఉత్తేజపరిచి, భారత ప్రజానీకాన్ని ఆకర్షించినాడు. జవహర్‌లాల్‌తోపాటు సుభాస్ చంద్రబోస్ కూడా యువనాయకుడుగా ముందుకు వచ్చినాడు. కాంగ్రేసులో సోషలిస్ట్ విభాగం ఏర్పడినది. ఆచార్య నరేంద్రదేవ్, జయప్రకాశ్ నారాయణ ప్రభృతులైన మేధావులు, దేశభక్తులు సోషలిస్టు విభాగానికి నాయకులుగా జవహర్‌లాల్‌కు సన్నిహితులుగా ఉండేవారు. రష్యన్ విప్లవభావాలు నాటి రచయితలను, మేధావివర్గాన్ని ఆకర్షించినవి. క్రమక్రమంగా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడినది. పి.సి.జోషి, రణదివే, సుందరయ్య ప్రభృతులు కమ్యూనిస్టు విభాగానికి నాయకత్వం వహించినారు. అరుణా ఆసఫలీ వీరికి దగ్గరగా ఉండేది. గాంధీగారి ఆదర్శాలను, కార్యక్రమాలను వీరు వ్యతిరేకిస్తుండేవారు. ఉపన్యాసాలలో ఎటువంటి విప్లవభావాలు ప్రకటించినప్పటికిని జవహర్‌లాల్ ఆచరణలో పెద్దలకు దగ్గరగా ఉండేవాడు. అందుచేతనే పెద్దలతోడ్పాటు ముఖ్యంగా గాంధీ మహాత్ముని తోడ్పాటు జవహర్‌లాల్‌కు లభించినది. అఖిలభారత కాంగ్రేస్ తీర్మానాలలో జవహర్‌లాల్ కొన్ని నూతన భావాలను ప్రవేశపెట్టినాడు. ఆ భావాలలో 1. సామ్యవాదం, 2. ప్రణాళికాబద్ధమైన సర్వతోముఖ దేశాభివృద్ధి, 3. ప్రజలు ఎన్నుకొన్న రాజ్యాంగ పరిషత్తుచేత రాజ్యాంగ నిర్మాణం అనునవి ముఖ్యమైనవని ఈ అభిప్రాయాన్ని

గాంధీమహాత్ముడే 'హరిజన్' పత్రికలో ప్రకటించినాడు. గాంధీమహాత్ముని నాయకత్వాన్ని సుభాస్‌చంద్రబోసు ప్రభృతులు ధిక్కరించేవారు. ఒక పర్యాయం ★అరుణా ఆసఫలీ అఖిల భారత కాంగ్రేస్ సమావేశాలలో మాట్లాడుతూ "బాపూజీ, ఇంతవరకు మీరు చెప్పినట్లు మేము వినినాము. ఇకముందు మేము చెప్పినట్లు మీరు వినవలసి ఉంటుంద"ని గర్జించిన సంఘటన ఆనాడు యువకులుగా ఉన్న నావంటి వారికి బాగా జ్ఞప్తి ఉన్నది. ఆ రోజులలో అనగా భారత స్వాతంత్ర్య ప్రాప్తి వరకు (15వ ఆగస్టు, 1947 వరకు) భారతదేశాన్ని బ్రిటిష్ ప్రభుత్వం పరిపాలించినది. బ్రిటిష్ ప్రభుత్వానికి సామంతులుగా ఐదు నూర్లకుపైగా స్వదేశ సంస్థానాధిపతులుండేవారు. వీరందరు బ్రిటిష్ ప్రభుత్వం అడుగులకు మడుగులొత్తుతు, పరమ విధేయులై తమ ప్రజల మీద నిరంకుశాధికారాన్ని చెలాయిస్తూ ఉండేవారు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రత్యక్షంగా పాలించిన ప్రాంతాలలో ప్రజలకున్న సదుపాయాలు కూడా స్వదేశ సంస్థానాల ప్రజలకు లేకుండేవి. ఈ స్వదేశ సంస్థానాధీశ్వరుల ధనము, కాలము విలాసాలకు, వినోదాలకు ఉపయోగపడు తుండేవి; దేశ క్షేమం ప్రజల శ్రేయస్సును గూర్చి ఆలోచనలు వారికి ఉండేవికావు.

భారతదేశంలో సాగుతున్న జాతీయోద్యమ, స్వాతంత్ర్యోద్యమ ప్రభావాలు అప్పుడప్పుడు స్వదేశ సంస్థాన ప్రజలను కొంత కదలిస్తుండేవి. ఇది ఆ స్వదేశ సంస్థానాధీశ్వరులకు కంటగింపుగా ఉండేది. అందుచేత వారు దమననీతిని అవలంబించేవారు. ఆ రోజుల్లో యీ స్వదేశ సంస్థాన ప్రజలపట్ల శ్రద్ధ తీసుకున్న వారిలో గాంధీమహాత్ముని తర్వాత, జవహర్‌లాల్ నెహ్రూ, షేక్ అబ్దుల్లా, డాక్టర్ పట్టాభి సీతారామయ్య ప్రభృతులు పేర్కొనదగినవారు. స్వదేశ సంస్థానాల ప్రజల విమోచన కొరకు కృషి చేయడానికి "సంస్థాన ప్రజల కాన్ఫరెన్సు' అనే సంస్థ ఒకటి ఉండేది. దానితో వీరందరికీ సంబంధము ఉండేది. ఆ కాలంలో యీ స్వదేశ సంస్థానాలకు సర్ అక్బర్ హైదరీ. సర్ మిర్జా ఇస్మాయిల్, సర్ సి.పి.రామస్వామి అయ్యర్ వంటి మేధావులు, పరిపాలనాదక్షులు ప్రధానమంత్రులుగా ఉండి ఇంగ్లీషు ప్రభుత్వానికి దగ్గరగా ఉండేవారు.

అప్పటి అయిదునూర్ల పైచిలుకు స్వదేశ సంస్థానాలలో హైద్రాబాదు, మైసూరు,

---

★ శ్రీమతి ఆసఫలీ సోషలిస్ట్ భావాలుగల దేశసేవకురాలు భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వీరనారీమణి.

కాశ్మీరు, తిరువాన్కూర్, కొచ్చిన్, బరోడ, బికనీర్ మొదలైనవి ఉండేవి. ఈ సంస్థానాధీశ్వరులందరు బ్రిటిష్ ప్రభుత్వానికి పరమవిశ్వాస పాత్రులైన విధేయ సామంతులు. అప్పుడు భాషారాష్ట్రాలు లేకుండెను. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్లోని 23 జిల్లాలలో 13 జిల్లాలు మదరాసు రాష్ట్రంలోను మరి 10 హైదరాబాదు రాష్ట్రంలోను ఉండేవి. ఈ విధంగా తెలుగు ప్రజలు మూడింట రెండు వంతులు ప్రత్యక్షంగా బ్రిటిష్ పరిపాలనలోను, ఒకవంతు నిజామునవాబు నిరంకుశ పరిపాలన క్రిందను ఉండేవారు. అయినప్పటికిని తెలుగు ప్రజల పరస్పర సాంస్కృతిక సంబంధాలు ఎన్నడూ తెగిపోలేదు. నాటకాలు, అవధానాలు, గ్రంథాలయాలు, పుస్తకాలు మొదలైనవి కవిపండితులతోపాటు తెలుగు ప్రజలను సాంస్కృతికంగా బంధించి ఉంచినవి.

బ్రిటిష్ పరిపాలనలోని తెలుగు ప్రజలపైన లేని నిర్బంధాలు ఎన్నో నిజాం రాష్ట్రంలోని తెలుగు ప్రజల మీద ఉండేవి. చివరి నిజాం ఉస్మాన్ ఆలీఖాన్ నిరంకుశ పరిపాలకుడుగా దమననీతిని అవలంబించి తుది దశలో మతశక్తులకు పూర్తిగా లొంగినాడు. ఆయన తండ్రిగారి కాలంలో జాగీర్దార్ వ్యవస్థలోని కొన్ని ఉదారవిధానాలు ఆయన కాలంలో అంతమొందినవి. కడమలోపాలు యేమైనప్పటికిని ఆయన తండ్రిగారైన మహబూబ్ అలీఖాన్ గారికి తన ప్రజలపట్ల కులమత విచక్షణ పాటించని ఆదరాభిమానాలు ఉండేవి. ఆయన పరిపాలనలో ప్రతి సంవత్సరం మూసీనది ఉప్పొంగి వరదలు వచ్చేవి. ఆ వరదలో హైదరాబాదు మునిగిపోయేది. ఆ సందర్భంలో ఆయన యేనుగుమీదయెక్కి వరదలలో మునిగిపోయిన బీదప్రజలను చూచి కన్నీళ్ళుగార్చి ఆ దీనులకు ఉచిత భోజన సౌకర్యాలు మొదలైనవి కల్పించేవాడని వినికిడి. అందుచేత ప్రజలు ఆయనను అభిమానంతో స్మరించేవారు. తరువాత ప్రసిద్ధ ఇంజనీయర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారి సలహాతో, సహాయంతో మూసీనదికి ఆనకట్టకట్టి గండిపేట చెరువును ఉస్మాన్ సాగర్ పేరుతో నిర్మించి యీ వరదలను నిరోధించడం జరిగింది. శ్రీ విశ్వేశ్వరయ్య హైదరాబాదు ప్రజల ప్రాణదాత. ఈనాటికి యీ చెరువే హైదరాబాదు ప్రజల నీటి అవసరాలను తీరుస్తున్నది. నూటికి తొంబైమంది మాట్లాడే ప్రజల భాషను అణచివేసి, నూటికి పదిమంది మాట్లాడే ప్రజలభాషను అందరి నెత్తిమీద రుద్ది, పరిపాలనను, ఉన్నత విద్యాబోధనను అల్పసంఖ్యాకుల భాషలలో నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ నడిపినాడు. ప్రపంచానికి ప్రజల మాతృభాషలో ఉన్నత విద్యాబోధన, పరిపాలన జరిపిస్తానని ప్రచారం చేసుకుంటుండేవాడు; ప్రాథమిక

స్వత్వాలు పూర్తిగా లోపించి ఉండేవి. సాహిత్య సభలు చేసుకోవలెనన్నా, గ్రంథాలయాలు నడుపుకోవలె నన్నా, పత్రికలను నడుపుకోవలెనన్నా, ప్రజల వికాసానికి మేలుకలిగించే పనిని చేయవలెనన్నా ప్రభుత్వం అనుమతి అవసరమై ఉండేది. ఆ అనుమతి దొరకడం దుర్లభంగా ఉండేది. పల్లెటూరి ప్రజలు ఆర్థికంగా, వైజ్ఞానికంగా వెనుకబడి ఉండేవారు. ఇంగ్లీషు ద్వారా ఉన్నత విద్యను బోధించే కళాశాల హైదరాబాదులో ఒక్కటే ఉండేది. అది మదరాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండేది. అందులో మూడునూర్ల సీట్లుమాత్రమే ఉండేవి. ఆ సీట్లు ఉన్నత వర్గాలకు మాత్రమే దొరికేవి. ఇంగ్లీషు ద్వారా మెట్రిక్‌లేషన్ వరకు విద్యను బోధించే హైస్కూల్ తెలంగాణములో ఒక్కటే ఉండేది. విద్యావ్యవస్థలో తెలుగు భాషకు స్థానమే లేకుండేది. ప్రాథమిక విద్య కూడా తెలుగు భాషలో దొరికే అవకాశం లేకుండేది. ఈ విధంగా ప్రజల వైజ్ఞానిక వికాసాన్ని పూర్తిగా నిరోధించడం జరిగింది.

నిజాం ప్రభుత్వం ఎంత ఉలికిపడినప్పటికిని, ఎంత నిరోధించినప్పటికిని, జాతీయభావాలు హైదరాబాద్ రాష్ట్రంలో క్రమక్రమంగా వ్యాప్తిచెందినవి. అఖిలభారత జాతీయకాంగ్రేస్ ఉద్యమ ప్రభావం మహాత్మాగాంధి, జవహర్‌లాల్ ప్రభృతుల నాయకత్వ ప్రభావం హైదరాబాద్ ప్రజలమీద కూడా పడి యిక్కడ జాతీయోద్యమాలు బయలుదేరినవి. ఆ జాతీయోద్యమాలలోని అంతర్భాగాలే సాంస్కృతికోద్యమాలు కూడ, ఆంధ్రోద్యమం, గ్రంథాలయోధ్యమం యీ తరగతికి చెందినవే; ఉద్యమానికి ప్రత్యక్షంగా యేపేరు పెట్టనప్పటికిని ప్రచ్ఛన్నంగా యివన్నీ జాతీయోద్యమాలే; ప్రజల విమోచనానికి, ప్రాథమిక హక్కుల సాధనానికి వైజ్ఞానిక వికాసానికి కృషి చేసిన ఉద్యమాలే. ఈ ఉద్యమాలను అణచివేయడానికి అప్పటి ప్రభుత్వం అన్ని ఆయుధాలను ప్రయోగించినది. ఆ రోజుల్లో నిజాం ప్రభువుకు 'సుల్తాన్-ఉల్-ఉలూమ్' అనే బిరుదు ఉండేది. అనగా ఆయన విద్యలకు ప్రభువు అన్నమాట. ఈ విద్యల ప్రభువు పరిపాలనలో ఉన్న ప్రజలలో మాతృభాషావికాసం నిండుసున్న. అక్షరాస్యులు నూటికి ముగ్గురు నలుగురు మాత్రమే. నూటికి తొమ్మిదిమంది మాట్లాడే అల్పసంఖ్యాక భాషకే సమస్త సౌకర్యాలు.

తొంబదితో పది సమమను తురకలెక్కది యెన్నాళ్లు?
పోలీసుటండను దౌర్జన్య శక్తులు పోషణ పొందేదెన్నాళ్లు?
నల్లగొండలో నాజీశక్తుల నగ్ననృత్య మెన్నాళ్ళు?

అని కాళోజి కవి ఆ రోజులలో ప్రశ్నించాడు-

ప్రత్యక్షంగా నిజాం ప్రభువుగారి సొంతయేలుబడి క్రింద ఉండిన 'సర్ఫెఖాస్' ప్రాంతంలో (హైదరాబాదు పరిసర ప్రాంతాలలో) ఒక్క హైస్కూల్ కూడా లేకుండేదన్న సంగతి ఆ రోజులలో అందరికీ తెలిసిన సత్యం. ఇటువంటి పరిస్థితులలో జీవించిన నావంటి వారికి ఎన్నో జ్ఞాపకాలున్నవి.

ఆ రోజులలో నిజాం ప్రపంచంలో అందరికన్నా యెక్కువ ధనవంతుడని ప్రతీతి. ఆయన డబ్బు అనేక రకాలుగా సమకూర్చుకొనేవాడు. ఆయన తండ్రి కాలంలో లేని ధనరాశిని ఆయన చాలా ప్రోగు చేసుకున్నాడు. ఉద్యోగులవద్ద, జాగీరుదారుల వద్ద రకరకాల సన్నివేశాలలో ఆయన డబ్బు సేకరిస్తుండేవాడు. ఆయన నివసించిన కింగుకోఠి రాజభవన్ ఎవరో ఒక శ్రీమంతుడు నిర్మించగా దానిని ఆక్రమించినాడని అనుకుంటుండేవారు. స్వయంగా చాలాసాధారణమైన దుస్తులు తొడిగి అతి సామాన్యమైన జీవితాన్ని గడిపేవాడు. అందరు ఆయనను లోభి అని భావించేవారు. ఆంధ్రోద్యమంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించి తెలంగాణ నాయకులలో ప్రసిద్ధిపొంది ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైన తర్వాత మంత్రి పదవిని అలంకరించిన ఒక పెద్దమనిషి నాకు చెప్పిన కథ యీనాటికీ జ్ఞాపకమున్నది. నిజాం నవాబు తన జన్మదినోత్సవ సందర్భంలో ప్రతి సంవత్సరం కొందరిని ఆహ్వానించేవారు. వారందరు ఆ సందర్భంలో హాజరై కనీసం ఒక అష్రఫీని (బంగారునాణెం) అయినా సమర్పించుకోవలసి వచ్చేది. ఒక జన్మ దినోత్సవానికి యీ పెద్దమనిషికి ఆహ్వానం వచ్చింది. ఈయన ధనవంతుడుకాడు. అయితే పబ్లిక్ రంగంలో ప్రముఖుడు! పత్రికా రచయిత, ఆంధ్రోద్యమ, జాతీయోద్యమాలకు నాయకుడు; ఈ ఆహ్వానాన్ని నిరాకరించలేని పరిస్థితిలో ఏదో కష్టపడి స్వహస్త పరహస్తాలతో ఒక అష్రఫీని సేకరించుకొని జన్మదినోత్సవానికి యీ ప్రముఖుడు హాజరయినాడు. జన్మదినోత్సవ కార్యక్రమంలో తనను పిలువగానే, వంగి సలాంచేసి, అష్రఫీని సమర్పించుకొన్న తర్వాత, తాను జాతీయోద్యమాలను బలపరచేవాడు అయినందువలన తగినన్ని చీవాట్లు తలవాచేటట్లుగా తనను నిజాం పెట్టినాడని స్వయంగా ఆయన నాతో చెప్పినాడు. నిజాం అన్నమాటలు ఏమి అని నేను ఆయనను ప్రశ్నించగా అవి తన 'గొంతులో మాత్రమే ఉండి పోగలవు; క్రిందికిరావు, మీదికి పోవు. నా జన్మలో ఎవరికీ చెప్పను' అని ఆయన అన్న మాటలు యీ నాటికి నా చెవిలో ప్రతిధ్వనిస్తున్నవి. నిజాం

నవాబుగారు ప్రతివారిని అరే, తురే అనే పలుకరించేవాడు. అసభ్యంగా మాట్లాడేవాడు. మంత్రులతో సైతం యిదే ధోరణితో మాట్లాడేవాడు. ఒక్క మహారాజా కిషన్ ప్రసాద్ బహద్దూర్‌ను తప్ప కడమవారందరిని నిజాం అగౌరవంగా పలుకరించి మాట్లాడేవారు.

ఇంకాకొన్ని సంవత్సరాలకు స్వరాజ్యం వస్తుందనగా నిజాం నవాబు అహంకార ధోరణి మరీ విపరీతంగా పెరిగింది. భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల వ్యతిరేకతా, బ్రిటిష్‌వారు వెళ్ళిపోతే తనే సార్వభౌమాధికారం గల స్వతంత్ర రాజును కావలెనన్న కోరికా, అందుకోసం అందరు ఉర్దూలోనే చదువుకోవలెనన్న మొండిపట్టుదలా, ఇస్లామ్ మతాన్ని అనుసరించేవారు కడుమ ప్రజలకన్న అధికులన్న అభిప్రాయం. ఈ అభిప్రాయానికి అనుగుణమైన ఆచరణా యివన్నీ ఆయనలో కరుడుగట్టి ఉండేవి. వీనిని సాధించుకోవడానికి నిజాం నవాబు రజాకార్ ఉద్యమాన్ని ప్రోత్సహించి ఘోర కిరాతక కృత్యాలను ప్రజలమీద జరిపించిన సత్యం అందరికీ తెలిసినదే, ఉర్దూలో మొత్తం పరిపాలన నిర్వహించి, ఉర్దూద్వార ఉన్నత విద్యను బోధించడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించిన నిజాం, ఉర్దూభాషలో పారిభాషిక పదాల నిర్మాణానికి కోట్ల రూపాయలు ఖర్చు చేసినాడు. ఒక్కొక్క పదానికి యిన్ని రూపాయల ప్రతిఫలము అని నిర్ణయించి కృత్రిమ పదజాలాన్ని సృష్టింప జేసినాడు. అయితే ఈ కృత్రిమ పదజాలం తొందరగానే లోపించి ఆయన అధికార నిష్క్రమణతో వాడుకలో నుంచి అంతరించి పోయినది. గాలిబ్, ప్రేంచంద్‌వంటి వారి సాహిత్యమే మిగిలినది. నిజాం ప్రోత్సాహం వలన ఒక ఉత్తమ రచయితగాని, ఒక ఉత్తమ రచనగాని వెలువడినట్లు కనిపించదు. మఖ్దూమ్‌వంటి మహాకవి ఆ రోజులలో ఆవిర్భవించినప్పటికిని ఆయన నిజాం ప్రోత్సాహంతో వచ్చినవాడుకాడు. నిజాంను వ్యతిరేకించి, ప్రతిఘటించి తన వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకున్నాడు. ప్రజల భాషలను పూర్తిగా అణగద్రొక్కడం యీయనకాలంలో జరిగింది. ఆ రోజుల్లో పెండ్లి పేరంటాలలో కూడా తెలుగువారు పరస్పరం బంధుమిత్రులతో ఉర్దూలోనే మాట్లాడుకొనేవారు. ఆంధ్రోద్యమ నాయకులు తాము కలుసుకున్నప్పుడు పరస్పరం ఉర్దూలోనే మాట్లాడుకోవడం నాకు బాగా జ్ఞప్తికి ఉన్న సత్యం.

ఆ రోజుల్లో తెలుగువారిని గురించి కొందరు కవులు వ్రాసిన మాటలు గమనించదగినవి.

ఏభాషరా? నీది ఏమివేషమురా ?

ఈ భాష యీ వేష మెందుకోసమురా ?

అని ఒకరు మందలించగా

మరొకరు –

"హోలీయంచును, గాలిబంచును సదా ఎఖ్బాలెపోషాయరిన్

చాలాచాల నఫీసులుట్టిపడ మాషాల్లారచించెన్‌గదా"

అని మరొకకవి నాటి తెలుగువాని చిత్తవృత్తిని చిత్రించినాడు. తరువాత ఐ.సి.యస్‌లో ప్రవేశించి, పెద్ద ఉద్యోగాలు చేసిన ఒక విద్యాధిక యువకుడు

"ఒక వంక ఆంగ్లేయ సుకుమారి యిచ్చగిం

పుల తోడవలపింపదలచుచుండ

ముసుగులో దాగిలిమూతలాడుచు ఉర్దు

భాషావనిత వలల్ బరచుచుండ

అప్సరోభామిని నంచు సంస్కృత కాంత

పాలిండ్లు పొంగార పైబడంగ

తగుదునమ్మా యంచు వగలాడి గ్రామ్యంపు

కులుకు మిటారి తళ్కులు నటింప

హింది కన్యను పెండ్లాడు మీ యటంచు

పెద్దలందరు బలవంతపెట్ట నకట !

చిన్నతనమునుండి నెచ్చెలిగ నున్న

తెలుగు కన్నియ ముద్దులు దీర్చుటెపుడొ"

అని ఆనాటి అన్యభాషా వ్యామోహాన్ని రమ్యంగా వెల్లడి చేసినాడు. అందుచేతనే ఆంధ్రుడు తౌరుక్యాంధ్రుడుగా మారిపోయినాడని స్వర్గీయ సురవరం ప్రతాపరెడ్డిగారు ఉద్ఘాటించినారు. ఈ సందర్భంలో ఉర్దూభాషను గూర్చిన మరొక దృక్పథాన్ని, (మిక్కిలి ముఖ్యమైన దృక్పథాన్ని) వివరించవలసి ఉన్నది. ఉర్దూభాష హిందూ ముస్లింల సమైక్యతకు చిహ్నము; ఆ భాష రమ్యమైన భాష. ఉర్దూమాతృభాషకాని వారు అనేకులు ఉర్దూభాషా సారస్వతాల వికాసానికి కృషి చేసినారు. అందుచేత ఆ భాషపట్ల యితర భాషలు మాట్లాడేవారికి వ్యతిరేకతలేదు; అభిమానమే ఉన్నది. కాని నిజాం ప్రభుత్వము

ముఖ్యంగా తుది పరిపాలకుడు. ఆ భాషా ప్రచారానికి అనుసరించిన విధానాలవలన, ఆ భాషను ఇస్లాంమతంతో ముడిపెట్టడానికి చేసిన ప్రయత్నం వల్ల ప్రజల భాషలను అణిచివేయడానికి పన్నిన పన్నాగాలవలన ఆ కాలంలో ఉర్దూపట్ల వైముఖ్యం యేర్పడినది. ఆ వైముఖ్యము తాత్కాలికమే. ఇప్పుడు ఆ వైముఖ్యము తొలగిపోయి ఉర్దూభాషా సాహిత్యాల పట్ల పూర్వపు ఆదరాభిమానాలు తిరిగి వ్యాపించినవి –

అపుడు హైదరాబాదు సంస్థానం ఒక ద్వీపకల్పంగా ఉండేది. మదరాసు, బొంబాయి, మధ్యప్రదేశ్ రాష్ట్రాలచేత చుట్టబడి ఉండేది. అందుచేత ఆ రాష్ట్రాలలోని జాతీయోద్యమాల ప్రభావం యిక్కడి ప్రజలమీదపడి జాతీయోద్యమం వ్యాప్తి చెందడం అనివార్యమైన పరిణామమైనది. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, ఆర్యసమాజం, జాతీయ భావాలు కలిగిన పత్రికలు, సాహిత్య సమావేశాలు మొదలైనవి ప్రజలలో జాగృతిని కలిగించినవి.

ఆ రోజుల్లో అనగా తుది నిజాం పరిపాలనలో ఆంధ్ర అనే పదం ప్రభుత్వానికి కంటకంగా ఉండేది. మదరాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండిన నిజాం కళాశాలలో తమిళం, కన్నడం, మరాఠి, తెలుగు మొదలైన విద్యార్థి సంఘాలు ఉండేవి. తెలుగు విద్యార్థి సంఘానికి 'ఆంధ్ర సారస్వత సమితి' అని పేరు. ఆ పేరుతో విద్యార్థి సంఘం చాలాకాలం చక్కగా నడిచినది. కాని క్రమంగా హైదరాబాదు రాష్ట్రంలో జాతీయోద్యమం వ్యాప్తి చెందుతుండగా యీ పేరు పట్ల అప్పటి పరిపాలకులకు విరోధము ఏర్పడి 1937 ప్రాంతంలో కాబోలు ప్రభుత్వ ఆదేశానుసారం దీనిని 'తెలుగు సారస్వత సమితి'గా పేరు మార్చడం జరిగింది. అప్పటివరకు అనగా 1937 వరకు ప్రజాస్వామికాన్ని కాంక్షించేవారికి ఆంధ్రమహాసభలో ప్రాబల్యం కలిగింది. క్రమక్రమంగా రాజకీయ స్వరూపం ఆ ఉద్యమానికి కలుగుతూ వచ్చింది. అంతేకాదు 'ఆంధ్ర' అనే పేరు ఎన్నటికైనా హైదరాబాదు రాష్ట్రవిచ్ఛిత్తికి కారణభూతం కాగలదనీ, మదరాసులోని తెలుగు జిల్లాలతో ఆంధ్రలోని తెలుగుజిల్లాల ఏకీకరణకు తోడ్పడగలదని అప్పటి పరిపాలకులు గుర్తించడం జరిగింది. ఈ సంగతి అప్పుడు హోంశాఖ కార్యదర్శిగా ఉండిన నవాబ్ అలీయావర్జంగ్ బహద్దూర్, ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు గారితో చెప్పినట్లు వారు తమ ఆంధ్రోద్యమ చరిత్రలో గ్రంథస్థం చేసినారు. నవాబ్ అలీయా వర్జంగ్ బహద్దూర్‌గారు భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉస్మానియా, అలీగఢ్ విశ్వవిద్యాలయాలకు ఉపాధ్యక్షులుగాను, ఈజిప్టు,

యుగస్లోవియా మొదలైన దేశాలలో రాయబారిగాను, బొంబాయి రాష్ట్రానికి గవర్నర్‌గాను పనిచేసి భారత ప్రభుత్వం మెప్పులను పొందినారు. పోలీసుచర్యకు సుమారు ఒక సంవత్సరం ముందు వీరు నిజాం ప్రభుత్వంలోని బాధ్యతలను అన్నీ వదులుకొని హైదరాబాదు రాష్ట్రం 'ఇండియన్ యూనియన్'లో విలీనము కావలెనని కోరిరి.

ఆంధ్రోద్యమం మొట్టమొదట సాంస్కృతిక ఉద్యమంగానే ప్రారంభమైనది. వివేకవర్ధని కళాశాల ఆవరణలో పూనాలోని కార్వే విశ్వవిద్యాలయానికి స్థాపకులై గొప్ప విజ్ఞానిగా, విద్వాంసుడుగా పేరుపొందిన కార్వేపండితుని అధ్యక్షతలో 1921వ సంవత్సరమున జరిగిన ఒక సమావేశంలో మహారాష్ట్రులు, కన్నడులు, తెలుగు వారు పాల్గొనిరి. ఆ వేదిక మీద టేక్‌మాల్ రంగారావుగారు అనే ఒకన్యాయవాది తెలుగులో మాట్లాడడానికి ప్రారంభించగా సభికులు చప్పట్లుచరిచి ఆయన ఉపన్యాసాన్ని కొనసాగనీయలేదు. అప్పుడు తెలుగువారు ఆ సభ నుంచి నిష్క్రమించిరి. అదే రోజు రాత్రి హైదరాబాదు ఆంధ్ర ప్రముఖులు సమావేశమై (1921వ సంవత్సరము) 'ఆంధ్ర జనసంఘము'ను స్థాపించిరి. ఈ సంఘము ఆదర్శాలన్నీ సాంస్కృతిక ఆదర్శాలే. ఆ సంఘానికి జీవగర్ర మాడపాటి హనుమంతరావు పంతులు. వారే తెలంగాణములోని సమస్త జాతీయ వికాసానికి మూలపురుషులు. క్రమక్రమంగా 'ఆంధ్ర జనసంఘము' 'ఆంధ్ర మహాసభ'గా మారి ప్రజల హక్కులకొరకు పోరాడే సంస్థగా రూపొంది హైదరాబాదు రాష్ట్రంలో బాధ్యతాయుత పరిపాలన స్థాపన జరుగవలెనని ఉద్ఘాటించి అందుకొరకు పోరాటం జరిపినది. ఈ పోరాటం తీవ్రమైన తర్వాత 'ఆంధ్ర మహాసభ' రెండుగా చీలిపోయినది. 1) జాతీయ మహాసభ; 2) కమ్యూనిస్టు మహాసభ. మాడపాటి హనుమంతరావుగారు మితవాది. తీవ్రరాజకీయాలకు కొంత దూరంగా ఉండేవారు. చాలా సంవత్సరాలు 'ఆంధ్ర మహాసభకు మూలవిరాట్టుగా ఉన్నవారు. ఈ సంస్థ రాజకీయ సంస్థకాదని పలుమార్లు ప్రభుత్వానికి చెప్పుతుండేవారు. రాజకీయ సంస్థగా మారినప్పుడు దీనితో సంబంధము వదులుకోగలమని అప్పుడు మంత్రులుగా ఉండిన ఇంగ్లీషువారికి వాగ్దానం చేసినందువలన ఆ వాగ్దానాన్ని వారు పాటించి యీ సంస్థతో సంబంధము వదులుకొని ఆ సంగతిని అప్పటి ఇంగ్లీషు మంత్రులకు తెలియజేసినారు. ఇది గమనించదగిన సంఘటన.

హైదరాబాదు నగరంలో ఆ రోజులలో తెలుగువారి సమస్త సాంస్కృతిక కార్యకలాపాలకు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయమే ఆటపట్టుగా ఉండేది. 1901వ సంవత్సరంలో యీ గ్రంథాలయము కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారి ప్రోత్సాహంతో, మునగాల రాజాగారు, రావిచెట్టు రంగారావుగారు మొదలైన పెద్దల సహాయంతో స్థాపితమై క్రమక్రమాభివృద్ధి పొంది యిక్కడి తెలుగువారిలో జాగృతిని కలిగించడానికి అద్వితీయమైన కృషిని చేసినది. తరువాత మాడపాటి హనుమంతరావు పంతులుగారు అప్పటి హైదరాబాదులోని ప్రముఖుల సహకారంతో సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావుగార్లవంటి పండితుల, దేశాభిమానుల తోడ్పాటుతో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం అభివృద్ధికి ఎంతో కృషి చేసినారు. ఈ భాషానిలయం రజతోత్సవం కావ్యకంఠ గణపతిశాస్త్రిగారి అధ్యక్షతలో జరిగి తెలంగాణములోని గ్రంథాలయ కార్యకర్తలను సమీకరించి గ్రంథాలయోద్యమ వ్యాప్తికి తోడ్పడినది. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో అనేక సాహిత్య సాంస్కృతిక ఉపన్యాసాలు జరిగేవి. తరువాత నాయకులైనవారు యెందరో యీ ఉపన్యాసాలచేత ఉత్తేజితులైనారు. ఈ గ్రంథాలయం ప్రచ్ఛన్నంగా రాజకీయ శిక్షణ శిబిరంగా ఉండేది. ఈ గ్రంథాలయ నిర్వహణతో, సంబంధంగలవారు తరువాత రాజకీయనాయకులై, ముఖ్యపరిపాలనాబాధ్యతలను నిర్వహించినారు. కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంతోపాటు గౌలీగూడాలోని బాలసరస్వతి గ్రంథాలయం, నాంపల్లిలోని వేమన గ్రంథాలయం ఆ రోజుల్లో తెలుగువారిలో చైతన్యాన్ని జాగృతిని కలిగించిన సంస్థలు. గాడిచర్ల హరిసర్వోత్తమరావు, విశ్వనాథ సత్యనారాయణ, మల్లంపల్లి సోమశేఖరశర్మ, శివశంకరస్వామి ప్రభృతులైన కవిపండితుల ఉపన్యాసాలను యెన్నిటినో నేను మొదటిసారి కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో విన్నాను.

కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం సుల్తాన్‌బజార్‌లో నెలకొల్పబడి నేటికీ అక్కడనే పనిచేస్తున్నది. ఆ రోజుల్లో యీ పరిసర ప్రాంతాలు బ్రిటిష్ రెసిడెంట్ ఆధీనంలో ఉండేవి. అందుచేత యీ ప్రాంతాన్ని రెసిడెన్సీబజార్ అనేవారు. ఇంగ్లీషువారు నిజాం ప్రభుత్వం మీద పర్యవేక్షణ కొరకు నియమించిన రెసిడెంట్ బొలారంలో ఉండేవారు. ఆయన కార్యాలయం ప్రస్తుత మహిళా కళాశాల భవనాలలో ఉండేది. నిజాం అధీనంలోని నిర్బంధాలు కొన్ని యీ రెసిడెన్సీ బజారులో ఉండేవికావు. అందుచేతనే కొందరు పెద్దలు యీ ప్రాంతంలో స్వగృహాలను నిర్మించుకొన్నారు.

మాడపాటి హనుమంతరావుగారి స్వగృహం ఆంధ్రకుటీరం యీ ప్రాంతంలోనే ఉండేది. బయట నుండి అనగా హైదరాబాదేతర ప్రాంతాల నుండి, కవిపండితులు యెవరు హైదరాబాదుకు వచ్చినా, మాడపాటి హనుమంతరావుగారిని మొట్టమొదట సందర్శించేవారు. ఆ రోజుల్లో హైదరాబాదులో కొన్ని చిన్న చిన్న దర్బారులుండేవి. అందులో ఒకటి సురవరం ప్రతాపరెడ్డిగారి గోలకొండ పత్రికా కార్యాలయం. ఆ కార్యాలయానికి రాష్ట్రం నుండీ, రాష్ట్రం వెలుపల నుండి వచ్చే, కవిపండితులు, కార్యకర్తలు అందరు వెళ్ళి కొంత కాలక్షేపం చేసి ఉత్తేజం ఉల్లాసం పొందేవారు. ఆ రోజుల్లో హైదరాబాదులో ఒకేఒక తెలుగు పుస్తకాల విక్రయశాల కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం పొరుగున ఉండేది. దానిని నడిపిన నాంపల్లి గౌరీశంకరవర్మగారు జాతీయవాదులు. రాష్ట్రమంతటికీ తెలుగు పుస్తకాలను సమకూర్చిన భాషాసేవకులు. కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయానికి మరొకవైపున డాక్టర్ పి.వి.రమణయ్యగారు ఉండేవారు. ఆయన ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చి హైదరాబాదులో స్థిరపడినవారు. వృత్తి చేత వైద్యుడు. తెలుగుభాషపైన అపారమైన అభిమానం కలవాడు. ప్రతిరోజు సాయంకాలము ఆయన దర్బారులో 'కవి పండితులు సమావేశమై కాలక్షేపం చేసేవారు. వారందరికీ ఆయన అతిథి మర్యాదలు చేసేవారు బయటి నుండి ముఖ్యంగా బ్రిటిష్ ఆంధ్రము నుండి వచ్చిన కవిపండితులకు ఆయన నివాసము విడిదిగా ఉండేది.

మందుముల నరసింగరావుగారిది మరొక దర్బారు. ఆయన 'రయ్యత్' అనే ★ఉర్దూ పత్రిక నడిపేవారు. కృష్ణాపత్రిక ధోరణిలో సంపాదకీయాలు వ్రాసి హైదరాబాదు రాష్ట్రంలో గొప్ప జాగృతిని కలిగించినారు. రయ్యత్ పత్రిక కార్యాలయానికి భాష, మతము అనే విచక్షణ లేక రాజకీయాలపట్ల, దేశ సమస్యలపట్ల ఆసక్తి కలిగిన యువకులు వెళ్ళి ఆయనతో మాట్లాడి తమ అభిప్రాయాలను రూపందించుకొనేవారు. సరోజినినాయుడుగారి కుమారులు డాక్టర్ జయసూర్యగారు అప్పుడే పాశ్చాత్య దేశాలలో వైద్యంలో గొప్ప డిగ్రీ తీసుకొని హైదరాబాదులో వృత్తిని ప్రారంభించి, అభ్యుదయభావాలు, తీవ్రభావాలు కలిగిన యువకులకు అండగా ఉండేవారు. రాజాబహద్దూర్ వెంకట్రామారెడ్డిగారు పోలీసు కమీష్నర్ పదవి నుండి విరమించి అటు నిజాం ప్రభువుతోను, ఇటు ప్రజల ప్రతినిధులతోను స్నేహసంబంధాలు కలిగి రెడ్డి విద్యార్థి వసతిగృహం, గోలకొండపత్రిక, కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం,

★ మొదట వారపత్రిక తరువాత దినపత్రిక

ఆంధ్రోద్యమం మొదలైన అనేక సంస్థలకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయం చేసేవారు. ఆ రోజులలో హరిజనోద్ధరణకు కృషి చేసినవారు భాగ్యరెడ్డి వర్మగారు. వారొక పత్రికనుకూడా నడిపేవారు. చాదర్ఘాట్ వంతెనవద్ద యిప్పటికీవారి స్వగృహం ఉన్నది. శ్యామరావుగారు అనే మరొక నాయకుడు సంఘసంస్కరణోద్యమానికి కృషి చేసేవారు. ఈయన సికిందరాబాదు నివాసి. దేశభక్త ధర్మ వీరవామన నాయక్‌గారు ఆ రోజులలో సమస్త జాతీయోద్యమాలకు పట్టుగొమ్మగా ఉండి హైదరాబాదుకు వెలుగు యిచ్చేవారు.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయస్థాపనను ప్రోత్సహించిన కొమర్రాజు లక్ష్మణరావుగారే తెలంగాణలో గ్రంథాలయోద్యమ వ్యాప్తికి కారణభూతులని చెప్పవచ్చును. హనుమకొండలోని 'రాజనరేంద్ర భాషానిలయం', వరంగల్‌లోని 'శబ్దానుశాసన ఆంధ్రగ్రంథాలయం' యింకా యితర పట్టణాలలోని గ్రంథాలయాలు అన్ని లక్ష్మణరావుగారి ప్రేరణతో, ప్రోత్సాహంతో స్థాపితమైనవి. రాజనరేంద్ర భాషానిలయం స్థాపితమయిన రోజులలో మాడపాటి హనుమంతరావుగారు హనుమకొండలోని విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఒక చిన్న ఉద్యోగిగా పని చేస్తుండేవారు. కాని వారిలో అణిగి ఉన్న దేశ సేవాభిలాష ఎక్కువరోజులు ఆ ఉద్యోగాన్ని చేయనీయలేదు. లక్ష్మణరావుగారిచే ప్రభావితులై ఆ ఉద్యోగాన్ని వదులుకొని హైదరాబాదు ప్రవేశించి స్వతంత్రమైన న్యాయవాద వృత్తిని అవలంబించి ఆంధ్రోద్యమాన్ని, గ్రంథాలయోద్యమాన్ని యింకా యితర జాతీయోద్యమాలను ప్రారంభించి, నిర్వహించి హనుమంతరావుగారు తెలంగాణ ప్రజలను మేల్కొల్పిన సత్యం చరిత్రలోసైతం నిలిచిపోగలదు. హనుమంతరావుగారు ఆంధ్రపితామహులు. తెలంగాణ వైతాళికులు. తరువాత తీవ్రరాజకీయాలకు దూరంగా ఉన్నా చివరవరకు అన్ని జాతీయోద్యమాలను, సాంస్కృతికోద్యమాలను, ప్రత్యక్షంగాను పరోక్షంగాను ప్రోత్సహించి, అండగా నిలిచిన దేశాభిమానులు.

ఇప్పటికి నలభై సంవత్సరాల క్రిందిమాట. 1939 సంవత్సరంలో నిజాం కళాశాల నుండి డిగ్రీ తీసుకొన్న తరువాత నేను ఒకటి రెండు సంవత్సరాలు, తీరికగా ఇంటిలో ఉండడం తటస్థించింది. ఆ కాలంలో న్యాయవాదవృత్తి అవలంబించవలెనా లేక వ్యవసాయము, వ్యవహారము మొదలైన ఇంటి పనులు చూచుకొనవలెనా అని ఆలోచించుకుంటున్న రోజులు. కాలక్షేపానికి కొంత కవితా వ్యాసంగము, రచనా

వ్యాసంగము చేస్తుండేవాణ్ణి. ఆ సందర్భంలో గోలకొండ పత్రికలో కొన్ని వ్యాసాలు వ్రాసి ప్రచురించే అవకాశం కలిగింది.

నా మొట్టమొదటి వ్యాసము పత్రికలో ప్రకటితమైంది. ఎంతో సంతోషం కలిగింది. రెండు రోజుల తరువాత సన్నని దస్తూరితో 'మిత్రవర్యా!' అని సంబోధిస్తూ వ్రాసిన కార్డు ఒకటి అందింది. ఆ కార్డు హైదరాబాదు రాష్ట్రంలోని సమస్త ప్రజాహిత జీవనానికి సాంస్కృతిక కార్యకలాపాలకు అన్నింటికీ మార్గదర్శకులైన మూలవిరాట్టు ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు పంతులుగారు వ్రాసింది. వారి ప్రశంస నన్ను పరమానంద భరితుణ్ణిచేసి, సాహిత్యరంగంలో కృషి చేయవలెననే సంకల్పము రేకెత్తించింది. నా వ్యాసాన్ని హర్షిస్తూ హైదరాబాదు వచ్చినప్పుడు తమను తప్పక కలుసుకోవలసిందిగా పంతులుగారు నన్ను ఆ కార్డులో కోరినారు. అంతటి మహావ్యక్తి కోరికను ఆదేశంగా భావించి, తరువాత కొన్ని వారాలకు హైదరాబాదు వచ్చి వారిని సందర్శించినారు. ఆనాడు వారు నాపట్ల చూపిన ఆదరము, నాకు యిచ్చిన ప్రోత్సాహము నా జీవితంలో యెన్నడూ మరువజాలను. ఆనాటి వారి ప్రోత్సాహమే తరువాత నాకాలాన్ని పూర్తిగా సాంస్కృతిక కార్యాకలాపాలకు వినియోగించడానికి కారణభూతమైనది. విద్యాధిక యువకులను ప్రజాసేవవైపు ఆకర్షించడం పంతులుగారి ఆశయాలలో ఒకటి – నాకు వారు యిచ్చిన ప్రోత్సాహం యింకొక మచ్చుతునక – ఎందరో యువకులు వారి ప్రోత్సాహంతో దేశసేవ, భాషా సేవచేసినారు.

1942వ సంవత్సరంలో 'తెలంగాణ' దినపత్రికగా హైదరాబాదు నుండి వెలువడినది. ఆ పత్రిక సంపాదక వర్గంలో చేరవలసిందని హనుమంతరావు పంతులుగారు స్వదస్తూరితో మరొకజాబు వ్రాసినారు. కాని, నేను నాగపూరు న్యాయకళాశాలలో చేరినందువలన ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు. అయితే హైదరాబాదుకు వచ్చిన ప్రతి సందర్భంలోనూ పంతులుగారిని సందర్శించి, వారితో కొంతకాలం గడిపి, ఉత్తేజితుణ్ణి అయ్యేవాడిని. వారి సలహాలను, ఆశీర్వచనాలను పొందేవాడిని. వారు నాపట్ల చూపిన ఆదరాభిమానాలు నాప్రజాహిత జీవనానికి మార్గదర్శకాలైనవి.

క్రమశిక్షణ, సమయపాలన విశేషించి సంస్థల డబ్బు వినియోగించడంలో కఠినమైన నియమాల పాటింపూ, ప్రజాసంస్థలకు సుస్థిరమైన పునాదులను నిర్మించవలెననే దీక్షా నేను పంతులుగారి నుండి నేర్చుకున్న పాఠాలు.

ఆ రోజుల్లో ప్రజలను మేల్కొలిపిన ఉద్యమాలు నాలుగు. ఒకటి ఆంధ్రోద్యమం. అది తర్వాత రాజకీయోద్యమంగా పరిణమించి స్టేట్ కాంగ్రెస్‌లో లీనమైనది. ఆంధ్రోద్యమంతో పాటు అదే పద్ధతిలో మహారాష్ట్ర, కర్ణాటక ఉద్యమాలు పని చేసినవి. రెండవది గ్రంధాలయోద్యమం- తెలంగాణ అంతటిని మేలుకొల్పినది. మూడవది ఆర్యసమాజ ఉద్యమం. తరువాత న్యాయమూర్తులైన పండిత కేశవరావు, పండిత విశ్వేశ్వరనాధ్‌గారు ఆర్యసమాజ ఉద్యమాన్ని బలపరచిరి. హైదరాబాదు రాష్ట్ర ప్రజలలో గొప్ప జాగృతిని కలిగించినదీ ఉద్యమం- పండిత వినాయక్‌రావు, పండిత నరేంద్రజీ ప్రభృతులతోపాటు రాష్ట్రం వెలుపల నుండి అఖిలభారత నాయకులువచ్చి ఆర్యసమాజ సభలలో ప్రసంగిస్తుండేవారు. నాలుగవది పత్రికారంగం. తెలుగుపత్రిక, నీలగిరిపత్రిక, గోలకొండపత్రిక మొదలైన పత్రికలు నిద్రాణమైన జాతిని మేలుకొల్పడానికి చరిత్రాత్మకమైన కృషి గావించినవి. ఈ పత్రికల చరిత్ర ఒక మహోజ్వలమైన అధ్యాయం.

సభలు ఏర్పాటు చేసుకోవడం, గ్రంధాలయాలు నిర్వహించడం చాలా కష్టసాధ్యమైన పనిగా ఉండేది. ఏ గ్రంథాలయమైన బాగా నడిచిందంటే, కీర్తి ప్రతిష్ఠలు యెవరికి వచ్చినప్పటికిని దాని వెనుక దేశానికొరకు పరితపించే ఒక త్యాగమూర్తి ఉన్నాడని, మనము తెలుసుకోవలెనని మాడపాటి హనుమంతరావుగారు చెప్పుతుండేవారు. ఆ మాట అక్షరాల నిజము.

ఆ కాలంలో, ప్రభుత్వ అనుమతిలేనిదే ప్రజల శ్రేయస్సును కాంక్షించే యేపనులు జరుగడానికి వీలులేదు. ప్రభుత్వ అనుమతి సులభంగా దొరికేదికాదు. ఎన్నో కఠినమైన నియమాలు ఉండేవి. వాక్స్వాతంత్ర్యం, సమావేశ స్వాతంత్ర్యం మొదలైన ప్రాథమిక నియమాలు కఠినంగా అమలు జరిగేవి. గష్తినిషాన్-53 అనే ఘోరమైన ఉత్తర్వు ఒకటి ఉండేది. ఈ ఉత్తర్వునే ఒక మారు సురవరం ప్రతాపరెడ్డిగారు, వాక్ బంధన శాసన శృంగార తాండవ విశేషమని వర్ణించినాడు. ఈ శాసనం ప్రకారం కలెక్టర్లకు, ఉన్నతాధికారులకు జాతీయోద్యమాలను అణిచివేసే అధికారాలు పుష్కలంగా ఉండేవి. వీనికి తోడు నిజాం ప్రభువు నిరంకుశ పరిపాలన శాశ్వతంగా కొనసాగవలెననే ఒక వర్గం ఉండేది. ఆ వర్గం ప్రతిదానికి మతవైషమ్యరూపం యిచ్చి యీ ఉద్యమాలను అణచివేయడానికి కావలసిన పరిస్థితులను వ్యాపింపజేసేది. బ్రిటిష్ ఆంధ్రప్రాంతంలో సాహిత్యం, సంస్కృతి, విద్య మొదలైన కార్యక్రమాల మీద లేని

నిర్బంధాలు ఆనాటి హైదరాబాదు రాష్ట్రంలో అపారంగా ఉండేవి. జాతీయనాయకులు వచ్చి ప్రసంగించే అవకాశాలు పూర్తిగా లేకుండేవి.

1944వ సంవత్సరాన వరంగల్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలు జరిగినవి. అవి కేవలం సాహిత్యానికి సంబంధించిన సభలు. పైకి ఏమి అనలేక పోయినప్పటికిని అంతరంగంలో ప్రభుత్వానికి, ఒక వర్గానికి యీ సభలు యిష్టం కాలేదు. ఈ సభల సందర్భమున వరంగల్ కోటలో కవిసమ్మేళనం ఏర్పాటు జరిగినది. రేపు సభ జరుగుతుందనగా ఆ రోజు రాత్రి కొన్ని మతదురహంకార పూరితమైన ఫాసిస్ట్ శక్తులు ఆ సభల కొరకు వేసిన పందిళ్ళను మొదలైనవాటిని దగ్ధం చేసి భయంకరమైన వాతావరణాన్ని నెలకొల్పిరి. అయినప్పటికిని ధైర్యసాహసాలతో ప్రత్యామ్నాయమైన యేర్పాట్లు చేసుకొని సభను జరిపించిన సంఘటన నాకు బాగా జ్ఞప్తి ఉన్నది.

ఆ కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ పరోక్షంగా సాంస్కృతిక ఉద్యమాలను బలపరచి వానివ్యాప్తి కొరకు పనిచేసిన వారిలో ఆదిరాజు వీరభద్రరావుగారిని ప్రత్యేకంగా పేర్కొనవలెను. ఆయన చాదర్‌ఘాట్ హైస్కూల్‌లో తెలుగు పండితుడుగా ఉండేవాడు. కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయానికి అనేక సంవత్సరాలు కార్యదర్శిగా ఉండి ఆ సంస్థ అభివృద్ధికి కృషి చేసినవారిలో గణనీయులు. వారు కొంతకాలం లక్ష్మణరావుగారివద్ద 'విజ్ఞాన సర్వస్వ' నిర్మాణ కార్యక్రమంలో పనిచేసి అనుభవం గడించినారు. గోలకొండ పత్రికలో ఎన్నో వ్యాసాలు వ్రాసి, కొన్ని ప్రత్యేక సంచికలకు సంపాదకులుగా ఉండినారు. సురవరం ప్రతాపరెడ్డిగారికి సన్నిహితులు; మాడపాటి హనుమంతరావుగారికి ఆప్తులు. బహుగ్రంథ రచయితలు, చరిత్ర పరిశోధకులు. నాటి తెలంగాణ సాంస్కృతిక జీవనానికి పట్టుగొమ్మ. పదవీ విరమణ తరువాత వారు కొంతకాలం ఆంధ్రబాలికా పాఠశాలలో ఉపాధ్యాయులుగాను, ఖండవల్లి లక్ష్మీరంజనంగారి 'సంగ్రహ విజ్ఞానకోశ' నిర్మాణంలో ముఖ్యులుగాను పనిచేసినారు. ఈ కాలంలో ఆంధ్రోద్యమ వ్యాప్తికి, సాంస్కృతిక వికాసానికి వీరభద్రరావుగారి కృషి అద్వితీయమైనది. ఈ విధంగా కృషి చేసిన ప్రభుత్వోద్యోగులలో యింకా యిద్దరిని పేర్కొనవలెను. ఒకరు శ్రీ వడ్లకొండ నరసింహారావు, రెండవవారు శ్రీ కొమ్మవరం సుబ్బారావు. వడ్లకొండ నరసింహారావుగారు పదవీ విరమణ తర్వాత స్టేట్ కాంగ్రేస్ కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శిగా పనిచేసినట్లు జ్ఞాపకం. ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూభాషలలో వ్రాయగల శక్తి వారికి ఉండేది. గోలకొండ దినపత్రిక అయిన తర్వాత

అపుడే ప్రభుత్వోద్యోగం నుండి విరమించిన కొమ్మవరం సుబ్బారావుగారు దానికి మేనేజర్‌గా పనిచేసినారు. నాంపల్లిలోని వేమన గ్రంథాలయ అభివృద్ధికి సుబ్బారావుగారు ఎంతో కృషి చేసినారు. తాము జీవనోపాధికొరకు యే వృత్తిని అవలంబించినా దేశానికి స్వాతంత్ర్యము రావలెనని, దేశం ముందడుగు వేయవలెనని కాంక్షించి ఒక ఉన్నత ఆదర్శానికి అంకితమైనవారు యీ పెద్దలు- ద్రవ్యకాంక్షగాక సేవాభావంతో వీరు తమచేతనైన విధంగా జాతీయోద్యమాలను బలపరచినారు.

1929 నుండి 1979కి మధ్యగల 50 సంవత్సరాల కాలాన్ని మూడు దశలుగా విభజించవచ్చును. 1929 నుండి 1949 సెప్టెంబర్ నెల వరకు మొదటిదశ; అనగా భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి హైదరాబాదుపైన భారత ప్రభుత్వం పోలీసు చర్యజరిపి, హైదరాబాదు ప్రజలకు విమోచనాన్ని కలిగించే వరకు. 1949 నుండి జవహర్‌లాల్ నెహ్రూ పరమపదించేవరకు రెండవదశ. 1965 నుండి 1979 వరకు మూడవదశ. 1929 నుండి 1949 వరకు గల మధ్య కాలము చాలాక్లిష్టమైనది. ముఖ్యంగా ఆనాటి హైదరాబాదు ప్రజల జీవితంలో విషాదకరమైన అంధకార యుగము. అయితే యీ చీకటిలోగూడా కొంతవెలుగు లేకపోలేదు. ఈ చీకటి వెలుగులను గూర్చిన జ్ఞాపకాలు కొన్ని ఉన్నవి.

1929-49 మధ్య గల కాలంలో పాఠశాలల సంఖ్య, కళాశాలల సంఖ్య, తక్కువగా ఉండినప్పటికినీ, చెప్పిన చదువు మాత్రం గుణంలో శ్రేష్టమైనది. తెలుగులో విద్యా సౌకర్యాలు లేకపోయినా, ఉర్దూలో, ఇంగ్లీషులో బోధన జరిగినా ఉపాధ్యాయ శిష్యసంబంధాలు చాలాబాగా ఉండేవి. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ఎంతో ప్రేమ కలిగి ఉండేవారు. మార్కులు యీయడంలోగాని, ప్రోత్సహించడంలో గాని కులం-మతం అడ్డువచ్చేదికాదు. బాగా కష్టపడి చదివే విద్యార్థులను తమ కులానికి, మతానికి చెందనప్పటికి ప్రోత్సహించిన నిదర్శనాలు ఎన్నో ఉన్నవి. నిజంగా ప్రతిభ కలిగి కష్టపడే వాడైతే తిండికి బట్టకు కొరత ఉన్న విద్యార్థి కూడ అత్యున్నత స్థితిని పొందిన నిదర్శనాలు ఉన్నవి. ముస్లిం ఉపాధ్యాయులు కూడా హిందూ విద్యార్థులను ఎంతో బాగా ఆదరించేవారు. మేము హైస్కూల్‌లో ఉన్న రోజులలో అబ్దుల్ అజీజ్, అబ్దుల్ సలాం, అలీనవాజ్ జద్దీ, అల్లాబక్ష్ కమాలి, ఆర్.సుబ్రహ్మణ్య అయ్యర్, ఆర్.వి.రావు, శ్రీ రామన్, టి.యం.కిషణరావు మొదలైన వారు ఉత్తమ శ్రేణికి చెందిన ఉపాధ్యాయులుగా ఉండేవారు; వీరిలో ఎవరూ తెలుగువారు కారు - వారికి చదువుతప్ప

యితర వ్యాసంగం ఉండేదికాదు. హనుమకొండ హైస్కూల్‌లో కంభంపాటి అప్పన్నశాస్త్రిగారు అనే తెలుగు ఉపాధ్యాయుడు ఉండేవారు. ఆయన పిల్లలకొరకు, 'పూలతోట' అనే పత్రిక నడిపేవారు. అది యీనాటి పిల్లల పత్రికలతో పోల్చినప్పటికి చాలా బాగుండేది. అయితం రాజు కొండలరావుగారు అనే మరొక ఉపాధ్యాయులు ఉండేవారు. తెల్లషేర్‌వాని, తెల్ల పైజామ వేసుకొని, తెల్లటోపీ పెట్టుకొని నెరసిన మీసాలతో సైకిల్ మీద వస్తుండేవారు. ఆయన వేషాన్ని చూస్తే ఉత్తర దేశం నుండి వచ్చి ఉర్దూ బోధించే మౌల్వీవలె ఉండేవారు. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, ఫారసీ మొదలైన అనేక భాషలలో ఆయన ప్రవీణులు. ఆయనపట్ల ఉపాధ్యాయులందరికీ గౌరవభావము ఉండేది. ఉర్దూ, తెలుగు – ఉర్దూ నిఘంటువులను రెండింటిని ఆయన ఒకచేతిమీద సిద్ధంచేసి ప్రకటించినారు. అవి ఉత్తమశ్రేణికి చెందిన నిఘంటువులు. రిటైర్ అయిన తరువాత ఆయన కొంతకాలం వనపర్తి సంస్థానం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి తుదిదశలో సుల్తాన్ బజారులో కొంతకాలం నివసించి పరలోకగతులైరి. అదేరోజులలో సుప్రసిద్ధులైన శేషాద్రి రమణ కవులలో ఒకరైన దూపాటి వేంకటరమణాచార్యులవారు హనుమకొండ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా నియమితులైనారు. ఈ నియామకానికి ముందు అనేక సంవత్సరాలు వారు తెలంగాణతోను, తెలంగాణ నాయకులతోను దగ్గరి సంబంధాలు కలిగి ఉండేవారు. వారు ఖద్దరు దుస్తులను ధరించేవారు. కట్టమంచి రామలింగారెడ్డిగారి తెలుగు పీఠికలను కొన్నింటిని, వారు పుస్తకంగా ప్రకటించినారు. కాకతీయ చరిత్ర వారికి అభిమానం. జయంతి రామయ్య పంతులుగారి ఆదేశంతో వారు ఆంధ్ర సాహిత్య పరిషత్తు పక్షాన తెలంగాణ ప్రాంతం అంతా తిరిగి ఎన్నో శాసనాలను, తాళపత్రగ్రంథాలను సేకరించినారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు మొదలైన తెలంగాణ నాయకులకు వారి పట్ల గౌరవం ఉండేది. వరంగల్‌లో 'కాకతీయగ్రంథమాల' నొకదానిని స్థాపించి, నిర్వహించి మహారాష్ట్ర భాష నుండి తెనిగించిన 'దాసబోధ'తోపాటు కొన్ని గ్రంథాలను వారు ప్రకటించినారు. వావిళ్ళవారి ప్రచురణలకు కొన్నింటికి వారు మంచి పీఠికలను వ్రాసినారు.

నాడు ఇంగ్లీషు ద్వారా విద్యాభ్యాసం చేసే హైస్కూలు విద్యార్థులలో కొన్ని హాస్యోక్తులు చలామణిలో ఉండేవి. ఒక ఉపాధ్యాయుడు తరగతిలోని ఒక విద్యార్థికి

బెత్తము చూపించుతూ 'There is a fool at the end of this cane' (ఈ బెత్తము చివర ఒక మూర్ఖుడు ఉన్నాడు) అని అనగా ఆ విద్యార్థి 'At which end sir', (ఏ చివర చెప్పండి సార్) అనగా తరగతి అంతా ఉపాధ్యాయునితో పాటు గొల్లున నవ్వినారు. భూగోళం బోధించే ఉపాధ్యాయునికి సంబంధించిన మరొక ఉదంతం; ఆయనకు నస్యం అలవాటు. ఆ నస్యపు డబ్బీలు రెండు ఉండేవి. ఒకటి చదరపుది, ఒకటి గుండ్రనిది. భూమి గుండ్రంగా ఉన్నదని చెపుతూ ఆయన తన నస్యపు డబ్బీని చూపించేవాడు. ఒకసారి ఆయన తరగతిలో ఒక విద్యార్థిని భూమి ఎట్లున్నదని ప్రశ్నించగా 'Round on some days and square on other days' అని ఆ విద్యార్థి ప్రత్యుత్తరము చెప్పినప్పుడు విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుడు కూడా కడుపుచెక్కలుగా నవ్వినాడు. విద్యార్థుల చురుకుదనానికి, తెలివితేటలకు మృదువైన హాస్యకుశలతకు యీ సంఘటనలు ఉదాహరణలు.

దూపాటి వెంకటరమణాచార్యులవారు ఉన్నత పాఠశాలలో కొంతకాలం, తర్వాత కరీంనగరం, ఆ తర్వాత నిర్మల్‌లోను పనిచేసి అనేకమంది విద్యార్థులను తెలుగు సాహిత్యం వైపుకు ఆకర్షించినారు. స్వయంగా కవులు అయిన వీరు ప్రోత్సహించిన యువకులెందరో తరువాత ఉన్నత పదవులను పొందినారు. బహుశ అదేరోజులలో అనుకుంటాను, వెంకటరమణాచార్యులవారు యింకా ఉపాధ్యాయులుగా నియమితులు కాకముందు, హనుమకొండలోని నేటి జూనియర్ కళాశాల ఆవరణలో కాకతీయ మహాసభలు 1931వ సంవత్సరములో వైభవంగా జరిగినవి. రాజమహేంద్రవరంలోని 'ఆంధ్రదేశీయ ఐతిహాసిక పరిశోధనా మండలి' యీ సభలకు సూత్రధారి. మాడపాటి, సురవరం ప్రభృతులు యీ మహాసభలకు తోడ్పడినారు. రాళ్లబండి సుబ్బారావు, మారేమండ రామారావు మొదలైన వారితోపాటు దూపాటి వెంకటరమణాచార్యులవారు యీ సభలలో పాల్గొన్నారు. అప్పుడు నిజాం కళాశాలలో రాజకీయశాస్త్ర అధ్యాపకులుగా ఉండిన ఆచార్య సిరుగూరి హనుమంతరావుగారు యీ సభలకు అధ్యక్షులుగా వచ్చినారు. పరిశోధకమండలి యింతకుపూర్వం యిటు వంటి మహాసభలు జరిపి 'చాళుక్య' సంచిక, 'కళింగ' సంచికలను వేసినట్లుగా కాకతీయసంచిక కూడా ప్రకటించినది. ఈ సభాధ్యక్షులు సిరుగూరి హనుమంతరావుగారు చరిత్ర, రాజకీయ శాస్త్రాలలో కూలంకషమైన పాండిత్యం కలవారు. ఇంగ్లీషు భాషలో వారి ప్రసంగకౌశలము నిరుపమానమైనది. ఆ సభలలో వారు తమ సహజ ధోరణిలో ఉత్తమ

ప్రసంగం చేసినారు. నిజాం కళాశాలలో వారి వద్ద చదువుకున్న వారు ఉన్నతోన్నత పదవులను పొందగలిగినారు. సర్వేపల్లి రాధాకృష్ణ పండితునికి వారిపైన అభిమానము ఉండేది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థికశాఖ కార్యదర్శి బి.పి.ఆర్.విఠల్‌గారు వారి మేనల్లుడు. మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటివారు, సిరుగూరి హనుమంతరావుగారిని ప్రామాణిక చరిత్రకారులుగా అంగీకరించేవారు. అదృష్టవశాత్తు హనుమంతరావుగారు యిప్పటికిని సజీవులై ఉన్నారు. నిజాం కళాశాలలో వారి వద్ద చదువుకునే భాగ్యం నాకు కలిగినది.

కాకతీయ మహాసభలకు ఆంధ్ర ప్రాంతాల నుండి ప్రతినిధులు అనేకులు వచ్చినారు. వారు ఓరుగల్లు కోటను సందర్శించి తిరిగి సభాస్థలికి వెళ్ళే మార్గమధ్యంలో వరంగల్‌లోని శబ్దానుశాసన గ్రంథాలయమున కొంతసేపు ఆగి స్వాగత సమావేశంలో పాల్గొన్న సంఘటన నాకు జ్ఞప్తి ఉన్నది. శబ్దానుశాసన గ్రంథాలయ పక్షాన వారికి పద్యరూపమైన స్వాగతపత్ర సమర్పణ జరిగినది. ఈ ప్రతినిధులతో పాటు దేశభక్త ధర్మవీర వామన నాయక్‌గారు కూడా వచ్చినట్లు నాకు జ్ఞాపకమున్నది. బాలునిగా నేను వారి ఉపన్యాసాలు విన్నాను. ఈ సభల తరువాత కొద్దిరోజులలోనే దేశోద్ధారక విశ్వదాత నాగేశ్వరరావు పంతులుగారు వరంగల్‌కు వచ్చినప్పుడు శబ్దానుశాసన గ్రంథాలయ పక్షాన యేర్పాటుచేసిన సభలో వారికి స్వాగతపత్ర సమర్పణ జరిగినది. నాగేశ్వరరావుగారి ఉపన్యాసం నేను చిన్నతనంలోనే విన్నాను. నాగేశ్వరరావుగారు ఆంధ్రపత్రికను ఉచితంగా కొన్ని గ్రంథాలయాలకు పంపేవారు. బహుశ యీ గ్రంథాలయానికి కూడా కొంతకాలం పంపించినట్లు నాకు జ్ఞాపకం.

దూపాటి వెంకట రమణాచార్యులవారు వరంగల్‌కు వచ్చినప్పుడు మా యింట్లో అతిథిగా ఉండేవారు. వరంగల్‌కు అనేక పర్యాయాలు వస్తుండేవారు. చిన్నవానిగా ఉన్న నన్ను వారు పలుకరిస్తూ తెలుగుభాషవైపుకు మనసు మరల్చేవారు.

ఆనాటి పత్రికలను గురించి యీ సందర్భంలో నాలుగుమాటలు చెప్పవలసి ఉన్నది. తెలంగాణ నుంచి వెలువడిన మొదటి తెలుగు పత్రికలు రెండు; రెండూ 1922వ సంవత్సరము ఆగస్టు నెలలో 4 రోజుల వ్యత్యాసంతో ప్రారంభమైనవి. రెండూ హైదరాబాదు నుండిగాక జిల్లాల నుండి వెలువడినవి, 24 ఆగస్టు 1922 నాడు నల్లగొండ నుండి 'నీలగిరి' అనే పత్రిక, 27 ఆగష్టు 1922 నాడు వరంగల్‌జిల్లా, మానుకోట తాలూక, ఇనుగుర్తి గ్రామం నుండి 'తెనుగు' పత్రిక వెలువడినవి. నీలగిరి

పత్రికకు సంపాదకుడు షబ్నవీస్ వెంకట్‌రామ నరసింహారావుగారు, తెనుగు పత్రికకు సంపాదకులు ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావు సోదరులు. ఈ రెండు పత్రికల సంపాదకులు సంపన్న కుటుంబీకులు. ఒద్దిరాజు సోదరులు సంస్కృతము, తెలుగు, ఇంగ్లీషు, ఉర్దు, ఫారసి భాషలలో ప్రవీణులు; కవులు, ప్రతిభావంతులైన రచయితలు; వక్తలు. వీరి అముద్రిత గ్రంధాలు ఎన్నో ఉన్నవి. అవన్నీ ప్రకటితము కావలసి ఉన్నవి. ఈ రెండు పత్రికలు గ్రంధాలయోద్యమాన్ని, ఆంధ్రోద్యమాన్ని బలపరిచినవి. అచ్చుతప్పులు లేకుండ మంచి అక్షరాలతో యీ పత్రికలు వెలువడుతుండేవి ఆనాటి కవుల, రచయితల రచనలను ప్రకటిస్తూ సమకాలిక సమస్యలనుగూర్చి మంచి వాఖ్యానాలు చేస్తూ ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలో యీ పత్రికలు చేసిన కృషి ప్రశంసనీయం. ఒక విధమైన పోటీ కూడా యీ పత్రికల మధ్య ఉండేది. రెండు మూడు సంవత్సరాలు నడిచి యీ పత్రికలు ఆగిపోయినవి. ఒకసారి ఆ పత్రికల సంపుటాలను చూస్తే ఆనాటి సమాజం మనకు కనిపిస్తుంది. ఈ పత్రికల తర్వాతనే గోలకొండ పత్రిక 10.6.1926 నాడు ప్రారంభమైనది. సుమారు 40 సంవత్సరాలు కొంతకాలం అర్ధవార పత్రికగాను, 1947 నుండి దినపత్రికగాను గోలకొండ పత్రికలో మనం అద్దంలో చూచినట్లు చూడవచ్చును. ఈ పత్రికలతోపాటు ఆ రోజుల్లో మరికొన్ని పత్రికలు కూడా వెలువడినవి. కొన్ని సాహిత్యపత్రికలు, కొన్ని మతసంబంధమైన పత్రికలు. ఆ రోజుల్లో ఆంధ్రసంస్కృతిని, ఆంధ్రభాషను కాపాడడానికి యీ పత్రికలు చేసిన కృషి మరువరానిది. తెలంగాణ నుండి కొన్ని సాహిత్యపత్రికలు మాసపత్రికలుగా వెలువడినవి. హనుమకొండ నుండి (వరంగల్) సీతారామశర్మ గారు సంపాదకులుగా వెలువడిన 'ఆంధ్రాభ్యుదయం' తూపురాన్ సమీపంలోని వడ్డెపల్లి నుండి వెలువడిన 'దేశబంధు' మొదలైనవి యీ శ్రేణికి చేరినవి. మాడపాటి, సురవరం ప్రభృతుల ప్రోత్సాహంతో 'సుజాత' అనే ఉత్తమసాహిత్య మాసపత్రిక గోలకొండ ప్రారంభమైన కొన్ని సంవత్సరాల తరువాత వెలువడి కొంత కాలము నడిచి ఆగిపోయినది. ఈ పత్రిక ప్రతిమాసం ఒక త్రివర్ణచిత్రంతో భారతి, శారదల స్థాయిలో చక్కగా ప్రకటితమయ్యేది. సాహిత్య విమర్శలు, ఉర్దూ మొదలైన యితర భాషాసారస్వతాల పరిచయాలు, కథానికలు, కవితలు యీ పత్రికలో ఉండి, పాఠకులకు ఉత్తమ సారస్వతాభిరుచిని కల్పించేవి. పోలీసుచర్య తరువాత యీ పత్రికను శ్రీమతి ఇల్లిందల

సరస్వతీ దేవిగారు, శ్రీ గడియారం రామకృష్ణ శర్మగారు కొంతకాలం ఉత్తమ స్థాయిలో నడిపినారు. తొలిదశలో 'సుజాత' సంపాదకులు శ్రీ పి.ఎన్.శర్మగారు. వీరు ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగుభాషలలో ప్రవీణులు. ఉత్తమ అభిరుచిగల సంస్కృతీపరులు. బి.ఏ, ఎల్.ఎల్.బి., పట్టభద్రులు. కొంతకాలం న్యాయవాదులుగా ఉండి తరువాత న్యాయశాఖలో మున్సిఫ్‌గాచేరి డిస్ట్రిక్ జడ్జిగా రిటైరైనారు.

ఆ కాలంలో వెలువడిన పత్రికలలో ప్రభుత్వ విధానాలను విమర్శించుటలో జంకక ధైర్యంగా ప్రజలపక్షాన పోరాడిన గౌరవం 'రయ్యత్' అనే ఉర్దూ పత్రికకు చెందుతుంది. ఈ పత్రికా సంపాదకులు మందుముల నరసింగరావుగారు. ఉర్దూలో ఉత్తమశ్రేణికి చెందిన రచయిత. కొంతకాలం న్యాయవాద వృత్తిని అవలంబించి, అది తన చిత్తవృత్తికి సరిపోనందున దానిని వదలివేసి సురవరం ప్రతాపరెడ్డిగారివలెనే పత్రికా సంపాదక వృత్తిని అవలంబించిన దేశ భక్తుడు. హైదరాబాదు రాష్ట్ర ప్రజలను మేల్కొల్పడానికి రయ్యత్ కొంతకాలం వారపత్రికగాను, కొంతకాలం దినపత్రికగాను అద్వితీయమైన కృషి చేసినది. బక్కపలుచగా తెల్లని పైజామ, షేర్వాని వేసుకొని, తెల్లని గాంధీటోపిని పెట్టుకొని నరసింగరావు గారు వీధులలో నడుస్తుంటే యింత మహోత్తరమైన శక్తి యీయన దుర్బలశరీరంలో దాగి ఉన్నదా అని అనుకొనేవారు. ఆ రోజులలో దేశస్వాతంత్ర్యము, ప్రజాస్వామ్యము కావలెననుకునేవారందరు వయసు, భాష, మతముతో సంబంధము లేకుండ నరసింగరావుగారి దగ్గరకు వెళ్ళుతుండేవారు. హైదరాబాదులో ఆయన ఒక గణనీయమైన వ్యక్తిగా ఉండేవారు.

చాలామందికి తెలియకపోవచ్చును మాడపాటి హనుమంతరావుగారుకూడా పరోక్షంగా పత్రికా సంపాదకులు. చిత్రమేమనగా వారు ఉర్దూ పత్రికా సంపాదకులు. 'ముషిర్ దక్కన్' అనే ఉర్దూ జాతీయ దినపత్రికకు వారు సంపాదకీయాలు వ్రాస్తుండేవారు. అయితే వారికి సంస్కృతాంధ్ర భాషలలో మంచి ప్రవేశం ఉండేది. మున్షీప్రేంచంద్ కథలను కొన్నింటిని వారు తెలుగులో పరివర్తనం చేసి ఒక సంపుటంగా ప్రకటించినారు. ఆ సంపుటం పేరు మాలతీ గుచ్ఛమో, లేక మల్లికా గుచ్ఛమో అని నాకు జ్ఞాపకం. ప్రేంచందును మొట్టమొదటిసారి తెలుగు పాఠకలోకానికి పరిచయం చేసినవారు మాడపాటి హనుమంతరావుగారు. 'క్షాత్రకాలపు హింద్వార్యులు' అనే పరిశోధన గ్రంథాన్ని వారు తెలుగులో అనువదించినారు. హనుమంతరావుగారి తెలుగుశైలి కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి, లక్ష్మీ నరసింహంగార్ల వచనశైలిచేత

ప్రభావితమైన సరళ గ్రాంథికం. 'సుజాత', 'గోలకొండ'లోను ఉర్దూకవులను తెలుగు పాఠకులకు పరిచయం చేస్తూ హనుమంతరావు గారు చక్కని వ్యాసాలు వ్రాసినారు. 'రయ్యత్' పత్రిక కొంత తీవ్రధోరణిలో నడిస్తే 'ముషీర్ దక్కన్' మితవాద ధోరణిలో ఉండేది. హనుమంతరావు, నరసింగరావుగార్ల వ్యక్తిత్వాల విశిష్టతను యీ పత్రికా సంపాదకీయాలు వెల్లడిచేసేవి. ఆ రోజులలో దేశ సమస్యలను, గూర్చి ఆలోచించే ప్రతివాడు రయ్యత్ పత్రికను చదివేవాడు. ఆనాటి నాయకులలో చాలా మంది న్యాయవాదులు, నిజాం రాజ్యంలో కోర్టుకు శుక్రవారం సెలవు. అందుచేత వారు వారానికి ఒకరోజు అనగా శుక్రవారాన్ని మాత్రమే దేశసేవకు వినియోగించినారు. పత్రికా సంపాదకులు అట్లుగాక ప్రతిదినం కార్యకర్తలకు లభ్యమయ్యేవారు. మాడపాటి హనుమంతరావుగారు ఛలోక్తులు కొన్ని విసరేవారు. అందులో ఒకటి న్యాయవాదులైన నాయకులను గూర్చి "ప్రతాపరెడ్డిగారు ఒకటి రెండు సంవత్సరాలు మాత్రమే న్యాయవాద వృత్తిని అవలంబించి వదలివేయగా, మందుముల నరసింగరావుగారు 7, 8 సంవత్సరాలు ఆ వృత్తిలో ఉండి నిరాశచెంది వెలుపలికి రాగా నేను ఓపికతో నా షష్టిపూర్తివరకు సంసారపక్షంగా యీడ్చుకొని వచ్చినాను. అయితే కొండా వెంకటరంగారెడ్డిగారు మాత్రం న్యాయవాద వృత్తిని విజయవంతంగా కొనసాగించినారు". అని వారు సభలలో ఛలోక్తిగా చెప్పుతుండేవారు.

1929–34 ప్రాంతంలో హైదరాబాదు ప్రధానమంత్రిగా మహారాజ సర్‌కిషన్ ప్రసాద్ బహద్దూర్‌గారు ఉండేవారు. ఆయన పూర్వకాలనికి, జమీందార్ వ్యవస్థకు చెందిన ఉదార సంస్కృతికి చిహ్నంగా ఉండేవాడు. దాన–ధర్మాలు చేయడంలో ఆయనకు గొప్ప కీర్తి ఉండేది. సాహిత్యానికి, కళలకు పోషకులుగా ఉండేవాడు. ఉర్దూ భాషలో కవిత్వం చెప్పేవాడు. ఆయన బ్రతికి ఉన్నంతకాలం (ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు–లేనప్పుడు కూడా) హైదరాబాదు నగరంలో ఎక్కడ కవిసమ్మేళనం (ఉర్దూ ముషాయిరా) జరిగినా ఆయనే అధ్యక్షుడు. కవులనెందరినో ఆయన ఆదరించినాడు. పోషించినాడు. ఆయన శృంగారప్రియుడు; రసికుడు కూడా. ఇంగ్లీషు ప్రభుత్వంతో మంచి సంబంధాలు ఆయనకు ఉండేవి. వాస్తవానికి ఆ రోజులలో అన్ని స్వదేశ సంస్థానాలలో వలెనే హైదరాబాదులో కూడా ఇంగ్లీషువారి అధికార ప్రాబల్యం ఉ ండేది. తన ప్రజలను గూర్చి ఏమి ఆలోచించినా ఆలోచించకపోయినా, వారి క్షేమం కొరకు ఏమిచేసినా చేయకపోయినా, అందరు సంస్థానాధీశ్వరుల వలెనే నిజాం కూడా

ఇంగ్లీషువారి అడుగులకు మడుగులొత్తేవాడు. ప్రభుత్వంలో రెండు శాఖలు అనగా, హెూం, రెవెన్యూలతోపాటు పోలీస్‌డైరెక్టర్ జనరల్ పదవి కూడ ఆ రోజులలో ఇంగ్లీషువారి ఆధీనంలో ఉండేది. 1942 తర్వాత కాబోలు యీ పద్ధతి తొలగిపోయినది. అయినా ఇంగ్లీషువారి అధికార ప్రాబల్యం తుదివరకు ఉండేది. 1934-35 ప్రాంతంలో కాబోలు మహారాజ సర్‌కిషన్ ప్రసాద్ బహద్దూర్‌గారు పదవీ విరమణచేసి సర్ అక్బర్ హైదరీగారు ప్రధానమంత్రి అయినారు. సర్ అక్బర్ హైదరీగారు అంతకుముందు ఆర్థికశాఖ కార్యదర్శి, ఆర్థిక మంత్రి పదవులను నిర్వహించి నిజాం ప్రభువు పరిపాలనలో తగినంత ప్రాబల్యం సంపాదించినారు.

సర్ అక్బర్ హైదరీ బొంబాయి వాస్తవ్యుడైన సివిలియన్ అధికారి. ఇంగ్లీషు ప్రభుత్వం విశ్వాసాన్నీ చూరగొన్న పరిపాలనదక్షుడు. స్థానికులు కొందరు వ్యతిరేకించినప్పటికి క్రమక్రమంగా ఆయన పరిపాలన యంత్రాంగాన్ని పూర్తిగా ఇంగ్లీషువారి సహాయంతో హస్తగతం చేసుకొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపనకు తోడ్పడిన ముఖ్యుడు ఆయన - ప్రజల మాతృభాషలకు ఆయన పరిపాలనలో ఏవిధమైన ప్రోత్సాహం లభించలేదు. ఇంగ్లీషువారి సహాయంతో నిజాం యిష్టపడే కొన్ని విధానాలు అమలుచేసిన సర్ అక్బర్ హైదరీ ఇంగ్లీషువారు పరిపాలించిన భారతదేశ ప్రాంత నాయకులతో స్నేహసంబంధాలు కలిగి ఉండేవారు. ఒక వైపున ప్రజల హక్కులను వ్యతిరేకిస్తూ, మరొకవైపున మహాత్మాగాంధీ మొదలైనవారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతుండేవారు. శ్రీరాజగోపాలాచారి మొదలైన కాంగ్రేస్ నాయకులతో స్నేహాన్ని కలిగి ఉండేవారు. ఒకటి రెండు పర్యాయాలు రాజగోపాలాచారిగారు హైదరాబాదు వచ్చి ఆయనకు అతిథిగా ఉండినట్లు నాకు జ్ఞాపకం. ప్రతి సంవత్సరం పాండిచ్చేరివెళ్ళి అరవిందయోగిని దర్శించేవాడు. హైదరాబాదు రాష్ట్రంలో నిజాంను సంతోషపెట్టడం ప్రజలను అణచి వేయడం, రాష్ట్రం వెలుపలి ప్రజానాయకులతో మైత్రి సంపాదించడం, ఇంగ్లీషువారికి తలలోనినాలుకగా ఉండడం, ఇది ఆనాటి సర్ అక్బర్ హైదరీగారి వ్యక్తిత్వం.

కాంగ్రేస్ నాయకులతోనేకాక, మితవాదనాయకులైన రాధాకృష్ణన్, సి.పి.రామస్వామి అయ్యర్, సర్‌తేజ్ బహద్దూర్ సప్రు, కట్టమంచి రామలింగారెడ్డి మొదలైనవారితో ఆయనకు స్నేహసంబంధాలు ఉండేవి. బనారస్ విశ్వవిద్యాలయానికి ఒక లక్షరూపాయల విరాళం, ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఒక లక్ష రూపాయల

విరాళం సర్‌అక్బర్ హైదరీగారు యిప్పించినారు. ఒక పర్యాయం బహుశ 37-38 ప్రాంతంలో కాబోలు కట్టమంచి రామలింగారెడ్డిగారిని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి స్నాతకోపన్యాసకులుగా ఆహ్వానించినారు. ఇక్కడొక సంగతి తెలుపవలసి ఉన్నది. ప్రజల మాతృభాషల ద్వారా విద్యాబోధన జరుగనందువలన నారాయణగూడెంలో ఆంధ్రబాలికా పాఠశాలను స్థాపించి కొంతమంది విద్యార్థినులను ప్రైవేటుగా మెట్రికులేషన్ మొదలైన పరీక్షలకు పంపేయేర్పాటు జరిగింది. అయితే యీ పాఠశాల నిర్వాహకులు యీ పరీక్షలను నడుపవలసినదని ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కోరగా అందుకు విశ్వవిద్యాలయం సమ్మతించలేదు. సర్‌అక్బర్ హైదరీగారి ద్వంద్వవిధానానికి, పలుకుబడికి యిదొక మచ్చుతునక. 1938-1939 ప్రాంతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతరం ఉద్యమం విజృంభించింది. అందుకు కారణం విశ్వవిద్యాలయ ఆవరణలో వందేమాతరం పాటపైన నిషేధం. అప్పుడు వేలసంఖ్యలో విద్యార్థులు ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని విడిచివెళ్ళినారు. ఆ సందర్భంలోకూడ ఆంధ్ర విశ్వవిద్యాలయ సహాయసానుభూతులు యీ విద్యార్థులకు లభించలేదు. విద్యార్థులు అందరు నాగపూర్ వెళ్ళి అప్పుడు అక్కడి విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా ఉండిన టి.జె.నెదార్‌గారిని కలుసుకొని వారి పూర్తి సహాయంతో ఆ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలను పొందినారు. ఎందువలననో ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలంగాణ ప్రాంతీయులకు ఆ రోజుల్లో అక్కరకురాని చుట్టముగా ఉండినదని నాటి పరిస్థితులు తెలిసినవారి అభిప్రాయం. హైదరాబాదేతర ప్రాంతాల నుండి వచ్చిన జాతీయ నాయకులను, మితవాదనాయకులను, పత్రికా ప్రతినిధులను సర్ అక్బర్ హైదరీ అత్యంతంగా ఆదరించేవాడు. సుప్రసిద్ధ పత్రికారచయితలైన కృపానిధిగారు హైదరాబాదువచ్చి "విద్యుత్ దీపాలతో వెలుగొందు దేవేంద్ర భవనంలో మహారాజభోగ్యమైన విందు ఆరగించితిని; అంతకన్నను చెప్పవలసినది ఏమిలేదు" అని ఒకమారు వ్యాఖ్యానించినారు.

నాకు బాగా జ్ఞాపకమున్నది. అప్పుడే పదార్థ విజ్ఞాన శాస్త్రానికి జగత్ ప్రసిద్ధమైన నోబుల్ బహుమతి పొందిన చంద్రశేఖర వెంకటరామన్‌గారు (సి.వి.రామన్) ఒకమారు హైదరాబాదు వచ్చిరి. వారి ఉపన్యాసం ఒకటి నిజాం కళాశాలలో ఏర్పాటు జరిగినది. రామన్‌గారు ప్రభుత్వానికి అతిథులు. ఉపన్యాస సమయానికి అయిదు నిముషాల ముందుగానే సర్ అక్బర్ హైదరీగారు నిజాం కళాశాలకువచ్చి పోర్టికోలో నిలిచి

రామన్‌గారి కారురాగానే ఎదురేగి స్వాగతమిచ్చి, కరచాలనం, చేసి లోపలికి తీసికొనివచ్చి, పూలమాలను వేసి స్వయంగా సభకు అధ్యక్షతను వహించినారు. రామన్‌గారు అనేక పర్యాయాలు హైదరాబాదుకు వచ్చినారు. బహుశా విశాఖపట్టణంలో కొంతకాలం ప్రొఫెసర్‌గా ఉన్నందున కాబోలు ఆయనకు తెలుగు బాగా వచ్చేది. ఒక పర్యాయం విద్యార్థిసంఘాలు వారికి వివిధ భాషలలో స్వాగతపత్రాలు సమర్పించగా తెలుగు స్వాగతపత్రం తమకెంతో నచ్చినదని వారన్నారు.

సి.పి.రామస్వామి అయ్యర్‌గారు కూడా హైదరాబాదుకు వస్తుండేవారు. నిజాం కళాశాలలో వారి ఉపన్యాసాలు నేను విన్నాను. రామస్వామి అయ్యర్‌గారిది కుశాగ్రబుద్ధి; సర్వతోముఖమైన ప్రతిభాసంపద; ఇంగ్లీషు, ఫ్రెంచ్, సంస్కృతము, తమిళ భాషలలో అనర్గళంగా మాట్లాడగలిగిన వచోవిలాసం; న్యాయశాస్త్రంలో పారంగతమైన పాండిత్యం కలిగి ఆనాటి న్యాయవాదులలో ఆయన అగ్రగణ్యుడు. సంగీతము, సాహిత్యము మొదలైన లలితకళలను గూర్చి, వేదాంతం, అర్థశాస్త్రం మొదలైన శాస్త్రాలను గూర్చి పరిపూర్ణమైన వైదుష్యం కలవాడు. ఆయన ఆకారం సుందరమైనది. ఆగర్భ శ్రీమంతుడైన ఆయన విలువగల దుస్తులు ధరించేవాడు. జాతీయవాదిగా ప్రారంభించిన ఆయన క్రమక్రమంగా జాతీయోద్యమానికి దూరమై మదరాసు రాష్ట్రంలోను, కేంద్ర ప్రభుత్వంలోను మంత్రి పదువులను నిర్వహించి, ఇంగ్లీషువారికి స్నేహితుడై చివరలో ఒక స్వదేశ సంస్థానానికి దివానుగా దిగజారినాడు. ఆ సంస్థానమే తిరువాన్‌కూర్–రామస్వామి అయ్యర్‌గారి విలాస జీవనాన్ని గూర్చి అనేకకథలు ప్రచారంలో ఉండేవి. ఆ కథలతో మనకేమిగాని తిరువాన్‌కూర్‌లో ఆయన ప్రజల ఉద్యమాన్ని అణచివేయడానికి వెనుకాడలేదు. ఆ సందర్భంలో ఆయన సహాధ్యాయి; ఆయునతో సమానమైన మేధావి అయిన డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారిని రాయబారాలకొరకు మహాత్మాగాంధీగారు తమ ప్రతినిధిగా పంపినప్పటికిని లాభమేమి లేకపోయినది. ఆ రోజులలో గాంధిగారు తమ 'హరిజన్' పత్రికలో రామస్వామి అయ్యర్‌గారి దమననీతిని గూర్చి చాలా కఠినంగా వ్రాసినారు. 'Sir C.P. has thrown to dust all principles of Democracy... ... ... It is organised goondaism on the part of Sir C.P.Rama Swamy Ayar' అన్న పరుషోక్తులను ఉపయోగించినారు (హరిజన్). జవహర్‌లాల్ నెహ్రూగారు తమ ఆత్మకథలో కూడ రామస్వామి అయ్యర్‌గారి విధానాలను తీవ్రంగా నిరసించినారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు

అయిన తర్వాత హైదరాబాదు నగరంలోని జూబిలిహాలులో మనదేశ పంచవర్ష ప్రణాళికలనుగూర్చి మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్మారకోపన్యాసాలను రెండింటిని ఆయన చేసినారు. ఆ ఉపన్యాసాలు చాలాగొప్పగా ఉండినవి. బహుముఖ ప్రజ్ఞా సమన్వితుడు, న్యాయవాదశిరోమణి అయినందున ఆయనను అనేక హైకోర్టులు న్యాయమూర్తి పదవిని అలంకరించమని కోరినవట. కాని ఆ కోరికను ఆయన ఒప్పుకోక 'నేను ఎంతసేపైనా అనుచితప్రలాపం చేయగలనుగాని కొంతసేపు కూడా అనుచిత ప్రలాపాన్ని వినలేను' అన్నాడన్నమాట, ఆ రోజులలో చాలామంది అనుకునేవారు. గొప్ప న్యాయవాదియైన మోతీలాల్ నెహ్రూ ఒక పర్యాయం ఒక మానసష్టపు దావాను మదరాస్ హైకోర్టులోవేయడం తటస్థించినప్పుడు ఆయన రామస్వామి అయ్యర్‌గారిని న్యాయవాదిగా పెట్టుకున్నాడట.

డాక్టర్ రాధాకృష్ణన్‌గారి పట్ల ఆనాటి నిజాం ప్రభుత్వానికి గౌరవాభిమానాలు ఉండేవి. రాధాకృష్ణన్‌గారు దూరదృష్టిని వివేకాన్ని దేశభక్తితో సమ్మిళితంచేసి అటు బ్రిటిష్ ప్రభుత్వంతోను. యిటు కాంగ్రేస్ నాయకులతోను సన్నిహితంగా ఉండేవారు. మహాత్మాగాంధి, మదన్‌మోహన్ మాలవ్య పండితులకు ఆయనపట్ల అభిమానము ఉండేది. ఆ ఉభయులు సంప్రదించుకొని ఆయనను బనారస్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షునిగా కూడా ఆహ్వానించినారు. జవహర్‌లాల్ నెహ్రూకు ఆయనపట్ల అత్యంత ఆదరం. అందుచేతనే స్వతంత్రభారతంలో ఆయన అనేక ఉన్నత పదవులతోపాటు రాష్ట్రపతి పదవిని కూడ సమర్థతతో అలవరించుకొని నిర్వహించినారు. ఆ రోజులలో రాయప్రోలు సుబ్బారావుగారు, కురుగంటి సీతారామయ్యగారు, మహమ్మద్ ఖాసీం ఖాన్‌గారు ముగ్గురు కలసి ఆంధ్రసాహిత్య పరిషత్తును 1940 ప్రాంతంలో ఏర్పాటు చేసినారు. ముగ్గురు మాత్రమే సభ్యులు గల యీ సాహిత్య పరిషత్తు నిజాం నవాబుగారి జీవితచరిత్ర, ఖురాన్‌షరీఫ్ అనువాదం మొదలైన గ్రంథాలను ప్రచురించి తమ సంస్థ తెలుగు భాషకు ప్రతినిధి అని చెప్పుకోడానికి యత్నించింది. అప్పుడు ప్రతాపరెడ్డిగారు మొదలైనవారు యిటువంటి సాహిత్యపరిషత్తు అవతరణను హర్షించలేదు. ఈ ముగ్గురు పండితులు ఆంధ్రసాహిత్య పరిషత్తును ప్రారంభించమని ఆహ్వానించగా రాధాకృష్ణన్‌గారు అంగీకరించి హైదరాబాదుకు వచ్చినప్పుడు ప్రతాపరెడ్డి ప్రభృతులు వారిని కలుసుకొని వాస్తవపరిస్థితిని వివరించిరి. అప్పుడు రాధాకృష్ణన్‌గారు ప్రారంభోపన్యాసం చేసినారుగాని, సాహిత్య పరిషత్తును గురించిగాని, యీముగ్గురిని

గురించిగాని ఏ విధమైన ప్రశంస చేయలేదు. మొట్టమొదటిసారి ఆనాటి సభలో గంగాప్రవాహ సదృశమైన రాధాకృష్ణన్‌గారి ఉపన్యాసం వినే-అవకాశం నాకు కలిగింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి, హైదరాబాదు ప్రజల విమోచన జరిగిన తరువాత ఆంధ్ర సారస్వత పరిషత్తు సప్తమ వార్షికోత్సవం 1953వ సంవత్సరమున అలంపురంలో ఏర్పాటు చేసినప్పుడు నేను ఢిల్లీకి వెళ్ళి వారిని ఆహ్వానించగా వారువచ్చి సారస్వత పరిషత్తు సభలను ప్రారంభించి కొంతసేపు ఇంగ్లీషులోను, కొంతసేపు తెలుగులోను మాట్లాడి మా అందరిని ఆశీర్వదించిరి. రాధాకృష్ణన్‌గారిని నేను ఆహ్వానించడానికి ఢిల్లీకి వెళ్ళినప్పుడు అప్పటి రాష్ట్రప్రభుత్వంతో సంప్రదించలేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండానే వారు మా ఆహ్వానాన్ని అంగీకరించిరి. డాక్టర్ రాజబహద్దూర్ గౌడ్, డాక్టర్ పుచ్చలపల్లి సుందరయ్యగారు మొదటిసారి నన్ను వారికి పరిచయం చేసినారు. వారు హైదరాబాదుకు వచ్చిన ప్రతిపర్యాయం నన్ను జ్ఞాపకం చేస్తుండేవారు. నేను వారిని సందర్శించేవాడిని. విశాలాంధ్ర ఉద్యమానికి వారి తోడ్పాటు పూర్తిగా లభించినది. ఆంధ్ర సారస్వత సంస్కృతులపైన ఆసక్తి అభిమానం వారికి పూర్తిగా ఉండేవి. గోవింద వల్లభ్‌పంత్‌గారి శక్తిసామర్థ్యాలపైన మేధాశక్తిపైన వారికి గౌరవం ఉండేది. ఒక పర్యాయం నాతో గోవింద్ వల్లభ్‌పంత్‌గారు హిమాలయపర్వతం వంటి ఉన్నతమైన వ్యక్తి అని అన్నారు. వాస్తవానికి కాంగ్రెస్ నాయకులలో గోవింద్‌వల్లభ్‌పంత్‌గారు అసమాన ప్రతిభా సంపదగల మేధావి. మూడు రోజులలో పార్లమెంట్‌లో జరిగిన చర్చను సావధానంగావిని ఏవిధమైన నోట్స్ సహాయం లేకుండ నాల్గవనాడు సహేతుకంగా ప్రతిభావంతంగా సమాధానం యిచ్చేవారు. ఆ రోజులలో పార్లమెంట్‌లో కాంగ్రెస్ పక్షంలోను, ప్రతిపక్షంలోను అతిరథ మహారథులుండేవారు. వారందరికి యుక్తియుక్తంగా సమంజసంగా పంత్‌గారు సమాధానం యిచ్చేవారు. అఖిలభారత జాతీయ కాంగ్రెస్ వేదికమీద ముఖ్యమైన తీర్మానం ప్రతిపాదించి ఆమోదింపజేయవలసి వచ్చిన ప్రతి పర్యాయము అందుకు తగినవారు యిద్దరే, రాజగోపాలాచారిగారు, గోవింద వల్లభ్‌పంత్‌గారు కాంగ్రెస్ మేధావులలోను, పరిపాలన దక్షులలోను యీ ఉభయులు అగ్రగణ్యులని ఆనాడు అందరూ అనుకునేవారు.

ఈ సందర్భంలో ఒక సంఘటన జ్ఞాపకం వస్తున్నది. గోవింద్ వల్లభ్‌పంత్‌గారి పూర్వీకులు ప్రస్తుత మహారాష్ట్ర ప్రదేశ్‌లోని రత్నగిరి జిల్లా నుండి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి

వలసపోయిరి. రత్నగిరిజిల్లా మహారాష్ట్ర బ్రాహ్మణులు మేధాశక్తికి, తెలివితేటలకు ప్రఖ్యాతిగాంచిన వారు. 1956వ సంవత్సరమున మనదేశంలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరికొన్ని భాషారాష్ట్రాల యేర్పాటు జరిగినది. కాని బొంబాయిని మాత్రము మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల సమిష్టి రాష్ట్రంగా కొంత కాలం కలిపి ఉంచడం జరిగింది. ఇందుకు ఆక్షేపణగా అప్పటి భారత ప్రభుత్వ ఆర్థికశాఖ మంత్రివర్యులు సి.డి.దేశ్‌ముఖ్‌గారు పదవికి రాజీనామా చేసిరి. సి.డి.దేశ్‌ముఖ్‌గారు రత్నగిరి జిల్లా మహారాష్ట్ర బ్రాహ్మణులు. అప్పుడు గోవిందవల్లభ పంత్‌గారు దీనిపైన వ్యాఖ్యానం చేస్తూ రత్నగిరి జిల్లాకు చెందిన మహారాష్ట్రుడు ఇంత అవివేకంగా వ్యవహరిస్తాడని అనుకోలేదు అని అన్నారు. దానికి సమాధానంగా సి.డి. దేశ్‌ముఖ్‌గారు 'కొన్ని సంవత్సరాల క్రింది రత్నగిరి జిల్లా నుండి ఒక మహారాష్ట్ర కుటుంబం వలసవెళ్ళినది. ఆ కుటుంబము తనవెంట మహారాష్ట్రుల తెలివితేటలను, మేధాశక్తిని యేమి మిగిలించకుండా తీసుకొని వెళ్ళినది' అని ఛలోక్తి విసిరినారు. ఇది గోవింద్‌వల్లభ్ పంత్‌గారి మేధాశక్తిపైన చింతామణి దేశ్‌ముఖ్ వంటి మేధావులకు ఉండిన అభిప్రాయం.

ఆనాడు భారత మేధావులలో ప్రసిద్ధిగాంచిన వారిలో రాజగోపాలాచారి గారు ముఖ్యులు. ఒక పర్యాయం రాజగోపాలాచారిగారు (1942) కాంగ్రేస్ పెద్దలతో అభిప్రాయభేదాలు కలిగినందువలన కాంగ్రేస్‌ను కొంతకాలం వదలివెళ్ళిరి. అప్పుడు ప్రముఖ పత్రికా రచయితయైన కుందూరి ఈశ్వరదత్తుగారు ఆయన దగ్గరకు వెళ్ళి "అయ్యా! నిన్నటివరకు మీరు కాంగ్రేసు సంస్థకు మెదడుగా ఉంటిరి. మీ నిష్క్రమణవలన కాంగ్రేసు మెదడు లేనిదైన"దని అన్నారట. రాధాకృష్ణగారు ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పుడు నాకు రాజ్యసభలో ఉండే అవకాశం లభించినది. ఆయన రాజ్యసభకు అధ్యక్షులుగా ఉండి సభాకార్యక్రమాలను హాస్యోక్తులతో, ఛలోక్తులతో మనోరంజకంగా – సమర్థవంతంగా నిర్వహించేవారు. ఒకమారు ప్రతిపక్షనాయకులైన భూపేశ్‌గుప్తగారు యేదో తీర్మానం మీద మాట్లాడుతూ "నావలె నాస్తికుడైన మన ప్రధానమంత్రి శ్రీ జవహర్‌లాల్" అని అనగానే రాధాకృష్ణగారు గొంతెత్తి 'భూపేశ్‌నీకు తెలియదు. మన ప్రధానమంత్రి నాస్తికుడుకాదు, ఆయనకు సత్యంలో ప్రగాఢమైన విశ్వాసం, సత్యమే భగవంతుడు, భగవంతుడే సత్యం' అని అన్నప్పుడు సభ హర్షామోదములను ప్రకటించిన సన్నివేశము నాకు బాగా జ్ఞాపకమున్నది.

1938లో కాబోలు కట్టమంచి రామలింగారెడ్డిగారు ఉస్మానియా విశ్వవిద్యాలయం స్నాతకోపన్యాసం యిచ్చిరి. అప్పుడు విద్యార్థుల సంఖ్య తక్కువ, ప్రస్తుత విశ్వవిద్యాలయ భవనాలు యింకా నిర్మాణం కాలేదు. ఆ రోజుల్లో టౌన్‌హాల్‌గా ఉండిన ప్రస్తుత శాసనసభ హాలులో స్నాతకోత్సవం జరిగినది. ప్రేక్షకుడిగా నేను వెళ్ళి వారి ఉపన్యాసం మొట్టమొదటిసారిగా విన్నాను. స్నాతకోపన్యాసంలో వారు తెలుగుసాహిత్యాన్ని, తెలుగుకవులను పేర్కొని విశ్వవిద్యాలయ భవనాలు నెలకొన్న అడిక్మేటును అధికమెట్టగా వర్ణించి, అధికమెట్ట అనగా – విజ్ఞానికి ఉన్నత శిఖరం. అనే అర్థం చెప్పి వారి సహజ ధోరణిలో బహురమణీయంగా మాట్లాడినారు. మరునాడు రెడ్డివిద్యార్థి వసతిగృహంలో జరిగిన సన్మానసభలో వారు తెలుగులో మాట్లాడినారు. వారి తెలుగు ఉపన్యాస ధోరణి తిక్కన భారతశైలిని జ్ఞప్తికి చేసేది. ఇంగ్లీషులో ఎంతగొప్పగా మాట్లాడినారో, తెలుగులో కూడ అంతగొప్పగా మాట్లాడినారు. ఆనాటిసభలో వారు నిజాం రాష్ట్రాంధ్రులు, బ్రిటీష్ ఆంధ్రుల పరస్పర సంబంధాన్ని గూర్చి ప్రస్తావిస్తూ 'మీరు మేము' కాదు. మీరుమేము అనడము తప్పు 'మనం' అనవలెను అన్నమాటలలో నాకు విశాలాంధ్రోద్యమ భావం స్ఫురించినది.

ఆ రోజులలో అనగా 1929–39 మధ్యన హైదరాబాదు హైకోర్టుకు వెలుపల నుండి ప్రసిద్ధులైన న్యాయవాదులు అనేకులు ఏదో కేసుల సంబంధములో వాదించడానికి వస్తుండేవారు. విద్యార్థులమైన మేము అప్పుడప్పుడు వీరివాదనలు వినడానికి వెళ్ళేవాళ్ళం. వీరిలో తేజ్‌బహద్దూర్ సప్రుగారు ముఖ్యులు. వారు ఆ రోజులలో యిటు కాంగ్రేస్ నాయకులతోను, అటు బ్రిటిష్ ప్రభుత్వంతోనే స్నేహసంబంధాలు కలిగి ఉభయులకు అభిమానపాత్రులుగా ఉండేవారు. ఆయనను అందరు గౌరవించే వారు. ఆయన గొప్ప న్యాయవాదియేగాక ఉర్దూ, ఫారసీ భాషలలో గొప్ప పండితుడు. ఒకమారు ఒక కేసులో తాను ఒకవైపు, జిన్నాగారు ఒకవైపు వాదిస్తుండగా సప్రూగారు జిన్నాను ఉద్దేశించి 'ఖురాన్‌లో యిట్లున్నది – అని మాత్రము వినిపించి' మీకు తెలియదు కావున ఇంగ్లీషులో దీని అనువాదంచేసి చెప్పుతాను వినండి అని అనగా అందరు గొల్లున నవ్విన సన్నివేశం నాకు బాగా జ్ఞాపకమున్నది. జిన్నా పాకిస్తాన్ నిర్మాత, ముస్లింనాయకుడు. కాని ఆయనకు ఉర్దూ, ఫారసీ, అరబ్బీలు రావు. వచ్చినవి రెండు భాషలు – ఇంగ్లీషు, గుజరాతి. మరునాడు ఉదయం హైదరాబాదు పత్రికలు యీ సంఘటనను పేర్కొంటూ పండిత్‌జిన్నా మౌల్వీ సప్రూ అని వర్ణించినవి.

ఆ రోజులలో ఒక కేసులో వచ్చిన మరొక న్యాయవాది భూలాభాయిదేశాయి. దేశాయిగారు అఖిల భారత కాంగ్రేస్‌నాయకులలో ప్రముఖులు. కేంద్ర శాసనసభలో ప్రతిపక్షనాయకులు. గొప్ప న్యాయవాది, గొప్ప పార్లమెంటేరియన్. ఆ రోజులలో నిజాం కళాశాలకు ఇంగ్లీషువారే ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. అప్పుడు మా ప్రిన్సిపాల్ విలియం టర్నర్‌గారు. ఆయన గొప్ప షేక్స్పియర్, విద్వాంసుడు. మేం విద్యార్థులం కొందరం వెళ్ళి భూలాభాయి దేశాయిగారిని మన కాలేజికి ఆహ్వానించవలెనని కోరగా ఆయన మొదట ఒప్పుకొనలేదు. తర్వాత మేం ఆయనకు దేశాయిగారు కేంద్రశాసనసభలో ప్రతిపక్షనాయకుడని చెప్పినపుడు కొంతమెత్తపడి, అయితే ఆ సభకు తానే అధ్యక్షునిగా ఉంటానన్న షరతుమీద ఒప్పుకున్నాడు. సభ జరిగినది. దేశాయిగారు మాట్లాడినారు. వాల్టర్‌స్కాట్‌గారు ఇంగ్లీషులో వ్రాసిన దేశభక్తి పద్య పంక్తులను చదివి భారత స్వాతంత్ర్యాన్ని సమర్థిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ సింహగర్జనలు చేస్తూ దేశాయిగారు ఆనాడు చేసిన గంభీరోపన్యాసం నేటికి నా చెవులలో ప్రతిధ్వనిస్తున్నది. "Breathes" there the man with soul, so dead, who never to himself hath said this is my own, my native land" అన్న స్కాట్ పద్యపంక్తులు ఆంగ్లభాష తెలిసిన వారందరికి సుపరిచితములు.

ఆ రోజులలో నిజాం కళాశాల మదరాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండేది. 1938 వరకు ఆ కళాశాల ప్రిన్సిపాళ్ళు అందరు ఆంగ్లేయులే. కళాశాల మొత్తం విద్యార్థుల సంఖ్య మూడు నూర్లకు మించరాదని నియమం ఉండేది. ఈ నియమం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రోత్సాహకరంగా ఉండేది. ఈ మూడునూర్లలో అత్యధికులు ఆనాటి జాగీరుదార్లు, ఉన్నతాధికారుల కుటుంబానికి చెందినవారు. అప్పటి హైదరాబాదు సివిల్‌సర్వీస్‌లో ఎక్కువగా నిజాం కళాశాల పట్టభద్రులకే అవకాశం దొరికేది. క్రికెట్, టెన్నిస్ ఆటలు నిజాం కళాశాల ప్రత్యేకతలుగా ఉండేవి. సాధారణంగా శ్రీమంతుల పిల్లలు కావడం వల్ల యీ విద్యార్థులు డ్రస్ కూడా బాగా వేసుకునేవారు. అయితే కొందరు విద్యార్థులు చదువులో అంతగా రాణించని సంఘటనలు కూడా ఉన్నవి. మా విద్యార్థి దశలో ఒక కథ వ్యాప్తిలో ఉండేది. హైదరాబాదు ప్రభుత్వంలో విద్యామంత్రిగా ఉండిన ఒకరు ఒక పర్యాయం కళాశాల చూడడానికి వచ్చినారు. ఆయన విద్యార్థులను కొన్ని ప్రశ్నలువేయగా వారు సరియైన సమాధానాలు చెప్పక పోయినందున ప్రిన్సిపాల్‌గారిని

మందలించినారు. అప్పుడు ప్రిన్సిపాల్‌గారు "Nawab Saheb, my college does not produce machines, but it produces Gentlemen" అని అన్నారట. విజ్ఞానశాలియైన ఆ మంత్రి వెంటనే "your students should not only be gentlemen, but they should also be educated gentlemen" అన్నారట.

అప్పుడు కాంగ్రేస్ నాయకులలో ప్రముఖులు, కేంద్ర శాసనసభలో ప్రతిపక్షానికి ఉపనాయకులు యస్.సత్యమూర్తిగారు మదరాసు విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యులుగా ఉండేవారు. ఆ అధికారంతో వారు ఒకటి రెండు పర్యాయాలు నిజాం కళాశాలను పరిశీలించడానికి వచ్చినారు. సాధారణంగా కాంగ్రేస్ నాయకులంటే యిష్టపడని ఇంగ్లీషు ప్రిన్సిపాలు విశ్వవిద్యాలయ అధికార ప్రతినిధిగా వచ్చినందున కాబోలు సత్యమూర్తిగారిని ప్రత్యేకంగా గౌరవించేవారు. సత్యమూర్తిగారు నిష్కళంక దేశభక్తుడు, జాతీయవాది, ఉత్తమశ్రేణి పార్లమెంటేరియన్; ఆంగ్లభాషపైన అధికారం కలిగిన గొప్ప వక్త. ప్రిన్సిపాల్‌గారు కళాశాలపక్షాన స్వాగతసభ ఒక పర్యాయం ఏర్పాటు చేసినారు. సత్యమూర్తిగారు తమ ఉపన్యాసాన్ని "I am a great lover of swaraj" అని ప్రారంభించి సుమారు ఒక గంటసేపు స్వరాజ్యము స్వాతంత్ర్యాన్ని గూర్చి మాట్లాడి విద్యార్థులను ప్రబోధించినారు. ఇంగ్లీషు ప్రిన్సిపాల్‌గారు కదలక మెదలక ఊరుకున్నారు. ఆ రోజులలో ఇది అసాధారణ సంఘటన.

శ్రీమతి సరోజినీ నాయుడుగారి పేరు తెలియని వారుండరు. ఆమె కాంగ్రేస్ నాయకురాలుగా, దేశభక్తురాలుగా, గాంధీ మహాత్ముని సన్నిహితురాలుగా మనదేశంలోను, యితరదేశాలలోను సుప్రసిద్ధురాలు. ఆమె హైదరాబాదు స్థిరనివాసురాలు. ఆమె తండ్రిగారు అఘోర్‌నాథ్ చటోపాధ్యాయ హైదరాబాదులోనే ఉండేవారు. ఆయన దేశభక్తుడైన గొప్ప విద్యావేత్త. జాతీయవాది. సరోజినిదేవి సోదరుడు హరీంద్రనాథ్ చటోపాధ్యాయ గొప్పకవి. దేశభక్తుడు. ఇప్పటికీ బొంబాయిలో ఉన్నారు. సరోజినీదేవి భర్త ముత్యాల గోవిందరాజులు నాయుడు గొప్ప డాక్టర్. వారి వివాహం కులాంతర భాషాంతర వివాహం. స్వయంగా వీరేశలింగం పంతులుగారే పౌరోహిత్యం వహించి యీ వివాహాన్ని జరిపించినారు. సరోజినీదేవిది భారత రాజకీయరంగంలో సమున్నతస్థానం. భారత జాతీయ కాంగ్రేస్ అధ్యక్ష పదవిని కూడ ఆమె అలంకరించినది. గోపాలకృష్ణ గోఖలే, మోతీలాల్‌నెహ్రూ, చిత్తరంజన్‌దాసు మొదలైన దేశనాయకులేకాక స్వయంగా గాంధీగారు ఆమెపట్ల ప్రత్యేక ఆదరణ,

అభిమానం చూపేవారు. ఆమె ఇంగ్లీషులో కవయిత్రి, మహావక్త. ఆమె ఉపన్యాసాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేసేవి. ఆ వచోవిలాసం అనన్యసామాన్యమైనది. హైదరాబాదు నగరంలోని ఉన్నత కుటుంబీకులు, ఉన్నత విద్యావంతులు, వారి రాజకీయ అభిప్రాయాలు ఏమైనప్పటికిని, ఆమె ఇంటికి వెళ్ళి విజ్ఞానపు విందులను కుడిచేవారు. హైదరాబాదులో అనేకమంది విద్యావంతులను ఆమె ఉత్తేజితులను గావించినది. వారిలో కొందరు యిప్పటికిని సజీవులై ఉన్నారు. గాంధీమహాత్ముడు, జవహర్‌లాల్ నెహ్రూ హైదరాబాదు వచ్చినప్పుడు ఆమె ఇంటిలోనే నివాసం.

నిజాం కళాశాలలో ప్రతి సంవత్సరం ఏదో ఒక సభలో ఆమె ఉపన్యాసం తప్పక ఉండేది. ఆమె తన ఉపన్యాసంతో విద్యార్థుల హృదయాలను చూరగొని దేశభక్తి ప్రపూర్ణములు గావించేది. విద్యార్థిగా నాకు ఆమె ఉపన్యాసాలను అనేకము వినే అవకాశము లభించినది. అప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంగ్లీషు శాఖలో తణికెళ్ళ వీరభద్రుడుగారు ఆచార్యులుగా ఉండేవారు. అదేకాలంలో సిరుగూరి హనుమంతరావుగారు నిజాం కళాశాలలో రాజకీయశాస్త్రంలో ఆచార్యులుగా ఉండేవారు. ఈ ఉభయులు ఆకారంలో వామనులైనప్పటికిని విజ్ఞాన జగత్తులో త్రివిక్రములుగా ఉండేవారు. మూర్తిచిన్నది, కీర్తి పెద్దది అని వారిని గూర్చి అందరు అనుకునేవారు. సరోజినిదేవిగారికి వీరభద్రుడు గారిపైన అపరిమితమైన అభిమానం. ఆమె ప్రతి ఉపన్యాసంలోను ఆయన ప్రస్తావన తెచ్చేది. విశ్వవిద్యాలయంలో ఆయన ఎమ్.ఏ., తరగతులకు బోధించే సమయంలో సరోజినిదేవిగారు అప్పుడప్పుడు వెళ్ళి వినేదని ఆ రోజులలో విద్యార్థులు అనుకునేవారు. షేక్స్పియర్ నాటకాలన్ని దగ్ధము చేసినప్పటికిని తిరిగి వ్రాసి యీయగల శక్తి వీరభద్రుడుగారికి ఉండేదని అందరు అనుకునేవారు. సరోజినిదేవి మెప్పులను పొందినది ఆయన ఆంగ్లభాషా ప్రావీణ్యం. తెలుగు భాషలో కూడా ఆసక్తి, అధికారం వీరభద్రుడుగారికి ఉండేవి. ధర్మవరం కృష్ణమాచార్యులవారి 'విషాద సారంగధర' నాటకానికి వీరభద్రుడు గారు ఉత్తమమైన పీఠిక వ్రాసినారు. హైదరాబాదులో అనేక సాహిత్య సభలలో మాట్లాడేవారు. రిటైరైన తరువాత ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యక్రమాలలో పాల్గొన్నారు. కొంతకాలం వారు పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా నియమితులై పనిచేసినారు. సరోజినీదేవిగారు తమ ఉపన్యాసాలలో భారత స్వాతంత్ర్యాన్ని గురించి ప్రబోధిస్తూ అప్పుడప్పుడు జవహర్‌లాల్ నెహ్రూను ప్రశంసిస్తుండేవారు. ఒకమారు ఆమె మాట్లాడుతూ "There

young Jawaharlal stands with the torch of Indipendence in his hands, and there are millions and millions behind him to support him" అని ఆమె అన్నమాటలు యీ నాటికి నాచెవులలో ప్రతిధ్వనిస్తున్నవి. ఉర్దూకవుల సూక్తులెన్నో ఆమెకు కంఠపాఠం. సుల్తాన్‌బజార్‌లోని హష్మత్‌గంజ్‌లో ఒక హోలీ పండుగ సందర్భంలో మజ్లిస్ ఇత్తెహాద్-ఉల్-ముసల్‌మీన్ నాయకుడైన బహద్దుర్ యార్జంగ్‌తో ఒక వేదికమీద హిందూ-ముస్లింల సమైక్యతను గురించి ఆమె ఉర్దూలో చేసిన మహోపన్యాసం నేనెన్నటికీ మరువలేను. ఆ ఉపన్యాసంలో ఆమెయెన్నో ఉర్దూ కవితా ఖండాలను ఉదహరించినది.

బుల్ బుల్‌కు గుల్ ముబారక్-
గుల్‌కూ చమన్ ముబారక్
రంగీన్ తబీయతోంకు
రంగీన్ సుఖున్ ముబారక్

అని ఆ సభలో ఆమె పేర్కొన్నది. నిజానికది మహోన్నతమైన, మహోదాత్తమైన వ్యక్తిత్వము సంస్కృతీగల నాయకులయుగం. వారందరూ రాజకీయరంగంలోను, విజ్ఞానరంగంలోను అతిరధమహారధులైన సవ్యసాచులు; త్యాగమూర్తులు; భారతదేశ వైతాళికులు. యువకులుగా, విద్యార్థులు, వారి నుండి ఉత్తేజం పొందేవారు.

ఈ శ్రేణికి చెందినవారే ఆచార్య నరేంద్రదేవ్. ఆయన మహావిజ్ఞాని, గొప్ప మేధావి, బహుభాషావేత్త. జవహర్‌లాల్ నెహ్రూ వంటివాడు ఆయన విజ్ఞానానికి ముగ్ధుడయ్యేవాడు. మార్క్సువాదం, సామ్యవాదంలో ఆయన నిష్ణాతుడు. జయప్రకాశ్ నారాయణ ప్రభృతులైన సోషలిస్టులు ఆయనను గురుతుల్యునిగా భావించేవారు. రాజకీయశాస్త్రం, అర్థశాస్త్రం, సాహిత్యములతోపాటు అనేక భాషలలో ఆయన ప్రవీణులు. పోలీసుచర్య తరువాత హిందీ ప్రచారసభ ఒక సాహిత్యసమ్మేళనం హైదరాబాదులో ఏర్పాటు చేసినది. పురుషోత్తమదాస్ టాండన్ ప్రభృతులతోపాటు ఆచార్య నరేంద్రదేవ్‌కూడా అందులో పాల్గొన్నారు. సంస్కృత బహుళమైన హిందీతోపాటు అరబ్బీ, ఫారసీమయమైన ఉర్దూలో కూడా ఉపన్యసించగలిగిన శక్తిలో ఆయనకు ఆయనేసాటి. సంస్కృత భాషలో ఆయన వైదుష్యము అద్వితీయమైనది. మనదక్షిణదేశ పండితులతో ఆయన సంస్కృతంలో సంభాషించగా వారు ఆశ్చర్యచకితులైన సందర్భం నాకు జ్ఞాపకం ఉన్నది.

సయ్యద్ హుసేన్ అనే ఒక రాజకీయశాస్త్ర పారంగతుడు, వక్త 1937 ప్రాంతంలో హైదరాబాదుకు విదేశాల నుండి వచ్చినారు. ఆయన ఒక విదేశ విశ్వవిద్యాలయంలో రాజకీయశాస్త్ర ఆచార్యులుగా ఉండేవారు. ఆయన భారతదేశ స్వాతంత్ర్యాన్ని సమర్థించిన జాతీయవాది. చిన్నతనంలో ఆయన మోతీలాల్ నెహ్రూగారి ఆదరణ పొందినాడని వినేవారం. ఏమైనప్పటికిని భారత స్వాతంత్ర్యాన్ని సమర్థించిన రెండు మహోపన్యాసాలు ఆయన హైదరాబాదులో చేసినప్పుడు నేను విన్నాను. స్వయంగా సరోజినీదేవి ఆ సభలకు అధ్యక్షత వహించి ఆయనను పరిచయం చేసి ప్రశంసించినది. తర్వాత, అనగా భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పిమ్మట నెహ్రూ ప్రభుత్వం ఆయనను ఈజిప్టులో కాబోలు రాయబారిగా నియమించినది. సయ్యద్ హుసేన్‌గారి ఉపన్యాసాలు వినడానికి హైదరాబాదులోని విద్యావంతులు అనేకులతోపాటు నిజాం ప్రభువుగారి పెద్ద కోడలు దుర్రెషహవర్‌బేగం గారు కూడ వచ్చినట్లు నాకు జ్ఞాపకం. ఆర్యసమాజ నాయకులైన రామచంద్రజీ ప్రభృతులు మతధార్మిక ఉపన్యాసాలు ఆ రోజులలో చేస్తుండేవారు. ఈ ఉపన్యాసాలు ప్రజలను ఉత్తేజపరుస్తుండేవి.

ఆనాటి నిజాం కళాశాల ఒక విశిష్టమైన సంస్కృతికి ఆటపట్టు. ఇంగ్లీషు ద్వారా విద్యాబోధనా, వెలుపలి ప్రపంచముతో పరిచయమూ, సంబంధమూ, హైదరాబాదులోని సమకాలీన సంస్కృతి మదరాసు విశ్వవిద్యాలయానికి అనుబంధమైనందువలన మాతృభాషా సాహిత్యాల ప్రభావమూ సమ్మిళితమై నిజాం కళాశాల విద్యార్థుల వ్యక్తిత్వాలను తీర్చిదిద్దేది. కళాశాలకు, కళాశాల వసతిగృహానికి మంచి గ్రంథాలయాలు పఠనాలయాలు ఉండేవి. ఆచార్య సిరుగూరి హనుమంతరావుగారు తమకు గ్రంథాలయ విభాగంలో ఏ సంబంధము లేకపోయినప్పటికిని కళాశాల గ్రంథాలయాన్ని స్వయంగాచూచి అభివృద్ధి చేసేవారు. పఠనాలయంలో ఉత్తమ శ్రేణి పత్రికలు వచ్చేవి. అప్పుడు హైదరాబాదు నుండి వెలువడే ఇంగ్లీషు దినపత్రిక "హైదరాబాదు-బుల్‌టిన్" మహాత్మాగాంధీగారి సంపాదకత్వంలో వెలువడుతుండే 'హరిజన్, ఈశ్వరదత్తుగారి Twentieth Century" కోలవెన్ను రామకోటీశ్వరరావుగారి త్రివేణి మొదలైన పత్రికలు చదివి విద్యార్థులు రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలను అవగాహన చేసుకునేవారు. ఇందుకుతోడు "Times of India" లో మంచి రాజకీయ వ్యాఖ్యానాలు వచ్చేవి. మహాత్మాగాంధీగారిని ధిక్కరించి సుభాస్‌చంద్రబోస్ కాంగ్రెస్

అధ్యక్షులుగా ఎన్నికైనప్పుడూ, ఆ తరువాత జరిగిన అఖిల భారత కాంగ్రేస్ సంఘ సమావేశంలో గాంధీగారిని సంప్రదించి ఆయన తన కార్యవర్గాన్ని నిర్మించవలెనని గోవిందవల్లభపంత్, రాజగోపాలాచారిగార్లు ప్రతిపాదించి బలపరిచిన తీర్మానం నెగ్గినందువలన సుభాస్ చంద్రబోస్ రాజీనామా చేసినప్పుడూ "Times of India"లో ఆనాటి రాజకీయ రంగాన్ని గూర్చి జవహర్‌లాల్ నెహ్రూ డోలాయమాన పరిస్థితిని గురించీ వ్రాసిన రాజకీయ వ్యాఖ్యానాలు ప్రతిభావంతమైనవి. సాటిలేనివి, మరువరానివి, నాటి విద్యార్థులను ఉత్తేజపరచినవి. భారతి, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రికలను ఆనాటి విద్యార్థులు ఆసక్తితో చదివేవారు.

1938లో సుభాస్ చంద్రబోస్ కాంగ్రేస్ అధ్యక్షులుగా యెన్నిక కాగానే సర్దార్‌పటేల్, రాజేంద్రప్రసాద్ ప్రభృతులు కాంగ్రేస్ కార్యవర్గ సభ్యత్వానికి రాజీనామాచేయగా, జవహర్‌లాల్ మాత్రము రాజీనామా చేయలేదు. అటు గాంధీగారితో విడిపోవడం యిష్టపడలేదు. ఇటు సుభాష్‌చంద్రబోస్‌ను సంపూర్ణంగా బలపరచలేదు. ఇది డోలాయమానస్థితి. కాంగ్రేసులో సోషలిస్టు పక్షాన్ని స్థాపించి ప్రోత్సహించినప్పటికి, మహాత్మాగాంధీ అడుగుజాడలలోనే ఆయన నడిచేవాడు. ఇదికూడ డోలాయమానస్థితియే. అందుచేతనే ఆ రోజులలో విద్యార్థులు, యువకులు ఆయనను గూర్చి మాట్లాడుతున్నప్పుడు – "He talks left but acts right " (మాటలలో అతివాది. ఆచరణలో మితవాది) అని అనుకునేవారు. ఈ విధంగా రాష్ట్రరాజకీయాలతోపాటు అఖిలభారత రాజకీయాలలో కూడ నిజాం కళాశాల విద్యార్థిలోకానికి ఆసక్తి ఉండేది. సుభాష్‌చంద్రబోస్ నాయకత్వాన్ని గూర్చి ప్రస్తావిస్తూ రాజగోపాలాచారి గారు "అది రంధ్రము పడిన పడవ" (Leaky boat) అని చెప్పినమాట మా విద్యార్థిలోకంలో బాగా ప్రచారంలో ఉండేది.

ఆనాటి ఉపాధ్యాయులను తలుచుకుంటే ఎన్నో మధురమైన స్మృతులు. ఒక్కొక్కరు ఒక్కొక్క రంగంలో నిష్ణాతులు. ఉపాధ్యాయ విద్యార్థుల సంబంధాలు ఆదర్శప్రాయంగా ఉండేవి. ప్రిన్సిపాల్ విలియం టర్నర్‌గారు షేక్స్పియర్ సాహిత్యంలో పారంగతులు. బి.ఏ., తరగతికివారే స్వయంగా షేక్స్పియర్ పాఠాలు బోధించేవారు. టర్నర్ స్కాట్‌లండ్ ప్రాంతీయుడు; మాకు మార్టిస్ అనేమరొక ఇంగ్లీషు ఉపాధ్యాయుడు ఉండేవాడు. ఈయన ఇంగ్లండ్‌వాడు. ఉచ్చారణలోను, బోధనలోను వీరికికొన్ని ప్రత్యేకతలు ఉండేవి. టర్నర్‌గారు "T" ని "త" అని పలికేవారు. 'R'ను ఒత్తిపలికేవారు.

Burns అనే ఒక ప్రసిద్ధకవి స్కాట్‌లాండ్ దేశీయుడు. ఆ అభిమానం చేత టర్నర్‌గారు ఆయనను ఎక్కువగా ప్రశంసించేవారు. ఈ చాదస్తాల నన్నింటిని మార్టిన్‌గారు వెక్కిరిస్తుండేవారు. స్కాట్‌లాండ్ గర్వపడగల కవి బర్న్సు ఒక్కడేనని టర్నర్ కూడ గర్వపడవలసిన కవి కూడ ఆయనేని మార్టిన్ హేళన చేసేవారు. టర్నర్ 'T' కి డ్యాష్ పెట్టేవారు. (t). మార్టిన్ అప్పుడప్పుడు "Oats are thrown to horses in England and eaten by men is Scotland" అని జాన్సన్ ఓట్స్‌కు అర్థం చెప్పినట్లు తరగతిలో అంటుండేవారు. ఇదంతా మాకొక వినోదంగా ఉండేది. టర్నర్ ఆరు అడుగుల రెండు అంగుళాల పొడుగుతో అందుకు తగిన దృఢమైన శరీరంతో బలిష్ఠంగా ఉండేవాడు. మార్టిన్ సాధారణమైన ఎత్తూపొడుగు కలిగి ఉండేవాడు. వీరు పరస్పరం ఒకరిమీద ఒకరు విసిరే ఛలోక్తులు మనదేశంలోని పండితుల వివాదాలు మాకు జ్ఞప్తికి తెచ్చేవి. కట్టమంచి రామలింగారెడ్డిగారు ఒకసారి "పండితుల వివాదాలు పరుషంబులేకాని సరళంబులుగావు" అని అన్నారని వారితో పరిచయం కలిగిన ఒక మిత్రుడు నాకు చెప్పినాడు. టర్నర్‌పైన మార్టిన్ యెత్తిపొడుపులు యిందుకు ఉదాహరణలు.

ఆచార్య సిరుగూరి హనుమంతరావుగారు రాజకీయ శాస్త్రాన్ని బోధించేవారు. ఉపాధ్యాయులుగా వారు ఆదర్శప్రాయులు. చరిత్రచెప్పే ఆచార్యులు అంత సమర్థులుకారు. అందుచేత హనుమంతరావుగారు రాజకీయశాస్త్ర పాఠాలను పరీక్షలకు మూడు నెలలకుముందు పూర్తి చేసి, తరువాత విద్యార్థులపట్ల సానుభూతితో తమకు ఎవ్వరు ఏమి పారితోషికము యీయకపోయినా చరిత్రపాఠాలు ఒకమారు రివైజ్ చేసి మళ్ళీ తాము బోధించురాజకీయ శాస్త్రాన్ని కూడా రివైజ్ చేసేవారు. ఆరోజుల్లో అర్థశాస్త్ర ఆచార్యులు ఎస్.కె.అయ్యంగారు. ఆయన అర్థశాస్త్రంలో గొప్ప ప్రామాణికులు. అనేక గ్రంథాలు వ్రాసినారు. హైదరాబాదు ప్రభుత్వానికి, మైసూరు ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా కూడ ఉండేవారు. అత్యంతసమర్థుడైన ఉపాధ్యాయుడుగా ఆయన విద్యార్థులకు బోధన చేసేవారు. సైన్స్ విభాగంలో డా॥ జె.సి.కామేశ్వర్‌రావుగారు పదార్థ విజ్ఞానశాస్త్రంలో పారంగతులు. వారి శిష్యవాత్సల్యం గొప్పది. తెలుగుశాఖలో ఆచార్య సరిపల్లి విశ్వనాథశాస్త్రిగారు, ఆచార్య కురుగంటి సీతారామయ్యగారు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉండి, తెలుగు సారస్వత సమితి కార్యకలాపాలకు మార్గదర్శకులుగా ఉండేవారు.

ఆచార్య కురుగంటి సీతారామయ్యగారి తెలుగు పాఠాలు మనోరంజకంగా ఉండి విద్యార్థులను ఆకర్షించేవి. తెలుగు కావ్యాలలోని పద్యాలు, పాఠాల మధ్య ఉదహరిస్తూ ఆధునిక కవులను గూర్చిన అనేక ఉదంతాలు తెలుపుతూ, ఆయన క్లాసులో పాఠం చెప్తుతుంటే హృదయంగమంగా ఉండేది. నిజాం కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా ప్రవేశించకముందు ఆయన గాంధీగారి శాసనోల్లంఘన ఉద్యమంలో, జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఇంట్లో ఖాదీ వేసినా, కాలేజికి సిల్కుసూటుతో వచ్చేవారు. 'తంజావురాంధ్ర నాయకచరిత్ర'ను గూర్చి పరిశోధనచేసి మొట్టమొదటి గ్రంథాన్ని వ్రాసినవారు కురుగంటి సీతారామయ్యగారు. కట్టమంచి రామలింగారెడ్డిగారి కవిత్వతత్త్వ విచారాన్ని, ముఖ్యంగా కవిత్వంలో అలంకారాలను గూర్చి చేసిన విమర్శను తీవ్రంగా ఖండిస్తూ సీతారామయ్యగారు "అలంకార తత్త్వవిచారం" అనే గ్రంథాన్ని వ్రాసినారు. "నవ్యాంధ్ర సాహిత్య వీథులు" అనే పేరుతో నవ్యసాహిత్యచరిత్రను మొట్టమొదటిసారిగా విపులంగా వ్రాసిన గౌరవం సీతారామయ్యగారికే చెందుతున్నది. ఇంగ్లీషు, సంస్కృతం, తెలుగు భాషలలో వ్రాయగల నేర్పు మాట్లాడగల నేర్పు ఆయనకు ఉండేది.

అందరిలో విశిష్టులు గణితశాస్త్ర ఆచార్యులు అరుణాచలశాస్త్రిగారు. శాస్త్రిగారికి మదరాసు విశ్వవిద్యాలయంలో గొప్ప కీర్తి, గౌరవము ఉండేవి. ఆనాటి ఇంగ్లీషు ప్రిన్సిపాళ్ళు గూడ శాస్త్రిగారిపట్ల గౌరవం, ఆదరము చూపేవారు. శాస్త్రిగారు ఉత్తమశ్రేణికి చెందిన ఆచార్యులు, గణితశాస్త్రంలో నిష్ణాతులు. శిష్యులపట్ల వాత్సల్యము గలవారు. శిష్యులకు ఆయనపట్ల భయభక్తులు ఉండేవి. చాలా స్వతంత్ర భావాలు గల అరుణాచల శాస్త్రిగారిని మదరాసు విశ్వవిద్యాలయం, అప్పటి ప్రభుత్వం, కళాశాల ప్రిన్సిపాల్, పాలకవర్గం, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆచార్య వర్గం, విద్యార్థి బృందం అత్యంతంగా గౌరవించేవారు. నాటికి, నేటికి శాస్త్రిగారి వంటి ఆదర్శ అధ్యాపకులను నేను చూడలేదు. తమిళం మాతృభాషయైన అరుణాచలశాస్త్రిగారికి, తెలుగుభాష పట్ల అభిమానం ఉండేది. ఒకసారి జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి గారు కళాశాలలో సహస్రావధానము చేయగా ఆ సభకు శాస్త్రిగారు అధ్యక్షత వహించి చక్కగా నిర్వహించిన దృశ్యం నేను కనులారచూచినాను. ఆచార్య రామనరుసుగారు అర్థశాస్త్ర విభాగంలోను, రాఘవన్, అల్లాఉద్దీన్, ఫజల్‌హఖ్‌గార్లు ఇంగ్లీషు విభాగంలోను ఆచార్యులై శిష్యుల గౌరవాభిమానాలకు పాత్రులుగా ఉండేవారు. ముఖ్యంగా

రామసరుసుగారికి స్వతంత్ర అభిప్రాయాలు ఉండేవి. అందువలన విద్యార్థులతో చాలామంచి సంబంధాలు ఉండేవి. ఆనాటి ఉపాధ్యాయులను తలుచుకుంటే హృదయం ఉప్పొంగుతుంది. వెనుకటి గురుకులాలను వారు జ్ఞప్తికి తెస్తుండేవారు.

ఆ రోజుల్లో ఆచార్య తణికెళ్ళ వీరభద్రుడుగారు ఉస్మానియా విశ్వవిద్యాలయ ఇంగ్లీషుశాఖలో ఆచార్యులుగా ఉండేవారు. అప్పటి హైదరాబాదు రాష్ట్రంలోని ప్రముఖులందరు వారిని గౌరవించేవారు. తమ ఉద్యోగధర్మానికి భంగం కలుగకుండా,. ఇక్కడి ప్రజలతో వారు కలసిమెలసి ఉండేవారు. (రాయప్రోలు సుబ్బారావుగారు యిందుకు భిన్నంగా వ్యవహరించేవారు) వీరభద్రుడుగారిని తలుచుకున్నప్పుడు ఎన్నో విషయాలు స్మరణకు వస్తున్నవి. ఆ కాలంలో ప్రతిభావంతుడని పేరుగాంచిన ఒక విద్యావేత్తను గూర్చి వీరభద్రుడుగారు "కొందరికి private morality ఉంటుంది. మరికొందరికి public morality ఉంటుంది. కాని యీ మహాశయునికి యీ రెండూ లేవని చెప్పుతుండేవారు. మరొక పర్యాయం ఒకానొక పురపాలక సంఘాధ్యక్షుని గూర్చి ప్రస్తావించి, ఒకకవి ఆయనను గూర్చి వ్రాసిన పద్యభాగం "నీవు చేసిన పనులు రెండే కలవు; నిడదవోలు బ్రిడ్జొకటి, నీ నిలయమొకటి" అని ఉదాహరించిన ఉదంతం నాకు బాగా జ్ఞాపకమున్నది. ఈనాడు మన ముందు జరుగుతున్న వ్యవహారాలు చూస్తుంటే ఆనాటి పెద్దల మాటలు కొన్ని జ్ఞప్తికి వస్తున్నవి. నాటికి, నేటికి ఎంత వ్యత్యాసం! ఎవరమైన ఒకసారిపోల్చి ఆలోచించుకుంటె ఆ ప్రపంచమే వేరు అనిపిస్తుంది. అధ్యాపక పదవి పవిత్రమైనది. జాతికి మార్గదర్శకమైనది. లోకమాన్య బాలగంగాధరతిలక్ గారిని స్వరాజ్యం వచ్చిన తర్వాత మీరు ఏమిపని చేయదలచినారని ఒకరు ప్రశ్నించగా ఫర్గూసన్ కళాశాలలో గణితశాస్త్రాన్ని బోధించదలచినానని చెప్పేవారట.

ఆ కాలంలో విద్యార్థిలోకంలో కొన్ని హాస్యసంఘటనలు ప్రచారంలో ఉండేవి. కళాశాల వసతిగృహంలో ఉండే విద్యార్థి ఒకరు తనకు తండ్రిగారి వద్ద నుంచి మనియార్డర్‌రాగా యింకా యెక్కువ డబ్బు యెందుకు తేలేదని పోస్ట్‌మాన్‌తో జగడమాడేవారు. బి.ఎస్‌సి., చదువుతున్న యీ విద్యార్థి అవివేకం, తోడివిద్యార్థులలో యీయనను నవ్వులపాలు గావించేది. అప్పుడు అలీగడ్ విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా ఒక మహాశయుడు ఉండేవారు. ఆయన ఎల్లప్పుడు అన్యమనస్కుడై ఉండేవారట. ఒకసారి వాహ్యాళికి వెళ్ళివచ్చి, గదిలో ప్రవేశించి, చేతిలోని బెత్తాన్ని

పడకమీదపెట్టి తాను బెత్తం ఉంచవలసినచోట నిలిచాడట. ఆ రోజులలో హైదరాబాదు పబ్లిక్ గార్డెన్సుకు జమాలుద్దీన్ అనే ఆయన పర్యవేక్షకుడుగా ఉండేవారు. ఆయన అవివేకాన్ని గూర్చి రకరకాల కథలు వ్యాప్తిలో ఉండేవి. ఒకరోజు వర్షము పడుతుండగా తోటమాలీలు చెట్లకు నీళ్ళుపోయలేదు. అప్పుడు ఆయన వారిని మందలించగా మాలీలు వానలో నీళ్ళు యెందుకు, యెట్లా పోయవలెను అని అనగా "గొడుగులు పట్టుకొని పోయవలెను" అని పట్టుపట్టినాడట. పరమానందయ్య శిష్యుల కథలను జ్ఞాపకంచేసే కథలుయెన్నో యీయనను గూర్చి ప్రచారంలో ఉండేవి. వాటిని సంకలనంచేస్తే మంచి హాస్యగ్రంథం కాగలదు.

మొదటి నుంచి ఇంగ్లీషు ద్వారా విద్యాభ్యాసం చేసినందువలన ఆంగ్లగ్రంథాలను, నవలలను చదివే అలవాటు మాకు కొంతమందికి హైస్కూలు దశనుండే కలిగినది. "David Copperfield, Oliver twist, Picwik Papers, Tom Brown's School Days, Three Musketeers, Don quixote మొదలైన గ్రంథాలతో పాటు Bernard Shaw, Gaulswardi రచనలను చదువుతుండేవారము. బెర్నార్డ్‌షా స్వతంత్రభావాలు కలిగిన మేధావి. ఎవరినీ లక్ష్యపెట్టేవాడుకాడు. ఇంగ్లండ్ రాణి ఆయనను కలువదలచినప్పుడు సమయము నిశ్చయించుకొని ఆయన ఇంటికి స్వయంగా వెళ్ళి చూచినదట. ఈయన విసిరిన ఛలోక్తులు ఎన్నో మా విద్యార్థిలోకంలో ప్రచారంలో ఉండేవి. ఆ రోజుల్లో ఇంగ్లండులోని ఒక సౌందర్యవతి తనను పెండ్లిచేసుకోమని కోరుతూ ఆయనకు ఒక లేఖ వ్రాసి – మన పెండ్లి జరిగితే మన సంతానానికి నాచక్కదనం. నీ తెలివితేటలు రాగలవని వ్రాసిందట. అందుకు సమాధానంగా ఆయన–నా చక్కదనం 'నీ తెలివి తేటలువస్తే అది దురదృష్టకరం కాగలదని, వ్రాసినాడట.

III

నిజాం ప్రభుత్వం ఎంత ఉలికిపడినప్పటికిని, ప్రజల భాషల వికాసాన్ని ఎంత వ్యతిరేకించినప్పటికిని, ప్రాథమిక స్వత్వాలను ఎంత అణిచి వేసినప్పటికిని తెలంగాణాలో తెలుగు సాహిత్యదీపాలు ఎన్నడూ ఆరిపోలేదు; దేదీప్యమానంగా అవి వెలుగకపోయినప్పటికి ఆమిదము పోసిన ప్రమిదలలోని దీపాలవలె మినుకుమినుకు మంటు వెలిగేవి. అంతేకాదు, తెలంగాణకు ఆంధ్రజిల్లాలతో సాంస్కృతికమైన సంబంధాలు కూడా ఎన్నడూ తెగిపోలేదు. తెలంగాణాలో ఆంధ్ర సంస్కృత భాషలలో పండితులు చాలామంది ఉండేవారు. అయితే వారికి తగిన ప్రోత్సాహం

దొరకకపోయ్యేది. ప్రాచీన సంప్రదాయానికి చెందిన కవులు, పండితులు పెక్కు మంది అజ్ఞాతంగా జీవితాలు గడిపేవారు. వారికి కొంత ఉర్దూ, ఫారసి భాషల పరిచయం కూడా ఉండేది. కాని ఆ ఉర్దూ, ఫారసి భాషల ప్రభావం పరిమితమై ఉండేదికాని సాహిత్యంమీద ఎక్కువగా పడలేదనేచెప్పవలెను. ఆంగ్లభాష ప్రభావం ఆలస్యంగా పడినందువలన భావకవులు కూడా తెలంగాణలో ఎక్కువమంది బయలుదేరలేదు. క్రమక్రమంగా యువకులలో కథానికా రచన బాగా ప్రచారంలోకి వచ్చింది. అవధానాలు చేసేవారు తగినంతమంది ఉండేవారు. ఆ రోజులలో తెలుగు భాషా పోషణ ఎక్కువగా వనపర్తి, గద్వాల, ఆత్మకూరు మొదలైన సంస్థానాలలో జరిగింది. ఈ సంస్థానాలలో కొందరు ఉద్దండులైన పండితులు ఉండేవారు. తిరుపతి వెంకట కవులు యీ సంస్థానాలకు వచ్చి సన్మానాలు పొందినారు. ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, భారతి మొదలైన పత్రికలు పల్లెటూళ్ళలో కూడ వచ్చేవి. గ్రంధాలయ వార్షికోత్సవాలలో ఆంధ్రప్రాంతానికి చెందిన కవిపండితులు వచ్చి పాల్గొనేవారు. ఈ విధంగా ఆంధ్ర, తెలంగాణల మధ్య సాహిత్య సంబంధాలు ఎన్నడూ తెగిపోలేదు. కొప్పరపు కవులలో ఒకరైన బుచ్చిరామకవిగారు యీ ప్రాంతాలకు వచ్చి ఆశుకవితా ప్రదర్శనము చేసిన సందర్భాలు నాకు జ్ఞప్తి ఉన్నవి. కవిపండితుల రాకపోకలకు ఎన్నడూ అంతరాయం కలుగలేదు.

అన్నిటికన్నా ముఖ్యంగా నాటక సంఘాలు, నాటక ప్రదర్శనాలు ఆ రోజులలో యీ రెండు ప్రాంతాల మధ్య స్నేహసంబంధాలు వర్ధిల్లచేసినవి. మైలవరం కంపెనీ, సురభి కంపెనీ మొదలైన నాటక సంఘాలు తెలంగాణ ప్రాంతములోని ముఖ్యపట్టణాలలో నాటక ప్రదర్శనాలు చేస్తుండేవి. సతీసావిత్రి, కృష్ణతులాభారం, సారంగధర, చిత్రనళీయము మొదలైన నాటకప్రదర్శనాలు జరుగుతుండేవి. చిలకమర్తివారి 'గయోపాఖ్యానం', ధర్మవరం కృష్ణమాచార్యులవారి నాటకాలు చాలా ప్రచారంలో ఉండేవి. ప్రతి పల్లెటూళ్లో కొందరైనా యీ నాటకాలు చూచిన వారుండేవారు. కపిలవాయి రామనాథశాస్త్రి, వేమూరి గగ్గయ్య, ఉప్పులూరి సంజీవరావు ప్రభృతులైన నటకుల పేర్లు తెలంగాణలో చదువుకున్న వారందరికి బాగా తెలిసినవే. బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు సికిందరాబాదుకు వచ్చి సత్యహరిశ్చంద్ర నాటకం వేసినప్పుడు నేను స్వయంగా చూచినాను. లక్ష్మీకాంతంగారి పద్యపఠన మనోరంజకంగా ఉండేది. ఆయన ఒకటి రెండు సాహిత్యసభలలో ప్రసంగించినట్లు నాకు జ్ఞాపకం.

మేము కొంతమంది విద్యార్థులము బలిజేపల్లి లక్ష్మీకాంతంగారిని సికిందరాబాదులో కలుసుకున్నప్పుడు వారు తమ ఉత్తరరామచరిత్రములోని కొన్ని భాగాలు మాకు వినిపించి, తాము అందులో అనువదించిన పద్యాలు మూలంతోపాటు మనోజ్ఞంగా చదివినప్పుడు నా హృదయం కదిలిపోయింది. తరువాత లక్ష్మీకాంతం గారి 'ఉత్తరరామ చరిత్ర' నాటకాన్ని కొని చదివి ఆనందించినాను. నాకు యీ నాటికి భవభూతి ఉత్తరరామ చరిత్ర మూలం చాలా యిష్టమైన రచన. ఇందుకు కారణం ఒకవిధంగా బలిజేపల్లి లక్ష్మీకాంతంగారే అని చెప్పవచ్చును.

పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు ఒక పర్యాయము 1937 ప్రాంతంలో యిక్కడికి వచ్చి యుండిరి. నెరసిన వెంట్రుకలతో, కాషాయపురంగు అద్దిన షర్టుతో, ధోవతితో ఉన్నవారి మూర్తి నేను సందర్శించడం జరిగింది. "నాయనలారా అని ప్రారంభించి సరిగ్గా సాక్షి ఉపన్యాసాలలోని జంఘాలశాస్త్రివలె వారు ప్రసంగించిరి. 'విజ్ఞాన ప్రచారిణి, ఆంధ్ర ప్రచారిణి' గ్రంథమాల నవలలు చిలకమర్తి నవలలు యిక్కడి గ్రంథాలయాల ద్వారా చదువుకున్న వారందరికి ఆ రోజులలో సుపరిచితాలు. 'విమలాదేవి, ప్రమదావనం, వసుమతీవసంతం, కొన్ని అపరాధపరిశోధన నవలలు యీ ప్రాంతంలో ప్రచారం ఉండి గ్రంథ పఠనాసక్తిని పురిగొల్పినవి. ఆ కాలంలోనే దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మగారు హైదరాబాదుకు వచ్చి నిజాం కళాశాలలో ఉపన్యసించిరి. ఆనాడు మహోద్రేకంతో ఆమె మాట్లాడినారు.

ఆ రోజులలో గ్రంథాలయోద్యమం ప్రజలను మేలుకొలిపి, జాతీయ ఉద్యమం వైపు మరలించిన గొప్ప ఉద్యమం. గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు (పటమటలోని ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘాధ్యక్షులు). ఈ ప్రాంతాలకు అప్పుడప్పుడు వస్తుండేవారు. వారు అనేక గ్రంథాలయ సభలలో పాల్గొని యీ ప్రాంతాలలో ఉద్యమవ్యాప్తికి తోడ్పడినారు. హరిసర్వోత్తమరావుగారు లక్ష్మణరావుగారికి సాంస్కృతికంగా అనుచరులు. అందుచేత లక్ష్మణరావుగారు ప్రారంభించిన ఉద్యమాన్ని వర్ధిల్లజేయడానికి వారు కృషి గావించినారు. అనాటి విజ్ఞానులలో హరిసర్వోత్తమరావుగారిది విశిష్టస్థానం. ఆయన రాయలసీమ వాస్తవ్యుడు. ఎమ్.ఏ., పట్టభద్రుడు. రాజకీయంగా బాలగంగాధర తిలక్‌గారికి అనుయాయులు. మొట్టమొదటిసారి తెలుగుదేశంలో దేశస్వాతంత్ర్యం కొరకు సత్యాగ్రహం చేసి జైలుకు వెళ్ళిన త్యాగమూర్తి. నాగేశ్వరరావుగారి ఆహ్వానంమీద కొంతకాలం "ఆంధ్రపత్రికకు"

సంపాదకులుగా ఉండిరి. లక్ష్మణరావుగారి ప్రోత్సాహంతో 'విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి' కొరకు వారు ఒకటి రెండు పుస్తకాలను కూడా వ్రాసిరి. ఆనాటి తెలంగాణ నాయకులకు హరిసర్వోత్తమ రావుగారిపైన అపారమైన గౌరవాభిమానాలు ఉండేవి. వారి నేతృత్వంలో ఖమ్మంజిల్లా కొత్తగూడెంలోను, మహబూబ్‌నగర్ జిల్లా క్యాతూర్‌లోను రెండు పర్యాయాలు ఆంధ్రదేశ గ్రంథాలయ వార్షిక సభలు జరిగి కార్యకర్తలను ప్రోత్సహించినవి. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు మొదలయిన పెద్దలతోపాటు కోదాటి నారాయణరావు, గడియారం రామకృష్ణశర్మ మొదలయిన యువకులు యీ సభల విజయానికి తోడ్పడినారు. కోదాటి నారాయణరావుగారు తెలంగాణలో గ్రంథాలయోద్యమవ్యాప్తికి చేసిన కృషి ప్రశంసనీయమైనది. ఆయన యీ రంగంలో హరిసర్వోత్తమరావుగారి అనుయాయులు. హరిసర్వోత్తమరావుగారితోపాటు, పాతూరి నాగభూషణం గారు గ్రంథాలయసభలకు వస్తుండేవారు. నాగభూషణంగారు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘానికి కార్యదర్శి; ఉద్యమానికి పట్టుగొమ్మ. 1944 ప్రాంతంలో వరంగల్‌లో జరిగిన శబ్దానుశాసన గ్రంథాలయ రజతోత్సవ సభలను హరిసర్వోత్తమరావుగారు ప్రారంభించిరి. పాతూరి నాగభూషణంగారు యీ సభలలో పాల్గొనిరి. 1950–51వ ప్రాంతంలో ఆంధ్ర సారస్వత పరిషత్తుపక్షాన హైదరాబాదులో నిర్వహించిన 'వయోజన శిక్షణ' శిబిరానికి హరిసర్వోత్తమరావుగారు ఆచార్యులుగావచ్చి సారస్వతపరిషత్తు కార్యకర్తలను ప్రోత్సహించిరి. నాటి తెలంగాణలోని గ్రంథాలయోద్యమానికి హరిసర్వోత్తమరావుగారు యిచ్చిన తోడ్పాటు గణనీయమైనది. గోపరాజు రామచంద్రరావుగారు కూడా క్యాతూర్‌లో జరిగిన ఆంధ్రదేశ గ్రంథాలయ సభలకు వచ్చినట్లు నాకు జ్ఞాపకం. గాఢమైన విశ్వాసాలు కలిగిన గోపరాజు రామచంద్రరావు గారికి వయోజన విద్యావ్యాప్తి, గ్రంథాలయ ఉద్యమం అభిమానాస్పదమైన ఉద్యమాలుగా ఉండేవి. లక్ష్మణరావుగారి తరువాత హరిసర్వోత్తమరావుగారు ఆంధ్ర, తెలంగాణల మధ్య ఒక దృఢమైన వంతెనగా ఉండేవారు.

గ్రంథాలయోద్యమ వ్యాప్తికి ప్రభుత్వము అనేక ప్రతిబంధకాలు కల్పించేది. అయినా కార్యకర్తలు ఓపికతో సహించి యీ ఉద్యమాన్ని ముందుకు నడిపినారు. గ్రంథాలయ సభల అధ్యక్షుల ఉపన్యాసాలు, వక్తల ఉపన్యాసాలు మొదలయిన వాని సారాంశాన్ని మొదలే వ్రాసి పంపవలెనని, వ్రాసిపంపని విషయాలు ప్రసంగాలలో

రాకూడదని యింకా యిటువంటి నిర్బంధాలు అప్పటి పరిపాలనలో ఎన్నో పెట్టేవారు. ఈ యిబ్బందులను యెదుర్కొని ప్రజలలో జాగృతిని కలిగించడానికి యీ గ్రంథాలయాలు చేసినసేవ అద్వితీయమైనది. ఈ గ్రంథాలయాలు అప్పటి కార్యకర్తలకు, నాయకులకు శిక్షణ శిబిరాలుగా ఉండేవి. 1945 ప్రాంతంలో కాబోలు సర్‌మిర్జా ఇస్మాయిల్‌గారు ప్రధానమంత్రిగా ఉండినరోజులు. ఆయన మైసూరు రాష్ట్రానికి ప్రధానమంత్రిగా ఉండి ఆ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసినారు. మైసూర్ రాష్ట్ర నిర్మాతలలో ఆయన ఒకరు. అటు ఇంగ్లీషు ప్రభుత్వంతోను యిటు కాంగ్రేస్ నాయకులతోను ఆయనకు స్నేహసంబంధాలు ఉండేవి. స్వయంగా విశాల భావాలు కలిగిన సంస్కృతీపరుడు. కాని ఆయన ఎక్కువ రోజులు హైదరాబాదు రాష్ట్రంలో ఉండలేకపోయినారు. కారణం, రజాకారులవ్యతిరేకతయే. అప్పటివరకు రజాకారుల ఉద్యమం బలపడింది.

రజాకారుల ఆశయాలు క్లుప్తంగా యివి.

1. హైదరాబాదు రాష్ట్రం స్వతంత్రంగా ఉండవలెను. ఇండియన్ యూనియన్‌లో చేరరాదు.
2. నిజాం నిరంకుశ పరిపాలన కొనసాగవలెను.
3. పరిపాలన పైన ముస్లింల ఆధిక్యత కొనసాగవలెను.

ఈ ఉద్దేశంతో దౌర్జన్యాలకు దిగి ప్రజలలో భయాందోళనలను వ్యాపింపజేసే నిమిత్తం, కిరాతకకృత్యాలను రజాకార్లు గావించిన వాస్తవం చాలామందికి తెలిసినదే. వరంగల్ నగరంలో రెండు హత్యలను రజాకార్లు చేసినారు. ఒకటి మొగులయ్య అనే కార్యకర్తను వరంగల్‌కోటలో హత్య చేసినారు. రెండవది వరంగల్ నగరంలో పట్టపగలు నారాయణరెడ్డి అనే ఒక డాక్టర్‌గారిని హత్యచేసినారు. మొగులయ్య హత్య తరువాత మిర్జాఇస్మాయిల్‌గారు వరంగల్ పర్యటన కొరకు వచ్చినారు. అప్పటికే కాళోజి నారాయణరావును వరంగల్ నుండి ఆరునెలల కొరకు వెళ్ళిపోవలసిందని ప్రభుత్వం ఉత్తర్వుచేసినది. ఆయన హైదరాబాదులో నివసిస్తూ మిర్జా ఇస్మాయిల్‌కు గేయకవితారూపకమైన ఒకలేఖ తెలుగులో వ్రాసినారు. మనలేఖా సాహిత్యంలో యీ లేఖ ఉత్తమశ్రేణికి చెందినది. ఇంగ్లీషులో లార్డ్‌చెస్టర్‌ఫీల్డుకు డాక్టర్ జాన్సన్ వ్రాసిన లేఖ వంటిది యిది. అందులో

మొగులయ్య మాతతో
మొగులయ్య భార్యతో
మొగమాటమును లేక ముచ్చటించితివా...
బాజారులోపల పసిబాలకుని బట్టి
బల్లెంబుతో పొడుచు బద్మాషునేమైన పసికట్టినావా?

అని ప్రశ్నించినాడు.

కాళోజి మా సహాధ్యాయుడు. చదువుకున్న రోజులలో ఆయన కవి అవుతాడని మేము ఎన్నడూ అనుకోలేదు. ఆయన తెలుగు విద్యార్థికూడా కాదు. తెలుగుభాషలో ప్రావీణ్యం కూడా ఎక్కువ లేకపోయేది. కాని అప్పటి ఉద్యమాలు ఆయనను కవిని చేసినవి. ఒక్కొక్క సంఘటన ఆయన హృదయాన్ని కదిలించి ఒక్కొక్క కవితగా వెలికివచ్చినది. అందుకే ఆయన ప్రజాకవి. భాషలోనూ, భావంలోనూ అన్నింటిలోనూ ఆయన ప్రజాకవి.

సర్ మిర్జా ఇస్మాయిల్ గారు మైసూరులో సంపాదించుకున్న కీర్తి విని, విద్యావ్యాప్తిలో ఆయనకున్న ఆసక్తి విని ఆయన వరంగల్‌కు వచ్చినప్పుడు మేము కొందరము చిత్రంగా ఆయనను కలుసుకోవడం జరిగింది. అప్పుడు శబ్దానుశాసన గ్రంథాలయానికి నేను కార్యదర్శిని - ఆ గ్రంథాలయము వరంగల్ కోట నుండి హనుమకొండకు వెళ్ళేదారిలో ఉన్నది. మిర్జా ఇస్మాయిల్‌గారు హైదరాబాదులోని ప్రభుత్వ కార్యాలయాలచుట్టూ ఉన్న ఎత్తైన గోడలను పడగొట్టించి చిన్నగోడలను పెట్టించేవారు. వాటికి పసుపురంగు వేయించేవారు. ఆ సంగతి మేము విని ఆయనతో ఇంటర్‌వ్యూ దొరుకునో లేదో అని సంకోచించి ఆ గ్రంథాలయపు గోడలకు పసుపు రంగువేయించి నలుగురైదుగురు యువకులము ఆయన వెళ్ళేదారిలో, ఆ సమయానికి గ్రంథాలయము ముందు నిలిచినాము. కారులో దూరం నుండి ఆయన మమ్ములను చూచి కారు ఆపి లోపలకు వచ్చినారు. అప్పుడు మేము ఆయనకు ఆ గ్రంథాలయ చరిత్ర తెలిపి పుస్తకాలను చూపించి గ్రంథాలయ సమస్యలను వివరించినాము. గ్రంథాలయం బాగా నడుస్తున్నదన్న అభిప్రాయం ఆయన వ్రాసిపెట్టివెళ్ళినారు. తరువాత రెండు రోజులకు డిస్ట్రిక్ట్‌కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్ యిద్దరు నన్ను వెదుకుకుంటు వచ్చి మిర్జా ఇస్మాయిల్‌గారు వ్యక్తిగతంగా విరాళంగా యిచ్చిన 116/- రూపాయల చెక్కును అందజేసి గ్రంథాలయ భవనాన్ని నిర్మించుకోవడానికి కావలసిన

స్థలాన్ని నిర్దేశించితే, ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఉచితంగా యీయగలదని చెప్పినారు. ఆ భూమిని నిర్దేశించడం జరిగింది. ఇంతలోనే మిర్జా ఇస్మాయిల్‌గారు అప్పటి ప్రభుత్వంలో యిముడలేక వెళ్ళిపోయినారు. తత్ఫలితంగా గ్రంథాలయానికి భూమి రాలేదు. మిర్జా ఇస్మాయిల్ మనదేశ వ్యవహారాలు సమస్యలు సంపూర్ణంగా తెలిసిన ప్రజ్ఞాశాలి, పరిపాలనాదక్షుడు. తుది దశలో విశ్రాంతి తీసుకుంటున్న కాలంలో మనదేశ పరిపాలనా వ్యవహారాలగూర్చి "Times of India" లో వరుసగా కొన్ని వ్యాసాలు వ్రాసినారు. అందులో చిన్న మనసు గలవారు పెద్దపదవులలో ఉండడం దేశానికి ఒక సమస్య అని తెలిపినారు. (Small men in high positions). ఈ మాట యీనాడు బాగా ఆలోచించవలసినదే కదా!

నేను 1977 అఖిలభారత కర్ణాటక సమ్మేళనంలో పాల్గొనడానికి బెంగళూరు వెళ్ళినప్పుడు కన్నడభాషావికాసానికి, కన్నడ సాహిత్య పరిషత్ భవన నిర్మాణానికి మిర్జా ఇస్మాయిల్ తోడ్పాటు గొప్పదని అక్కడి మిత్రుల చెప్పినారు. అంతేకాదు, ఆధునిక కాలంలో కన్నడం మాతృభాష కానివారు ఆ భాష అభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయమైనదని అక్కడి మిత్రులు చెప్పినారు. కన్నడ సాహిత్యంలో సమున్నత స్థానం కలిగిన మాస్తి వెంకటేశ అయ్యంగారి మాతృభాష తమిళం; కర్ణాటక సాహిత్యాన్ని తీర్చిదిద్దిన బేంద్రే మాతృభాష మహారాష్ట్రం; ఆధునిక కర్ణాటక నిర్మాతలైన మోక్షగుండం విశ్వేశ్వరయ్య మాతృభాష తెలుగు; మిర్జాఇస్మాయిల్ మాతృభాష ఉర్దు.

మిర్జా ఇస్మాయిల్‌గారు వరంగల్‌లో శబ్దానుశాసన గ్రంథాలయాన్ని చూచినప్పుడు హైదరాబాదుకు వస్తే, తమ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కె.ఈశ్వరదత్తు గారిని కలుసుకోవలసిందని నన్ను కోరారు. ఆవిధంగా ఈశ్వరదత్తు గారిని నేను హైదరాబాదులో కలుసుకున్నప్పుడు ఎంతో ఆదరించి హైదరాబాదు వచ్చినప్పుడల్లా తమను కలుసుకోవలసిందని కోరి ఇస్మాయిల్ గారికి తెలుగు భాషాభివృద్ధికి సహాయం చేయవలెననే కోరిక ఉన్నదని తెలిపినారు. ఇస్మాయిల్‌గారి నిష్క్రమణ ఫలితంగా యీ కోరిక నెరవేరలేదు. కుందూరు ఈశ్వరదత్ అనుపేరు గలవారు మన తెలుగువారిలో యిద్దరు ఉన్నారు. ఒకరు సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు–ప్రాచీనాంధ్ర, భూగోళము మొదలైన ఉత్తమ గ్రంథాలను వ్రాసిన వారు. రెండవవారు మిర్జా ఇస్మాయిల్ వెంటవచ్చిన ఆంగ్లభాషా కోవిదులు; ప్రతిభావంతులైన సంపాదకులు. వారి ఇంగ్లీషు శైలి చాలా శక్తివంతమైనది. ఇంగ్లీషులో కొన్ని ఉత్తమ గ్రంథాలు వ్రాసినారు. అందులో

కాంగ్రెస్ చరిత్ర ముఖ్యమైనది. యౌవనంలోనే ఈశ్వరదత్‌గారు ఉత్తరదేశం వెళ్లి అక్కడ ప్రముఖనాయకులతో పరిచయం చేసుకొని ఇంగ్లీషు పత్రికలలో పనిచేసేవారు. తేజ్‌బహద్దూర్ సప్రూ మొదలైనవారి ఆదరణ వారికి లభించినది. ఆ ఆదరణతో వారు "Twentieth Century" అనే మాసపత్రికను అలహాబాదు నుండి కొన్ని సంవత్సరాలు నడిపినారు. ఆ పత్రిక రాజకీయ ఆర్థిక వ్యవహారాలకు ప్రాధాన్యమిచ్చి ఉత్తమ స్థాయిలో నడిచినది. తుదిదశలో ఈశ్వర్‌దత్‌గారు ఢిల్లీలో స్థిరపడినారు. తెలుగుదేశం నుండి ఎవరు వెళ్లినా దత్తుగారి ఆదరణ, ఆతిథ్యము లభించేది. నేను కూడ ఒకటి రెండు పర్యాయాలు వారి ఇంటిలో వారితో కొంతసేపు కాలక్షేపం చేసి ఆతిథ్యము స్వీకరించడం జరిగింది. ఈశ్వర్‌దత్‌గారికి మన దేశనాయకులందరు సుపరిచితులు; ఉత్తర దేశీయుల ఆదరాభిమానాలకు వారు పాత్రులైనారు.

ఆనాటి పత్రికలను గూర్చి నా జ్ఞాపకాలు ఎన్నో ఉన్నవి. 'గోలకొండ పత్రిక నాటి తెలంగాణ పత్రికలలో ముఖ్యమైనది. తెలంగాణ ప్రజలను అన్ని రంగాలలో మేల్కొల్పడానికి యీ పత్రిక చేసిన కృషి చరిత్రాత్మకమైనది. తెలంగాణ విమోచనోద్యమానికి గోలకొండ వెన్నెముకగా ఉండేది. ఆ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డిగారు సాహిత్య రంగంలోనేగాక, సామాజిక, సాంస్కృతిక రాజకీయరంగాలలోకూడ వైతాళికులు. ఏ మాత్రం కొంచెం దేశానికి అక్కరకు వచ్చేవారని తోచినప్పటికీ యువకులను ఆయన విశేషంగా ప్రోత్సహించేవారు. చూడటానికి పరుషంగా కనిపించినప్పటికిని తగినంత పరిచయం కలిగి దగ్గరకు వస్తే ఎంతో అభిమానించేవారు. ఉన్నత ఉద్యోగము సంపాదించుకోవడానికి తగినన్ని అవకాశాలు ఉండినప్పటికిని, ధనార్జనకు కావలసిన సౌకర్యాలు పుష్కలంగా ఉన్నప్పటికిని ఆయన సాధారణ జీవితమే గడిపి పత్రికాసంపాదక వృత్తికి తన జీవితాన్ని వినియోగించి దేశసేవకు పూర్తిగా అంకితమైనారు. నిరంతర గ్రంథావలోకనమే ఆయన ముఖ్య వ్యాసంగం. ఎంత ఉద్గ్రంథమైనా శీఘ్రంగా చదివి అందులోని సంగతులను సులభంగా అవగాహన చేసుకునేవారు. రచనలో ఎన్ని పోకడలైనా పోగలిగేశక్తి ఆయనకు ఉండేది. నవల, కవిత, కథానిక, వ్యంగ్య విమర్శ, నాటకం మొదలైన అనేక ప్రక్రియలను ఆయన సాధించినారు. కథానికా రచయితగా, పరిశోధకునిగా ఆయన స్థానం ఉన్నతమైనది. ఆయన రచనలు మిక్కిలి విలువగలవి ఆయన వచనశైలి విశిష్టమైనది. 1942-43 ప్రాంతంలో కాబోలు హైదరాబాదులో

తెలుగు దినపత్రికలేని లోపాన్ని తొలగించే నిమిత్తం మాడపాటి హనుమంతరావు సురవరం ప్రతాపరెడ్డిగార్ల ప్రోత్సాహంతో బుక్కపట్టణం రామానుజాచార్యుల వారు (B.R.Charry) 'తెలంగాణ' దినపత్రికను ప్రారంభించి కొన్ని సంవత్సరాలు నడిపినారు. ఆ పత్రిక జాతీయోద్యమాన్ని బలపరిచినది. యువ రచయితలను ప్రోత్సహించినది. నేను వ్రాసిన తొలి సాహిత్య విమర్శలు అందులో ప్రతివారమూ ప్రకటితమయ్యేవి. అంతకుముందు బి-ఆర్-చారిగారు కొంతకాలం "దక్కన్ క్రానికల్" పత్రికా సంపాదకులుగా పనిచేసినారు. వారు ఇంగ్లీషులో ఉత్తమశ్రేణి రచయిత. ఇంచుమించుగా యిదే కాలంలో కలకత్తావాలా అనే పెట్టుబడిదారు ఉర్దూ, ఇంగ్లీషు, తెలుగు మూడు భాషలలో "మీజాన్" అనే పేరుతో మూడు దినపత్రికలను ప్రారంభించి నడిపినారు. అడవి బాపిరాజుగారు తెలుగు దిన పత్రికకు సంపాదకులుగా ఉండేవారు. బాపిరాజుగారు భావకవి, చిత్రకారుడు, గాయకుడు, నవలారచయిత. అందరితో కలసి మెలసి ఉండేవారు. ఏ సభకు పిలిచినా తప్పక వచ్చి మాట్లాడేవారు. మహబూబ్‌నగరంలో 1946వ సంవత్సరమున జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు వార్షిక సభలలో బాపిరాజుగారు పాల్గొని కవి సమ్మేళనానికి అధ్యక్షత వహించినారు. ఈ కవి సమ్మేళనంలో బూర్గుల రామకృష్ణారావు, కాళోజి ప్రభృతులతోపాటు పాల్గొనే అవకాశం నాకు లభించినది. ఈ సభలోనే మొదటిసారి డాక్టర్ దాశరధి మా అందరికి పరిచితమైనారు. అప్పుడు ఆయన వయసులో చిన్నవాడు. ఉద్రేకపూరితంగా కవిత్వం చెప్పేవాడు. "తెలంగాణము రైతుదే" "మా నిజాం రాజు జన్మజన్మాల బూజు" మొదలైన పద్యాలు ఆయన మా అందరికి ఆ సభల సందర్భమున వినిపించేవారు. ఆ సభలో నేను గౌతమబుద్ధుని గూర్చి 'సుజాత' శీర్షికగల పద్యాలు వినిపించగా దాశరథి ప్రసంగించినారు.

అందరితో కలిసి మెలిసి ఉండే స్వభావం బాపిరాజుగారిది. కొందరికి యీ స్వభావం లేకపోయేది. రాయప్రోలు సుబ్బారావుగారు యెక్కువగా యీ ప్రాంతీయులతో కలిసిమెలిసి ఉండేవారు కారని అందరు అనుకునేవారు. దేశభక్తిని గురించి, జాతీయతను గురించి ఎంత గొప్ప కవిత్వం వ్రాసినప్పటికీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖకు అధ్యక్షులుగా ఉండిన సుబ్బారావుగారు, తెలంగాణలోని జాతీయోద్యమానికి, కొంత దూరంగానే ఉండిపోయినారు. అందుచేత తెలంగాణమువారు కూడ వారికి కొంత దూరంగానే ఉండేవారు- తెలుగు భాషా

వికాసానికి విశ్వవిద్యాలయంలో ఆయన చేసిన కృషి స్వల్పము. ఒకమారు నిజాం ప్రభువుగారి జన్మదిన సందర్భంలో సుబ్బారావుగారు 'రగడలో' కవిత వ్రాసి నిజాంను ప్రశంసిస్తే, ప్రతాపరెడ్డిగారు దానిని 'రాయప్రోలు రగడ' అనే శీర్షికతో గోలకొండలో ప్రకటించిరి. బాపిరాజుగారు తమ పత్రికల విధానాలు ప్రజల ఉద్యమాలకు వ్యతిరేకంగా ఉన్నప్పటికి వ్యక్తిగతంగా యిక్కడి నాయకులతోను కార్యకర్తలతోను కలిసిమెలిసి ఉండేవారు. "ఉప్పొంగి పోయింది గోదావరి" "లేపాక్షి బసవన్న లేచి రావయ్యా!" అనే గేయాలను పాడితే సభికుల మనస్సులు ఉప్పొంగి పోయేవి. "గోనగన్నారెడ్డి" మొదలైన బాపిరాజుగారి నవలలు "మీజాన్"లో ధారావాహికంగా ప్రకటితమైనవి. నేను హైదరాబాదు వచ్చిన ప్రతి పర్యాయము ఉదయంపూట ఇంటిలో వారిని చూచేవాడిని. ఆ సందర్భంలో వారు తమ నవలలోని ప్రకరణాలు పత్రిక కొరకు వ్రాస్తుండేవారు. ఎప్పటి ప్రకరణం అప్పుడు వ్రాయడం వల్లనే కాబోలు వారి నవలల్లో వస్త్వైక్యత లోపించినది. బాపిరాజుగారికి సహాయ సంపాదకులుగా మీజాన్‌లో శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి, శ్రీ విద్వాన్ విశ్వం ప్రభృతులైన కవిపండితులు ఉండేవారు. ఉగాది సందర్భంలో 'మీజాన్' పత్రిక తెలంగాణ ప్రముఖులకు బిరుదులు యిచ్చేది. హాస్యోక్తులు, ఛలోక్తులు ఆ బిరుదుల్లో ఉండేవి. మీజాన్‌లో మంచి సారస్వతం ప్రకటితమయ్యేది – అటువంటి బిరుదు పొందినవారిలో నేనొకణ్ణి. ఏకశిలా నగర శిలాఫలక కలకల శోభావిభావరి అన్న బిరుదును మీజాన్ నాకు ప్రసాదించినది.

తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రోద్యమం బ్రిటిష్ ఆంధ్ర ప్రాంతంలోని ఆంధ్రోద్యమం వంటిది కాదు. బ్రిటిష్ ఆంధ్రలో అది భాషారాష్ట్రోద్యమము. ఇక్కడ అట్లుగాక తెలుగు భాషా ప్రచార ఉద్యమంగా 1931లో అవతరించింది. తర్వాత క్రమంగా రాజకీయోద్యమంగా పరిణమించింది. ఒక పదిసంవత్సరాల కాలంలో అది రాజకీయోద్యమంగా రూపొంది రెండు పాయలుగా చీలిపోయింది. తత్ఫలితంగా కమ్యూనిష్టుల ప్రాబల్యం కలిగిన మహాసభ ఒకటి రావి నారాయణరెడ్డిగారి నాయకత్వంలోను, జాతీయ మహాసభ మరొకటి కొండా వెంకటరంగారెడ్డి మందుముల నరసింగరావుగార్ల నాయకత్వంలోను అవతరించినవి. క్రమక్రమంగా యీ జాతీయ మహాసభ స్టేట్ కాంగ్రెస్‌లో లీనమైనది. ఆంధ్ర మహాసభలతో పాటు ఆ రోజులలో ఆంధ్ర మహిళాసభలు కూడా జరిగేవి. మహిళలు చాలా మంది పాల్గొనేవారు. ఈ సభలన్నీ ప్రజలలో జాగృతిని కలిగించినవి.

ఆంధ్రమహాసభలో చిత్తశుద్ధి గల నాయకులు, కార్యకర్తలతోపాటు రకరకాల వ్యక్తులు ప్రవేశించేవారు. వీరిలో కీర్తి, పలుకుబడి సంపాదించవలెననేవారు కొందరు ఉండేవారు. చాలామంది వేషభాషలలో తెలుగుతనం ఏమాత్రం లేకపోయెడిది. షేర్వానీలు, పాయాజామాలు ధరించి ఉర్దూలోను, ఇంగ్లీషులోను మాట్లాడుతూ ఆర్భాటంగా తిరిగే కృత్రిమ నాయకులు ఉండేవారు. వీరిలో చాలా మంది న్యాయవాదులుగా ఉండేవారు. పూర్తి సమయాన్ని యిచ్చేవారు తక్కువ. చిత్తశుద్ధి గలవారిలో కూడా సెలవురోజు మాత్రమే ఉద్యమాన్ని గురించి ఆలోచించే వారు ఎక్కువమంది ఉండేవారు. కార్యకర్తలలో చాలామంది ఆర్థిక సదుపాయాలు లేనివారు. ఎక్కువగా చదువుకోనివారు ఉండేవారు. కొందరు తీరికలేని నాయకులైతే మరికొందరు తిండికిలేని నాయకులని మన ప్రజాకవి వర్ణించినాడు. సాలు కొకసారి జరుగు జల్సాలలోను వివిధ వేషాలతో వీరు వచ్చి కొందరు ఇంగ్లీషులో, కొందరు ఉర్దూలో మాట్లాడుతూ "వర్దింగు" కొరకై వాదించుకుంటూ కొంత కవిత వచ్చినది. గడియారం రామకృష్ణశర్మ, కాళోజి నారాయణరావు మొదలైన వారు యీ కవితలను వ్రాసి వేదికలమీద చదివేవారు. వీనిలో కొన్ని అచ్చు కూడా అయినవి.

ఆంధ్రోద్యమంలో మహారాష్ట్రులు కర్ణాటకులతోపాటు కొందరు ముస్లింలు కూడా పాల్గొనేవారు. 1937వ సంవత్సరంలో కాబోలు నిజామాబాదులో జరిగిన ఆంధ్రమహాసభలో భాషా సమస్య ప్రాధాన్యం వహించింది. తెలుగువారితో పాటు మహారాష్ట్రులు, కన్నడలు, కొందరు ముస్లింలు కూడా బాధ్యతాయుత పరిపాలనను సమర్థించినందువలన తెలుగులోనే సభా కార్యక్రమాలు జరగవలెననే ప్రతిపాదనను అధిక సంఖ్యాకులు ఆమోదించలేదు. అప్పుడు ఒకరిద్దరు పెద్దలతోపాటు యువకులు చీలిపోయి "అభివృద్ధి పక్షం" పేరుతో ఒక పక్షాన్ని స్థాపించినారు. స్వర్గీయ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ వి.బి.రాజు యిందులో ఉండేవారు. కాని ఆ పక్షం ఎక్కువకాలం పనిచేసినట్లుగాని యేమైన సాధించినట్లు గాని కనపడదు. అయితే తెలుగుభాషా ప్రచారానికి ఒక సాహిత్య సంస్థ ఉండవలెననే కోరిక అందరిలోను బలపడినది. అప్పటివరకు హైదరాబాదు నగరంలోని యువకులు 'సాధనసమితి' 'వైతాళిక సమితి' మొదలైన సంస్థలను స్థాపించి నడుపుతుండేవారు. కొన్ని గ్రంథమాలలు కొన్ని మాసపత్రికలు కూడా వెలువడుతుండేవి. తెలంగాణ స్థాయిలో ఒక సాహిత్య

సంస్థకావలెనన్న అభిప్రాయం క్రమక్రమంగా బలపడి 1943 మే, నెలలో ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపన జరిగినది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఒక విశిష్టమైన సంస్థ. ఏ ప్రత్యేక సాహిత్య సంప్రదాయానికి కట్టుబడిన సంస్థ కాదు యిది. అది ప్రాచీనమైన సాహిత్యానికి అతి నవీనమైన సాహిత్యానికి సుస్వాగతమిచ్చి, ప్రోత్సహించే విశాల భావ పూరితమైన సంస్థ. కేవలం సమావేశాలు సభలు జరిపి పుస్తక ప్రచురణ మొదలైన కార్యక్రమాలకు మాత్రమే పరిమితమైన సంస్థ కాదిది. తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు అవతరించి ఆ ధ్యేయంతోనే నాటి నుండి నేటివరకు ఎటువంటి ఆటంకాలు వచ్చినా, ఎవరిని ఎదిరించవలసి వచ్చినా వెనుకాడక ముందుకు నడుస్తున్న సంస్థయిది.

అప్పుడు నిజాం ప్రభుత్వంతో సంఘర్షణపడిన సారస్వత పరిషత్తుకు పోలీసు చర్య తరువాత కూడా కొన్ని సందర్భాలలో అధికారంలో ఉన్న వారితో సంఘర్షణలు తప్పలేదు. అయినప్పటికి తన యాత్రను కొనసాగిస్తూ వాఙ్మయ ఉద్యమాన్ని విజయవంతంగా సారస్వత పరిషత్తు నడిపించినది. ఆర్థికమైన యిబ్బందులను కూడా పరిషత్తు ఎదుర్కొనవలసివచ్చినది. తమ స్వప్రయోజనాల కొరకు సంస్థను ఉపయోగించుకొనవలెనని ప్రయత్నం చేసిన కొందరి పన్నాగాలను తప్పించుకొని పరిషత్తు బయటపడినది. అందుచేతనే ఎవరికి ఆగ్రహం వచ్చినా, ఎవరికి అనుగ్రహం వచ్చినా లక్ష్యం చేయక పురోగమించడానికి అనువుగా పరిషత్తు గడిచిన రెండు దశాబ్దాలలో పరిమిత స్థాయిలోనైనప్పటికి ఆర్థిక స్వయం సమృద్ధిని సాధించుకొన్నది. ఆంధ్రభాషా సంస్కృతుల వ్యాప్తి కొరకు కృషి చేసే సంస్థలకు, ఉద్యమాలకు పరిషత్తు సర్వవిధాల సహాయం చేసి బలపరిచినది. వివిధ జిల్లాలలో, వివిధ ప్రాంతాలలో కేంద్రాలను, శాఖలను స్థాపించుకొన్నది. రాష్ట్రేతర ప్రాంతాలలోను, మారిషస్‌వంటి విదేశంలోను తన కార్యక్రమాలను అమలు చేసి తెలుగు దీపాన్ని వెలిగించినది. ఆంధ్ర సారస్వత పరిషత్తులో వివిధ సమస్యలపైన భిన్నాభిప్రాయాలు కలవారు. రాజకీయంగా, సాంఘికంగా ప్రత్యేక దృక్పథం కలిగిన వారు అందరు సహకరించినారు. కావుననే సారస్వత పరిషత్తు ప్రజలసంస్థ; జాతీయసంస్థ, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ కొరకు అంకితమైన సాంస్కృతిక సంస్థ. నాటి నుండి యీ పరిషత్తు నిరంతరాయంగా అభివృద్ధి పథంలో ముందడుగువేస్తూ భాషా రంగంలో చరిత్రాత్మకమైన కృషి చేసినది.

IV

అప్పటి హైదరాబాదు రాష్ట్రం ఒక సమష్టి కుటుంబం. అందులో తెలుగు, మరాఠి, కన్నడ మాట్లాడేవారు నూటికి తొంబదిమంది; ఉర్దూ మాట్లాడేవారు నూటికి పదిమంది ఉండేవారు. ఈ నూటికి పదిమంది ప్రాబల్యాన్ని పరిపాలనలో సురక్షితం చేసే ఉద్దేశం నాటి ప్రభుత్వానికి ఉండేదని నూటికి తొంబదిమంది ప్రజలు భావించేవారు. అందుచేతనే మాతృభాషలో విద్యాబోధన చేస్తున్నామని ఎంత ప్రచారం చేసినప్పటికిని ప్రజల ఆదరాభిమానాలను ఆనాటి ఉస్మానియా విశ్వవిద్యాలయం చూరగొనలేదు. కోట్లరూపాయలు విశ్వవిద్యాలయంపైన ఖర్చు చేసిన ప్రభుత్వం ప్రజలకు మాతృభాషల ద్వారా కనీసం ప్రాథమిక విద్యనైనా బోధించే అవకాశం కల్పించలేదు. ప్రాథమిక దశ నుండి అత్యున్నత దశ వరకు ఉర్దూలోనే విద్యాబోధన జరిగింది. సర్‌అక్బర్ హైదరీగారు రాష్ట్రేతరులైన విద్యావేత్తలచేత మాతృభాషల ద్వారా విద్యాబోధన జరుగుతున్నదని ప్రశంసిస్తూ ఎన్ని ప్రకటనలు చేయించినా రాష్ట్ర ప్రజల హృదయాలు మాత్రం విముఖంగా ఉండినవి.

తెలుగు; మరాఠి, కన్నడములు విశ్వవిద్యాలయంలో కనీసం ద్వితీయ భాషలుగా ఉండే భాగ్యానికైనా నోచుకోలేదు. ఆధునికాంధ్ర మహాకవిగా ప్రఖ్యాతి గాంచిన రాయప్రోలు సుబ్బారావుగారు తెలుగుశాఖకు అధ్యక్షులుగా ఉండినా తెలుగు భాషకు జరిగిన ఉపకారమేమి లేకపోయినది. డిగ్రీ స్థాయివరకు తెలుగుకు సరియైన స్థానమే లేదు. ఎంతో కష్టంమీద ఎమ్.ఏ. తరగతిలో తెలుగు చదివే విద్యార్థి ఒక్కరో, అరో ఉండేవారు. ఆ విద్యార్థి కూడా ఉద్యోగం దొరికితే వెళ్ళి పోయే చిత్తవృత్తిలో ఉండేవాడు. పోలీసు చర్యవరకు యీ పరిస్థితి కొనసాగింది.

పోలీసు చర్య కాగానే ప్రజల భాషలకు సముచిత స్థానము కావలెననే కోరికలు ఉప్పొంగినవి. 1949 జనవరిలో ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలు హైదరాబాదు పట్టణ సమీపంలోని తూపురాన్‌లో జరిగినవి. ఆ సభలలో మెట్రికులేషన్ వరకు ప్రజల మాతృభాషలలో విద్యాబోధన జరుగవలెననీ, విశ్వవిద్యాలయ స్థాయిలో ఇంటర్, డిగ్రీ తరగతులలో తెలుగు, మరాఠి, కన్నడ భాషలు ద్వితీయ భాషలుగా ఉండవలెననీ, పరిపాలనలో ప్రజల భాషకు సముచిత స్థానం లభించవలెననీ తీర్మానాలు జరిగినవి. ఈ తీర్మానాలను అమలు చేయడానికి ఆచార్య తణికెళ్ళ వీరభద్రుడుగారి నాయకత్వంలో, మాడపాటి హనుమంతరావు సభ్యులుగా దేవులపల్లి రామానుజరావు

కార్యదర్శిగా ఒక సంఘాన్ని నియమించడం జరిగింది. ఈ సంఘం అప్పుడు విద్యాశాఖ మంత్రిగా ఉండిన శ్రీ ధోండేరాజ్ బహద్దూర్ గారిని కలుసుకొని జరిపిన చర్చల ఫలితంగా మాతృభాషలలో మెట్రికులేషన్ తరగతుల వరకు విద్యాబోధన చేయించడానికి ప్రభుత్వం అంగీకరించి తత్క్షణమే ఉత్తరువులు జారీ చేసినది.

తెలుగులో విద్యాబోధనచేసే సమర్థతగల ఉపాధ్యాయులు లేకపోవడం అప్పటి ప్రభుత్వానికి ఒక సమస్యయైనది. అప్పుడు ఆంధ్ర సారస్వత పరిషత్తు పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ప్రభుత్వం ఎదుర్కొన్న సమస్యను పరిష్కరించినారు. మొదట బూర్గుల రామకృష్ణారావుగారు, తరువాత పూల్చంద్ గాంధీగారు విద్యా మంత్రులుగా ఉన్న కాలమిది. పరిషత్తు ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగాను, విశారదలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను హైస్కూలు తరగతులలో తెలుగు బోధించే ఉపాధ్యాయులుగాను నియామకం చేయవచ్చునని ప్రభుత్వం అంగీకరించినది. పరిషత్తు 1943లో దూరదృష్టితో ప్రారంభించిన పరీక్షలు ప్రభుత్వానికి సకాలంలో అక్కరకు వచ్చినవి. కావున సూర్యుని రశ్మివలె పరిషత్తు పల్లెపల్లెలోను వెలుతురు తీసుకొనిపోయినదని బూర్గుల రామకృష్ణారావుగారు, పరిషత్తు కృషి ఒక చరిత్రకు కావలసినంత ఆధార సామగ్రిని సమకూర్చినదని మాడపాటి హనుమంతరావుగారు వ్యాఖ్యానించినారు.

కాని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పని యింత సులభంగా నెరవేరలేదు. తరువాత అనేక ఉన్నతోద్యోగాలు నిర్వహించిన నవాబ్ అలీయావర్ జంగ్ బహద్దూర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అప్పుడు ఉపాధ్యక్షులుగా ఉండేవారు. ఆయన విశ్వవిద్యాలయంలో ప్రజల మాతృభాషలను ద్వితీయ భాషగా ప్రవేశపెట్టడానికి సులభంగా అంగీకరించలేదు. అందుకొరకు పై సంఘం చాలా కష్టపడి పనిచేయవలసి వచ్చినది. ఎకడమిక్ కౌన్సిల్, సెనేట్ సభ్యులను కలుసుకొని వారికి నచ్చజెప్పవలసి వచ్చినది. రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌గారు హైదరాబాదుకు వచ్చినప్పుడు ఆయనకు ఒక వినతిపత్రం కూడా సమర్పించవలసి వచ్చినది. చాలా ప్రయత్నము జరిగిన తరువాత విశ్వవిద్యాలయములోని కంచు గోడలు కూలిపోయినవి. ప్రజల భాషలైన తెలుగు, మరాఠి, కన్నడములకు డిగ్రీ తరగతుల వరకు ద్వితీయ భాషల స్థానము లభించినది. బి.ఎస్‌సి., తరగతులలో మాత్రం యీ భాషకు ద్వితీయ స్థానాన్ని ఇయ్యడానికి నవాబ్ అలీయావర్‌జంగ్ నిరాకరించి భీష్మించినారు. అందుచేత ఆర్ట్సు

తరగతులకు మాత్రమే యీ సౌకర్యము లభించినది. నవాబ్ ఆలీయావర్ జంగ్ యిక్కడి నుండి మరొక ఉన్నతోద్యోగముపైన వెళ్ళిపోయిన తర్వాత, డాక్టర్ భగవంతంగారు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులయినారు. అప్పుడు పై సంఘం భగవంతంగారిని కలుసుకొని చర్చలు జరిపిన తరువాత బి.ఎస్‌సి. తరగతులకు కూడా తెలుగు, మరాఠి, కన్నడములు ద్వితీయ భాషలుగా ఆమోదించబడినవి. వీరభద్రుడుగారి నాయకత్వములో యీ సంఘము చేసిన కృషి ప్రశంసనీయమైనది. భగవంతంగారికి మాతృభాషయైన తెలుగులో ప్రావీణ్యము, తెలుగుమీద అభిమానం ఉండేవి. ఇంగ్లీషులో సైన్సునుగూర్చి యెంత చక్కగా మాట్లాడేవారో, తెలుగులో కూడా అంత చక్కగానే మాట్లాడేవారు. సైన్సు తరగతులకు తెలుగు యెందుకు అని వారు రాయబార వర్గాన్ని ప్రశ్నించగా "మీరు తెలుగులో యింత చక్కగా మాట్లాడుదురుగదా! మీ విద్యార్థులు గూడా సైన్సును గూర్చి తెలుగులో మాట్లాడవలెనుగదా! తెలుగులో సైన్సు బోధన, సైన్సు పుస్తకాల రచన జరుగవలెను గదా!" ఈనాటి విద్యార్థులు రేపు ఆ పని చేయవలెను గదా! అని నేను సమాధానం చెప్పగా చిరునవ్వు నవ్వి, మా అభ్యర్థనను అంగీకరించిరి.

నవాబ్ ఆలీ యావర్‌జంగ్ పోలీసు చర్యకు పూర్వం రజాకార్ల విజృంభణకు కొద్దిగా ముందు అనేక ఉన్నతోద్యోగాలు నిర్వహించిన విద్యావంతుడు, చతురుడు. రజాకార్ విజృంభణతో ప్రభుత్వం నుండి వైదొలగిన ఈయన పోలీసు చర్యకాగానే అప్పటి భారత ప్రభుత్వానికి, నిజాం రాజుగారికి మధ్య లైజాన్ ఆఫీసర్‌గా (సంధానకర్తగా) ఉండినాడు. భారత ప్రభుత్వం ఆయన తెలివితేటలను, చతురతను మెచ్చుకొన్నది. తత్‌క్షణమే ఆయన విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు అయినాడు. ఉర్దూ భాషను విశ్వవిద్యాలయ స్థాయిలో యధాస్థానంలో ఉంచడానికి ఆయన ఒక ఉపాయం ఆలోచించినాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలెననీ అందులో హిందీ ద్వారా విద్యాబోధన చేయించవలెననీ కేంద్ర ప్రభుత్వానికి వ్రాసి ఆమోదం పొందినాడు. హిందీ అనగానే కేంద్ర ప్రభుత్వం ఉప్పొంగి తనను హర్షించగలదని, ఆయనకు ఉన్నతోద్యోగాలు లభించగలవని ఒక ప్రణాళిక వేసినాడు. అనుకున్నంత పని జరిగినది. స్వయంగా తెలివి కలవాడు కావున ఆయనకు ఉన్నతోద్యోగాలు లభించినవి. విశ్వవిద్యాలయాన్ని స్వాధీనం చేసుకొని హిందీ బోధన భాషగా చేయవలెనన్న ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా

అంగీకరించినది. అయితే ప్రజలకు యిది తీవ్రమైన అసంతృప్తిని కలిగించింది. తెలుగు, మహారాష్ట్ర, కన్నడ భాషలు మాట్లాడేవారు యిందుకు వ్యతిరేకించినారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు మొదలైన భాషా సంస్థలు దీనిని ప్రతిఘటించినవి, ఆంధ్ర సారస్వత పరిషత్తు మొదలైన భాషా సంస్థల ప్రోత్సాహంతో అప్పుడు హైదరాబాదులో ప్రముఖ న్యాయవాదిగా ఉండిన లక్ష్మణరావుగారి అధ్యక్షతలో దేవులపల్లి రామానుజరావు కార్యదర్శిగా అన్ని పక్షాల ప్రతినిధులతో ఒక పౌరసంఘము ఏర్పడి తీవ్రమైన పోరాటం జరిపినది. 1952లో యిక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినది. కేంద్ర ప్రభుత్వానికి కోపం వస్తుందేమో అన్న మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి ప్రభృతులైన పెద్దలు పౌరసంఘంలో చేరినారు. ప్రతిపక్షాలు అన్నీ పౌరసంఘాన్ని బలపరిచినవి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తీవ్రమైన ఆందోళన చెలరేగి ఒక పెద్ద ఉద్యమం కొనసాగినది.

అప్పుడు భగవంతంగారు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులు. ప్రభుత్వానికి సన్నిహితులు కొందరు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా ఒక తీర్మానాన్ని సెనేట్‌లో ప్రతిపాదించడానికి ప్రయత్నించిరి. ఆ సందర్భంలో పౌరసంఘం ప్రతినిధులు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులను కలుసుకొని యిటువంటి తీర్మానాన్ని ఆమోదించే హక్కు సెనేట్‌కు లేదని నివేదించినది. సెనేట్‌లో యీ తీర్మానం చర్చకు వచ్చినప్పుడు ఉపాధ్యక్షులు పౌర సంఘము సూచనకు అనుకూలంగా రూలింగు యిచ్చిరి. ప్రభుత్వ ప్రతినిధుల ప్రయత్నాలు ఫలించలేదు. ప్రభుత్వాన్ని నడుపుతున్న వారికి మరొక పర్యాయం ఆగ్రహం వచ్చినది. పౌరసంఘాన్ని సమర్థించినందుకు ప్రతాపరెడ్డి గారిని ప్రభుత్వ ముఖ్యులు మందలించడం కూడా జరిగింది. కాని ఆయన జంకే మనిషికాదు; జంకలేదు. ఇది జరిగిన తరువాత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూగారు, కేంద్ర విద్యామంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గారితో కలిసి హైదరాబాదుకు వచ్చినప్పుడు పౌర సంఘం ఒక రాయబారవర్గాన్ని వారివద్దకు పంపినది. రాయబార వర్గానికి నాయకులు లక్ష్మణరావుగారు, సమావేశకర్త దేవులపల్లి రామానుజరావు. సభ్యులు నవాబ్ మీర్ అహమదలీ ఖాన్, నూకల సరోత్తమరెడ్డి, పులిజాల హనుమంతరావుగార్లు. జవహర్‌లాల్ నెహ్రూగారు రాయబార వర్గం మీద కోపంతో విరుచుకుపడినారు. అయితే సభ్యులు గట్టిగా వాదించినారు. ఇదంత శ్రద్ధగా విన్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌గారు కొంతసేపు ఆలోచించి రాయబారవర్గం

కోరికను ఆమోదించవలసిందని జవహర్‌లాల్ నెహ్రూగారికి సలహా యిచ్చిరి. తత్ఫలితంగా కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాన్ని స్వాధీనం చేసుకొని హిందీని బోధన భాషగా చేయవలెననే నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నది. ఇది ప్రజల భాషకు, ప్రజల ఉద్యమానికి గొప్ప విజయం. మౌలానా ఆజాద్‌గారి ఉచితజ్ఞత, ఔదార్యం యీ సందర్భంలో ప్రశంసనీయం.

ఆనాటి హైదరాబాదు పరిస్థితులు స్మరణకు వచ్చినప్పుడు ఉదార అభిప్రాయాలు గల కొంతమందిని తప్పక పేర్కొనవలసి ఉంటుంది. అందులో నవాబ్ ఆజమ్‌జంగ్ ముఖ్యులు, ఆయనకు ప్రజలపట్ల ప్రజల భాషలపట్ల సానుభూతి ఉండేది. అయితే చాలాకాలం అప్పటి పరిపాలకులు ఆయనను పైకి రానీయలేదు. అనేక సంవత్సరాలు ఆయనను సిటీ కాలేజి ప్రిన్సిపాల్‌గానే ఉంచినారు. మంచివాడైన ఆయన ఉద్యోగంలో అభివృద్ధి కనుబొమ్మలమీది వెంట్రుకలవలె మొదటిదశలో అనేక సంవత్సరాలు పెరుగలేదు. ఆయన ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు డాక్టర్ రావాడ సత్యనారాయణ, శ్రీ ఎస్.కె.రావు అక్కడ విద్యార్థులుగా ఉండేవారు. ఈ ఉభయులనేకాక యింకా అనేకమంది విద్యార్థుల ప్రతిభను గుర్తించి కులమత విచక్షణ పాటించక ఆయన సహాయం చేసినారు. వీరందరు తర్వాత అభివృద్ధిలోనికి వచ్చినారు. నవాజ్ ఆజంజంగ్ విద్యాశాఖకు డైరెక్టర్ అయిన తర్వాతనే ప్రాథమిక విద్య ప్రజల మాతృభాషలలో జరగడానికి అవకాశం కల్పించినారు. తర్వాత ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు, విద్యామంత్రి, పబ్లిక్ సర్వీస్ కమీషన్ సభ్యులుగా కూడా పనిచేసినారు. ఆయన హృదయం విశాలమైనది. చిత్తవృత్తి ఉదారమైనది. కులమత విచక్షణలేక యోగ్యులైనవారికి న్యాయమైన సహాయం చేయడానికి ఎన్నడూ వెనుకాడేవారుకారు. ఇటువంటివారే నవాబ్ మెహదీ నవాబ్ జంగ్. స్వతంత్ర భారతంలో వీరు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో సభ్యులుగాను, గుజరాత్ గవర్నర్‌గాను పనిచేసిరి. మోహదీ నవాజ్ జంగ్ కులమత విచక్షణలేక ఎందరినో ప్రోత్సహించినారు. వారందరూ పైకి వచ్చినారు. రవీంద్రనాథ్‌టాగూర్ హైదరాబాదుకు వచ్చినప్పుడు నవాబ్ మెహదీ నవాజ్ జంగ్ గృహంలో అతిథులుగా ఉండినారు. మెహదీనవాబ్ జంగ్ అనేక సంస్థలను స్థాపించి నిర్వహించినారు. వైద్యశాలలు, సాంఘిక సంస్థలు వారి సంపూర్ణ సహాయ సహకారాలు పొందినవి. హైదరాబాదు చరిత్రలో యిటువంటి వ్యక్తులు మందికొందరు కూడా ఉండినారు.

సిరాజల్ హసన్ తిర్మిజీగారు కాంగ్రేసుకు నాయకులుగా ఉండి జాతీయోద్యమాన్ని బలపరిచినారు. ఫజ్లుర్రహ్మాన్‌గారు జాతీయభావాలు కలిగిన ఉన్నత విద్యాపారీణులు, సరోజినీ దేవిగారి చేత ప్రభావితులు. అలీనవాజ్‌జంగ్ గారు ఆకాలం ఇంజనీరులలో ప్రముఖులు; విశ్వేశ్వరయ్యగారి మెప్పును పొందిన ప్రతిభావంతులు. వీరు కారుచీకటిలో కాంతిరేఖలు.

1937-39 మధ్యన అప్పటి హైదరాబాదు రాష్ట్రంలో ముఖ్యమైన సంఘటనలు కొన్ని జరిగినవి. ఆ సంఘటనలన్ని ప్రజలలో కలిగిన జాగృతికీ, చైతన్యానికీ నిదర్శనాలు. ఉస్మానియా విశ్వవిద్యాలయ వసతిగృహంలో విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించగా అప్పటి విశ్వవిద్యాలయ అధికారులు, ప్రభుత్వమూ ఒక అల్పసంఖ్యాకవర్గ ప్రేరణలో వందేమాతరం గేయాన్ని నిషేధించగా జాతీయ భావపూరితులైన యువక విద్యార్థులు ఉద్రిక్తులై కళాశాలను బహిష్కరించినారు. అప్పుడు ఆ విద్యార్థులను అధికారవర్గం విశ్వవిద్యాలయం నుండి వెళ్ళగొట్టడం కూడా జరిగింది. సామూహికంగా వేల సంఖ్యలో విద్యార్థులు విశ్వవిద్యాలయాన్ని వదలిపెట్టి వెళ్ళినారు. అప్పుడు కొత్తగా ఇంగ్లండు నుండి వచ్చి విశ్వవిద్యాలయ పదార్థ విజ్ఞానశాస్త్ర శాఖలో లెక్చరర్‌గా చేరిన రావాడ సత్యనారాయణగారు, ధైర్యంగా బహిరంగంగా విద్యార్థులపట్ల సానుభూతిని ప్రకటించినారు. ఆ రోజులలో ఆయన ఖద్దరు కూడా ధరించేవారు. విద్యార్థులు నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేరడానికి బయలుదేరినప్పుడు రావాడ సత్యనారాయణగారు స్టేషన్‌కు వెళ్ళి వీడ్కోలు యిచ్చినారు. ఆయన మొదటి నుంచి జాతీయవాది. స్వతంత్రభావాలు కల సజ్జనుడు. కల్లకపటం తెలియని వాడు. ఎవరి ముందు ఎన్నడు తలవంచక ఆత్మగౌరవం కాపాడుకొనినవాడు. పదార్థ విజ్ఞాన శాస్త్రంలో ప్రవీణుడు. తరువాత పదార్థవిజ్ఞాన శాస్త్ర పీఠానికి అధ్యక్షులై విశ్వవిద్యాలయం ఉపాధ్యక్ష పదవిని కూడా ఆయన నిర్వహించినాడు. ఏ పదవిలో ఉన్నా ఆయన తన స్వతంత్ర వ్యక్తిత్వాన్ని కాపాడుకొన్నాడు. రావాడ సత్యనారాయణగారి వంటి శీల సంపద, ఉన్నత లక్ష్యాలకు అనుగుణమైన జీవన విధానం కలిగినవారు చాలా తక్కువమంది. ఆయన విద్యార్థిలోకానికి ప్రీతిపాత్రులై సర్వజనాదరణీయుడుగా ఉండేవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి నిష్క్రమించిన విద్యార్థులకు యితర విశ్వవిద్యాలయాలు ప్రవేశ మీయడానికి సంకోచించినప్పుడు నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం వీరికి ఆశ్రయమిచ్చింది. అందుకు కారణభూతులు అప్పటి

ఉపాధ్యక్షులు టి.జె.కేదార్‌గారు. నాగపూర్‌లో ఆయన గొప్ప క్రిమినల్ న్యాయవాది. జాతీయభావాలుగల స్వతంత్రుడు. అప్పటి నాగపూర్‌లోను, మధ్యప్రదేశ్‌లోను సింహం వంటి వ్యక్తి ఆయన. వేలమంది విద్యార్థులకు ఆయన సమస్త సౌకర్యాలు కల్పించి వారి విద్యావ్యాసంగానికి సహాయపడినారు. ఈ విధంగా వందేమాతరం ఉద్యమంలో చేరిన విద్యార్థులు చాలామంది తరువాత రాష్ట్రంలో జాతీయోద్యమ రంగంలో నాయకత్వం వహించి గురుతరమైన బాధ్యతలను నిర్వహించినారు. అచ్యుతారెడ్డి, నరేంద్రదత్తు మొదలైనవారు యీ తరగతికి చెందినవారు.

ఆ కాలంలోనే రెండు సత్యాగ్రహాలు జరిగినవి. ఒకటి ఆర్యసమాజం నడిపిన సత్యాగ్రహం, రెండవది స్టేట్ కాంగ్రెస్ నడిపిన సత్యాగ్రహం. ప్రాథమిక స్వత్వాల సాధన లక్ష్యంతో యీ సత్యాగ్రహాలు జరిగినవి. స్త్రీ పురుషులనేకులు యీ సత్యాగ్రహాలలో చేరినారు. అప్పటి ప్రభుత్వం యీ సత్యాగ్రహాలపట్ల అవలంబించిన విధానం కఠినమైనది. విద్యార్థులుగా ఉన్న మేము యీ సత్యాగ్రహాలు జరిగే స్థలాలకు వెళ్లి చూస్తుండేవారము. మన పెద్దలు చాలామంది వెనుక ముందు ఆడుతున్నప్పుడు స్టేట్ కాంగ్రెస్ ప్రారంభించిన సత్యాగ్రహంలో మొదటి జట్టులోనే చేరి జైలుకు వెళ్ళినవారు అప్పుడు యువకులుగా ఉండిన రావి నారాయణ రెడ్డిగారు. యువకులకు ఆయన ప్రీతిపాత్రుడైన నాయకుడుగా ఉండేవారు. త్యాగ సమయంలో రావి నారాయణరెడ్డిగారు ఎన్నడూ వెనుకాడలేదు. స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహాన్ని మతద్వేషపూరితమైన ఉద్యమంగా చిత్రించడానికి ప్రభుత్వం ఎన్నో పన్నాగాలు పన్నినది. ఇంచుమించుగా ఆ రోజులలోనే అనుకుంటాను తిరువాన్‌కూర్‌లో కూడా సత్యాగ్రహ ఉద్యమం కొనసాగినది. ఏమైనప్పటికిని కొన్నాళ్ళ తరువాత మహాత్మాగాంధిగారి సలహా ప్రకారం స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహాన్ని నిలిపివేసినది.

ఆనాడు రావి నారాయణరెడ్డిగారు అభ్యుదయ భావాలుగల యువకుడు. ఆస్తిపాస్తులు గల కుటుంబము నుండి వచ్చినప్పటికి దీనప్రజల సమస్యలవైపు ఆకర్షితుడై ఆంధ్ర మహాసభ, స్టేట్ కాంగ్రేస్, కమ్యూనిస్టు పార్టీ మొదలైన అనేక ఉద్యమాలలో యువకులకు నాయకత్వం వహించిన త్యాగధనుడు. ఆ రోజులలో నిజాం ప్రాపకంతో కొందరు దేశ్‌ముఖులు (భూస్వాములు, దొరలు) గ్రామాలలోని భూమి నంతటిని ఆక్రమించి ప్రజలను వెట్టిచాకిరివంటి అనేక బాధలకు గురిచేసి నిరంకుశ పరిపాలనను కొనసాగిస్తుండేవారు. జనగామ తాలూకాలోని విస్నూర్

దేశ్‌ముఖ్, మానుకోట తాలూకాలో కుమ్మరికుంట దేశ్‌ముఖ్ మొదలైనవారు యిటువంటివారు. కుమ్మరికుంట వారికి లక్షా ముప్పైవేల ఎకరాల భూమి ఉండేది. నిజాం ప్రభువు స్వయంగా యీ కుటుంబం వారు యిక ముందు భూమిని పట్టా చేసుకోవడానికి వీలులేదని ఒక ఫర్మాన్ జారీ చేసినారంటే కుమ్మరి కుంటవారి దురాక్రమణ స్వరూపం మనకు అర్థం కాగలదు. ఎక్కడ మంచి కోడె కనిపించినా వీరు దానిని తీసుకొనిపోయేవారని, ఏ రైతు తమకున్న కొద్ది భూమిని బాగు చేసుకొని మంచి పంటలు పండించుకున్నా ఆ భూమిని వీరు స్వాధీనం చేసుకునేవారని ఒక కవీశ్వరుడు ఈ రోజుల్లో గేయాలు వ్రాసినాడు. బహుశా అవి గోలకొండ పత్రికలో ప్రకటితమైనవని అనుకుంటాను. విస్నూర్ దేశ్‌ముఖ్ తమ గ్రామాలలోని ప్రజలపైన ఎన్నో అత్యాచారాలు జరిపేవారు. ఈ అత్యాచారాలకు వ్యతిరేకంగా నారాయణరెడ్డిగారి వంటి అభ్యుదయ భావాలు గల యువకుల నాయకత్వంలో పోరాటాలు సాగినవి. తరువాత కమ్యూనిస్టు నాయకులుగా ప్రఖ్యాతి గాంచిన బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావుగార్లు 'జనగామ ప్రజల వీరోచిత పోరాటాలు' అనే గ్రంథం వ్రాసి ప్రకటించినారు. ఆనాటి తెలంగాణ ప్రజలవాణి యీ పుస్తకంలో ప్రతిబింబిస్తున్నది. ఉర్దూ కవులలో అగ్రగణ్యుడైన మఖ్దూమ్ అప్పుడు యువకుడు. ఆయన జాగీర్‌దారులకు వ్యతిరేకంగా గొంతెత్తి పాడినారు. ఆయనతోపాటు రాజ్‌బహద్దూర్ గౌడ్ రంగప్రవేశం గావించినాడు. వీరంతా తెలంగాణాలో పీడిత ప్రజానీకానికి నాయకత్వం వహించి రావి నారాయణ రెడ్డిగారి మార్గదర్శకత్వంలో ముందడుగు వేసినారు. మందుముల నరసింగరావు గారు, సురవరం ప్రతాపరెడ్డిగారు ఉభయులు కొంత మితవాదులైనప్పటికిని 'రయ్యత్', 'గోలకొండ' పత్రికల ద్వార తమ సహజ ధోరణిలో తెలుగు ప్రజలలో జాగృతిని, రాజకీయ చైతన్యాన్ని వ్యాసాల ద్వార, సంపాదకీయాల ద్వారా కలుగజేసినారు.

ఆనాటి యువ నాయకులలో నాగులపల్లి కోదండరామారావు విశిష్టమైన వ్యక్తి. అందరు ఆయనను ఎన్.కె.రావు అనేవారు. బి.ఎస్‌సి., ఎల్‌ఎల్.బి. పట్టభద్రుడు. యావజ్జీవితము బ్రహ్మచారిగా ఉండినాడు. న్యాయశాస్త్రంలో ప్రతిభ, ప్రావీణ్యం కలిగినవాడు. ఎంతోమంది ఆయనవద్ద చదువుకొని న్యాయశాస్త్ర పరీక్షను యిచ్చి మంచి న్యాయవాదులుగా రాణించినారు. ఆయన ఆకారం, వేషం సుభాష్ చంద్రబోస్‌ను పోలి ఉండేది. స్వామీ రామానంద తీర్థకు ఆయన సన్నిహితుడుగా

ఉండేవాడు. ప్రతాపరెడ్డిగారికి ఆయన మిత్రుడు. ఆయనకు తీవ్రమైన రాజకీయాభిప్రాయాలు ఉండేవి. పోలీసుచర్యకు ముందు బొలారంలో (సికిందరాబాదు) భారత ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా ఉండిన కె.ఎమ్.మున్షీగారికి, స్టేట్ కాంగ్రేస్ నాయకులకు ముఖ్యంగా స్వామీ రామానందతీర్థగారికి ఆయన లైజాన్ ఆఫీసర్‌గా ఉండేవాడు. నవాబ్ ఆజంజంగ్‌కు ఆయన ప్రీతిపాత్రుడైన శిష్యుడు. పోలీసు చర్య తరువాత రెండు మూడు సంవత్సరాలలోనే రోడ్డు ప్రమాదంలో గాయపడి కొంత కాలం రోగగ్రస్తుడై పరలోకగతుడైనాడు. విషాదకరమైన సంఘటన యిది. దేదీప్యమానంగా చాలాకాలం వెలుగవలసిన దీపం ఆరిపోయింది.

ఎన్.కె.రావుగారికి సంస్కృతభాషపట్ల అత్యంత అభిమానం. ప్రస్తుతం తిరుపతి దేవస్థానం వారు నడుపుతున్న ప్రాచ్యకళాశాలకు ఆరంభదశలో ఆయన ఎంతో సహాయముచేసి దాని అభివృద్ధికి కారణభూతుడైనాడు. పోలీసు చర్యకు ముందు హైదరాబాదులోను, వరంగల్‌లోను స్థాపితమైన ఆంధ్ర విద్యాలయాలకు (High Schools) ఆయన ముఖ్య సలహాదారుడు, ముఖ్య కార్యకర్తగా ఉండి వాని అభివృద్ధికి మిక్కిలి తోడ్పడినాడు. ఇంకా ఎన్నో సంస్థలకు ఆయన సహాయం లభ్యమైనది. ఎంతోమంది బీద విద్యార్థులకు ఆయన ఆర్థిక సహాయం గావించినారు. ఆయనవంటి త్యాగమూర్తులు తక్కువమంది – ఆ రోజుల్లోనే ప్రభుత్వోద్యోగానికి రాజీనామచేసి జాతీయోద్యమంలో దుమికినవారు సర్దార్ జమలాపురం కేశవరావు. తెలంగాణలో ఊరూరుకువెళ్ళి అనేక కష్టాలను ఎదుర్కొని ప్రజలను మేలుకొల్పిన త్యాగమూర్తి సర్దార్ జమలాపురం కేశవరావు. దేశం కొరకు ఆయన ఎన్నో బాధలు పడినారు. ఎన్.కె.రావుగారివలె ఆయనకూడా పోలీసు చర్యతరువాత కొన్ని సంవత్సరాలలోనే పరలోకగతులైనారు. ఈ విధంగా ఆ రోజులలో ఉద్యోగాలను వదులుకొని దేశ సేవ చేయడానికి ముందుకు వచ్చిన వారిలో కొమరగిరి నారాయణరావు. పెరవెల్లి వెంకటరమణయ్య మొదలైన వారు గణనీయులు. ఈ త్యాగమూర్తుల కృషి తెలంగాణ ప్రజల విమోచనోద్యమానికి గట్టి పునాదులను నిర్మించినది.

ఈ దశాబ్దంలో 1939 నుంచి 1949 మధ్యకాలము అనగా ఒకదశాబ్ది భారతదేశ చరిత్రలో అతిముఖ్యమైనది. ఈ కాలంలోనే భారతదేశానికి స్వాతంత్ర్యము వచ్చినది. భారతదేశ విభజన జరిగినది. ఇంగ్లీషువారు వెళ్లిపోయినారు. సామ్యవాద ప్రజాస్వామిక రిపబ్లిక్ భారత దేశం ఒక రాజ్యాంగాన్ని పార్లమెంటరీ పద్ధతిని, అనుసరించి

రూపొందించుకొన్నది. ఈ కాలాన్ని చూచినవారికి అప్పటి జ్ఞాపకాలు ఎన్నో ఉండకతప్పదు. బ్రిటిష్‌వారు వెళ్ళిపోవలెనని భారత జాతీయ కాంగ్రేస్ గాంధీమహాత్ముని ఆదేశంతో యిచ్చిన పిలుపునందుకొని భారత ప్రజలు ఒక్కమారు విజృంభించినారు. ఈ విజృంభణ ఎక్కువగా ఇంగ్లీషు పరిపాలిత ప్రాంతాలలోనే చెలరేగినది. హైదరాబాదువంటి స్వదేశ సంస్థానాలు కొంత ప్రశాంతంగానే ఉండినవి. ఇంగ్లీషువారి అధీనంలోని అనేక ప్రాంతాలలో కొన్ని రోజులు పరిపాలన స్తంభించిపోయినది. గాంధీ, నెహ్రూ ప్రభృతులైన దేశనాయకుల నిర్బంధం దేశాన్ని క్రోధోద్రేకంలో ముంచివేసినది. ఆనాడు ప్రజలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, త్యాగము మహోజ్వలమైనవి; చరిత్రాత్మకమైనవి. 1942-44 మధ్యన నాగపూర్ న్యాయ కళాశాలలో నేను విద్యార్థిగా ఉండినాను. అందుచేత ఆ పరిస్థితులను ప్రత్యక్షంగా చూచే అవకాశం కలిగింది. వారం రోజులు నాగపూర్‌లో ప్రజాజీవనం స్థంభించినది. కర్ఫ్యూ విధింపు జరిగినది. నాగపూర్‌లో కొన్ని ప్రాంతాలలో పరిపాలన ఛాయకూడా కనిపించక కొన్ని రోజులు స్వతంత్ర ప్రదేశంవలె ప్రజల జీవనం కొనసాగినది.

ఆ రోజుల్లో నాగపూర్‌లో చాలామంది తెలుగువారు ఉండేవారు. వీరందరు వివిధ వృత్తులను అవలంబిస్తూ పుష్కలంగా డబ్బు సంపాదించుకుంటుండేవారు. కొంతమంది సినిమాహాళ్ళ అధిపతులు కూడా ఉండేవారు. చిత్రమేమనగా నాగపూర్‌లో కూరగాయల మార్కెటు, పండ్ల మార్కెట్‌కు వెళ్లినప్పుడు అక్కడ తట్టలు బుట్టలు మోసే కూలీలు కొందరు తెలుగు మాట్లాడడం వినిపించేది. వంట చేసేవారు చాలామంది తెలుగువారు ఉండేవారు. సీతాబల్డీ ప్రాంతంలో ఒక భవనములో కింది అంతస్తులో తమిళులు, మీది అంతస్తులో తెలుగువారు, ఒక గ్రంథాలయాన్ని, ఒక పఠనాలయాన్ని నడుపుతుండేవారు. అప్పుడప్పుడు తెలుగుసభలు జరుగుతుండేవి. ఎప్పుడైనా తెలుగు నాటకాలు ప్రదర్శితమయ్యేవి. తెలుగు సినిమాలు అప్పుడప్పుడు వస్తుండేవి. ఇప్పుడు తెలుగింటి అల్లుడైన శ్రీ చింతామణి దేశ్‌ముఖ్‌గారితోపాటు శ్రీ పి.యస్.రావు (I.C.S.) ప్రభుత్వంలో కార్యదర్శులుగా ఉన్నతస్థితిలో ఉండేవారు. (C.D.దేశ్‌ముఖ్‌గారికి మొదటి భార్య ఆంగ్లవనిత); న్యాయవాదులుగా కొందరు ఉండేవారు. వారిలో ప్రముఖులు మాచిరాజు భవానీశంకర్ నియోగిగారు. వారు నాగపూర్‌లో అత్యున్నత పదవులను అలంకరించినారు. అడ్వకేట్ జనరల్‌గాను; హైకోర్టు న్యాయమూర్తిగాను; ప్రధాన న్యాయమూర్తిగాను; విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగాను; పబ్లిక్ సర్వీస్ కమీషన్

అధ్యక్షులుగాను; పురపాలక సంఘ అధ్యక్షులుగాను పనిచేసి కీర్తి పొందినారని చెప్పితే తెలుగువారి ప్రాధాన్యం వెల్లడి కాగలదు. భవానీశంకర్ నియోగిగారి ఇంట్లో అంతా మహారాష్ట్రమయం. భార్యలిద్దరూ మహారాష్ట్ర మహిళలే. కాని నియోగిగారు మాత్రం చక్కగా తెలుగు మాట్లాడేవారు. తెలుగు విద్యార్థులము మేము వారిని కలుసుకోవడానికి వెళ్ళినప్పుడు వారు మాపట్ల చూపిన మర్యాద, యిచ్చిన తేనీటి విందు ఎప్పుడూ జ్ఞాపకం ఉంటవి. వారి తమ్ముడు భాస్కరరావు నియోగికూడ న్యాయవాదులు. వారు మాకు న్యాయకళాశాలలో అధ్యాపకులుగా ఉండేవారు. మాకు వారు చక్కని వీడ్కోలు విందును వారి ఇంటిలో చేసినారు. రుచికరమైన మహారాష్ట్ర భోజనం వారితో కలిసి ఆరగించినాము. అప్పుడు న్యాయకళాశాలకు అధ్యాపకులందరు న్యాయవాదులే. కళాశాల ఉదయం పూట నడిచేది. ప్రస్తుతం భారత ఉపరాష్ట్రపతిగా ఉన్న మాజీ సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి హిదాయతుల్లాగారు అప్పుడు యువకులు, అవివాహితులు. న్యాయ కళాశాలలో మాకు అధ్యాపకులు. ఈ న్యాయవాదులందరూ చక్కగా బోధించేవారు. ఈడ్పుగంటి రాఘవేంద్రరావుగారు ఆనాడు సకల భారత ప్రఖ్యాతిగాంచిన తెలుగువారు. నాగపూర్ నివాసి. నాగపూర్ ప్రజాహిత జీవనంలో చురుకుగా పాల్గొన్న రాజకీయవేత్త, న్యాయవాద శిరోమణి. తరువాత ఆయన ఇంగ్లీషువారి కాలంలోనే గవర్నర్‌గాను, కేంద్రమంత్రిగాను గురుతరమైన బాధ్యతలను నిర్వహించిరి. ఆయన ఖద్దరు కట్టేవారు. ఖద్దరు టోపీ గవర్నర్ అని ఆయన ఆరోజులలో ప్రఖ్యాతి గాంచినారు. ఆయన మేనల్లుడు కోసలేంద్రరావుగారు కూడా ప్రముఖ న్యాయవాది; అడ్వకేట్ జనరల్‌గా పనిచేసినారు. ఈ విధంగా నాగపూర్‌లో తెలుగు దీపం దేదీప్యమానంగా వెలుగొందినది. లక్ష్మీనారాయణగారు అనే ఒక వర్తకుడు నాగపూర్‌లో ఉండేవారు. ఆయన ఇరవై లక్షలకు పైగా ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విరాళంగా యిచ్చే ఉద్దేశ్యంతో విశాఖపట్టణం వెళ్ళగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుల దర్శనమే కాలేదట. అందుచేత నాగపూర్‌కు తిరిగివచ్చి అక్కడనే ఒక టెక్నాలజీ Institute ను స్థాపించి ఆ డబ్బును దానికి యిచ్చినారని విన్నాను; మేము విద్యార్థులుగా ఉన్న రోజులలో నాగపూర్ సైన్స్ కళాశాలకు డాక్టర్ కృష్ణమూర్తి అనే ఆంధ్రుడు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. నాగపూర్‌లో 'హితవాద' దినపత్రిక ప్రసిద్ధమైనది. ఆ దినపత్రిక సంపాదకుడు కోదండరావుగారు; తెలుగువారు; ధారాళంగా తెలుగులో మాట్లాడేవారు. విద్యార్థులము మేము వారి దర్శనానికి

వెళ్ళినప్పుడు మమ్ములను ఎంతో ఆదరించేవారు. ఆయన భార్య అమెరికన్ మహిళ. ఆమె అప్పుడు ఛలోక్తిగా ఆయనతో మేము వింటుండేటట్లు 'మీరు మీ దేశీయులతో నాపైన నాకు తెలియకుండా ఏమైన ఆరోపణలు చేస్తున్నారా?' అని ఇంగ్లీషులో అడిగేది. కోదండరావుగారు "Servants of India Society" సభ్యులు. గోపాలకృష్ణ గోఖలే, శ్రీనివాసశాస్త్రిగార్ల సంప్రదాయానికి చెందినవారు. శ్రీనివాసశాస్త్రి గారికి కొంతకాలం ఆంతరంగిక కార్యదర్శిగా కూడా ఉండేవారు. ఆయన మితవాద నాయకుడు, రాజకీయవేత్త, మేధావి; ఇంగ్లీషులో మంచివక్త; రచయిత. మేము వెళ్ళిన సందర్భాలలో ఆయన మాకు వివిధ దేశాలను గూర్చి ఎన్నో వివరాలు చెప్పుతుండేవారు. అమెరికా సంయుక్త రాష్ట్రములలోని కారులన్ని వరుసగా నిలబెట్టితే మొత్తం జనాభా అందులో కూర్చోవచ్చునని ఒక పర్యాయం ఆయన మాకు చెప్పినారు. ఆనాటి అమెరికా (1940) అట్లా ఉంటే యిప్పుడు ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చును.

సుప్రసిద్ధ నాట్యాచార్యులు నటరాజ రామకృష్ణగారు ఆరోజుల్లో నాగపూర్‌లో ఉండేవారు. అప్పుడు వారు యువకులు; అవి నాట్యశాస్త్రంలో వారి తొలిరోజులు. సంపన్న మహారాష్ట్ర కుటుంబాలలో కొన్ని వారిని ఆదరిస్తుండేవి. వారి ప్రతిభను ఆ కుటుంబాలు గుర్తించి, తమ ఇండ్లలోని బాలబాలికలకు నాట్యకళలో ప్రథమ పాఠాలు రామకృష్ణగారిచేత చెప్పిస్తుండేవారు. తరువాత రామకృష్ణగారు ఆంధ్రదేశానికి వచ్చి అనేకులకు నాట్యకళను నేర్పినారు. శ్రీ విస్సా అప్పారావు, శ్రీ కల్లూరి సుబ్బారావుగార్ల ప్రోత్సాహం వారికి లభించినది. వారివద్ద నాట్యము నేర్చుకొనినవారిలో కొందరు అగ్రశ్రేణిని అలంకరించి, రామకృష్ణగారికీ కీర్తి తెచ్చినారు. నేడు ఆంధ్రదేశంలోనేకాదు సకల భారతంలో కూడ రామకృష్ణగారు అగ్రశ్రేణి నాట్యాచార్యుడు. హైదరాబాదులో యెప్పుడు కలుసుకున్నా మేము నాగపూర్ స్నేహాన్ని గూర్చి ఆప్యాయంగా మాట్లాడుకుంటాము. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ నృత్య అకాడమికి అధ్యక్షులుగా ఉండడం నాకు ఆనందాన్ని కలిగిస్తున్నది.

న్యాయశాస్త్ర కళాశాలకు ప్రముఖ న్యాయవాదులు అప్పుడప్పుడు ఆహ్వానితులై ఉపన్యాసాలు చేస్తుండేవారు. ఒక వృద్ధ న్యాయవాది బి.జి.కపర్ది అని నాకు జ్ఞాపకం ఒకసారి ఆహ్వానితులై వచ్చి ప్రముఖ న్యాయవాదులను గూర్చి ప్రస్తావిస్తూ చిత్తరంజన్ దాసుగారిని గూర్చి చెప్పిన మాటలు నాకు బాగా జ్ఞాపకమున్నవి. చిత్తరంజన్‌దాసుగారు మోతీలాల్‌నెహ్రూ గారికి అంతరంగమిత్రులు; ఆయన మోతీలాల్ నెహ్రూ గారితో

సమానమైన ఆర్జనతోపాటు త్యాగం, ప్రతిభ కలిగిన న్యాయవాద శిరోమణి. కపర్దిగారు యేదో కేసులో చిత్తరంజనుదాసుగారిని నాగపూర్ తీసుకొనిరావలెనని కలకత్తా వెళ్ళినారట. ఆ సందర్భంలో చిత్తరంజన్‌దాసుగారి ముందు ఒక ధనవంతుడు యేదో కేసులో ఆయనను న్యాయవాదిగా నియమించుకోవలెనని కూర్చుండినాడట. ఆ కేసు కలకత్తా హైకోర్టులోనే. కాని ఆరోజు కాంగ్రేస్ కార్యవర్గము సమావేశము ఔతున్నదట. అందుచేత ఆ శ్రీమంతుడు ఒక గంటకొరకు అయిదువేల రూపాయలు ఇస్తానన్నా దాసుగారు ఒప్పుకోలేదట. దాసుగారు కోరితే కార్యవర్గము ఆయన కొరకు ఒక గంట ఆలస్యంగా సమావేశం కావడానికి వీలుండేది. ఈ సంఘటన చూచిన కపర్దేగారు తాము దాసుగారిని నాగపూర్ తీసుకొని వెళ్ళలేమని భావించి, లేచి వస్తుండగా దాసుగారు వచ్చినపని తెలుసుకొని వారి వద్ద ఫీసు కూడా తీసుకొనక సొంత ఖర్చుతో నాగపూర్ వెళ్ళి కేసులో వాదించి విజయం చేకూర్చినారట. భోగము, త్యాగము, ఆర్జనశక్తి, వితరణ కలిగిన మహెూదార స్వభావుడు చిత్తరంజన్‌దాసు అని కపర్దేగారు యీ కథను మాకు చెప్పినారు.

చిత్తరంజన్‌దాసుగారిని గూర్చి మాడపాటి హన్మంతరావుగారు మరొక ఉదంతం తెలిపినారు. 1921 సంవత్సరంలో కాకినాడలో అఖిలభారత జాతీయ కాంగ్రేసు మహాసభలు జరిగినవి. ఆ సభలకు దాసుగారు వచ్చినారు. కాని ఆయన సతీమణి రాలేదు. ఎందుకు రాలేదని అప్పటి నిజాం రాష్ట్రం నుండి వెళ్ళిన ప్రతినిధులు చిత్తరంజన్‌దాసు గారిని అడుగగా రైలు ప్రయాణానికి కావలసిన డబ్బు లేకపోవడం వల్ల రాలేదని తెలిపినారట. న్యాయవాదిగా లక్షలు ఆర్జించి, దేశానికొరకు సర్వము త్యాగము చేసిన చిత్తరంజన్‌దాసుగారు జీవితం తుదిదశలో ఆర్థికమైన యిబ్బందులు యెదుర్కొనక తప్పలేదు. నేటి నాయకులకు నాటి నాయకులకు యెంత వ్యత్యాసమో ఆలోచించండి. లక్షలు సంపాదించి, లక్షల ఖర్చుచేసిన చిత్తరంజన్ దాసుగారు మన టంగుటూరి ప్రకాశం పంతులుగారి వంటి వారు. ఇంత సంపాదించినా, కాంగ్రేస్‌లోచేరి, దేశసేవలో మునిగిపోయిన తరువాత, కొద్ది డబ్బు కొరకుగూడ ఆయన కష్టపడేవారట. ఉన్నత ఆదర్శము, త్యాగము ఆయనలో మూర్తీభవించినవి.

1942-44 మధ్య రెండు సంవత్సరాలు నాగపూర్ న్యాయశాస్త్ర కళాశాలలో గడిపిన విద్యార్థి జీవనంలో చిరస్మరణీయ ఘట్టాలు కొన్ని ఉన్నవి. బ్రిటిష్ వారిని వెళ్ళిపొమ్మని కోరిన స్వాతంత్ర పోరాటాన్ని దగ్గర నుండి చూసే అవకాశం స్వదేశ

సంస్థాన పౌరుడైన నాకు కలిగింది. ముఖ్యంగా స్వరాజ్య సాధన ఉద్యమానికి నాయకత్వం వహించి భారత జాతికి చిహ్నమై, భారతీయ సంస్కృతికి ప్రతిబింబమై గౌతమ బుద్ధుని తరువాత భారతదేశ చరిత్రలో ఆయన అంతటి మహనీయమూర్తిగా, మనదేశానికేకాక సకల ప్రపంచానికి శాంతిదూతగా ప్రత్యక్షమై ప్రపంచ మహామేధావుల, మహానుభావుల గౌరవాభిమానాలకు పాత్రమైన ఋషితుల్యుడు. గాంధీమహాత్ముని సందర్శన భాగ్యము 1942లో కలిగింది. అంతకుముందు బసవరాజు అప్పారావుగారి గేయాన్ని చదివాను.

"కొల్లాయి గట్టితేనేమి
మా గాంధి కోమటై పుట్టితేనేమి
వెన్నపూసా మనసు
కన్నతల్లీ ప్రేమ
పండంటి మోముపై బ్రహ్మతేజస్సూ
పలుకు పలికిందంటె బ్రహ్మవాక్కేను
చకచకా నడిస్తేను జగతి కంపించేను"

అన్న మాటలు నా మనసులో మెదలుతూ ఉండేవి. ఆయనను చూడవలెనని గాఢమైన ఆకాంక్ష కలిగి మిత్రులతో కలిసి వార్ధాకు వెళ్ళి అక్కడి నుండి ఆయన ఆశ్రమమైన సేవాగ్రామం చేరినాము. అది 1942 ఆగస్టు నెల. అదే రోజు సాయంకాలం ఆయన బొంబాయి బయలుదేరవలసిన కార్యక్రమం. బొంబాయిలో అఖిల భారత కాంగ్రేస్ బ్రిటిష్‌వారిని మనదేశం నుండి వెళ్ళిపొమ్మనే తీర్మానం ఆమోదించనున్నది. యువకులమైన మేము ఆశ్రమమంతా తిరిగి చూచినాము. మట్టిగోడలతో సాధారణమైన కప్పులో (బహుశా తడకల కప్పు కావచ్చును) ఉన్న గదులన్ని చూచినాము; అవి రాజప్రాసాదము కన్నా పరిశుభ్రముగా ఉండినవి. ఏ గదిలోకి వెళ్ళినప్పటికిని మీరెందుకు వచ్చినారని మమ్ము యెవ్వరూ పలుకరించలేదు. ఎవరి పనిలో వారు నిమగ్నులై యుండిరి. అది ఒక ఋషి ఆశ్రమం వలె మాకు కనిపించినది. దూరం నుండి ఆ సంయమీంద్రుని సందర్శించినాము. భవ్యమైన ఆవేశం కలిగినది. పులకాంకిత గాత్రులమైనాము. ఆరోజు సాయంకాలం వార్ధా రైల్వేస్టేషన్‌లో బొంబాయి రైలు ఎక్కడానికి వచ్చిన ఆయనను రెండవ పర్యాయం చూచినాము. ఓవర్ బ్రిడ్జిపై నుండి ఆయన క్రిందికి దిగుతుండగా ఆయన మాకొక

మహా సేనానాయకునివలె గోచరించినాడు. ఆకారంలో చిన్నవాడైననూ పంచగట్టుకొని పైన ఒక ఉత్తరీయం వేసుకొని చేతిలో కట్టె పట్టుకొని మెట్లు దిగుతుండగా ఆయన ముఖముపైన మాకొక దివ్యతేజస్సు కనిపించినది. ఆయన వక్షస్థలము ఒక మహావీరుని వక్షస్థలమువలె కనిపించినది. నిజానికి కొందరు పెద్దలు ఆయన వక్షస్థలము మహా సేనానాయకుని వక్షస్థలమువలె ఉండేదని అంటుండేవారు. ఆరోజు మా జీవితంలో చిరస్మరణీయమైన రోజు. ఆనాడు నా మనఃఫలకం మీద చిత్రితమైన ఆయన మూర్తి నేటికీ కన్నుమూసుకుంటె కనిపిస్తున్నది.

నాగపూర్‌లోని వివిధ కళాశాలల్లో చదువుకోవడానికి అప్పటి హైదరాబాదు రాష్ట్రము నుండి కాక మద్రాసు రాష్ట్ర అంతర్గతమైన ఆంధ్ర జిల్లాల నుండి విద్యార్థులు వస్తుండేవారు. న్యాయ కళాశాలలో తెలుగు విద్యార్థులు తగినంత సంఖ్యలో ఉండేవారు. ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి, ప్రస్తుత భారత ప్రభుత్వ విదేశాంగమంత్రి శ్రీ పి.వి.నరసింహారావు న్యాయ కళాశాలలో నాకు సహాధ్యాయిగా ఉండేవారు. నాతో యెంతో స్నేహంగా ఉండేవారు. మహారాష్ట్ర, హిందీ భాషలలో ఆయన ప్రవీణులుగా ఉండేవారు; ఆయన కుశాగ్రబుద్ధి, ప్రతిభా సంపద నివురు గప్పిన నిప్పువలె ఉండేది; సన్నిహితులకు మాత్రమే ఆయన శక్తి సామర్థ్యాలు తెలిసేవి. కొంతకాలం ఆయన బూర్గుల రామకృష్ణారావు గారికి జూనియర్‌గా ఉండి, న్యాయవాదవృత్తిని కొనసాగించి తరువాత పూర్తిగా రాజకీయాలలో నిమగ్నులై ఉన్నతోన్నతమైన పదవులను నిర్వహించి బహు భాషా వేత్తగా, పార్లమెంటేరియన్‌గా, మేధావిగా వన్నెకెక్కినారు.

V

ఆ రోజులలో ఆంధ్ర – తెలంగాణల మధ్య సేతువు నిర్మించినవి నాటక ప్రదర్శనలు, అవధానాలు, గ్రంథాలయాలు, నవలలు, పత్రికలు మొదలైనవి. నామట్టుకు నేను చిన్నతనంలోనే తెలుగు సాహిత్యమువైపు ఆకర్షితుడను కావడానికి యివీ కారణం. మైలవరం కంపెనీవారి నాటకాలను చూచి అందులో కపిలవాయి రామనాథశాస్త్రి, ఉప్పులూరి సంజీవరావు, వేమూరి గగ్గయ్య మొదలైనవారు ఆడిన నాటకాలను చూచి, అవధాన సభలలో పద్యాలు విని, గ్రంథాలయ వార్షికోత్సవాలలో సాహిత్యోపన్యాసాలు విని, ధర్మవరం, చిలకమర్తి, పానుగంటి ప్రభృతుల నాటకాలు కొన్ని చదివి విజ్ఞాన చంద్రికా మండలి, ఆంధ్ర ప్రచారిణి గ్రంథమాలల నవలలు

కొన్ని పఠించి ఆంధ్ర, కృష్ణా పత్రికలను అప్పుడప్పుడు చదువుతూ "నీలగిరి, తెలుగు, గోలకొండ" పత్రికలను చదువుతూ తెలుగు సాహిత్యంవైపు అభిముఖుడనైనాను. చిన్న వయస్సులో సాహిత్యంతో కలిగిన ఆ సంబంధము నాటికీ నేటికీ తెగిపోక దృఢంగా వున్నది.

హైదరాబాదు నేను తొలిసారి 1934 సంవత్సరంలో వచ్చినాను. నిజాం కళాశాలలో నాల్గు సంవత్సరాల విద్యాభ్యాసము – ఈ దశలో ఆంధ్రప్రాంతం నుండి వచ్చిన కొందరు కవిపండితులను సందర్శించే భాగ్యం కలిగినది. ఆ రోజులలో తెలుగు నాటకాలు సికిందరాబాదులో అప్పుడప్పుడు ఆడుతుండేవారు, సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనం 1935–36లో కాబోలు జరిగినది. నాటకాన్ని వ్రాసిన బలిజేపల్లి లక్ష్మీకాంతంగారే స్వయంగా అందులో ఒక పాత్రధారి. హాస్టల్‌లోని విద్యార్థులం కొందరం ఆ నాటకాన్ని సికిందరాబాదువెళ్ళి చూచినాము. మరునాడు ఆయనను కళాశాలకు ఆహ్వానించినాము. ఆయన చక్కని ఉపన్యాసము చేసినారు. ఆయన కంఠము ముఖ్యంగా పద్యాన్ని పఠించే పద్ధతి నావంటి వారిని ఎందరినో ఆకర్షించినది. ఆ తరువాత కొన్ని రోజులకు కాబోలు పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు సికిందరాబాదుకు వచ్చినారు. అప్పుడు వారు ఏవో కొన్ని చిక్కులలో ఉండినారని అందుచేత మనస్సు కొంచెం వికలమై ఉండినదని మేము విన్నాము. అయినప్పటికి ఆయనను వెళ్ళి ఆహ్వానించగానే కళాశాలకు వచ్చి మహోపన్యాసం చేసినారు. అంతకుముందు పత్రికలో సాక్షి ఉపన్యాసాలు చదివిన మాకు ఆయన ఆనాడు "నాయనలారా! అని మొదలుపెట్టి ఉపన్యసించగా సరిగా జంఘాలశాస్త్రి వలెనే ప్రసంగించినట్లు తోచినది. ఆయన కాషాయరంగు ధోవతి, అదే రంగు షర్టు, పూర్తిగా నెరసిన తెల్లని మీసాలు, తెల్లటి క్రాఫు, కొంచెం దుర్బలంగా ఉండే శరీరంతో వేదికమీద నిలిచినారు. మాట్లాడినంతసేపు సభ నిశ్శబ్దంగా ఉండినది. మా ఆచార్యులందరూ వారికి చేయెత్తి నమస్కరించినారు. ఈ దృశ్యాన్ని నేను ఎన్నడూ మరువలేను. తిరుపతి వెంకటకవులను గూర్చి మేము వింటూ ఉండేవారము. ఆయన కుమారులు మరొకరితో కలిసి సత్యదుర్గేశ్వర కవులుగా హైదరాబాదుకు వచ్చి మా కళాశాలలో అవధానం చేసినారు. మనోరంజకంగా అవధానం జరిగినది. ఆ సభకు రాయప్రోలు సుబ్బారావుగారు అధ్యక్షులు. ఆనాడే మొదటిసారి నేను ఆయనను చూడడం జరిగింది. అధ్యక్షోపన్యాసం ఒక పద్యంతో ఆయన ఆరంభించినారు. ఇట్లు ఆరంభించడం ఆయనకు అలవాటు. ఆ పద్యం యింకా నాకు జ్ఞాపకమున్నది.

అనవద్యంబగు ధారణాబల మహాన్యాసంబు కాంక్షింతురో
తెనుగుందేనెలురాలు వాచవుల పందిళ్ళన్ రసాస్వాదనం
బునపేక్షింతురొ? పూలుపండ్లుగల వీపూజా సువర్ణాశ్రమం
బున; గైకొందు రసప్రియుల్ కవుల సంపూర్ణామృతాతిథ్యమున్.

అదే రోజులలో రాయప్రోలు సుబ్బారావుగారు రాజమహేంద్రవరంలో జరిగిన నవ్యసాహిత్య పరిషత్తు సభలకు అధ్యక్షత వహించినారు. అధ్యక్షోపన్యాసం రెండుమూడు పద్యాలతో ప్రారంభించి రసవంతంగా నడిపినారు. ఆ ఉపన్యాసం భారతిలో ప్రకటితమైనది. రెండు మూడు పర్యాయాలు చదివినాను.

తెలుగుందోటల భావగీతికల రక్తింబాడుటో? పూలమ
ళ్ళనొయారంబుగ దిద్దుటో? పొదల పొం
తన్ కోయిలన్ బిల్చుటో? ననలన్ తేనెలు తీయుటో?
జననీ వేదికలేల? లేవెయిక యుష్మత్ సేవయందన్యముల్.

సుబ్బారావుగారి ఉపన్యాసాన్ని గూర్చి భారతిలో 'శాస్త్రి' అని పేరుతో వ్రాసిన ఒక సమీక్ష ప్రకటితమైనది. ఆ సమీక్షలో యీ ఉపన్యాసాన్ని విజ్ఞాన సంపన్న ఉపదేశంగా చైతన్య సమంచితమైన సల్లాపముగా వర్ణించినారు. వెంటనే రాయప్రోలువారి రచనలు కొని చదివినాను. ఆయన కవిత్వం నన్ను బాగా ఆకర్షించినది. ఆయనవలె కవిత్వం వ్రాయవలెననే కోరిక కూడా కలిగినది. తరువాత 1940-42 మధ్యన దొరికిన వ్యవధిలో వరంగల్‌లో సాయంకాలం వాహ్యాళికి వెళ్ళుతూ అప్పటి జాతీయోద్యమములోని కొన్ని ఘట్టాలచే ఉత్తేజితుడనై రాయప్రోలు శైలిని మనస్సులో ఉంచుకొని కవితలు కొన్ని అల్లడం జరిగింది. దానిని తరువాత రాయప్రోలు వారికి చూపించగా నా కవిత్వాన్ని మెచ్చుకొని వారికి ఆప్తమిత్రులైన శివశంకర స్వామిగారికి చూపించినారు. నా వ్రాత బాగుండనందున నా కవితను హర్షించిన శివశంకర స్వామిగారు వ్రాతప్రతి స్వయంగా సిద్ధం చేసి నాకు పంపినారు. "పచ్చతోరణం" అనే పేరుతో ఆ పుస్తకం 1953లో రాయప్రోలు సుబ్బారావుగారి పీఠికతో ముద్రితమైనది. నాటికి నేటికి రాయప్రోలు కవిత నాకు మిక్కిలి అభిమానాస్పదమైనది.

దువ్వూరి సుబ్బమ్మగారు ఆ రోజులలో భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొనిన వీరనారీమణి. ఆమె నిజాం కళాశాల విద్యార్థులను ఉద్దేశించి హైదరాబాదులో దేశభక్తి

ప్రబోధమైన గంభీరోపన్యాసం కావించినది. చాలామంది విద్యార్థులమీద ఆ ప్రసంగం చెరగనిముద్ర వేసినది. మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు 1937-38 ప్రాంతంలో కాబోలు హైదరాబాదుకు వచ్చి కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో ఆంధ్రుల చరిత్రను గూర్చి మూడు మహోపన్యాసాలు గావించినారు. వారిని మా కళాశాలకు ఆహ్వానించి వారి ఉపన్యాసం వినే అవకాశం లభించింది. ఆ సభకు సిరుగూరి హనుమంతరావుగారుకూడా విచ్చేసిరి. సభకు అధ్యక్షత వహించిన కురుగంటి సీతారామయ్యగారు స్వయంగా చరిత్ర పరిశోధకులు, "తంజావూర్ ఆంధ్రనాయక చరిత్ర"ను మొదటిసారి వ్రాసినవారు. ఆ చరిత్రను సమీక్షిస్తూ సోమశేఖర శర్మగారు "భారతి"లో వ్రాసిన సమీక్షను పేర్కొని వారు చూపించిన దోషాలను ఒప్పుకొని సోమశేఖర శర్మగారిని సీతారామయ్యగారు మిక్కిలి ప్రశంసించిన ఆ సందర్భం నాకు యింకా జ్ఞప్తికి ఉన్నది. సోమశేఖర శర్మగారిది సుందరమైన మూర్తి; గంభీరమైన కంఠం; ఉత్తేజకరమైన వచనశైలి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు వారికి తమ కృతిని అంకితమిస్తూ

"కొదమ తుమ్మెదరెక్కల గుస్తరించు
మీసముల నా ప్రసన్న గంభీరముఖము"

అన్న మాటలు అక్షరాల సత్యమైనవని అందరమూ అనుకొన్నాము. అంతేకాదు ఆ వరుసలోనే మరొక పద్యంలో విశ్వనాథ సత్యనారాయణగారు సోమశేఖర శర్మగారిని గూర్చి వ్రాసిన మాటలు తెలుగు సాహిత్యం ఉన్నంతవరకు ప్రతివారు స్మరించవలసిన మాటలు.

"డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకు
రాని పాడుకాలాన పుట్టి
నీ చరిత్ర జ్ఞాన నిర్మలాంభఃపూర
మూషరక్షేత్ర వర్షోదకమయి
చాడీలకు ముఖప్రశంసల కీర్త్యకు
స్థానమైనట్టి లోకాన నుండి
నీ యచ్ఛతర కమనీయశీల జ్యోత్స్న
అడవిగాచిన వెన్నెలగుచు చెలగి"

అన్న మాటలు సోమశేఖర శర్మగారి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నవి. కొమఱ్ఱాజు లక్ష్మణరావు, చిలుకూరి వీరభద్రరావుగార్ల తరువాత ఆంధ్ర చరిత్ర పరిశోధకులలో సోమశేఖర శర్మగారు గణనీయులు. అయితే దేశము, ప్రభుత్వము ఆయనను తగినట్లు ఆదరించలేదు. ఆర్థిక ఇబ్బందులతో శర్మగారు జీవితాన్ని గడిపి అమూల్యమైన పరిశోధనలు చేసి అనేక గ్రంథాలు వ్రాసి తెలుగు జాతిని ఋణగ్రస్తము గావించినారు.

అదేరోజులలో హైదరాబాదులో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో అఖిలాంధ్ర కథకుల సమావేశము జరిగినది. నందగిరి వెంకటరావు, నందగిరి ఇందిరాదేవి, భాస్కరభట్ల కృష్ణారావుగార్లు అప్పుడు తెలంగాణలో ప్రసిద్ధ కథకులు. వారందరు యీ సమావేశంలో పాల్గొన్నారు. శివశంకర శాస్త్రిగారు సభను ప్రారంభించినట్లు నాకు జ్ఞాపకం. అప్పటికి యింకా వారు "స్వామి" అని పేరు పెట్టుకొనలేదు. కాషాయ వస్త్రాలు ధరించలేదు. ఖద్దరు దుస్తులతో ఉండేవారు. సుందరమైనమూర్తి ఆయనది. ఆనాటి కథానికా సాహిత్యాన్ని వారు సమగ్రంగా సమీక్షించినారు. ఈ కాలంలోనే రెండు, మూడు పర్యాయాలు విశ్వనాథ సత్యనారాయణగారు హైదరాబాదుకు వచ్చినారు. బహుశా వారి 'వేయిపడగల'కు, అడవి బాపిరాజుగారి 'నారాయణరావు' నవలకు ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు ఉత్తమ పారితోషికము యిచ్చిన రోజులవి.

తెలుగులో ఉత్తమ నవలలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం నవలా రచన పోటీని నిర్వహించి పెద్ద బహుమతిని ప్రకటించినది. ఆంధ్ర సంస్కృతిని ప్రతిబింబించే యితివృత్తాన్ని తీసుకొని నవల వ్రాయవలెనని విశ్వవిద్యాలయం ఒక నియమంగా పెట్టినది. ఆ పోటీలో విశ్వనాథ సత్యనారాయణగారి 'వేయిపడగలు', అడవి బాపిరాజుగారి 'నారాయణరావు' ఉత్తమ నవలలుగా ప్రకటితమై బహుమతిని సమానంగా పంచుకున్నవి.

తరువాత ఆ రెండు నవలలు 'ఆంధ్రపత్రిక'లో ధారావాహికంగా ప్రకటితమైనవి. వానిని మేము ఆసక్తితో చదువుతుండేవారము. అందుచేత సత్యనారాయణగారు హైదరాబాదుకు వచ్చినప్పుడు వారి ఉపన్యాసాలను వెళ్ళి వింటుండేవారము. ఉపన్యాసానికన్నా వారి 'కిన్నెరసాని' పాట యువకులమైన మమ్ములను పరవశులను జేసేది, నాటికి నేటికి 'కిన్నెరసాని' కావ్యం కనిపించితే రెండు మూడు పుటలైనా నేను చదువకుండ ఉండలేను. మామునూరి నాగభూషణరావుగారు ఆనాటి

నవ్యకవులలో ముఖ్యులు. వారు హైదరాబాదుకు వచ్చి ఒక సభలో తమ రచనలతోపాటు 'కిన్నెరసాని' పాటలు పాడినారు. కిన్నెరసాని పాటలు రమ్యంగా వారు పాడేవారు. ఆనాటి నవ్యకవులు అనేకులు కిన్నెరసాని పాటలతో పాటు ఎంకిపాటలు పాడుతుండేవారు.

విశ్వనాథ సత్యనారాయణ గారిని తలుచుకున్నప్పుడు అనేకమైన మధుర స్మృతులు.

"నిండుమనంబు నవ్యనవనీత సమానము
పల్కుదారుణాఖండల శస్త్రతుల్యము"

అన్న సూక్తికి మంచి ఉదాహరణము సత్యనారాయణగారు. ఆయనకు గాఢమైన యిష్టానిష్టాలు ఉండేవి. తనకు తోచిన మాటను చెప్పడానికి పరమేశ్వరుని కైనా జంకేవాడు కాడు ఆయన. ఆయన సహాయం ఎందరికో లభించినది. కుల మత ప్రాంత విచక్షణలేక ఆయన సహాయం చేసేవారు. బీర్నీడి ప్రసన్న కవి పృథ్వీభాగవతాన్ని ఆయన వేయిన్నూట పదహార్లిచ్చి కృతి తీసుకున్నారు. బెజవాడలో ఆయన ఆతిథ్యము ఎందరికో లభించినది. యువకుల నెందరినో ఆయన ప్రోత్సహించినారు. జీవితంలో అరువై సంవత్సరాలు దాటిన తర్వాత ఆయనకు అన్ని గౌరవాలు లభించే అదృష్టం కలిసివచ్చినది. తెలుగుకవులలో తమ రచన మీద విశ్వనాథ సత్యనారాయణగారు సంపాదించినంత డబ్బు మరెవ్వరు సంపాదించలేదంటే అతిశయోక్తి కాదు. కళాశాల ప్రిన్సిపాల్ పదవి, లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యత్వము, ఆస్థానకవి పట్టము, పద్మభూషణ బిరుదము, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు, జ్ఞానపీఠ అవార్డు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఉపాధ్యక్ష పదవి మొదలైన అనేక గౌరవాలు ఆయనకు వరుసగా లభించినవి. అన్నింటికీ ఆయన యోగ్యుడు. ఆధునిక ఆంధ్రకవులలో సత్యనారాయణగారి వంటి ప్రతిభావంతులు లేరంటే సత్యానికి తలవంపులు కలుగవు. నిస్సందేహంగా గడచిన కొన్ని శతాబ్దాలలో తెలుగుదేశమున జన్మించిన రచయితలందరిలోను అత్యంత ప్రతిభావంతుడు విశ్వనాథ సత్యనారాయణగారు. సాహిత్యం ఆయన చేతిలోని క్రీడా కందుకం అభిప్రాయభేదము ఏమైనా ఉంటె ఆయన ప్రతిభను గురించి కాదు; ఆయన భావాల గూర్చి మాత్రమే, నేటి అభ్యుదయ కవులలో ప్రముఖులొకరు ఒక భావకవిని గురించి ప్రసంగిస్తూ విశ్వనాథ సత్యనారాయణ ప్రతిభను గూర్చి ప్రస్తావించి "ఆయన ప్రజ్ఞ గొప్పది, అంతటి

శక్తిమంతుడు మా శ్రేణిలో లేడు; లేకపోయెనే అన్న విచారము మాకందరికి ఉన్నది" అన్నాడు.

సత్యనారాయణగారి స్వభావాన్ని వివరించే సంఘటన ఒకటి పేర్కొనవలసి ఉన్నది. 1942వ సంవత్సర ప్రాంతంలో హైదరాబాదు నగరం నుండి 'తెలంగాణ' అనే దినపత్రిక వెలువడి కొన్ని సంవత్సరాలు నడిచినది. తెలంగాణ ఆంధ్రుల ఉద్యమాలకు యీ పత్రిక ప్రతిబింబంగా ఉండేది. ఈ పత్రికకు వ్యాసాలు వ్రాయమని మాడపాటి హనుమంతరావుగారి ఆదేశం. ఆ ఆదేశానుసారం నవ్య సాహిత్యాన్ని గురించి ప్రతివారం వ్రాస్తుండేవాడిని. ఒకవారం వేయి పడగలను గురించి వ్యాసం వ్రాసి దాని కటింగ్ ఒకటి సత్యనారాయణగారికి పంపినాను. రెండు రోజులలో వ్యాసాన్ని ప్రశంసిస్తూ నన్ను అభినందిస్తూ జాబు వ్రాసి నన్ను ఆనంద సముద్రంలో ఓలలాడించినారు. అప్పుడు నాది చిన్నవయసు. పది మందికి పరిచితుడను కాదు. కథ అంతటితో ముగిసిందనుకున్నాను. తరువాత కొన్ని నెలలకు వారు వరంగల్‌లో ఒక గ్రంథాలయ వార్షికోత్సవ సభకు విచ్చేసినారు. ఆ సభలో నేను ఎక్కడో వెనక కూర్చున్నాను. ఆనాటి వరంగల్‌లో న్యాయవాద ప్రముఖులొకరు వారికి స్వాగతం చెబుతూ సత్యనారాయణ గారి కవిత్వాన్ని గురించి ప్రస్తావించి అది చాలా సరళమై, సుబోధకమై ఉండునని సర్వసామాన్యమైన పరిచయ వాక్యాలు పలికిరి. ఆ మాటలు సత్యనారాయణ గారిని కోపోద్దీపితులను చేసినవి. తమ ప్రసంగాన్ని ప్రారంభిస్తూ "మీ అధ్యక్షులు తెలిపినంత సరళమైనది నా కవిత్వం కాదు. బహుశా ఆయన నా పుస్తకాలేవి చదివినట్లు కనిపించదు. నా రచనలు చదివి అర్థం చేసుకోవడం అందరికి సాధ్యమయ్యే పనికాదు. అట్లా అర్థం చేసుకున్నవారు తెలుగుదేశంలో కొందరే ఉన్నారు. ఆ కొందరిలో మీ ఊరివారొకరు. ఆయనే దేవులపల్లి రామానుజరావు" అని తర్వాత తమ ఉపన్యాసాన్ని కొనసాగించిరి. ఆ మాటలు నామీద పూలవాన కురిపించినవి. సభికులు ఆశ్చర్యచకితులైరి. మా ఊరివారి చూపులు నాపైన ప్రసరించినవి. సభ ముగిసిన తర్వాత నేను వెళ్ళి వారిని కలుసుకొనగా నన్ను వారు తమ దగ్గరకు తీసుకొని కౌగిలించుకొని అభినందించినారు. నా రచనా వ్యాసాంగానికి అది ఒక గొప్ప ప్రోత్సాహం. తుదివరకు వారికి నాపైన ఆదరాభిమానాలు, పరిపూర్ణమైన విశ్వాసం ఉండేవి. ఆంధ్ర సారస్వత పరిషత్తు వారికి అభిమానాస్పదమైన సంస్థ. అలంపురం సభలకు వచ్చి పరిషత్తు కృషిని ప్రశంసించిరి. సాహిత్య అకాడమి

మొదటి ఉపాధ్యక్షులుగా, విశిష్ట సభ్యులుగా వారి సహకారం సంపూర్ణంగా నాకు లభించినది. హైదరాబాదు వస్తే నన్ను చూడనిదే వెళ్ళకపోయేవారుకారు.

మరొక సంఘటన మరువలేనిది. 1950 సంవత్సరంలో చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు ఆస్థాన కవులుగా నియమితులైన సందర్భంలో అభినందన సభ, దానితోపాటు మూడు రోజులు సాహిత్యసభలు విజయవాడలో జరిగినవి. ఏ కారణంవల్లనో విశ్వనాథ సత్యనారాయణగారు సభలలో ప్రముఖంగా కనిపించలేదు. ఒకపూట సభకు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అధ్యక్షులు; సత్యనారాయణగారు వేదికమీద లేకపోవడం గమనించినారు. సత్యనారాయణగారికి సభల నిర్వాహకులమీద యేదో కోపం వచ్చినదని అందరు అనుకున్నారు. ప్రభాకర శాస్త్రిగారుకూడా వినివుంటారు. వెంటనేవారు అధ్యక్షస్థానం నుండి 'నాయనా, సత్యనారాయణ వేదికమీదికి రావయ్యా! నీవురాకపోతే నేను ఉపన్యాసం చేయను' అని అనగానే సత్యనారాయణగారు ఎక్కడనుండియో వచ్చి వేదికమీద ఆసీనులైనారు. ఆ సంఘటన ప్రభాకరశాస్త్రిగారి గొప్పదనానికి, మహనీయ వ్యక్తిత్వానికి – సత్యనారాయణగారి సౌజన్యానికి నిదర్శనం.

జాషువాగారుకూడా ఆ రోజుల్లో ఒక పర్యాయం హైదరాబాదుకు వచ్చినట్లు జ్ఞాపకం. కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలోనే ఆయన ఉపన్యాసం మొదటిసారి విన్నాను.

"మాది వినుకొండ; హైదరాబాదు మీది;
స్నేహమైనది వాఙ్మయ సేవకతన"

అని మొదలుపెట్టి సుమారు ఒక గంటసేపు చక్కగా మాట్లాడినారు. జాషువా గారు ఒడ్డూ పొడుగు మనిషి. నల్లగా ఉండేవారు. ఆయనకు కవికోకిల బిరుదు ఉండేది. కవిత్వంలోనేకాక రంగులోకూడ ఆయన కోకిలయేనని అందరం అనుకునేవారం. ప్రతినెలా జాషువాగారి పద్యాలు భారతిలో ప్రకటితమయ్యేవి. ఆ పద్యాలన్నీ ఎంతో ఆసక్తితో చదువుకుంటుండేవారము. జాషువా కవిత్వం తెలుగు ప్రజలను రంజింపజేసినంతగా చాలా తక్కువమంది కవిత్వం రంజింపజేసినదని చెప్పవలెను. జాషువాశైలి ప్రత్యేకమైనది. తెలుగు పదాల పొందిక, సొంపు ఆయన కవిత్వంయొక్క ప్రత్యేకత. అందుకొరకే ఆబాలగోపాలం ఆయన కవిత్వాన్ని చదివి ఆనందించేది.

ఆ రోజులలో నెల్లుట్ల రామకృష్ణామాత్యుడు అనే యువకవి వరంగల్‌లో ఉండేవారు. ఆయనకు అత్యంతమైన నియోగి కులాభిమానం. సిరిసంపదలుగల కుటుంబం ఆయనది.

"ఎవడురా మా అమాత్యుల నీసడించి
కలము నడిపెడి మొనగాడు తెలుగునేల" – అనీ
"ఆంధ్రభారతి మాయింటి ఆడుబిడ్డ"

అని వ్రాసి గర్విస్తుండేవాడు. ఆయనకు జాషువా కవిత్వంపైన అపరిమితమైన అభిమానం. "సూరబాల" అనే కావ్యం వ్రాసి జాషువా కవిగారికి వేయిన్నూట పదహారు రూపాయలు సమర్పించి, తన కావ్యాన్ని అంకితం చేసినాడు. ఆ రోజుల్లో జాషువాగారికి తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారికి మధ్య యేవో మనస్పర్ధలు ఉండేవి. తుమ్మల సీతారామమూర్తిచౌదరి జాషువాగారి స్వప్న కథ కావ్యంపైన విమర్శ "స్వప్నకథ ఔచిత్య విచారం" అనే పేరుతో వ్రాయగా రామకృష్ణామాత్యుడు "స్వప్నకథ ఔచిత్య విచార పరామర్శ" అని సమాధానం వ్రాసి గ్రంథ రూపకంగా ప్రకటించినాడు. ఆయన "భావార్ణవం" మొదలైన మరికొన్ని కావ్యాలు కూడా వ్రాసినారు, తరువాత కొంతకాలానికి తుమ్మలవారికి కూడా ఆయన ఆప్తులైనారు.

జాషువాగారితోను, తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారితోను నాకు జాబులద్వారా నెల్లుట్ల రామకృష్ణామాత్యుని ద్వారానే 1941 నుండి పరిచయం. అయితే ఆ ఉభయులకు నేను చివరివరకు సన్నిహితుడుగా ఉన్నాను. జాషువా గారికి నాపైన ఆదరాభిమానాలు ఉండేవి. హైదరాబాదుకు వచ్చిన ప్రతిపర్యాయం స్వయంగా వచ్చి నన్ను కలుసుకునేవారు. సీతారామమూర్తిగారు నాటి నుండి నేటివరకు నాకు పరమ ఆప్తులు. 1945–46 ప్రాంతంలో నన్ను చూడవలెననే కుతూహలం వారికి ఉండేది. ఒక పర్యాయం విజయవాడ రేడియో స్టేషన్‌లో యేదో ప్రసంగం చేయడానికి వెళ్ళినప్పుడు వారికి నారాక సంగతి తెలిసి రేడియో స్టేషన్‌ముందు నా కొరకు యెదురుచూస్తూ కూర్చుండిరి. అప్పుడువారు అప్పికట్లలో ఉండేవారు. మరునాడు నన్ను అప్పికట్లకు తీసుకొనివెళ్ళి ఆతిథ్య మిచ్చినారు. ఒకరోజు పూర్తిగా వారితో గడిపిన సదవకాశం నాకు లభించినది. జాషువాగారు, తుమ్మల సీతారామమూర్తిగారు ఉభయులు అమృత హృదయులు. వారి పరస్పర సంబంధాలు యెట్లున్నప్పటికిని మిత్రులపట్ల, అభిమానులపట్ల వారు ఎంతో ఆదరము కనపరచేవారు. వారి కవిత్వమువలె వారి సహవాసము కూడా మధురమైనది. రసార్ద్రమైనది.

ఆ రోజుల్లో హైదరాబాదులో ఏ ముఖ్యమైన సాహిత్యసభ జరిగినప్పటికిని అధ్యక్షులు ప్రతాపరెడ్డిగారు. అందుకు కారణం ఆయన బహుగ్రంథావలోకనం; వైదుష్యం; గోలకొండ పత్రిక సంపాదకత్వం; సాహిత్య రంగంలో సమున్నతమైన స్థానం. ప్రతాపరెడ్డిగారికి ఒక అలవాటు ఉండేది. అదే సకాలంలో సభను ప్రారంభించవలెననే పట్టుదల; సరిగ్గా సభ జరిగే కాలానికి కొన్ని నిముషాల ముందు వచ్చి ఉపన్యాసకులు, సమావేశకర్తలు వచ్చినా రాకపోయినా నిర్ణయించిన సమయానికి స్వయంగా వెళ్లి అధ్యక్షస్థానంలో కూర్చొని సభను ప్రారంభించేవారు. మాడపాటి హనుమంతరావుగారికి కూడా యీ పట్టుదల ఉండేది. అయితే ఆయన యింత కఠినంగా వ్యవహరించేవారుకారు. బూర్గుల రామకృష్ణారావుగారికి సభకు ఆలస్యంగా వచ్చే అలవాటు ఉండేది. ఆయనకూడ ప్రతాపరెడ్డిగారివలెనే ఏ సాహిత్య సభకైనా అధ్యక్షత వహించగల సమర్థుడు, విజ్ఞాని. సాహిత్య రంగంలో, రాజకీయరంగంలో ఆయన మేటిగా ఉండేవారు. ఆంధ్రమహాసభలో ముఖ్యమైన తీర్మానాలన్నీ ఆయనే ప్రతిపాదించేవారు. సర్వతోముఖ విజ్ఞానంతో పాటు వాదనా నైపుణ్యం, సమయస్ఫూర్తి రామకృష్ణారావుగారి ప్రత్యేకతలు. తణికెళ్ళ వీరభద్రుడుగారు హైదరాబాదులో ఏ సభ జరిగినా అధ్యక్షతకు ఆహ్వానింపబడే ముఖ్యులు. రామకృష్ణారావుగారు, వీరభద్రుడుగారు ఉభయులు. ఆకారంలో వామనులైనప్పటికి ఉపన్యాస కౌశలంలో త్రివిక్రములు.

పూర్వపు హైదరాబాదు రాష్ట్ర విశిష్ట సంస్కృతి ప్రత్యేకతలలో బహు భాషా వైద్యుష్యము ముఖ్యమైనది. ఆంధ్ర మహారాష్ట్ర కర్ణాటకుల సమష్టి కుటుంబము నాటి హైదరాబాదు. ఉర్దూ, ఫారసీ భాషల ప్రభావం ప్రముఖంగా కనిపించేది. ఆనాటి బహుభాషా పండితులలో గుండేరావు హర్కారేగారిని ప్రత్యేకంగా పేర్కొనవలెను. మహారాష్ట్రము, కన్నడము, తెలుగు, అరబ్బీ, ఫారసీ, ఉర్దూ, ఇంగ్లీషుభాషలలో ఆయన పండితులు; న్యాయ, తర్క, వేదాంత, మీమాంస సాహిత్యాలలో ఆయన ప్రవీణులు. అఖిలభారత ఓరియంటల్ కాన్ఫరెన్స్ సమావేశంలో అనేక విషయాలమీద పరిశోధనాత్మకమైన ప్రసంగాలు చేసి ఆయన యావద్భారత కీర్తిగాంచినారు. విద్వాంసుడిగా ఆయనను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించినవి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఆయనకు విశిష్ట సభ్యత్వము యిచ్చినది – ఆయన వైదుష్యం అంతా స్వయం కృషిచేత సంపాదించినది.

ఆయన చేసిన అనువాదాలు, స్వతంత్ర రచనలు అసంఖ్యాకములు. సంస్కృతభాషలో వ్యాకరణం నేర్చుకోవడానికి ఆయన ఒక యంత్రాన్ని సిద్ధము చేసినారు. ఆ యంత్రము అనేకమంది విద్వాంసుల ప్రశంసలు పొందినది. తొంబై సంవత్సరాలు పైగా జీవించినారు. ఆయనతో సమానులైన అగ్రశ్రేణికి చెందిన పండితులు మనదేశంలో మిక్కిలి కొద్దిమంది. గుండేరావుగారికి నాపైన అభిమానం నిండుగా ఉండేది. నన్ను ఆత్మీయునిగా భావించుకునేవారు.

స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం జరుగుతున్న రోజుల్లో హైదరాబాదు నుండి కొంతమంది విద్యార్థికులైన యువకులు విజయవాడవెళ్ళి అక్కడినుండి ఒకవార పత్రిక నడుపుతుండేవారు. ఆ పత్రిక "ఆంధ్రవాణి" అని నా జ్ఞాపకం. హైదరాబాదులో పత్రికా స్వాతంత్ర్యంపైన ఉన్న నిర్బంధాల కారణంగా ఆ పత్రికకు విజయవాడ కేంద్రస్థానమైనది. మాడపాటి రామచంద్రరావుగారు, బి.ఎన్.శర్మగారు యీ పత్రికను నిర్వహించినవారిలో ముఖ్యులు. మాడపాటి రామచంద్రరావుగారు బి.ఏ; బిఎల్ పట్టభద్రులు. ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగు భాషలలో ప్రవీణులు. రచనా నైపుణ్యం, ప్రసంగ కౌశలం రెండూ వారికి ఉండేవి. వృత్తిలో ఎక్కువకాలం ఆయన కొనసాగలేదు. సినిమా ప్రపంచంతో కూడా ఆయనకు సంబంధము ఉండేది. ఆంధ్ర జిల్లాలకు ఆయన సుపరిచితుడు. స్టేట్ కాంగ్రెస్ ఉద్యమంలో ఆయన స్వామి రామానందతీర్థ అనుయాయి. పోలీసు చర్యకు కొంతముందు, తరువాత కూడ ఆయన కొన్ని సంవత్సరాలు స్టేట్ కాంగ్రెస్ కార్యదర్శిగా ఉండేవారు. బి.ఎన్.శర్మగారు మంచి పత్రికా రచయిత, గోలకొండలో గొంతకాలం ప్రతాపరెడ్డిగారికి సహాయ సంపాదకులుగా ఉండేవారు. పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రాన్ని గురించి పుస్తకం వ్రాసినారు. స్టేట్ కాంగ్రెస్ ఉద్యమం ఆపివేసిన తరువాత యీ పత్రికకూడ ఆగిపోయినది. నాటి హైదరాబాదు రాష్ట్రంలో తెలుగు పత్రికల చరిత్ర ఉత్సాహకరంగా ఉండేది కాదు. ఒక్క గోలకొండ తప్ప ఏ పత్రికైనా ఎక్కువకాలం నడుపలేదు. పరిస్థితులు పత్రికా నిర్వహణకు అనుకూలంగా ఉండేవికావు. గోలకొండలో యువ రచయితలు అనేకులకు ప్రోత్సాహం లభించేది. గోలకొండ పత్రికపక్షాన కొన్ని సంవత్సరాది సంచికలు కూడా వెలువడినవి. ఆ సంవత్సరాది సంచికలకు సంపాదకులుగా యితరులను కూడా ఆహ్వానించేవారు. ఆదిరాజు వీరభద్రరావు గారు యిటువంటి ఆహ్వానితులలో ముఖ్యుడు.

తెలంగాణ వైతాళికులలో ఆదిరాజు వీరభద్రరావుగారిని ప్రత్యేకంగా చెప్పుకొనవలెను. ఆయన తొలిదశలో కొమర్రాజు లక్ష్మణరావుగారి చేతిక్రింద ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ నిర్మాణంలో పనిచేసినారు. అందుచేత బహుముఖ విజ్ఞానం, చరిత్ర పరిశోధనలో ఆయన సిద్ధహస్తుడు. తరువాత ఆయన చాదర్‌ఘాట్ హైస్కూలులో తెలుగు పండితులుగా పనిచేసినాడు. కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయానికి అనేక సంవత్సరాలు కార్యదర్శిగా ఉండి దాని అభివృద్ధికి కారణభూతులలో ముఖ్యులు. హైదరాబాదు నగరంలోను తెలంగాణలోను జరిగిన సాహిత్యకృషికి, సంస్కృతీ వికాసానికి ఆదిరాజు వీరభద్రరావుగారి దోహదం గొప్పది. పోలీసు చర్య తరువాత ఖండవల్లి లక్ష్మీరంజనంగారు సిద్ధం చేసిన సంగ్రహ విజ్ఞానకోశానికి వీరభద్రరావుగారు మూలస్తంభంగా నిలిచిరి. లక్ష్మణరాయ పరిశోధకమండలి కార్యదర్శిగా కొన్ని నూర్ల శాసనాలను ఆయన సేకరించి భద్రపరిచినారు. తమ జీవితాన్ని పూర్తిగా ఆంధ్రభాషావ్యాసంగానికి అంకితము చేసిన మహనీయుడు ఆదిరాజు వీరభద్రరావుగారు. మాడపాటి హనుమంతరావుగారి షష్టిపూర్తి సంచికకు ఆయన ప్రధాన సంపాదకులుగా ఉండి సంచికను సర్వోత్తమంగా ప్రకటించినారు.

ఈ శతాబ్దంలో జరిగిన ఒక సంఘటన జ్ఞాపకం వస్తున్నది. తెలంగాణము విడిగా ఉండినందువలన ఆంధ్ర జిల్లాలవారికి యిక్కడి పరిస్థితులు సరిగా తెలియక పోయేవి. తెలంగాణములో తెలుగు భాషలేదు. తెలుగు రచయితలు లేరు; తెలుగు పండితులు లేరు, అని కొందరు ఆంధ్ర మహాశయులు ఎక్కడో ఏవో ఆరోపణలు చేయగా ప్రతాపరెడ్డిగారికి కోపమువచ్చి గోలకొండ కవుల సంచికను ప్రకటించినారు. ఇందులో తెలంగాణంలోని పూర్వకవులనుగూర్చి పరిచయం చేస్తూ నాలుగునూర్లపైగా సమకాలిక కవిపండితుల రచనలు చేర్చి తెలంగాణ రచయితలను పరిచయం గావించినారు. శేషాద్రి రమణకవులలో ఒకర్తె, తెలంగాణ గ్రామాలన్నీ తిరిగి యిక్కడి పూర్వ, ఆధునిక సాహిత్యాలను పూర్తిగా గుర్తించిన పండితులు దూపాటి వెంకటరమణా చార్యులవారు; ఆయన ప్రతాపరెడ్డిగారికి యీసందర్భంలో పద్యరూపకమైన ఒక సందేశాన్ని పంపిరి. అందులో ఒక పద్యం

"గోలకొండకవుల కుసుమముల్ సమకూర్చి
దండగుచ్చె మా ప్రతాపరెడ్డి
అందుతావులీను అలరు సమర్పింప
బడయమైతి మకట భాగ్యరేఖ"

ఇందులో ఆచార్యులవారికి తాము తెలంగాణవాసిని కాకపోతినే అని ఆవేదన ఉన్నట్లు స్పష్టమౌతున్నది. ఆరోజులలో తెలంగాణకు చాలా సన్నిహితంగా వచ్చిన కవి పండితులలో ఆచార్యులవారు ప్రముఖులు–

ప్రతాపరెడ్డిగారు చూడటానికి కొట్టవచ్చినట్లున్నప్పటికి హృదయం ప్రేమార్ద్రంగా ఉండేది. ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతుండేవాడు. చాలావేగంగా చదివేవారు సొంత గ్రంథాలయం నుండి పుస్తకాలు ఎవరికీ యిచ్చేవారుకాదు. అయినప్పటికి యిష్టులైన వారిపట్ల యీ నియమం వర్తించేదికాదు. పుస్తకాలు యెవ్వరికీ యీయబడవని వ్రాసి నావంటి వారికి యేపుస్తకమైనా యిచ్చేవారు. యువరచయితలను ఆయన ప్రత్యేకంగా అభిమానించేవారు. పెద్దల సహవాసంలో కన్న పిన్నల సహవాసంలో ఆయన సంతోషంగా కాలక్షేపం చేసేవారు. 1939లో నా నిజాం కళాశాల విద్యార్థిదశ ముగిసినది. తరువాత హైదరాబాదుకు తరుచుగా వస్తుండే వాడిని. వచ్చినప్పుడల్లా ఆయనను సందర్శించి కొన్ని గంటల సేపు ఆయనతో గడిపే వాణ్ణి. పగలు రెండు గంటలకు వెళ్ళితే మూడుగంటలసేపు సాహిత్య వ్యాసంగం తరువాత హెూటల్‌కు వెళ్ళి కాఫీపానం, ఆ పిమ్మట ఏదైనా సినెమాచూడటం యీ విధంగా గడిచేది, నాకు ఆయన శుకసప్తతి, క్రీడాభిరామం మొదలైన కావ్యాలను చదివి వినిపించినారు. యువకులను తెలుగు సాహిత్యంవైపు అభిముఖులను చేయవలెననే ఉద్దేశంతో ఆయన యీవిధంగా ప్రోత్సహించేవారు. 1940వ ప్రాంతంలో ఆయనతో ఏర్పడిన సన్నిహితత్వం తుదివరకు ఉండినది. ఒక్కమారు మనసిచ్చినారంటే చిరకాలం ఆ ఆప్యాయత నిలిచేది. హైదరాబాదులోని నాకార్యకలాపాలను అన్నింటిని ఆయన సమర్థించినారు. విషాదకరమైన విషయము యేమనగా 1952లో ఆయన వనపర్తి నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైనారు. కాని ఆయన యోగ్యతకు తగిన పదవి ఏది లభించలేదు. ఆయన మంచి తనాన్ని, నిష్కపట స్వభావాన్ని స్మరించినప్పుడు యిందులో ఆశ్చర్యమేమీలేదు. 1954వ సంవత్సరము బహుశా ఆగస్టు నెలలో అనుకుంటాను ఒకరోజు ఉదయం 8.00 గంటల ప్రాంతంలో నేను ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యాలయంలో కూర్చొని ఉండగా స్వగ్రామమైన అలంపూర్‌కు వెళ్ళి వస్తానని చెప్పి రైల్‌స్టేషన్‌కు పోయినారు. అదియే ఆయనతో కడసారి కలయిక, నాలుగురోజులలో ఆయన పరలోక గతుడైనాడన్న వార్త పిడుగువలె మీదపడినది ఇంకా ఎన్నో ఏండ్లు దేశానికి, భాషకు అభ్యుదయం కలిగించవలసిన

ప్రతాపరెడ్డి అస్తమించినాడు. ఆంధ్ర వాఙ్మయానికి తీరనిలోటు కలిగినది. ఆయన గోలకొండ పత్రికతో సంబంధం వదులుకున్న తర్వాత కూడా, మాయిద్దరి వయస్సులో ఎంతో వ్యత్యాసమున్నప్పటికి నన్ను తన ఆప్త స్నేహితునివలె చూచేవాడు. 1951లో కాబోలు ఆయన ప్రారంభించిన మరొక దినపత్రిక "ప్రజావాణి". ప్రజావాణి డైరెక్టర్ల బోర్డులో కూడా నన్ను తీసుకున్నారు. ప్రజావాణి కొద్దికాలమే నడిచి ఆగినది. లిమిటెడ్ కంపెనీని రద్దు చేసే తుది సమావేశానికి కూడ నన్ను వెంబడి తీసుకొని వెళ్లినారు. నాలో ఆయన పరిపూర్ణమైన విశ్వాసాన్ని ప్రకటించినారు. అదేమి ఆత్మీయతయో!

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సు కోభవతి యత్సుఖతోపి జంతుః
తచ్చేత సా స్మరతి నూన మబోధ పూర్వమ్
భావస్థిరాణి జననాంతర సౌ హృదాని" (శాకుంతలమ్)

1942-43లో మాడపాటి హనుమంతరావుగారికి షష్టిపూర్తి జరిగినది. వారికి ఆప్తమిత్రుడైన కొండా వెంకట రంగారెడ్డిగారు ఈ షష్టిపూర్తిని నిర్వహించిన వారిలో ముఖ్యులు. తెలంగాణంలోని సమస్త జాతీయోద్యమాలకు, సర్వ సాంస్కృతికోద్యమాలకు వెన్నెముక మాడపాటి హనుమంతరావుగారు. ఆనాటి నాయకులూ, కార్యకర్తలు అందరూ వారి అడుగుజాడలలో నడిచినవారే. భారతదేశానికి గోపాలకృష్ణ గోఖలే ఎటువంటివాడో నాటి తెలంగాణకు మాడపాటి హనుమంతరావుగారు అటువంటి వారని చెప్పవచ్చును. ఆదిరాజు వీరభద్ర రావుగారు వారికి ప్రియమిత్రులుగా ఉండేవారు. కొండా వెంకట రంగారెడ్డిగారి మీద వారికి ప్రత్యేకమైన అభిమానం ఉండేది. ఒకానొక సభలో రంగారెడ్డిగారు మాట్లాడుతూ తెలంగాణం మాడపాటి హనుమంతరావుగారికి ఎంతో రుణపడి ఉన్నది; ఈ రుణాన్ని చెల్లించడానికి నేను మూడు పథకాలు ఆలోచించాను అన్నారు. అందులో "మొదటిది షష్టిపూర్తి, రెండవది పోలీసు చర్య తరువాత హైదరాబాదు నగరానికి తొలి మేయర్ పదవి; ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తరువాత శాసనమండలి తొలి అధ్యక్ష పదవి" రంగారెడ్డిగారి కృషి వలన ఈ మూడు గౌరవాలు హనుమంతరావుగారికి లభ్యమైనవి. పబ్లిక్ సంస్థలలో డబ్బు సద్వినియోగము, లెక్కలు సరిగా ఉంచే క్రమశిక్షణ హనుమంతరావుగారు పట్టుదలగా పాటించేవారు. అప్పుడప్పుడు కఠినంగా కూడా వ్యవహరించేవారు. అందుకే ఆయన పట్టినదల్ల బంగారమైనది. నారాయణగూడెం ఆంధ్ర బాలికా పాఠశాల, రాజబహద్దూర్

మహిళా కళాశాల, కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం మొదలైన అనేక సంస్థలు ఆయన చేతిచలువవలన, డబ్బు వ్యవహారాలలో ఆయన పాటించిన క్రమశిక్షణవలన అభివృద్ధి పొందినవి. రాజబహద్దూర్ వెంకటరామారెడ్డిగారికి హనుమంతరావుగారి మీద గౌరవభావం ఉండేది.

షష్టిపూర్తి సందర్భంలో హనుమంతరావుగారికి అప్పటి ఉస్మానియా రూపాయి నాణెములతో తులాభారము జరిగినది. అందువలన ఏడువేల రూపాయల పైచిలుకు వచ్చినది. కాని ఆడబ్బును వారు సొంతానికి వినియోగించుకోలేదు. దానిని పోలీసుచర్య జరిగేవరకు బ్యాంకులోపెట్టి పోలీసు చర్య తరువాత" ఆంధ్ర చంద్రికా గ్రంథమాల" అనే ఒక గ్రంథమాలను స్థాపించి దాని పక్షాన యీ సొమ్ముతో కొన్ని పుస్తకాలు ప్రకటించి, వానిని విక్రయించి ఆ డబ్బును ఇరువైవేలకు పైగా పెంచినారు. ఆ మొత్తం డబ్బును రాజబహద్దూర్ వెంకట్ రామారెడ్డి మహిళా కళాశాలను స్థాపించిన సందర్భంలో దానికి విరాళంగా యిచ్చిరి. ప్రజల ధనాన్ని సద్వినియోగం చేసే క్రమశిక్షణలో హనుమంతరావుగారి పట్టుదలకు యిదొక నిదర్శనము మాత్రమే.

ఆరోజుల్లో హైదరాబాదు నగరంలో యువకులు నిర్వహించే సాహిత్య సంస్థలు కొన్ని ఉండేవి. అళ్వారుస్వామి ప్రభృతులు గ్రంథాలయాలు నడిపేవారు. నూతన ప్రక్రియలకు సంబంధించిన పుస్తకాలను, కొన్ని తమవి, మరికొన్ని యితరులవి ప్రకటిస్తూ సాహిత్య కార్యకలాపాలను నిర్వహిస్తుండేవారు. దేశోద్ధారక గ్రంథమాల, అణాగ్రంథమాల, ఆంధ్రకేసరి గ్రంథమాల మొదలైనవి విజ్ఞానదాయకమైన గ్రంథాలను ప్రకటించినవి. వైతాళిక సమితి అనే సాహిత్య సంస్థ నూతన పద్ధతిలో రచనలు చేసేవారికి కూడలిగా ఉండేది. ప్రతినెలా ఒక సారస్వత సమావేశం కొంతకాలం జరుగుతుండేది. సాధనసమితి యువ కవులకు, కథకులకు, రచయితలకు వేదికగా ఉండేది. సాధన సమితి పక్షాన ఖండకావ్యాలు, కథానికలు, సాహిత్య విమర్శలు ప్రకటితమైనవి. బూర్గుల రంగనాధరావు, భాగి నారాయణమూర్తి, నెల్లూరి కేశవస్వామి మొదలైనవారు సాధన సమితిని నడుపుతుండేవారు. ఆరోజులలో కథానికలు వ్రాసేవారిలో నందగిరి వెంకటరావు, నందగిరి ఇందిరాదేవి, భాస్కరభట్ల కృష్ణారావు ముఖ్యులు. భాస్కరభట్ల యిప్పుడు కీర్తిశేషులు. నందగిరి దంపతులు కలాన్ని క్రిందికి దింపి విశ్రాంతి తీసుకుంటున్నారు. నల్లగొండ జిల్లా చండూరులో "సాహితీమేఖల" చాలా చురుకుగా పనిచేసిన సంస్థ. ఎక్కువగా కవులే యీ సంస్థలో సభ్యులు. బాపట్ల

సమీపంలో ఒక గ్రామ వాస్తవ్యులైన అంబడిపూడి వెంకటరత్నంగారు చండూరుకు వచ్చి అక్కడ చాలామంది యువకులను కవితావ్యాసంగంవైపుకు ఆకర్షించినారు. వెంకటరత్నంగారు బి.ఏ. పట్టభద్రులు. కవులు, పండితులు. వేలూరి శివరామశాస్త్రిగారి శిష్యులు. రాయప్రోలు సుబ్బారావుగారు మొదలైన అభినవ ఆంధ్రకవుల రచనలను చక్కగా పఠించినవారు; వత్సలుడు, వనవాటి, చంద్రశాల మొదలైన కావ్యాలను రచించిన కవులు. వీరిచే ప్రబోధితులైన కవులలో పులిజాల హనుమంతరావు, ధవళా శ్రీనివాసరావు, పులిజాల గోపాలరావు, సిరిప్రగ్గడ భార్గవరావు, సిరిప్రగ్గడ రాధాకృష్ణారావు, మద్దోజు సత్యనారాయణ మొదలైన వారు ఉండేవారు. వీరంతా ఉత్సాహశీలురైన యువకులు; ఆంధ్ర సాహిత్యాన్ని బాగా ఆకళించుకున్నవారు; చక్కనిశైలిలో కవితలు వ్రాసేవారు. సాహితీమేఖల దశమవార్షికోత్సవం 1945 ప్రాంతంలో చండూరులో జరిగినది. సభ చాలాగొప్పగా జరిగినది. తెలంగాణలోని వివిధ ప్రాంతాలనుండి కవులు, పండితులు వచ్చినారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతిపరెడ్డిగార్లు యీ సభలో పాల్గొన్నారు. యువకుడైన నన్ను యీ సభకు అధ్యక్షునిగా ఆహ్వానించారు. రెండు రోజులపాటు జరిగిన యీ సభలో వానమామలై వరదాచార్యులవారు పాల్గొని తమ పోతన కావ్యమును తొలిసారిగా శ్రావ్యంగా వినిపించినారు. సాయంకాలం 6.00 గంటల నుండి రాత్రి 10.00 గంటల వరకు వారి కావ్యగానం సాగినది. వేయికిపైగా పాల్గొన్న సభ్యులు నిశ్శబ్దంగా కావ్య రసాస్వాదన చేసినారు. వరదాచార్యులవారి గొంతు శ్రావ్యమైనది. వారి కావ్యగానం వీణానాదంవలె ఉంటుంది. నాటికీ నేటికీ వరదాచార్యుల వారి కంఠంలో మార్పులేదు. ఎన్ని ఏండ్లుపైబడినా గొంతులో శ్రావ్యత తగ్గనివారిలో విశ్వనాథ సత్యనారాయణగారిని, వరదాచార్యులవారిని ప్రత్యేకంగా పేర్కొనవలెను. ఎటువంటి సభనైనా రంజింపగల శక్తి వారి ప్రత్యేకత.

1939–49 మధ్యన తెలంగాణంలో జరిగిన ముఖ్యమైన సభలలో సాహితీ మేఖల వార్షికోత్సవాన్ని పేర్కొన్నాను. తెలంగాణకంతటికి ఒక సాహిత్య సంస్థ ఉండవలెనన్న అభిప్రాయం నాటి రచయితలలో, పండితులలో వ్యాపించి బలపడింది. 1943వ సంవత్సరం, మే నెలలో ఆంధ్రసారస్వత పరిషత్తు స్థాపన జరిగినది. దానికి తొలి అధ్యక్షులు లోకనంది శంకర నారాయణరావుగారు, మలి అధ్యక్షులు సురవరం ప్రతాపరెడ్డిగారు, లోకనంది శంకరనారాయణరావుగారు అర్థశాస్త్రంలో ఎమ్ఏ, డిగ్రీని

పొందినారు. ఆంధ్ర, ఆంగ్ల సాహిత్యంలోను కూలంకషంగా చదివిన విద్వాంసుడు; మంచివక్త; వచన రచయిత. ఆ రోజులలో వారు సెంట్రల్ బ్యాంకులో ఉద్యోగిగా ఉండేవారు. అన్ని సాహిత్య సభలలో పాల్గొని మాట్లాడేవారు. వారి సతీమణి సత్యవతిగారు సాంఘిక, సాంస్కృతిక సమావేశాలలో పాల్గొంటుండేవారు. హైదరాబాదు నుండి వారి ట్రాన్స్ఫర్ అయిన తర్వాత ప్రతాపరెడ్డిగారు అధ్యక్షులుగా యెన్నికైనారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు మొదటి కార్యదర్శి బిదురు వెంకట శేషయ్యగారు. పోలీసుచర్య జరిగేవరకు వారే ప్రధాన కార్యదర్శిగా ఉండి పరిషత్తును చక్కగా నడిపినారు. సారస్వత పరిషత్తు మొదటి వార్షికోత్సవం వరంగల్‌లో 1944లో మూడు రోజులపాటు జరిగినది. ఉదయరాజు రాజేశ్వరరావుగారు ఆహ్వానసంఘ అధ్యక్షులు; కాళోజి నారాయణరావుగారు ఆహ్వానసంఘ కార్యదర్శిగా సభలు విజయవంతంగా జరిగినవి. వరంగల్ కోటలో కవిసమ్మేళనం కొరకు వేసిన పందిరిని రజాకారులు తగులబెట్టినారు. అయినప్పటికి జంకక దాని ప్రక్కనే కవి సమ్మేళనం నిర్వహించుకోవడం జరిగింది. చాలా చిన్న వయసులో ఉన్న దాశరథిగూడ ఆ కవి సమ్మేళనంలో పాల్గొన్నట్టు జ్ఞాపకం. ఈ సభల సందర్భమున తెలంగాణలోని ప్రాచీన వాఙ్మయాన్ని, ఆధునిక వాఙ్మయాన్ని వివరించే ఒక పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసే బాధ్యత నాకు అప్పగించడం జరిగింది. పుస్తక ప్రదర్శన ప్రారంభించి నన్ను అభినందించినారు. అదే మా తొలి పరిచయం. ఈ సమావేశంలోనే ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యవర్గ సభ్యునిగా చిన్న వయసులో నేను ఎన్నిక అయినాను. నాటి నుండి నేటికి యీ బంధము దినదినము దృఢతరమై అవినాభావ సంబంధముగా పరిణమించినది.

ఆ కాలంలో వరంగల్ శబ్దాను శాసన గ్రంథాలయానికి నేను కార్యదర్శిగా ఉండేవాడిని. ఈ గ్రంథాలయం లక్ష్మణరావుగారు స్థాపించిన గ్రంథాలయాల వరుసలోనే స్థాపితమై 25 సంవత్సరాలు పూర్తి చేసినది. అందుచేత 1944వ సంవత్సరంలో దీని రజతోత్సవ సభలు జరిపే అవకాశం నాకు లభించినది. నేను కోరగానే యీ సభలకు అధ్యక్షులుగా వచ్చిన రాయప్రోలు సుబ్బారావుగారు రెండు రోజులు వరంగల్‌లో ఉండి మా అందరిని ప్రోత్సహించిరి. సభలను గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు ప్రారంభించిరి. శివశంకర స్వామిగారు, వేదాల తిరు వెంగళాచార్యులగారు, జమ్మలమడక మాధవరామ శర్మగారు యీ సభలలో పాల్గొనినందువలన యీ సభలు యావదాంధ్ర సభలుగా జరిగినవి.

శివశంకరస్వామిగారితో నా తొలి పరిచయం అప్పుడే ఏర్పడినది. ఆ పరిచయం క్రమక్రమంగా అభివృద్ధి పొంది సన్నిహితత్వంగా మారి వారి చివరి దశ వరకు ఉండినది. నన్ను వారు తమ ఆప్తునిగా భావించేవారు. పోలీసు చర్య తరువాత హైదరాబాదు వస్తే సారస్వత పరిషత్తు కార్యాలయంలోనే ఉండేవారు. సారస్వత పరిషత్తుతో వారికి ఒక ఆత్మీయత ఏర్పడినది. వారిద్వార నాకు అనేకమంది కవిపండితులతో పరిచయం ఏర్పడినది. విశ్వనాథ సత్యనారాయణగారి తరువాత వారు ఒక అయిదు సంవత్సరాలపాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఉపాధ్యక్షులుగా ఉండిరి. శివశంకరస్వామిగారు తమ జాతక కథల సంపుటిలో ఒకదానిని నాకు అంకితమిచ్చి నన్ను ధన్యుని చేసిరి. వారి వాత్సల్యం మరువరానిది. ఎన్నో రోజులు, ఎన్నో గంటలు వారితో గడిపే అవకాశం నాకు లభించినది. బహు భాషావేత్తలైన శివశంకరస్వామిగారికి సాహిత్యమును గూర్చి తెలియని అంశము ఏమీలేదు. ఆయన ప్రోత్సాహంతో కవులుగా, రచయితలుగా పేరు పొందినవారు అనేకులు. ఇంతమందిని యీ విధంగా ప్రోత్సహించినవారు తెలుగు దేశంలో మరొకరులేరని చెప్పితే అతిశయోక్తికారు. వేదాల తిరువెంగళాచార్యులవారు సంస్కృతాంధ్రాలలో మహాపండితులు. తర్కము, వ్యాకరణము, అలంకారము, వేదాంతము అన్నీ వారికి కరతలామలకాలు. వారు సంస్కృతాంధ్ర భాషా సముద్రాలను అపోశనము పెట్టిన అగస్త్యులు; ప్రతివాది భయంకరులు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి పక్షాన భాగవతం ప్రామాణికంగా ప్రకటించినప్పుడు సంపాదక సంఘానికి వారు యిచ్చిన సహకారం అమూల్యమైనది. వారు రచించిన "ధ్వన్యాలోకం" తెలుగు అలంకార శాస్త్ర గ్రంథాలలో అద్వితీయమైనది. వారు తెనిగించిన "రసగంగాధరం" ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి పక్షాన ప్రకటితమైనది. శ్రీ ఆచార్యులవారి స్థాయిని అందుకోగలిగిన పండితుల సంఖ్య చాలా తక్కువ. జమ్మలమడక మాధవరామశర్మగారు అప్పుడు యువకులు. తాతా సుబ్బారాయశాస్త్రిగారి ప్రియశిష్యులు. అలంకార శాస్త్రంలో గొప్ప పండితులు. అనర్గళంగా సంస్కృతాంధ్రాలలో మాట్లాడగలిగిన శక్తిమంతులు. అనేక గ్రంథాలు వ్రాసిన విద్వాంసులు, ఆనాటి వరంగల్ సభలో వారు సుమారు ఒక గంటసేపు సంస్కృత భాషలో ఉపన్యసించి సభికులనేకాక సభకు నలువైపుల రాకపోకలు చేస్తున్న జనాన్ని ఆకర్షించి ఉపన్యాసం జరుగుతున్నంత సేపు అందరిని నిశ్చేష్టులను గావించినారు.

ఆరోజులలో 1944-46 సంవత్సరాల మధ్య అనుకుంటాను నల్లగొండలో ఉత్సాహవంతులైన రచయితలు ఉద్యోగరీత్యా ఉండేవారు. బూర్గుల రంగనాథరావు వెల్దుర్తి మాణిక్యరావు, వి.పి.రాఘవాచారి, ధరణికోట శ్రీనివాసులు యీ ఉద్యోగులలో ముఖ్యులు. స్థానికులు, న్యాయవాదులు కంచినపల్లి చినవెంకట రామారావుగారు వీరికితోడుగా ఉండేవారు. కంచినపల్లి చినవెంకటరామారావు గారు, కవీ, కథానిక రచయిత, అభ్యుదయ భావాలు కలిగిన సాహితీపరుడు. రాజకీయ రంగంలో తీవ్రవాది. 1952లో జరిగిన ఎన్నికలలో కమ్యూనిష్టు పార్టీ ప్రతినిధిగా శాసనసభకు యెన్నికయై అయిదు సంవత్సరాలు ఉండినారు. ఆయన మంచివక్త, రచయిత నల్లగొండ కవి సమ్మేళనాలలోను, సాహితీమేఖల దశమవార్షికోత్సవాలలోను పాల్గొని తమ రచనలను చదివి వినిపించినారు. తెలంగాణ ప్రజల యిక్కట్లు ఆయన కథలలో చిత్రిత మయ్యేవి. ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఆయనకు ఆది నుంచి సంబంధము. వీరందరు ప్రతినెలా కవిసమ్మేళనాలు రచయితల సభలు జరిపి నల్లగొండ ప్రాంతంలో మంచి సాహిత్య వాతావరణాన్ని సృజించిరి. ధరణికోట శ్రీనివాసులుగారు చిన్నవయసులో కీర్తిశేషులైనారు. మునిమాణిక్యం నరసింహారావుగారి కాంతం ధోరణిలో మంచికథలను కొన్నింటిని వ్రాసినారు. నల్లగొండ మిత్రులు 'తొలిసంజ' అనే పేరుతో ఒక ఖండకావ్య సంపుటిని ప్రచురించి నాతో పీఠిక వ్రాయించినారు. అప్పుడప్పుడు నల్లగొండకు వెళ్ళే అవకాశం నాకు లభిస్తుండేది. వీరందరితో సాహిత్య పరమైన మైత్రి నాకు ఉండేది. ఆరోజులు ఎంతో హాయిగా గడిచినవి. ఉన్నత ఆదర్శానికి, భాషాభిమానానికి, దేశాభిమానానికి విలువగల రోజులవి. మళ్ళీ అటువంటి రోజులను చూడగలమా?

మిత్రుల ప్రోద్బలంతో, ప్రోత్సాహంతో నా స్వగ్రామమైన వరంగల్ నుండి 1946వ ప్రాంతంలో "శోభ" అనే సాహిత్య మాస పత్రికను ప్రారంభించి కొంత కాలం నడిపే అవకాశము నాకు లభించినది. అప్పటి పరిస్థితులలో సుమారు ఒక సంవత్సరం నడిచి ఆగిపోయిన శోభ తిరిగి 1950 ప్రాంతంలో గోలకొండ ప్రచురణల పక్షాన మరొక సంవత్సరం నడిచి ఆగిపోయినది. తెలంగాణలో సాహిత్య పత్రికలు ఏవీలేనిలోటు తీర్చవలెననే ఉద్దేశంతో శోభను ప్రారంభించడం జరిగింది. "శోభ"కు మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి ప్రభృతులైన పెద్దలతోపాటు నల్లగొండ మిత్రుల తోడ్పాటు లభించినది. కాళోజి నారాయణరావు, పొట్లపల్లి

రామారావు మొదలైన మిత్రులు నాకు అండగా నిలిచిరి. కాళోజి నారాయణరావు హైస్కూలులో నా సహాధ్యాయి – ఆంధ్రోద్యమం స్టేట్ కాంగ్రెస్ ఉద్యమం మొదలైన అన్ని జాతీయోద్యమాలలో పాల్గొన్న స్వాతంత్ర యోధుడు. దేశం కొరకు త్యాగం చేయవలసి వచ్చినప్పుడు అరనిముషము కూడ ఆలోచించే వ్యక్తి కాదు. కల్లకపటము తెలియని నిజాయితీ పరుడు. ప్రస్తుతము పూర్తి సమయాన్ని కవితావ్యాసాంగానికి వినియోగిస్తున్నాడు.

"అవనిపై జరిగేటి అవకతవకలు జూచి
ఎందుకో నా మదిని యిన్ని ఆవేదనలు

....

తప్పుదిద్దగలేను, దారిజూపగాలేను
తప్పుచేసినవాని దండింపగాలేను
కష్టపడు వారలను కాపాడగాలేను
ఎందుకో నా మదిని యిన్ని ఆవేదనలు"

అని ఆయన అన్నమాటలు ఆయన వ్యక్తిత్వానికి ప్రతిబింబాలు. పొట్లపల్లి రామారావు వరంగల్ సమీపంలోని తాటికాయల గ్రామవాస్తవ్యుడు, వృత్తి వ్యవసాయము. చిత్తవృత్తి సర్వదా సాహిత్యమువైపు లగ్నమై ఉంటుంది. నిరాడంబర జీవనానికి, చిత్తశుద్ధికి ఆయన ప్రతిబింబము. చేయితిరిగిన రచయిత. కవిత, కథానిక, వ్యక్తిచిత్రణ మొదలైన అనేక వాఙ్మయ ప్రక్రియలలో ఆయన కలము ఆరితేరినది. ప్రచారము ఒల్లక ప్రశాంతమైన పల్లెటూరి వాతావరణంలో జీవితాన్ని సాహిత్యమునకు అంకితము చేసిన సరసుడు పొట్లపల్లి రామారావు. శోభకు ఆయన యిచ్చిన సహకారము అమూల్యమైనది. శోభ వ్యాసకర్తలలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు మొదలైన వారు కూడా ఉండేవారు. యువకవి దాశరథి తొలిరచనలు 'శోభ'లో ప్రకటితమైనవి. శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి తొలిరచనలు శోభలో ప్రకటిత మైనవి. ఆంధ్రప్రాంత కవిపండితుల రచనలను శివశంకరస్వామిగారు సేకరించి నాకు పంపుతుండేవారు. కాళోజి నారాయణరావు కవితలు; పొట్లపల్లి రామారావు, భాస్కరభట్ల కృష్ణారావు, నందగిరి ఇందిరాదేవి, బూర్గుల రంగనాధరావు, వెల్దుర్తి మాణిక్యరావు ధరణికోట శ్రీనివాసులు, మొదలైన వారి రచనలు శోభలో ప్రకటితమైనవి. సాహితీమేఖల కవులు శోభను తమ రచనలచేత అలంకరించినారు. శోభ ఆంధ్ర తెలంగాణ మధ్య వంతెనగా ఉండేది.

1947లో రెండు దశాబ్దాలకుపైగా అర్ధవారపత్రికగా వెలువడుతున్న గోలకొండ దినపత్రికగా అవతరించింది. నిర్వహణకు ఒక లిమిటెడ్ కంపెనీ ఏర్పడినది. ఆ డైరెక్టర్ల బోర్డుకు శ్రీరాజారామేశ్వర్‌రావు అధ్యక్షులు; శ్రీ నరోత్తమ రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్. ఆనాటి తెలంగాణ ప్రజల రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక అవసరాల దృష్ట్యా ఒక దినపత్రిక వెలువడవలసిన ఆవశ్యకత ఎంతో ఉండినది. అంతకుముందు వెలువడిన దిన పత్రికలు రెండు. మొదటిది 'మీజాన్' పత్రిక. ప్రజలకూ, ప్రజల ఉద్యమాలకు దూరంగా ఉండినది. రెండవది 'తెలంగాణ' పత్రిక ఒకటి రెండు సంవత్సరాలు నడిచి ఆగిపోయినది. అందుచేత దినపత్రిక అవసరం ఎంతో ఉండినది. ఉర్దూలో జాతీయోద్యమాలను బలపరిచిన పత్రిక "రయ్యత్" దాని సంపాదకులు మందుముల నరసింగరావుగారు. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలిపి జాతీయోద్యమాన్ని బలపరిచి అవసరమైనప్పుడు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించడానికి కూడా "రయ్యత్" జంకలేదు. జాతీయోద్యమానికి రయ్యత్ పెట్టని కోటగా ఉండినది. రయ్యత్ ద్వార మందుముల నరసింగరావుగారు దేశానికి చేసిన సేవ గొప్పది. అయితే తెలుగులో కూడ ఒక దినపత్రిక అవసరమైనది. ఆ లోటును గోలకొండ తీర్చినది. రాజరామేశ్వరరావు వనపర్తి సంస్థానాధీశ్వరులు. నిజాం కళాశాలలో అర్థశాస్త్రంలో ఎమ్.ఏ పట్టం తీసుకున్న విద్యావంతులు. భారతదేశ స్వాతంత్రాన్ని కాంక్షించి హైదరాబాదు రాష్ట్రం ఇండియన్ యూనియన్‌లో అంతర్భాగమని భావించి సామ్యవాద భావాలు కలిగిన ఉత్సాహవంతులు. శ్రీ నరోత్తమరెడ్డి ఆయన సహాధ్యాయి ఎమ్.ఏ. పట్టభద్రుడు. భూస్వాముల కుటుంబానికి చెంది ఉదార భావాలు కలిగిన ఉత్సాహవంతుడు. ఈ ఉభయుల కృషితో ప్రతాపరెడ్డిగారి సంపాదకత్వంలో గోలకొండ దినపత్రికగా అవతరించినది. కాని అనారోగ్యం వల్ల ప్రతాపరెడ్డిగారు కొన్ని నెలలు మాత్రమే పనిచేసి స్వగ్రామమైన (అలంపూర్ తాలూకాలోని) ఇటికాలపాడుకు వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు. ఆ సందర్భంలో వరంగల్‌లో ఉన్న నాకు ప్రతాపరెడ్డిగారి వద్ద నుండి ఒక జాబు వచ్చినది. అందులో నన్ను వెంటనే హైదరాబాదుకు రమ్మని ఆహ్వానించినారు. హైదరాబాదుకు వచ్చి నేను వారిని కలుసుకొనగా గోలకొండ పత్రికలో నన్ను చేరమని కోరినారు. మాడపాటి హనుమంతరావుగారి ప్రోద్బలం కూడా ఉన్నదని చెప్పినారు. రాజరామేశ్వర రావు, నరోత్తమరెడ్డిగార్లు నాకు నిజాం కళాశాలలో పరిచితులు. రెండు మూడు

సంవత్సరాలు నాకన్న జూనియర్లుగా ఉండేవారు. నాది నిత్య జీవితానికి లోటులేని భూవసతిగల కుటుంబం. దానిని తోడుగా బి.ఏ.బి.ఎల్, డిగ్రీలు తీసుకొని అప్పటి దేశ పరిస్థితుల దృష్ట్యా వెంటనే న్యాయవాద వృత్తిని అవలంబించవలెనా లేక వేచియుండవలెనా అని ఆలోచించుకుంటున్న రోజులు. ఎందుకనగా వృత్తిలోనున్న న్యాయవాదులు-కోర్టులను బహిష్కరించిన రోజులవి, అందుకు కారణం నిజాం ప్రభుత్వం దమననీతి. అవిచాలా భయంకరమైన రోజులు. సర్‌మిర్జా ఇస్మాయిల్ వంటి పరిపాలనాదక్షుడు ప్రధానమంత్రి పదవిని వదలుకొని వెళ్ళినాడు. తరువాత ప్రధానమంత్రిగా వచ్చిన ఛత్తారి నవాబ్ అవమానాలకు గురియై వెళ్ళిపోయినాడు. రజాకార్లు విజృంభించినారు. ఖాసింరజ్వీ అనే ఒక సాధారణ న్యాయవాది మజిలిస్‌కు అధ్యక్షుడై ప్రజలకు జన్మజన్మాల బూజుగా నిలిచిన నిజాంరాజు తోడ్పాటుతో ఒక ప్రైవేట్ సైనికదళమైన రజాకారు వ్యవస్థను సమీకరించి గృహదహనాలు, దోపిడీలు, హత్యలు, గ్రామాలపై దండయాత్రలు మొదలైన కిరాతక కృత్యాల ద్వార హిందువులను సకలహింసలకు, బాధలకు గురిచేసిన రోజులు. చాలామంది రాష్ట్రాన్ని వదిలిపెట్టి యితర ప్రాంతాలకు వలసకు వెళ్ళిన రోజులవి. “రయ్యత్” పత్రిక కూడా ఆగిపోయినది. ఆ పత్రికలో పనిచేసిన షోయిబుల్లాఖాన్ అనే విద్యావంతుడైన యువకుడు, జాతీయవాది. కొంతకాలం రయ్యత్ పత్రికలో పనిచేసి అది ఆగినందువలన “ఇంరోజ్” అనే పేరుతో మరొక దినపత్రికను స్థాపించి నడుపుతున్న రోజులవి. ఆ రోజులలో పెద్దల ఆదేశం ప్రకారం మిత్రుల సలహాలను పాటించి శ్రీరాజారామేశ్వరరావు, శ్రీ నరోత్తమ రెడ్డి గార్లపైన నాకున్న అభిమానంతో గోలకొండలోచేరి సుమారు ఇరవై సంవత్సరాల వరకు ఆపత్రిక సంపాదకీయాలు వ్రాసి ఎడిటింగ్ కార్యకలాపాలను (సంపాదక) పర్యవేక్షించే బాధ్యతను స్వీకరించినాను. ఈ ఇరువై సంవత్సరాలు నాపైన పరిపూర్ణమైన విశ్వాసం ఉంచి నన్ను గౌరవంతో చూచి నాకు కావలసిన స్వాతంత్ర్యం యిచ్చి గోలకొండ పత్రిక సంపాదక బాధ్యతలను నిర్వహించడంలో సమస్త సౌకర్యాలు కల్పించిన మిత్రులు శ్రీ రాజారామేశ్వరరావు, శ్రీ నరోత్తమ రెడ్డిగార్లు. తరువాత అనేక కార్యకలాపాలలో అనగా ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదలైన రంగాలలో వారితో కలిసి పనిచేయడం జరిగింది. ఈ ఉభయులు నాకు ఆత్మీయులు, శ్రేయోభిలాషులు. ఉదార భావాలు గల సంస్కృతీపరులు వారితో స్నేహం యావజ్జీవితము

కొనసాగేబంధము. తెలంగాణ రాష్ట్రము మొదలైన సమస్యలలో నాకు అభిప్రాయ భేదాలున్న సందర్భంలో కూడా (తెలంగాణ ఉద్యమాలు చెలరేగినరోజులలో నేను పత్రికకు సంపాదకీయాలు వ్రాయలేదు) వారితో స్నేహసంబంధాలకు ఎటువంటి ఆటంకము కలుగలేదు.

ఆ రోజులలోని ఉర్దూ పత్రికలలో ప్రముఖమైనవి 'రహబరె దక్కన్', 'పఖ్తు' మొదలైనవి నిజాంరాజు స్వతంత్ర పరిపాలకుడుగా ఉండవలెనని నిజాం రాష్ట్రం ఇండియన్ యూనియన్‌లో చేరగూడదని యీ పత్రికల ఆశయాలు. మజ్లీస్ నాయకుల ఆశయాలు కూడా ఇవే. నిజాంరాజు అభిప్రాయం కూడా ఇదే. రోగికి పథ్యము రుచించనట్లుగా నిజాంరాజు ఇండియన్ యూనియన్‌లో చేరడం క్షేమకరమని యెవ్వరు చెప్పినను ఆయనకు నచ్చలేదు. రజాకార్ల కిరాతకకృత్యాలను ఆయన బలపరిచినాడని చెప్పవలెను. గోలకొండ పత్రిక యీ అభిప్రాయాలకు వ్యతిరేకంగా వార్తలను, వ్యాఖ్యానాలను, సంపాదకీయాలను ప్రకటిస్తూ ప్రజల ప్రతినిధిగా నిలిచినది. 1948 ఆగస్టులో అనుకుంటాను రజాకార్లు షోయిబుల్లాఖాన్‌ను హత్య చేసినారు. అయినప్పటికీ గోలకొండ పత్రిక చలించలేదు. జాతీయోద్యమాన్ని బలపరచడంలో సందేహించలేదు. తుదకు భారత ప్రభుత్వం చర్యతీసుకొనక తప్పలేదు 1948, 14వ సెప్టెంబర్ నాడు ఇండియా ప్రభుత్వం తన సైన్యాన్ని పంపినది. అప్పటి గవర్నర్ జనరల్‌గా ఉండిన రాజగోపాలాచారిగారు దీనిని పోలీసు చర్యగా వర్ణించినారు. అప్పుడు హోంమంత్రిగా ఉండిన సర్దార్ వల్లభాయి పటేల్‌గారి ధైర్యము పట్టుదల కార్యదక్షత యీ పోలీసుచర్యను విజయవంతగా నిర్వహించినవి. అంతకుముందు యెన్నో ప్రగల్భాలు పలికి తమ శక్తిని చాల ఎక్కువగా అంచనా వేసుకున్న నిజాం సైన్యాలు మూడు రోజులు కూడా నిలువలేక పోయినవి. 17వ సెప్టెంబర్‌నాడు నిజాం సైన్యాలు లొంగిపోయినవి. నిజాం లొంగుబాటును అంగీకరించి ఇండియన్ యూనియన్‌లో చేరినాడు. హైదరాబాదు ప్రజల విమోచన జరిగినది 13వ సెప్టెంబర్ 1948 వరకు గోలకొండ పత్రిక యధాప్రకారం కొనసాగినది. 14, 15, 16, 17 నాలుగు రోజులు మాత్రము పత్రిక వెలువడలేదు. తిరిగి సెప్టెంబర్ 18వ తేదీనాడు ఇండియా ప్రభుత్వ సైన్యాలకు స్వాగతమిస్తూ సంపాదకీయంతో గోలకొండ పత్రిక వెలువడినది. ఆ రోజులలో ప్రాణాలకు తెగించి పత్రికను నిర్వహించవలసి వచ్చినది.

పోలీసు చర్య తరువాత తిరిగి న్యాయవాద వృత్తి చేపట్టవలెననే కోరిక అప్పుడప్పుడు కలుగుతుండేది. కాని యెప్పటికప్పుడు ఏదో దేశసేవకు భాషా సేవకు సంబంధించిన కార్యక్రమాలలో మునిగితేలుతూ ఆ కోరికను నెరవేర్చుకోలేక పోయినాను. ఆంధ్రసారస్వత పరిషత్తు, ఉస్మానియా విశ్వవిద్యాలయ వ్యవహారాలు విశాలాంధ్రోద్యమం మొదలైన పనులకు పూర్తి సమయాన్ని ఈయవలసి వచ్చినది. మాడపాటి హనుమంతరావుగారు ఛలోక్తిగా అంటుండేవారు "కొండా వెంకటరంగారెడ్డిగారు న్యాయవాద వృత్తిలో బాగారాణించినారు" నేను (మాడపాటి హనుమంతరావు) అతికష్టంమీద షష్టిపూర్తి వరకు యీ వృత్తిని సంసారపక్షంగా లాగినాను, మందుముల నరసింగరావుగారు ఏడు ఎనిమిది సంవత్సరాలు యీవృత్తిలో ఉండి అది తమ చిత్తవృత్తికి గిట్టక వదలివేసినారు. ప్రతాపరెడ్డిగారు రెండు సంవత్సరాల అనుభవంతోనే వదిలివేసినారు. మా అందరికన్న రామానుజరావు ముందడుగు వేసినాడు. ఎల్.ఎల్.బి, డిగ్రీ తీసుకొని వృత్తికి కావలసినటు వంటి సౌకర్యాలు అన్నీ కలిగి ఉండి సనదు తీసుకోలేదు. కోర్టులో అడుగు పెట్టలేదు" ఆయన ఛలోక్తిగా ఏమి అన్నప్పటికిని నేను న్యాయవాద వృత్తిని చేపట్టక పోవడానికి కారణం ఆయన సలహాయేనని చెప్పవలెను. విద్యావంతులైన యువకులు దేశసేవ, భాషాసేవ చేయవలెననే ఉద్దేశంతో ఆయన యిటువంటి సలహాలు యిస్తుండేవారు.

1929-49 మధ్య రెండు దశాబ్దాలు యీవిధంగా గడిచినవి. నిద్రాణమైయున్న హైదరాబాదు ప్రజలు యీకాలంలో మేల్కొన్నారు ఆంధ్రోద్యమము, జాతీయోద్యమము హైదరాబాదు రాష్ట్ర ప్రజల విమోచనోద్యమము కొనసాగి విజయవంతంగా ముగిసినది, నిజాంరాజు ఆయన భృత్యులు యిష్టపడ్డా, యిష్టపడక పోయినా రాష్ట్ర ప్రజలకు యిరుగు పొరుగు ప్రాంతాల ప్రజలతో సంబంధాలు అభివృద్ధి చెందినవి. మాత్రభాషా సంస్కృతులు రాష్ట్రాన్ని ప్రభావితం చేసినవి. క్రమక్రమంగా కవిపండితులు అజ్ఞాతంగా దాగుకొనక వేదికలమీదికి వచ్చి పత్రికలలో వ్రాసి భాషాభివృద్ధికి, సాహిత్యవికాసానికి తోడ్పడినారు. ప్రజాస్వామిక యుగం ప్రారంభమైనది. జాతి చరిత్రలో నూతనాధ్యాయం మొదలైనది.

VI

1949 సెప్టెంబర్‌లో పోలీసు చర్య జరిగినది. 1956వ సంవత్సరము నవంబర్ ఒకటవ తేదీనాడు ఆంధ్రప్రదేశ్ ఏర్పడినది. ఈ మధ్యలో 1954 అక్టోబర్ ఒకటవ తేదీనాడు కర్నూల్ రాజధానిగా అసమగ్ర ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినది. 1949 నుండి 1956 వరకు ఏడు సంవత్సరాల కాలంలో అనేక ముఖ్యమైన సంఘటనలు జరిగినవి. భారతదేశము అంతటిలోను భాషారాష్ట్రాలు ఏర్పడినవి. (ఒక్క బొంబాయి తప్ప బొంబాయి రాష్ట్రంకూడా తరువాత కొద్ది కాలానికే మహారాష్ట్ర, గుజరాత్‌లుగా విడిపోయినవి) సుమారు రెండునూర్ల సంవత్సరాలుగా కలిసియున్న మహారాష్ట్రులు, కర్ణాటకులు, ఆంధ్రులు విడిపోయి పొరుగు ప్రాంతాలలోని తమ భాష మాట్లాడు సోదరప్రజలతో కలిసిపోయినారు. హైదరాబాదు ప్రభుత్వానికి మొదటిలో ఆంధ్రోద్యమాన్ని గూర్చి ఉండిన అనుమానాలు నిజమైనవి. అప్పటి గవర్నర్ జనరల్ చక్రవర్తి రాజగోపాలాచారి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, దేశీయాంగమంత్రి సర్దార్ వల్లభాయిపటేల్ ఒకరి తరువాత ఒకరు హైదరాబాదుకు వచ్చి బహిరంగ సభలలో మాట్లాడి వెళ్ళినారు. ఒక మహా సముద్రం ఉప్పొంగినట్లుగా గ్రామప్రాంతాల నుండి ప్రజలు తండోపతండాలుగా వచ్చి ఆ నాయకులను సందర్శించినారు. ఆ నాయకులు మాట్లాడిన సభలలో యిసుకబోసిన రాలని జనసందోహము. దీనికంతా నూటయాభై సంవత్సరాలకు పైగా నిరంకుశ పరిపాలన కింద నలిగిపోయిన జనులకు స్వాతంత్ర్యం లభించిందన్న మహోత్సాహమే కారణము.

పోలీసు చర్య జరిగినప్పుడు ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆరు సంవత్సరాలు నిండి ఏడవ సంవత్సరంలో అడుగు పెట్టిన బాలిక. బాలారిష్టాలు గడిచిపోయినవి. క్రూరకిరాతకుల దౌర్జన్యం నుండి విముక్తి కలిగినది. సారస్వత పరిషత్తు అవతరణ జరిగిన నాటి నుండి నాకు యీ సంస్థతో సంబంధం. పోలీసు చర్య అయిన ఒకటి రెండు నెలలలో యీ సంస్థ నిర్వహణ బాధ్యత తీసుకోవలసినదని ఆంధ్ర పితామహుల ఆదేశం శిరసావహించక తప్పలేదు. శ్రీ నరోత్తమరెడ్డి, శ్రీ పులిజాల హనుమంతరావు, శ్రీ గడియారం రామకృష్ణ శర్మగార్లతో ఒకటీము ఏర్పడి మాడపాటి, సురవరంల అండతో ముందడుగు వేసినాము.

ఈ మిత్ర మండలి ఒక విశిష్టమైన టీము. నరోత్తమరెడ్డి శ్రీమంతుల ఇంటిబిడ్డ. అర్థశాస్త్రంలో ఎమ్ఏ డిగ్రీ తీసుకొనిన విద్యాధికుడు, కొంచెం ప్రయత్నం చేస్తే ఉన్నతోద్యోగం

ఏదైనా లభించేది. వ్యవసాయమో, వ్యాపారమో చేసుకుంటే కావలసినంత డబ్బు గడించేవారు. కాని ఆయన దిన పత్రిక సంపాదక పదవికే ప్రాధాన్యం యిచ్చి ప్రజాహిత జీవనంలో అడుగు పెట్టినాడు. సహజంగా గంభీరమైన మనిషి. నిండు కుండ, పేరుతో ఉన్న ఉత్తమ శబ్దం నూటికి నూరుపాళ్ళు సార్థకం. స్నేహపాత్రుడు. విశ్వసనీయుడు తరువాత ఆయన పార్లమెంట్ సభ్యుడైనాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడైనాడు. దురదృష్టవశాత్తు సుమారు ఎనిమిది సంవత్సరాలనుండి ఆరోగ్యం కోల్పోయినాడు. ఆయనతో నాస్నేహం స్వార్థరహితమైనది. యావజ్జీవితము కొనసాగేది.

పులిజాల హనుమంతరావు తాను తిని యితరులకు పెట్టగల భూవసతి ఉన్న కుటుంబానికి చెందినవాడు. అంబడిపూడి వెంకటరత్నంగారి శిక్షణలో కవితా వ్యాసంగం చేసినాడు. 'సాహితీ మేఖల'కు వ్యవహర్తగా కార్యదక్షుడని పేరుగాంచినాడు. ఉత్సాహము, ఉద్రేకము రెండూ కలవాడు. కొంత వ్యాపార దృక్పథం కూడా ఉన్నవాడు. పరిషత్తు అభివృద్ధికి సుమారు ఎనిమిది సంవత్సరాలు నిరంతర కృషిగావించినాడు. హైదరాబాదు నగరంలో ఒక పర్యాయం సాహితీమేఖల పక్షాన అంబడిపూడి వెంకటరత్నంగారి సన్మాన సభ ఒకటి ఆయన ఏర్పాటు చేసినప్పుడు వెంకటరత్నంగారు ఆయనను గూర్చి చెప్పిన పద్యం మరువరానిది.

"మా హనుమంతరాయడ సమాన కళారసపానమత్తుడే
యూహకు వశ్యుడై యిటుల సేయగ నెంచెనొ? ఘోరమైనవా
దాహవ మీకవీశ్వరుల యంగణమన్న వినండు; రచ్చకున్
బాహులు వట్టిలాగె, నిది భావ్యముగాదని ఎంత చెప్పినన్"

దురదృష్టవశాత్తు చిన్న వయసులోనే 50 సంవత్సరాలు నిండకముందే క్యాన్సర్ వ్యాధికి గురియైన ఆయన పరలోకగతుడైనాడు.

గడియారం రామకృష్ణశర్మగారు వెంకటశేషశాస్త్రిగారి సోదరుని కుమారుడు. పండితవంశం. వేలూరి శివరామశాస్త్రిగారి శిష్యుడు. సంస్కృతాంధ్రాలలో నిష్ణాతమైన పాండిత్యము. కన్నడంలో తగినంత పరిచయం. ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో అవసరమైన ప్రవేశం. చరిత్ర పరిశోధనలో ఆసక్తి, శాసనాలను చదివి వ్యాఖ్యానించడంలో నైపుణ్యం, యిందుకు తోడు దేశాభిమానం. ఆంధ్రోద్యమంలోను, కాంగ్రేస్ ఉద్యమంలోను పనిచేసిన స్వాతంత్ర్య యోధుడు, స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తి. మంచి కవిత్వం

అల్లగలిగినవాడు. పద్యము చదివితే ఎన్నివేల మందినైనా ఆకర్షించగల గంభీరమైన కంఠం. ఆంధ్ర మహాసభ వేదికలమీద ఆయన నాయకులను విమర్శిస్తూ పద్యాలు చదువుతుంటే పెద్దలు కొందరు మూతి ముడుచుకునేవారు. ఇటీవలనే శర్మగారు తమ కవితలను ఒక గ్రంథంగా ప్రకటించినారు. పోలీసు చర్య తరువాత ఆదర్శాలను వదులుకొని అంతఃకలహాలతో పదవులకై ప్రాకులాడే నాయకులను గూర్చి ఆయనవ్రాసిన ద్విపద నాకు ఎప్పుడూ జ్ఞాపకముంటుంది.

"ఉన్నావో లేవయ్యు ఓ జగన్నాథ !
విన్నావ మాగోడు వీనులారంగ
....
....
తలదాచుకొనలేక తనువుపైలేక
తొలిపూటకే లేక తోడేమి లేక
తెలంగాణ ప్రజల బన్నాలు విన్నావా ?
మమ్మేల వలసిన మా ప్రజాపతులు
దొమ్మిలో దిగినారు దుర్విధివలన!
....
....
గారాబు ఒకబిడ్డ గణికయైనట్లు
మా రాజకీయాలు మలినంబులయ్యె;"

అన్నారు శర్మగారు. 1952 ప్రాంతంలోనే యింతగా బాధపడిన శర్మగారు నేటి పరిస్థితులు చూచి ఎంత బాధపడుతున్నారో తెలియదు. ఈ ముగ్గురితోపాటు యీ టీములోనేను కూడా సభ్యుడను.

ఆ కాలంలో మదరాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండిన నిజాం కళాశాల నుండి బి.ఏ. పట్టము, నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి ఎల్ఎల్.బి పట్టము తీసుకొని, దేశసేవ, భాషాసేవ చేయవలెనని ఉత్సాహంతో పెద్దల కోరిక పైన ముందుకు వచ్చినవాడిని. ఇంటిలోని వ్యవసాయము అభివృద్ధి చేసుకోగల సదుపాయం ప్రయత్నం చేస్తే సులభంగా ఉద్యోగం దొరికే అవకాశం, న్యాయవాద వృత్తిని స్వీకరిస్తే పుష్కలంగా ధనార్జన చేయగల ఆశ, అన్నీ వదులుకొని కుటుంబ

సమస్యలు ఎక్కువగా లేనందువలన, ఆర్థిక బాధలు లేనందువలన యీ టీములో చేరడం జరిగింది.

పోలీసు చర్య తరువాత పరిషత్తు కృషి ఫలితంగా తెలుగుద్వార మెట్రికులేషన్ వరకు విద్యాబోధన జరిపే నిర్ణయాన్ని ప్రభుత్వం చేసినది; ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ద్వితీయ భాషగా తెలుగుకు ప్రవేశము దొరికినది. ప్రభుత్వ నిర్ణయానుసారం ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలో తెలుగు బోధించే ఉపాధ్యాయులు, తెలుగు ద్వారా బోధించే ఉపాధ్యాయులు ప్రభుత్వానికి కావలసి వచ్చినారు. అందుచేత ప్రభుత్వం పరిషత్తు పరీక్షలను గుర్తించవలసి వచ్చినది. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు గాను, విశారద పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాధ్యమిక పాఠశాలలో తెలుగు పండితులుగాను నియుక్తులైనారు. పరిషత్తు పరీక్షలకు వచ్చే అభ్యర్థుల సంఖ్య వేలపరిమితికి పెరిగినది. నూర్లమందికి ఉపాధ్యాయ పదవులు లభించినవి. కావుననే హనుమంతరావుగారు పరిషత్తు కృషి ఒక చరిత్రకు కావలసిన సాధన సామగ్రిని లభింపజేస్తున్నదని, బూర్గుల రామకృష్ణారావుగారు పరిషత్తు సూర్యునివలె గ్రామగ్రామాలకు వెలుతురు లభింపజేసినదని చెప్పినారు. తెలంగాణములోనే కాక బొంబాయి, బెంగుళూరు, మైసూరు, షోలాపూర్ వంటి రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా పరిషత్తు పరీక్షలు జరిగినవి. విదేశ ప్రాంతమైన మారిషస్‌లో కూడా పరిషత్తు పరీక్షలు జరిగినవి. ఈనాటివరకు సుమారు లక్షా యాభైవేలమంది యీ పరీక్షలలో పాల్గొన్నారు. కొన్నివేలమందికి ఉద్యోగాలు లభించినవి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత మరొక సమస్యతలెత్తినది. వీరు ట్రెయినింగ్ పొందక పోవడమే యీ సమస్య. పరిషత్తు కృషి ఫలితంగా వీరికి ట్రెయినింగ్ పొందని గ్రేడు ఇయ్యవలెననీ. ట్రెయినింగ్ పొందే అవకాశాలు లభింపజేయవలెనని; తరువాత ట్రెయినింగ్ పొందిన గ్రేడ్ యీయవలెనని ప్రభుత్వము నిశ్చయించినది. పండిత శిక్షణ కళాశాలను ఒకదానిని నిర్వహించే బాధ్యతకూడా ప్రభుత్వం పరిషత్తుకు అప్పగించినది. సుమారు పది సంవత్సరాలు పరిషత్తు పక్షాన పండిత శిక్షణ కళాశాల నడిచి వేలమంది అభ్యర్థులు తెలంగాణవారు, రాయలసీమవారు, సర్కార్ జిల్లాలవారు పండిత శిక్షణ పొందినారు. ఈ విధంగా పరిషత్తు ఒక క్లిష్ట సందర్భంలో ముందుకువచ్చి దేశానికి, భాషకు, ప్రభుత్వానికి కావలసిన అక్కరను తీర్చినది. ఆంధ్ర సారస్వత పరిషత్తు జాతీయ సంస్థ, ప్రజల సంస్థ. భారత స్వాతంత్ర ప్రాప్తికి ముందరినుండియే

తెలుగు భాషా సంస్కృతులపరిరక్షణ కొరకు విజయవంతంగా పోరాడి యీనాడు రాజధాని నగరంలో సుస్థిరంగా నిలిచియున్న సాహిత్యసంస్థ జాతీయ సంస్థ ఆంధ్రసారస్వత పరిషత్తు.

సారస్వత పరిషత్తు ప్రచురణలుకూడా ప్రత్యేకమైనవి; విశిష్టమైనవి. తొలిసారి ఆంధ్రుల సాంఘిక చరిత్రను ప్రకటించినది ఆంధ్రసారస్వత పరిషత్తు. ఈ సాంఘిక చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమి మొదటి జాతీయ బహుమతి లభించినది. జానపద వాఙ్మయాన్ని ముఖ్యంగా స్త్రీల పాటలను, పల్లెపదాలను మూడు సంపుటాలుగా కూర్చి ప్రకటించినది సారస్వత పరిషత్తు. తెలుగు భారతం పైన, తెలుగు భాగవతంపైన ప్రామాణికమైన ఉపన్యాసాలు చేయించి వానిని గ్రంథ రూపమున వెలువరించినది ఆంధ్ర సారస్వత పరిషత్తు. తెలుగు స్వబోధినిని ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలలో ప్రకటించినది. ప్రపంచరాజ్యాల చరిత్రను సమగ్రంగా ఒక మహా గ్రంథంగా కూర్చి ప్రకటించినది. మొదటిసారి పదకవిత మీద తెలుగులో ఒక మంచి గ్రంథాన్ని ప్రకటించినది. పిల్లలకొరకు అనేక గ్రంథాలు ప్రకటించినది. ఈ విధంగా పరిషత్తు పక్షాన సుమారు నూరు పుస్తకాలు ప్రకటితమై విశ్వవిద్యాలయాల, పండితుల, సాధారణ పాఠకుల ఆదరము పరిషత్తు పొందినది. పరిషత్తు ఒక ఉత్తమ గ్రంథాలయాన్ని సమకూర్చుకొన్నది. ఇది తెలుగుభాషా పరిశోధకులకు ఉపయోగకరంగా ఉన్నది. పరిషత్తు పక్షాన ఎం.ఎ (భాషా) తరగతుల వరకు బోధనం చేసే సాయం కళాశాల చక్కగా నిర్వహింపబడుతున్నది. డాక్టరేటు పరిశోధనను నడిపే కేంద్రంగా రూపొందడానికి కావలసిన సమస్త సౌకర్యాలు మా కళాశాలకు ఉన్నవి.

పోలీసు చర్య తరువాత పరిషత్తు కార్యక్రమాలలో నూతన చైతన్యము గోచరించినది. పరిషత్తు అయిదవ వార్షికోత్సవము హైదరాబాదు జిల్లా తూపురాన్ గ్రామంలో 1949, ఫిబ్రవరి నెలలో జరిగినది. ఈ సభలకు తెలంగాణమంతటి నుండి ప్రతినిధులు వచ్చి వేలసంఖ్యలో పాల్గొనిరి. సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు; సుప్రసిద్ధ కథకులు ముని మాణిక్యం నరసింహారావుగారు, సుప్రసిద్ధ జీవిత చరిత్ర రచయితలు గొట్టిపాటి వెంకట సుబ్బయ్యగారలు యీ సభలలో పాల్గొన్నందున యీ వార్షికోత్సవము ఆంధ్ర తెలంగాణ సాహితీ పరులను మరింత దగ్గరగా తీసుకొని వచ్చినది. సోమశేఖర శర్మగారు పరిషత్తు కార్యకర్తలకు ఆప్తులుగా ఉండినారు. తూపురాన్‌లో తెలంగాణ చరిత్ర ఒకటి ప్రత్యేకంగా

వ్రాయవలెననే సంకల్పం వారికి కలిగినది. ఒకటిరెండు అధ్యాయాలు ప్రారంభించినారు కాని ఏ కారణం వల్లనో గ్రంథం పూర్తికాలేదు. ఇంతలో వారు కీర్తిశేషులైనారు. ఆ గ్రంథాన్ని నాకు అంకితము చేయవలెనని కూడా వారు సంకల్పించిరి. సోమశేఖర శర్మగారి వలెనే మునిమాణిక్యం నరసింహారావుగారు అమృతమూర్తులు. పరిషత్తుకు చాలా దగ్గరగా వచ్చిన సహృదయులు. చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రిగారి అభినందన సభ సందర్భమున తెలంగాణ నుండి చాలామంది మిత్రులము విజయవాడకు వెళ్ళినాము. అప్పుడు నరసింహారావుగారు నన్ను, పులిజాల హనుమంతరావును మచిలీపట్టణానికి తమ వెంట తీసుకొని వెళ్లి అతిథ్యమిచ్చి ఎంతో ఆదరించిరి. నరసింహారావుగారు పదవీ విరమణ గావించిన తరువాత మరేదైనా ఉద్యోగం కావలెనని కోరగా వారిని నల్లగొండ జిల్లా బచ్చన్న పేట ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా నియామకము చేయించనైనది. దాని తరువాత వారు పరిషత్తు పండిత శిక్షణ కళాశాలలో కొంతకాలం లెక్చరర్‌గా, మరికొంతకాలం ప్రిన్సిపాల్‌గా పనిచేసిరి. ఈ విధంగా నరసింహారావుగారు పరిషత్తు ఆప్తవర్గంలో చేరినారు. తూపురాన్ సభల తర్వాత 'కృష్ణా' పత్రికలో వారు తెలంగాణ కవిమిత్రులను గూర్చి పరిచయం చేస్తూ నన్ను కూడ అందులో చేర్చిరి. గొట్టిపాటి వెంకట సుబ్బయ్యగారు కూడ యీ విధంగా మా అందరిని గూర్చి వ్రాసినారు. మునిమాణిక్యం నరసింహారావు గారువ్రాసిన 'మన హాస్యం' అనే గ్రంథాన్ని అభిమానంతో నాకు అంకితమిచ్చినారు. అది సారస్వత పరిషత్తు పక్షాన ప్రకటితమైనది.

1950లో విజయవాడలో జరిగిన చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి సన్మానసభల సందర్భమున, ఆంధ్ర కవి పండితులను చాలామందిని కలుసుకునే అవకాశం లభించినది. అయ్యదేవర కాళేశ్వరరావుగారు యీ సభలకు ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా ఉండిరి. సభకు కట్టమంచి రామలింగారెడ్డిగారు అధ్యక్షత వహించిరి. ఈ సభలో పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, గిడుగు సీతాపతి, గడియారం వెంకటశేషశాస్త్రి, కోరాడ రామకృష్ణయ్య, చిలుకూరి నారాయణరావు, అడివి బాపిరాజు, కోలవెన్ను రామకోటీశ్వరరావు, వేలూరి శివరామశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి మొదలైన కవిపండితులను, పెద్దలను కలుసుకునే అవకాశం లభించినది. ఆ సందర్భంలో తెలంగాణ నుండి వెళ్ళిన ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రతినిధులలో ఆంధ్ర రచయితలు, పండితులు పరస్పర పరిచయం

చేసుకునే ఉద్దేశంతో ఒక తేనీటివిందు ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో బూర్గుల రామకృష్ణారావుగారు, ఎమ్.ఆర్.అప్పారావుగారు పాల్గొనిరి. ఆ సందర్భంలో ఆంధ్ర ప్రాంత కవి పండితులను పింగళి లక్ష్మీకాంతంగారు పరిచయం చేయగా తెలంగాణ ప్రాంతం కవిపండితులను పరిచయం చేసే బాధ్యత నాపై పడినది. ఈ తేనీటి విందులో పాల్గొనిన కవి పండితుల ఫొటో ఒకటి తీసుకోనైనది. ఇందులో చిన్నవయసులో ఉన్న సీతా అనసూయలు కూడా ఉన్నారు. చెళ్లపిళ్ళ అభినందన సభల సందర్భమున తీసుకొన్న ఒకే ఒక ఛాయాచిత్రమిది.

ఏకారణమువల్లనో సకల నిర్వాహకులు సమావేశాల ఫొటోలను తీసుకునే యేర్పాటు చేయలేదు. ఆ సభలలో యీ సమావేశం ఎంతో శోభాయమానంగా జరిగినది. ఇంతమంది కవిపండితులను ఒక పర్యాయం కలుసుకోవడం వారితో రెండు రోజులు కాలక్షేపం చేయడం ఒక మహదవకాశంగా భావించినాను. తెలంగాణం నుండి వెళ్ళినవారిలో కాళోజి, దాశరథి ప్రభృతులు ఉండిరి.

ఆ రోజులలో కోలవెన్ను రామకోటీశ్వరరావుగారు కృష్ణాపత్రికకు సంపాదకులుగా ఉండినారు. 'త్రివేణి' పత్రిక సంపాదకులుగా ఆయన పేరు నా విద్యార్థి దశ నుండియే విన్నాను. విద్యార్థులుగా మేము త్రివేణి పత్రికను చదువుకొని ఎన్నో సంగతులను తెలుసుకొని ఎంతో ఉత్తేజం పొందేవారం. భారతీయ సాంస్కృతిక వికాసానికి తెలుగు సాహిత్య సంస్కృతుల పరిచయానికి త్రివేణి పత్రిక చేసిన దోహదం అద్వితీయమైనది. రామకోటీశ్వరరావుగారి సంపాదకీయాలు మనోరంజకంగా ఉండేవి. హైదరాబాదు రేడియోవారు నన్ను మునిమాణిక్యంవారి కాంతాన్ని గూర్చి మాట్లాడవలసిందిగా కోరిరి. నా రేడియో ప్రసంగం ఏవిధంగా లభించిందో తెలియదు కాని కృష్ణా పత్రికలో అది ప్రకటితమైనన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేసినది. ఒకటి రెండు రోజులలో మునిమాణిక్యం నరసింహారావుగారు నాకు ఒక కార్డు వ్రాసి అందులో రామకోటీశ్వరరావుగారు నా ప్రసంగం విని హర్షించినారని, వారే నా ప్రసంగాన్ని సేకరించి పత్రికలో వేసినారని, నేను రామకోటీశ్వరరావుగారి ప్రశంసను పొందడం తనకు ఆనందం కలిగించిందని వ్రాసిరి. రామకోటీశ్వరరావుగారి ఆమోదం నన్ను పన్నీటిలో స్నానము చేయించినది. తరువాత ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి సభ్యుడుగా, కేంద్ర సాహిత్య అకాడమి తెలుగు సలహా సంఘు సభ్యుడుగా రామకోటీశ్వరరావు గారిని నేను కలుసుకొని వైజ్ఞానికంగా లాభం పొందినాను.

రామకోటీశ్వరరావుగారు ఆంధ్ర, ఆంగ్ల భాషలలో నిష్ణాతులు. ఉత్తమశ్రేణి రచయితలు, సరసులు. అఖిలాంధ్ర కవిపండిత మండలికి ఆప్తమిత్రులు. అయితే వ్యవహార దక్షులు కానందువలన త్రివేణి యెప్పుడూ ఆర్థిక యిబ్బందులతో ఉండేదని అంటుండేవారు.

1950లో ఆదిలాబాదు జిల్లా మంచిర్యాలలో పరిషత్తు సభలు పెద్దస్థాయిలో జరిగినవి. పరిషత్తు పరీక్షలలో నెగ్గిన అభ్యర్థులకు విజయపత్ర ప్రదానం చేసే సందర్భంలో స్నాతకోపన్యాసం యీయమని కోరగా అందుకు అంగీకరించి వేలూరి శివరామశాస్త్రిగారు విచ్చేసిరి. శివరామశాస్త్రిగారు మహాపండితులు.

"తిరుపతి వెంకటేశకవిధీరుల శిష్యుడ; నాదుపేరు
వేలూరి శివరామశాస్త్రియని లోకమువాకొను
ఆధ్యమైన వ్యాకరణము జీవనంబు;
అధికారము కావ్యపురాణ నాటకాకరముల
చేయజాలుదు నఖండముగా శతావధానమున్"

అని ఢంకా కొట్టి చెప్పుకొన్న సాహిత్య వీరులు. కొంచెం వామనులైనప్పటికి విజ్ఞానం ప్రతిబింబించే సుందరమైనమూర్తి ఆయనది. తెలుగులో చక్కని వచనరచయిత. ఆనాడు చిన్నకథలు వ్రాసినవారిలో ప్రముఖులు. గాంధీ మహాత్ముని, ఆత్మకథను చక్కని తెనుగు శైలిలో అనువాదము చేసినారు. వారిచేతివ్రాత అచ్చు అక్షరములకూర్పువలె ఉండేది. చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రిగారి అభినందన సభల సందర్భంలో నాకు వారితో పరిచయము యేర్పడినది. నా పుస్తకాలు వారికి పంపినప్పుడు వానిని ప్రశంసిస్తూ వారు నాకు వ్రాయడం గౌరవంగా భావించుకున్నాను. అటువంటి మహాకవులు, మహాపండితులు మా సభలకు వచ్చి మాతో రెండు రోజులు కలిసి ఉండడం మాకు అత్యంత ఆనందము కలిగించినది. జీవితాంతం వరకు నాపట్ల వారు ఆదరాభిమానాలు ప్రకటించినారు. మంచిర్యాల సభలను ప్రసిద్ధ పత్రికా సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావుగారు ప్రారంభించిరి. వారు తమ సహజ ధోరణిలో చక్కని ఉత్తేజకరమైన ప్రసంగం గావించిరి.

తూపురాన్ సభలకు అప్పుడు రెవెన్యూ కార్యదర్శి అయిన ఇల్లిందల రామచంద్రరావుగారు అధ్యక్షత వహించగా, రాజారామేశ్వర రావుగారు సభలను ప్రారంభించిరి. మంచిర్యాల సభలలో రామచంద్రరావుగారి స్థానంలో పర్సా వెంకటేశ్వరరావుగారిని అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. రామచంద్రరావుగారి

వలెనే వెంకటేశ్వరరావుగారు కూడా బి.ఏ.ఎల్ఎల్.బి పట్టభద్రుడు. సివిలియన్ ఉద్యోగి. డిస్ట్రిక్ కలెక్టర్ పదవిలో ఉండినారు. ఈ ఎన్నిక రామచంద్రరావుగారికి కోప కారణమైనది. ఎవరు అధ్యక్షులుగా ఉన్నప్పటికిని సమస్త కార్యాలు నిర్వహించినవారు మా టీము సభ్యులే. అప్పుడు తీవ్రమైన చీలికలు ఏర్పడినవి. అయితే మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డిగార్లు మా టీమునే బలపరిచినారు. నిజానికి పర్సా వెంకటేశ్వరరావుపేరును ప్రతిపాదించినది సురవరం ప్రతాపరెడ్డిగారే, పర్సా వెంకటేశ్వరరావుగారు నా చిన్ననాటి స్నేహితుడు. సహాధ్యాయి. ఇల్లిందల రామచంద్రరావుగారు కూడా నాకు బాగా పరిచితులు; మిత్రులు అని చెప్పగలిగినంత చనువుగలవారు. మొత్తం మీద సంఘర్షణ తప్పలేదు. బూర్గుల రంగనాధారావు, వెల్దుర్తి మాణిక్యరావు గారలు రామచంద్రరావు గారిని సమర్థించిరి. బూర్గుల రామకృష్ణారావుగారి సానుభూతి వీరికి ఉండినదని విన్నాము. మాడపాటి, సురవరంలతో పాటు కొండా వెంకటరంగారెడ్డిగారు మా టీమును బలపరిచిరి. రంగారెడ్డిగారు తమ ఇంట్లో మాకు ఒక తేనీటివిందును ఏర్పాటు చేసి సమస్యను పరిష్కారం కావించడానికి కృషి చేసిరి. ఆ సందర్భంలో జరిగిన సంఘటన ఒకటి – రామచంద్రరావుగారి అనుయాయులు ఒకరులేచి రంగారెడ్డిగారిని ఉద్దేశించి మీకు రామానుజరావు, నరోత్తమరెడ్డి, హనుమంతరావులమీద పక్షపాతం అని వ్యాఖ్యానించగా, రంగారెడ్డిగారు "ఇటువంటి మాటలు మాట్లాడవద్దు, రామానుజరావు, నరోత్తమరెడ్డి, హనుమంతరావు ప్రభృతులు ప్రభుత్వోద్యోగులు కారు; కావున మీకే నష్టం కలుగుతుంది, నేను మీ రక్షణకొరకే యిందులో ప్రవేశించినాను" అని గట్టిగా చీవాట్లు పెట్టిరి. కొన్ని నెలల సంఘర్షణ తరువాత పరిషత్తును యీ టీముకు అప్పగించడం జరిగింది. అప్పటివరకు రామకృష్ణారావుగారు ముఖ్యమంత్రి కాలేదు. బహుశా రెవిన్యూ, విద్యాశాఖలకు మంత్రిగా ఉండేవారు.

పరిషత్తు ఆశయాలలో అక్షరాస్యతా ప్రచారం ఒకటి. పరీక్షలతోపాటు వయోజనవిద్యా ప్రచారానికి కూడా పరిషత్తు పూనుకున్నది. 1950, జూన్ నెల 15 నుండి 30వ తేదీ వరకు పరిషత్తు పక్షాన వయోజన విద్యాశిక్షణ కేంద్రాన్ని నిర్వహించనైనది. ఇందులో చాలామంది కార్యకర్తలు పాల్గొని లాభము పొందిరి. గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు స్వయంగా రెండు వారాలపాటు హైదరాబాదులో ఉండి యీశిక్షణ శిబిరానికి ప్రిన్సిపాల్‌గా పనిచేసిరి. హరిసర్వోత్తమ రావుగారికి మాపైన

ఎంతో వాత్సల్యము ఉండేది. త్యాగమూర్తి నిష్కళంక దేశభక్తుడు మహావిజ్ఞాని అయిన హరిసర్వోత్తమరావుగారి అండదండలు పరిషత్తుకూ, నావంటి కార్యకర్తలకూ ఎంతో బలమిచ్చినవి. ప్రభుత్వ సహకారంతో 11 సాంఘిక విద్యాకేంద్రాలు, 64 వయోజన రాత్రి పాఠశాలలను పరిషత్తు నడిపినది. ఇంతేగాక బొగ్గుగనుల ప్రాంతాలైన ఇల్లెందు, కొత్తగూడెం, బెల్లంపల్లి ప్రాంతాలలో 18 వయోజన పాఠశాలలు నిర్వహింపబడినవి. వేల సంఖ్యలో వయోజనులు పాల్గొని అక్షరాస్యులైనారు. ఈ విధంగా ఒక మహోత్సాహంతో పరిషత్తు కార్యక్రమాలలో తోడిమిత్రులతో సముద్రంలో యీత కొట్టినట్లు దిగినాను. నాటి నుండి నేటివరకు జీవితంలో అత్యధికకాలం పరిషత్తు కొరకే వినియోగించినాను. ఇప్పుడు పరిషత్తు సొంత భవనాలలో అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో మున్నెన్నదగిన సాహిత్య సంస్థగా నిలిచి ఉన్నది.

పరిషత్తు వయోజన విద్యాకేంద్రాలకు, రాత్రి పాఠశాలలకు 1950–52 మధ్యన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారం కొంత లభించినది. అప్పుడు తెలంగాణ ప్రాంతానికి క్యాప్టన్ నంజప్ప అనే సైనికాధికారి ఒకరు ప్రత్యేక కమిషనర్‌గా ఉండేవాడు. ఆయన చండశాసనుడు, కమ్యూనిస్టులను అణిచివేయడానికి కఠినమైన చర్యలను తీసుకున్నాడు. కొందరిని కాల్చివేసి, కొందరిని చెరసాలలో పెట్టి దమననీతిని అవలంబించినాడు. తరువాత ముఖ్యమంత్రి అయిన కార్యకర్త ఒకరీ విధంగా చెరసాలలో ఉండినవారే. ఆయనను చెరసాల నుండి విడిపించడానికి మా కాంగ్రేస్ మిత్రులు కొందరు సర్దార్‌పటేల్ వరకు వెళ్లవలసివచ్చినది. పరిషత్తుకు నంజప్పగారితో యీవయోజన పాఠశాలలకు సంబంధించిన వ్యవహారం కొంత ఉండేది. పరిషత్తుకు నంజప్పగారికి మధ్యన నేను లైజాన్ ఆఫీసర్‌గా ఉండేవాడిని. అందుచేత ఆయనను అప్పుడప్పుడు కలుసుకోవలసి వచ్చేది. నన్ను చాలా మర్యాదగా ఆయన చూచినారు. నిర్ణయించిన సమయానికి నన్ను కలుసుకోవడానికి కొంత ఆలస్యం జరిగితే ఆయన భార్య స్వయంగావచ్చి నన్ను కూర్చోమని చెప్పి టీ యిచ్చేది. అంత క్రూరుడుగా వ్యవహరించిన నంజప్ప నాతో ఎంతో మృదువుగా, గౌరవంగా వ్యవహరించేవాడు. బహుశా నావేషభాషలు అందుకు కారణం అయి ఉండవచ్చును.

పోలీసు చర్య తరువాత పూల్‌చంద్ గాంధీగారు ఎమ్.కె.వెల్లోడిగారి మంత్రివర్గంలోను, తర్వాత రామకృష్ణారావుగారి మంత్రివర్గంలోనూ విద్యామంత్రిగా

ఉండిరి. ఆయన పరషత్తుకు మిక్కిలి తోడ్పడిరి. ఆయనకు పరిషత్తు కార్యకర్తల మీద ముఖ్యంగా నాపైన ఎంతో ఆదరము ఉండేది. ఫూల్‌చంద్ గాంధీగారు మరఠ్వాడా ఉస్మానాబాదు ప్రాంతీయులు బి.ఏ.ఎల్‌ఎల్.బి పట్టభద్రులు. పలుకుబడిగల న్యాయవాది. సంస్కృత భాషాభిమాని. మాతృభాషల వికాసానికీ ప్రత్యేకంగా తోడ్పడినారు. పరిషత్తుకు ప్రతిసంవత్సరానికి ప్రభుత్వం నుండి 18 వేల గ్రాంటు మంజూరు చేసి ప్రస్తుతం పరిషత్తు భవనాలు ఉన్న స్థలాన్ని 99 సంవత్సరాల కొరకు నామమాత్రమైన రెంటుకు యిచ్చినారు. అప్పుడు ఆర్థిక మంత్రిగా ఉండిన జి.ఎస్.మెల్‌కోటిగారు పరిషత్తుకు తోడ్పడినారు. కొండా వెంకటరంగారెడ్డిగారి సహాయం పరిషత్తు టీముకు పూర్తిగా లభించినది. ఎన్.కె.రావుగారు పరిషత్తు టీముతో కలిసిమెలిసి ఉండేవారు. ముఖ్యంగా నాతో ఎంతో కలిసిమెలిసి ఉండేవారు. ఎక్కడ మంచిపని జరిగినా దానిని బలపరచవలెననే దృఢ అభిప్రాయం గలవారు ఎన్.కె.రావుగారు. ఆయన అకాలమరణం దేశానికి తీరని నష్టం కలిగించింది. అప్పుడు సుప్రసిద్ధ ఉర్దూకవి కామ్రేడ్ మఖ్దూం శాసనసభ్యుడుగా ఉండేవాడు. ఆయన పూల్‌చంద్‌గాంధి మీద ఒక ఛలోక్తి విసిరినారు. ఉర్దూలో పూల్ అనగా పూలు. చంద్ అనగా కొన్ని. అందుచేత ఒక చర్చ సందర్భంలో మగ్దూం ఆయనను విమర్శిస్తూ 'పూల్‌హైచంద్ కాంటేహైఁబొహెూత్" అని చమత్కరించినాడు. (దీని అర్థం పూలుకొన్ని ముండ్లు ఎక్కువ)

1950వ ప్రాంతంలో పరిషత్తుకు ఆంధ్ర కవిపండితులు మరికొందరితో సన్నిహితత్వం కలిగినది. వీరిలో ఒకరు నేలటూరి వెంకట రమణయ్యగారు. ఆయన అప్పుడే మదరాసు విశ్వవిద్యాలయం చరిత్ర శాఖలో రీడరుగా పనిచేసి రిటైర్ అయినారు. సంస్కృతాంధ్రాంగ్ల భాషలలో విద్వాంసుడు చరిత్ర, పరిశోధనలో నిష్ణాతులు. విశేషించి విజయనగర చరిత్ర వారికి అభిమానాస్పదమైనది. అందులో వారు ప్రామాణికులు, అనేక గ్రంథాలు వ్రాసినారు, పెక్కుశాసనాలు చదివినారు. సోమశేఖర శర్మగారి తరువాత ఎన్నదగిన చరిత్రకారుడు. వారిని ఆంధ్రులచరిత్ర సంస్కృతులను గూర్చి పరిషత్తుపక్షాన మూడు ఉపన్యాసాలు ఈయమని కోరగా అంగీకరించినారు. ఆ ఉపన్యాసాలు గ్రంథరూపంగా ప్రకటితమైనవి. వెంకటరమణయ్యగారికి ఫారసిభాష కూడా బాగా వచ్చేది. ఒకరోజువారి వెంబడి మేము గోలకొండ కోటకువెళ్ళి అక్కడ కుతుబ్‌షాహీ రాజుల సమాధులను చూచినాము. అప్పుడు మాకు వారు ఆ రాజులను

గూర్చి అనేక ఫారసీ కవితలను చదివి అర్థము చెప్పగా ఆశ్చర్యచకితుల మయినాము. అప్పుడు పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖకు అధ్యక్షులుగా ఉండేవారు. వారు కూడా పరిషత్తు ఆహ్వానాన్ని స్వీకరించి తిక్కన భారతాన్ని గూర్చి మూడు ఉత్తమమైన ఉపన్యాసాలు గావించినారు. లక్ష్మీకాంతం గారు కవులు, పండితులు, వక్తలు. వారికి అంతరంగ మిత్రులు కాటూరి వెంకటేశ్వరరావుగారు ఈ ఉభయులు చెళ్ళపిళ్ళ వెంకటశేషశాస్త్రిగారికి అభిమానాస్పదులైన ప్రియశిష్యులు, జంటకవులు. వీరువ్రాసిన తొలకరి, సౌందరనందము తెలుగుదేశం ఆదరించిన కావ్యాలు. కాటూరి వెంకటేశ్వర రావుగారు పరిషత్తు టీముతో చాలా స్నేహంగా ఉండేవారు. ఈ కాలంలో శివశంకర స్వామిగారికి పరిషత్తుతో అత్యంత సన్నిహితత్వం ఏర్పడినది. వారు హైదరాబాదు వస్తే పరిషత్తు లోనే విడిదిచేసి అహర్నిశలు పరిషత్తు కార్యకర్తలతో కలిసి మెలిసి ఉండి వారికి ఉత్సాహాన్ని విజ్ఞానాన్ని ప్రసాదించేవారు. శివశంకర స్వామిగారికి బహుభాషలలో ప్రావీణ్యము. లలితకళలను గూర్చిన సంపూర్ణ విజ్ఞానము. వారి స్వభావం మృదుమైనది. వారు చూపే మర్యాద లలితమైనది. స్వామిగారి వియ్యంకులు మొక్కపాటి నరసింహశాస్త్రిగారు. తెలుగులో హాస్యాన్ని పోషించినవారిలో ముఖ్యులు, బారిస్టర్ పార్వతీశం గ్రంథకర్త. వీరు అప్పుడప్పుడు వచ్చి పరిషత్తు సమావేశాలలో పాల్గొని పరిషత్తు కార్యకర్తలకు ఆప్తులుగా ఉండేవారు. ఈ విధంగా ఆంధ్రదేశ కవిపండితులలో చాలామంది పరిషత్తు ఆప్తవర్గంలో చేరినారు.

మంచిర్యాల సభల తర్వాత పరిషత్తులో వచ్చిన చీలికలు, ఆ పిమ్మట జరిగిన కథ, తదనంతరము పరిషత్తు నిర్వహణ బాధ్యతలు యీటీముకు సంక్రమించడం జరిగినది. పబ్లిక్ సంస్థలను ప్రభుత్వోద్యోగుల కంటె అనధికారులు నడిపితేనే బాగుంటుందని పరిషత్తు కార్యకర్తలు అనుభవం వలన గుర్తించినారు. తరువాత జరిగిన సంఘటనలు కూడా యీ అనుభవాన్ని బలపరిచినవి. అందుచేత ప్రభుత్వోద్యోగి కాని వ్యక్తిని పరిషత్తు అధ్యక్షుడుగా ఎన్నుకోవలెనని ఒక నిర్ణయానికి రావడం జరిగింది. 1952లో మొదటిసారి సాధారణ ఎన్నికలు జరిగినవి. ఈ ఎన్నికల తరువాత పరిషత్తు అధ్యక్షపదవి ఖాళీ ఏర్పడినది. అప్పుడు నేను అధ్యక్షునిగా ఎన్నిక కావడం జరిగింది. నా యెన్నికల తరువాత ప్రభుత్వం నుండి పరిషత్తుకు సహకారం ఎక్కువగా లభించినదని నా అనుభవం రుజువు చేసినది.

1943లో పరిషత్తు స్థాపన సందర్భంలో నాకు ఆ సంస్థతో ఏర్పడిన సంబంధం క్రమక్రమంగా దృఢపడింది. 1944లో కార్యవర్గ సభ్యునిగా ఎన్నికయై 1949లో ఉపాధ్యక్షుడనై, పరీక్షా కార్యదర్శినై పరిషత్తు కార్యక్రమాలలో పూర్తిగా నిమగ్నుడనైతిని. 1948-53 మధ్యన పరిషత్తుతో అవినాభావ సంబంధము కలిగినది. ఇతర ఉద్యమాలు వేనిలో పాల్గొనినా, అవి రాజకీయ ఉద్యమాలైనను, సాంస్కృతిక, వైజ్ఞానిక ఉద్యమాలైనను ఏవైనను జీవితముతో పూర్తిగా పెనవేసుకుపోయినది సారస్వతపరిషత్తు మాత్రమే. అది యావజ్జీవిత సంబంధంగా పరిణమించినది. ఆంధ్ర సారస్వత పరిషత్తు శాఖోపశాఖలుగ విస్తరించి రాష్ట్రేతర ప్రాంతాలలో కూడ పరీక్షల నిర్వహణ, ఉత్తమశ్రేణి ప్రచురణల, సాహిత్య సమావేశాల ఏర్పాటు మొదలైన కార్యక్రమాలతో ముందుకుసాగింది. హైదరాబాదు రాజధాని నగరంలో పరిషత్తుకు విశాలమైన వసతి, భవనాలు ఏర్పడినవి. మంచి గ్రంథాలయం రూపొందినది ఎమ్.ఏ. తరగతులవరకు బోధనచేసే ప్రాచ్యకళాశాలను పరిషత్తు నిర్వహిస్తున్నది. అనేక సాహిత్య సాంస్కృతిక కార్యకలాపాలకు పరిషత్తు కేంద్రమైనది. దేశంలో యీ విధంగా సువ్యవస్థితమైన సారస్వత సంస్థలు మిక్కిలి తక్కువ. అందరి సహకారంతో తెలుగువారు గర్వించదగిన ఒక మహాసంస్థగా యీనాడు పరిషత్తు శోభిల్లుతున్నది. పరిషత్తు వికాసానికి జీవితంలో అత్యధిక భాగాన్ని వినియోగించిన సంతృప్తి పూర్తిగా నాకున్నది. ఇంటిలోని వ్యవసాయాన్ని విస్మరించి, సులభంగా సాధించగలిగిన ఉద్యోగాలు జోలికిపోక, అనుకూలంగా అవలంబించగలిగిన న్యాయవాద వృత్తిని గూర్చి శ్రద్ధ వహించక, యీవిధంగా సారస్వత పరిషత్తు నుండి ప్రారంభించి పూర్తిగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలలో మునిగిపోయినాను.

"బంగారు వంటి కోమటి
సంగీతము చేతబేర
సారము లుడిగెన్"

అని అప్పుడప్పుడు మా బంధుమిత్రులు అంటుంటారు. ఎవరు ఏమన్న ఉత్సాహంగా ఒక సముద్రంలో పడి యీతకొట్టడం జరిగింది. ఒక ప్రణాళిక వేసుకొని సాగించిన జీవయాత్ర కాదునాది.

1953 జనవరి నెలలో ఆంధ్రసారస్వత పరిషత్తు సప్తమ వార్షిక సభలు అలంపురంలో జరిగినవి. సభలకు అధ్యక్షత వహించే సదవకాశం నాకు లభించినది.

సభలను అప్పుడు ఉపరాష్ట్రపతిగా ఉండిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణగారు ప్రారంభించిరి. ఆనాడు హైదరాబాదు రాష్ట్రానికి బూర్గుల రామకృష్ణారావుగారు ముఖ్యమంత్రిగా ఉండిరి. మంచిర్యాల సభల సంఘటన తరువాత పరిషత్తుకు వారికి మధ్య అవసరమైన సన్నిహితత్వం లేకపోయినది. అందుచేత హైదరాబాదు ప్రభుత్వంతో సంప్రదించకనే నేను ఢిల్లీకి వెళ్ళి రాధాకృష్ణ పండితునితో కలిసి సభలను ప్రారంభించవలెనని ఆహ్వానించితిని. రాజ్యసభ సభ్యుడు, నాకు చిరకాల మిత్రుడు డాక్టర్ రాజబహద్దూర్‌గౌడ్‌తోపాటు అప్పుడు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకులైన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారు నన్ను డాక్టర్ రాధాకృష్ణగారి గదిలోనికి తీసుకొనివెళ్లి వారితో పరిచయం చేసిరి. రాధాకృష్ణన్‌గారి అంగీకారము సకలాంధ్రప్రీతి గావించినది. సభలు మహావైభవంగా జరిగినవి. రాష్ట్ర ముఖ్యమంత్రి, యితర మంత్రులు కూడా వేదిక నలంకరించిరి. శ్రీపాద నుండి శ్రీశ్రీ వరకు గల యావదాంధ్ర కవిపండితులు సభలలో పాల్గొనిరి. విశ్వనాథ సత్యనారాయణగారు స్నాతకోపన్యాసం చేసిరి. సాహిత్య సమావేశాలు, కవిసమ్మేళనం, సాంస్కృతిక ప్రదర్శనలతో మూడు రోజులు సభలు జరిగినవి. రాధాకృష్ణగారు ప్రధాన ఉపన్యాసము ఇంగ్లీషులో చేసినప్పటికిని సభ్యుల కోరికమీద కొంతసేపు తెలుగులో అనర్గళంగా మాట్లాడినారు. సారస్వత పరిషత్ చరిత్రలో యిది మహోజ్జ్వలమైన ఘట్టం. రాధాకృష్ణగారికి తెలుగుభాషా సంస్కృతులపై ప్రీతి. తెలుగు సాహిత్యంతో పరిపూర్ణమైన పరిచయం ఉండినది. నేను ఎప్పుడు కలిసినా తెలుగులోనే మాట్లాడేవారు. తెలుగు కవులను గురించి ప్రస్తావించేవారు, తెలుగు పద్యాలను చదువుతుండేవారు. ఏదైనా పద్యాన్ని చదువుతూ పూర్తిచేయలేకపోతే పూర్తిచేయమని కోరేవారు. ఇదొక సాహిత్య పరీక్షగా ఉండేది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు వికాసానికి తోడ్పడిన ఆంధ్రేతరులు కొందరు ఉన్నారు. అప్పటి విద్యాశాఖామంత్రి ఫూల్‌చంద్ గాంధీగారు, ఆర్థికశాఖామంత్రి డాక్టర్ మెల్‌కోటిగారు పరిషత్తుకు సహాయం చేసినారు. హిందీ ప్రచారసభ అప్పటి అధ్యక్షులు, ప్రభుత్వ విద్యాశాఖ ఆర్థికశాఖల కార్యదర్శులుగా పనిచేసిన ఎల్.ఎన్.గుప్తగారు పరిషత్తుకు పూర్తిగా తోడ్పడినారు. ఎల్.ఎన్.గుప్తగారు హైదరాబాదు సివిల్ సర్వీసులో ప్రవేశించి, క్రమక్రమంగా ప్రభుత్వ కార్యదర్శి పదవిని అందుకున్నారు. ఆయన మాతృభాష హిందీ అయినప్పటికి తెలుగు సంస్థలకు సహాయం చేసినారు. ఆయన సమర్థుడైన పరిపాలకుడు. ఉత్తమ అభిరుచిగల విజ్ఞాని; సరసుడు, హైదరాబాదులో

అనేక సంస్థలను నిర్మించి అభివృద్ధి చేసిన ప్రతిభావంతుడు. ప్రభుత్వోద్యోగులలో యిటువంటివారు తక్కువ సంఖ్యలో కనుపించుతారు. తెలుగుభాషా సంస్కృతుల ప్రచారానికి ఏర్పడిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు నగరంలోని హిందీ, ఉర్దూ సంస్థల సహకారం సంపూర్ణంగా లభించినది. మహారాష్ట్ర, కర్ణాటక సాహిత్య సభలు పరిషత్తుకు దగ్గరగా వచ్చినవి. ఈ సత్ సంబంధాలను గమనించి డా॥ రాధాకృష్ణగారు హర్షామోదములను ప్రకటించిరి. ఆంధ్ర భాషా వికాసానికి పరిషత్తు చేస్తున్న కృషిని వారు అభినందించిరి, ఆశీర్వదించిరి. డా. రాధాకృష్ణగారితో ఏర్పడిన యీ పరిచయం క్రమక్రమంగా అభివృద్ధి పొంది వారి అవసానం వరకు నిలిచినది. 1959లో డా.రాధాకృష్ణగారు, నేను అప్పుడు కార్యదర్శిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి వార్షికోత్సవంలో పాల్గొనిరి. 1960-62 మధ్యన నేను రాజ్యసభ సభ్యుడుగా ఉన్నప్పుడు వారు రాజ్యసభకు అధ్యక్షులుగా ఉండేవారు. 1960 ఆగస్టులో రాజ్యసభకు నేను ఏకగ్రీవంగా యెన్నికయైన తర్వాత ప్రమాణ స్వీకారానికి ముందు డా.రాధాకృష్ణన్‌గారిని కలుసుకొనగా "రాజ్యసభకు సుస్వాగతం ఢిల్లీకి సుస్వాగతం" అని వారు అన్న మాటలు నా చెవులలో ప్రతిధ్వనిస్తున్నవి. అయితే నా రాజ్యసభ సభ్యత్వం రెండు సంవత్సరాలకన్న ఎక్కువ కాలం నిలువలేదు. ఉపఎన్నికలో రాజ్యసభకు ఎన్నికయైన నాకు అప్పటి సంప్రదాయం ప్రకారం మరొక టర్మ్ రావలసియుండెను. కాని కాంగ్రేస్ నాయకుల గర్భశైత్యాలు, పెనుగులాటలు, కల్మషాలు కారణంగా రెండవ పూర్తి టర్మ్ నాకు రాలేదు. నేను కూడా యీ విషయమై ప్రయత్నమేమీ చేయలేదు. నాపై ఆదరాభిమానాలు చూపిన రాధాకృష్ణన్ గారిని కూడా కలుసుకొని యీ విషయంలో సహాయం చేయమని కోరలేదు. జవహర్‌లాల్ నెహ్రూగారికి చెప్పలేదు. రాష్ట్రనాయకులను ఆశ్రయించలేదు. ఈ కళంకము రాష్ట్ర నాయకత్వం గౌరవంగా భావించుకుంటె అది అట్లాగే ఉండనిమ్మని నేను ఆ విషయమే మరిచిపోయినాను.

తెలుగుదేశంలోని కవిపండితులు చాలా మంది నన్ను అభిమానించినారు. ఆంధ్ర కవి పండితులు సుమారు 25 మంది గడచిన రెండు దశాబ్దాలలో తమ కృతులను నాకు అంకితమిచ్చి నాపైన పూలవాన కురిపించి నా సాహిత్య కృషిని ప్రోత్సహించినారు. ఒక్కమారు యీ కవి పండితులను, రచయితలను స్మరించుకుంటే నేను పులకాంకిత గాత్రుడను ఔతుంటాను. చూడండి ఆ పట్టిక నొకమారు.

1. అశ్వఘోషుడు (నాటకము) డా. అరిపిరాల విశ్వం.
2. నవోదయం – కీ.శే.బెల్లకొండ చంద్రమౌళిశాస్త్రి.
3. అనపోతు – కీ.శే.సిద్ధయ్యకవి
4. కవితాపుష్పకం – డా.దాశరథి
5. మనహాస్యము – స్వర్గీయ మునిమాణిక్యం నరసింహారావు.
6. సాహిత్య కౌముది – శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ
7. జయంతి – శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి
8. సాహిత్య సౌరభం – డా॥ జి.వి.సుబ్రహ్మణ్యం
9. జాతక కథలు (ఐదవ భాగం) స్వర్గీయ స్వామి శివశంకరస్వామి
10. ఉదయం నా హృదయం – డా॥ సి.నారాయణరెడ్డి
11. భాషాచారిత్రక వ్యాసావళి – డా. తూమాటి దోణప్ప
12. మందారాలు – శ్రీ పోతుకూచి సాంబశివరావు
13. వైతరణి – కుమారి వాసిరెడ్డి సీతాదేవి.
14. అక్షరగుచ్ఛము – డా. జ్ఞానానందకవి.
15. ప్రతిజ్ఞ – శ్రీ ఎన్.వి.జగన్నాథం (మాజీ శాసన సభ్యులు)
16. పారసీ కవుల ప్రసక్తి – శ్రీ ఎస్.సదాశివ.
17. అల్లసాని పెద్దన – డా. పల్లా దుర్గయ్య
18. శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము – శ్రీ జంధ్యాల జయకృష్ణ ప్రసాద్ బాపూజీ
19. నెలవంక – ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యా కళాశాల పక్షాన వెలువడిన ప్రత్యేక సంచిక.
20. కాంతిపుంజాలు – శ్రీ నీలా జంగయ్య
21. బొమ్మ – శ్రీమతి జ్యోతిర్మయి.
22. కావ్యమీమాంస (రాజశేఖరవిరచిత) – డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు.
23. బల్లకట్టు బాపులు – శ్రీమతి లక్ష్మీరమణ
24. పుంభావ సరస్వతి శ్రీనాథుడు – శ్రీ పాతకోట రాధాకృష్ణమూర్తి.
25. లజ్జా కిరీటధారిణి – శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ.

ఆశ్చర్యమేమనగా తెలుగు సాహిత్యంతో నా జీవితం పూర్తిగా పెనవేసుకొని పోయినప్పటికిని తెలుగును నేను ఒక క్రమ పద్ధతి ప్రకారం అధ్యయనం చేయలేదు. పూర్వపు నిజాం రాష్ట్రంలో ఉర్దూభాషా సంస్కృతులకు ప్రాబల్యం గల కాలంలో మొదటి నుంచి ఇంగ్లీషు ద్వారా నా విద్యాభ్యాసం జరిగినది. అయితే తెలుగు నవలలు నన్ను మాతృభాషవైపు ఆకర్షించినవి. విజ్ఞాన ప్రచారిణి గ్రంథమాల ప్రకటించిన "విమలాదేవి", ఆంధ్ర ప్రచారిణి ప్రకటించిన "ప్రమదావనం" హేమలత, గణపతి మొదలైన నవలలు వరంగల్‌లోని మా ఇంటి దగ్గరనే ఉన్న చిలకమర్తి శబ్దానుశాసన గ్రంధాలయం నుండి తెచ్చుకొని చదివేవాడిని. క్రమక్రమంగా ధర్మవరం, పానుగంటి, చిలకమర్తి నాటకాలు గూడ చదువుతుండేవాడిని. వీరేశలింగం సంపూర్ణ గ్రంథావళి 10 సంపుటాలు అప్పుడే వెలువడినవి. ఆ సంపుటాలలో ప్రహసనాలు నాటకాలు, రాజశేఖరచరిత్ర, సత్యరాజా పూర్వదేశయాత్రలు అదే రోజులలో చదివినాను. ఈ విధంగా తెలుగు భాషలో నాకు అభిరుచి అలవడింది.

సకలాంధ్ర దేశానికి, సమస్త ఆంధ్ర వాఙ్మయానికి ప్రాతినిధ్యం వహించే విద్వన్మణి మండలిని యీ పట్టికలో చూడవచ్చును. స్త్రీలు, పురుషులు, యువకులు, పెద్దలు, లబ్ధప్రతిష్టులు అభివృద్ధికి రాదగిన రచయితలు యీ పట్టికలో కనిపిస్తున్నారు. ఇంతమంది నాపట్ల అక్షరమైన ఆదరణ చూపించినారంటే అది వారి సౌజన్యం, నిర్ హేతుక జాయమాన కటాక్షం అని మాత్రమే చెప్పవలెను. నా యోగ్యత యొక్క పరిమితులు నాకు బాగా తెలిసినవే; ఏమైనప్పటికిని వీరందరు నా శ్రేయస్సును కాంక్షించి నా చేత తెలుగు సరస్వతికి మరికొంత కాలం ఊడిగము చేయించవలెననే ఉద్దేశంతో యీ కృతి ప్రదానం కావించినారని నా అభిప్రాయం. ఈ అభిప్రాయంతోనే యీ కృతి స్వీకరణకు నేను సమ్మతించడం జరిగింది. వీరి ఆశీర్వాద బలంతో జీవించినంత కాలం తెలుగుభాషా సంస్కృతులకు చేతనైన సేవచేయవలెనని నాదృఢ నిశ్చయం. ఆ నిశ్చయం వీరందరికి సంతృప్తి కలిగించగలదనే నావిశ్వాసం. ఈ కృతి ప్రదానాలు నాజీవితంలో అవిస్మరణీయమైన ఘట్టాలు; నాకు లభించినటువంటి గొప్ప గౌరవాలు; నేను అన్నిటికన్న ఎక్కువగా విలువకట్టి నాజీవితంలో ప్రాధాన్యం యిచ్చినటువంటి సంఘటనలు. తెలుగు దేశంలో గొప్పవారు చాలామంది ఉన్నారు. కాని వారిలో చాలాకొద్దిమందికి యిటువంటి గౌరవాలు లభించినవి. ఆ కొద్దిమందిలో నేను చేరడం నా సుకృత విశేషం.

గీ॥ ఏ ప్రఫుల్ల పుష్పంబుల ఈశ్వరునకు
పూజసేసితినో ఏను పూర్వమందు
కలదయేని పునర్జన్మ కలుగుగాక
మధురమధురమైన తెలుగు మాతృభాష

వరంగల్‌కు వచ్చిన కవిపండితులు అందరు మా ఇంటికి తప్పక వస్తూండేవారు. మా నాయనగారికి (స్వర్గీయ దేవులపల్లి వెంకటాచలపతిరావుగారు) తెలుగుభాషా సాహిత్యాలు అంటే ఇష్టం. కవిపండితులను ఆదరించేవారు, స్వయంగా కవిత్వం చెప్పేవారు. ఒద్దిరాజు సీతారామచంద్రరావు రాఘవరంగారావు సోదరులు అప్పుడు తెనుగు పత్రికను మానుకోట తాలూక ఇనుగుర్తి నుండి నడపుతుండేవారు. కొంతకాలం యీ పత్రికను వరంగల్ నుండి కూడా నడిపినారు. స్వయంగా మఖ్తేదారులు, దేశ్‌ముఖ్‌లు అయినందున వీరికి జిల్లా కేంద్రమైన వరంగల్‌లో ఏవోపనులుండేవి. వరంగల్‌లో వీరు మాయింటిలోనే దిగేవారు. శేషాద్రి రమణకవులలో ఒకరైన దూపాటి వెంకట రమణాచార్యులవారు కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రతినిధులుగా జయంతి రామయ్య పంతులుగారి ఆదేశం మీద వరంగల్, కరీంనగర్ ప్రాంతాలలోని శాసనాలను, తాళపత్ర గ్రంథాలను సేకరించే నిమిత్తం వస్తుండేవారు. ఎడ్లబండిమీద శాసనాలను తాళపత్ర గ్రంథాలను వరంగల్ ప్రాంత గ్రామాల నుండి తీసుకొని వచ్చేవారు. మా ఇంటిలోనే వసతిగనుక, తీరిక సమయాలలో ఒద్దిరాజు సోదరులవలెనే వీరుకూడ నాకు తెలుగు సాహిత్యాన్ని పరిచయం చేస్తూ పద్యాలు చదివి వినిపిస్తుండేవారు. సంపన్ముదుంబ సింగరాచార్యులవారు అనే పండితులు జగ్గయ్యపేట వాస్తవ్యులు. వారు కూడా ఎక్కువగా కొన్నాళ్లు వరంగల్ వస్తుండేవారు. భాగవతం ప్రథమ; ద్వితీయ స్కంధాలను, ఏకాదశ ద్వాదశ స్కంధాలను వీరు తెనిగించినారు. పోతన వరంగల్ వాస్తవ్యుడైనందున యీ స్కంధాల ప్రచురణ కొరకు ఆర్థిక సహాయ నిమిత్తం వారు వరంగల్‌కు వస్తుండేవారు అనుకుంటాను. ప్రథమ, ద్వితీయ స్కంధాలు, ఏకాదశ, ద్వాదశ స్కంధాలు పోతన వ్రాసినవి ఖిలములై పోయినందువలన తాము యీ స్కంధాలను మాత్రమే తెనిగించడానికి పూనుకున్నామని వారు చెప్పుతుండేవారు. ఆచార్యుల వారు గొప్పపండితులు, కవులు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారికి సన్నిహితులు. వారి భారతాంధ్రీకరణంలో ఆచార్యులవారు తోడ్పడినారని చెప్పేవారు. భీష్మపర్వానికి కాబోలు వారు పీఠిక కూడా వ్రాసినారు.

సంస్కృతభాష చదువుకోవలెనని నాకు కోరిక ఉన్నప్పటికిని కొనసాగలేదు. ఒక సంఘటన జ్ఞాపకం వస్తున్నది. 1931వ సంవత్సరము అనుకుంటాను నేను హనుమకొండ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ (Fourth Form)లో విద్యార్థిని. దూపాటి వెంకట రమణాచార్యులవారు అప్పుడే కొత్తగా వచ్చి సంస్కృతాన్ని బోధిస్తుండేవారు. నాకు వారితో పూర్వపరిచయం వలన తగినంత చనువు ఉండేది. సంస్కృతాన్ని నేను ఐచ్ఛికంగా తీసుకొన్నాను. రెండు మూడు పాఠాలు జరిగినవి. రామశబ్దాన్ని కంఠస్థం చేయవలెనని ఆచార్యులవారి ఆదేశం. నాకు కంఠస్థం కాలేదు. బెంచీమీద నిలబడమని ఆచార్యులవారు ఆగ్రహించిరి. నేను వెంటనే వారికి ఒక నమస్కారం చేసి, నాకు యీ సంస్కృతం వద్దు, నేను యీ బెంచీమీద నిలబడను పక్కనే ఉన్న గణితశాస్త్రం తరగతిలో చేరుతాను అని చెప్పి వెళ్ళిపోయినాను. సంస్కృతం మాట ఎట్లున్నప్పటికి తెలుగులోను, ఇంగ్లీషులోను పుస్తకాలు చదివే అలవాటు చిన్నతనంలోనే నాకు కలిగినది.

తెలుగుభాషలో గ్రంథావలోకం నన్ను తెలుగు సాహిత్యంవైపు మరలించినది. భావకవుల కవితలు నిజాంకళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు చదువుతుండేవాడిని. అప్పుడే ముద్దుకృష్ణగారి సంపాదకత్వంలో వెలువడిన 'వైతాళికులు' నా కంటపడినది. ఆ పుస్తకం నన్ను బాగా ఆకర్షించినది. ఎప్పుడూ అందులోని పద్యాలు చదువుతుండేవాడిని. రాయప్రోలు వారు హైదరాబాదులోనే ఉండేవారు. దూరంగా సభలలో వారిని చూస్తుండేవాడిని. విశ్వనాథ సత్యనారాయణగారి కిన్నెరసాని పాటలు నాకు ఎంతో యింపుగా ఉండేవి. స్వయంగా సత్యనారాయణగారు యీ పాటలు పాడినపుడు నేను పరవశుణ్ణి అయ్యేవాణ్ణి. వైతాళికుల తరువాత రాయప్రోలు వారి రచనలు చదివినాను. ఆయనవలె కవిత్వం వ్రాయవలెననే కుతూహలం కూడా నాలో కలిగింది. అయితే నేను 1939లో డిగ్రీ తీసుకున్న తరువాతనే కవిత్వం వ్రాయడం మొదలుపెట్టినాను. 1939–42 మధ్య ఇంటిలో తీరికగా ఉండేవాడిని. పని ఉండకపోయేది. లా కాలేజిలో అప్పటి వరకు చేరలేదు. భావకవుల ప్రణయ కవిత్వం, దేశంలో జరుగుతున్న స్వాతంత్రోద్యమం రెండూ నన్ను ప్రభావితుణ్ణి చేసినవి. ఆ ఉత్సాహంలో, ఆ ఊపులో కవిత్వం కొంత అల్లుతుండేవాడిని. అది కూడా చిత్రంగా నడుస్తుండేది. సాయంకాల వాహ్యాళీ వెళ్ళి తిరిగి వచ్చేలోపల ఏవో కొన్ని పద్యాలు మెదడులో దొరిలేవి. రాగానే వానికి లిఖితరూపం యిచ్చేవాణ్ణి. 1942–44 మధ్యన

నాగపూర్ న్యాయకళాశాలలో ఉన్నప్పుడు కూడా యిదే అనుభవం. ఈ కవిత్వమే తరువాత 'పచ్చతోరణం'గా 1953లో ప్రకటితమైనది. రాయప్రోలు సుబ్బారావుగారు నా కవిత్వాన్ని మెచ్చుకొని పుస్తకానికి పీఠిక వ్రాసినందువలన సాహసంచేసి యీ పుస్తకాన్ని ప్రకటించినాను. శివశంకరస్వామి, పింగళి లక్ష్మీకాంతం, మల్లంపల్లి సోమశేఖరశర్మ, వేలూరి శివరామశాస్త్రి, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి మొదలైన కవిపండితులు, నా కవిత్వాన్ని ప్రశంసించడం నా ఆనందానికి కారణమైనది. ఇదేకాలంలో వ్యాసరచనలు కూడా కాలక్షేపం చేసే ఉద్దేశంతో ఉపక్రమించినాను. గోలకొండ, తెలంగాణ పత్రికల ప్రోత్సాహం. విశ్వనాథ సత్యనారాయణగారి ఆమోదం నాకు లభించినవి. కవిత్వాన్ని తొందరగానే విరమించినప్పటికీ, వ్యాస రచనా కృషిని యీనాటికి సాగిస్తూనే ఉన్నాను. కవితావ్యాసంగం కొనసాగించలేదని, అది దురదృష్టకరమని రాయప్రోలు సుబ్బారావుగారు నా "పచ్చతోరణం" తొలిపలుకులో వ్యాఖ్యానించినారు. డాక్టర్ నాయని కృష్ణకుమారిగారు కూడా మేము కలుసుకున్నప్పుడు యిదే అభిప్రాయాన్ని వెల్లడి చేయడం జరుగుతున్నది. నేను తొలిరోజులలో వ్రాసిన సాహిత్య విమర్శ స్త్రీలపాటలలో కవిత్వాన్ని గురించినది. అప్పుడు ఆంధ్రప్రభకు న్యాయపతి నారాయణమూర్తిగారు సంపాదకులుగా ఉండేవారు. వారు నా యీ వ్యాసాన్ని ప్రముఖంగా ప్రకటించినారు. తరువాత వ్యాసాలను అప్పుడప్పుడు వ్రాస్తూ ఉండడం పండితులకు పంపిస్తూ ఉండడం జరుగుతుండేది. కృష్ణాపత్రిక నా వ్యాస సంపుటాలను ప్రశంసిస్తూ సమీక్షించింది. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, వేలూరి శివరామశాస్త్రిగారు, సోమశేఖర శర్మగారు, పుట్టపర్తి నారాయణాచార్యులవారు మొదలైన కవిపండితులు నా రచనలను ప్రశంసించి నందు వలన నా ఉత్సాహము రెండింతలు పెరిగినది.

పోలీసు చర్యకు పూర్వం తెలంగాణలో తెలుగు సాహిత్య దీపాలు ఎన్నడూ ఆరిపోలేదు; ఆంగ్లవిద్యా మూలకమైన ఆధునిక నాగరికత ప్రభావం పడకపోయినప్పటికిని ప్రభుత్వపు ఆదరణ లేకపోయినప్పటికిని సంస్కృతాంధ్రాలలో నిష్ణాతులైన పండితులుండేవారు. వనపర్తి; గద్వాల మొదలైన సంస్థానాలలో వీరికి పోషణ లభిస్తుండేది. ప్రతి సంవత్సరం యీ సంస్థానాలు కవిపండితులను సన్మానించేవి. ఈ సంస్థానాల పోషణలో ఉన్న పండితులు చాలామంది సకలాంధ్ర ప్రఖ్యాతి పొందినారు. మైసూరు, కాశ్మీరు మొదలైన సంస్థానాల సత్కారము కూడా

వీరిలో కొందరు పొందినారు. ఆధునిక కాలంలో కూడా పూర్వం సంప్రదాయానికి చెందిన కవిపండితులు. కవులు తగినంతమంది తెలంగాణలో ఉన్నారు. కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు వనపర్తి సంస్థానానికి చెందినవారు. సంస్కృతాంధ్రాలలో పండితులు, ఉర్దూ; ఫారసీలలో తగినంత పరిచయం కలవారు. వనపర్తి సంస్థానానికి చెందినవారు మాదిరాజు విశ్వనాథరావుగారు అనే కవిమిత్రునితో కలిసి 'విక్రమాంకదేవ చరిత్రము' అనే కావ్యాన్ని తెలుగులో రచించినారు. సమాచార శాఖలో, విద్యాశాఖలో ఉన్నతోద్యోగాలను చేసినారు. బాలసరస్వతి గ్రంథాలయానికి కొంతకాలం కార్యదర్శిగా ఉండేవారు. ఆంధ్ర సారస్వత పరిషత్తులో సభ్యులు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమిలో కూడా కొన్నాళ్ళు సభ్యులుగా ఉండినారు. సంస్కృత భాషా ప్రచారానికి కృషి చేసినారు; మంచి వక్తలు. కేశవపంతుల నరసింహశాస్త్రిగారు కవులు, పండితులు. ఆంధ్ర సారస్వత పరిషత్తులోను, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమిలోను సభ్యులుగా ఉన్నారు. రేడియోలో ఉన్నతోద్యోగం చేసినారు. అనేక సంవత్సరాలు రేడియోలో సంస్కృత పాఠాలు చెప్పినారు. ఉత్తమశ్రేణివక్తలు, రచయితలు, సంస్కృతాంధ్రాలలో ప్రామాణికులు. అయితరాజు కొండలరావుగారు సంస్కృతాంధ్రాంగ్లాల లోనేగాక అరబ్బీ, ఫారసీ, ఉర్దూ భాషలలో ప్రవీణులు. ఉర్దూ, తెలుగు నిఘంటువులను సిద్ధం చేసి ప్రకటించినారు. గుండేరావు హర్కారేగారు న్యాయశాఖలో సెషన్‌జడ్జి ఉన్నతోద్యోగాన్ని నిర్వహించినారు. అనేక భాషలలో ప్రామాణికులైన పండితులు. ఫారసి, అరబ్బీ, సంస్కృతం, ఉర్దూ భాషలలో నిష్ణాతులు. మరాఠి, కన్నడ భాషలలో ప్రవీణులు, సాహిత్యం, వ్యాకరణం వీరి కరతలామలకాలు, కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల సన్మానాలు పొందినారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి విశిష్ట సభ్యత్వము వీరికి యిచ్చినది. సంస్కృత భాషలలో అనేక గ్రంథాలు వ్రాసినారు. సకల భారత పండితలోకంలో గణనీయులు అని చెప్పదగినవారు.

ఆధునిక సంప్రదాయానికి చెందిన కవులు, పండితులు,రచయితలు కూడా తెలంగాణలో పోలీసు చర్యకు పూర్వం తగినంతమంది ఉండేవారు. మాడపాటి హనుమంతరావుగారు ప్రేంచంద్ కథలను తెలుగులోకి అనువదించినవారిలో ప్రథములు. సురవరం ప్రతాపరెడ్డిగారు సుప్రసిద్ధులు. కథానిక మొదలైన ఆధునిక వాఙ్మయ ప్రక్రియలో ఆరితేరినవారు. బూర్గుల రామకృష్ణారావుగారు కవులు, ఆధునిక వాఙ్మయాన్ని గూర్చి, ఉర్దూ భాషా సారస్వతాలను గూర్చి అనేక వ్యాసాలు వ్రాసినారు.

వీరి 'సారస్వత వ్యాసముక్తావళి' ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన ప్రకటితమైనది. ఏకారణం వల్లనో భావకవిత్వ ప్రభావం ఎక్కువగా తెలంగాణ మీద పడలేదు. రాజకీయాలను నడిపినవారు కూడా తెలంగాణ సాహిత్యరంగంలో కృషి చేసినారు. కథానికారచన తెలంగాణలో చాలాబాగా వ్యాప్తి చెందినది. మాడపాటి, సురవరం ప్రభృతులైన పెద్దలేకాక వారి తరువాత తరానికి చెందిన యువకులు యీ రంగంలో ముందడుగు వేసినారు. నందగిరి వెంకటరావుగారు బి.ఏ;బిఎల్ పట్టభద్రులు. కొంతకాలం న్యాయవాదిగా ఉండి తరువాత సెషన్ జడ్జిగా పనిచేసి పదవీ విరమణ గావించినా ఉత్తమమైన కథలను వారు వ్రాసినారు. చలంతో పోటీపడి వారు వ్రాసేవారని ఆరోజులలో ఈ ప్రాంతపు పాఠకులు అనుకునేవారు. వారి సతీమణి ఇందిరాదేవిగారు మేలైన కథలు వ్రాసినారు. ఎల్లాప్రగడ సీతాకుమారిగారు మంచి కథలను వ్రాసినారు. భాస్కరభట్ల కృష్ణారావుగారు బిఏ, ఎల్ఎల్.బి పట్టభద్రులు. హైదరాబాదు రేడియోలో అధికారిగా పనిచేసినారు. మొదటి తరగతి కథానికా రచయితలు. మంచి నవలలు వ్రాసినారు. అకాల మరణానికి గురియైనారు. వీరు యావదాంధ్ర ప్రఖ్యాతి గాంచిన రచయితలు. తెలంగాణ రాజకీయ సాంఘిక జీవితాన్ని ప్రతిబింబించే నవలలను, కథలను ఆళ్వార్‌స్వామిగారు వ్రాసినారు. వీరుకూడా అకాలమరణానికి గురికావడం దురదృష్టకరమైన సంఘటన. సాధన సమితికి అనేక సంవత్సరాలు అధ్యక్షులుగా ఉండిన బూర్గుల రంగనాధారావుగారు మంచి కథానికలను కవితలను వ్రాసినారు. వీరు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సెక్రటేరియట్‌లో సహాయ కార్యదర్శిగా పనిచేసి విరమించినారు. నెల్లూరి కేశవస్వామిగారు పిడబ్ల్యూడి శాఖలో ఇంజనీయర్‌గా ఉద్యోగం చేసినారు. సాధన సమితికి అనేక సంవత్సరాలు కార్యదర్శిగా ఉండినారు. కథానికా రచయితలలో ప్రథమశ్రేణికి చెందినవారు. వెల్దుర్తి మాణిక్యరావుగారు కథలను, గేయాలను అసంఖ్యాకంగా వ్రాసి ప్రసిద్ధిగాంచినారు. ధరణికోట శ్రీనివాసులుగారు సాంసారిక కథలను వ్రాయడంలో సిద్ధహస్తులు. వీరు చిన్నవయసులోనే పరలోకగతులైనారు. వానమామలై వరదాచార్యుల వారు పండిత కుటుంబానికి చెందినవారు. సంస్కృతాంధ్రాలలో విద్వాంసులు; మహాకవులు, శ్రావ్యమైన గొంతుతో ఎన్నివేల మందినైనా రంజింప చేయగలవారు. వారి పోతన కావ్యం ఈ యుగంలో వచ్చిన మహాకావ్యాలలో గణనీయమైనది. కాళోజీ నారాయణరావుగారు యిక్కడి రాజకీయ సాంఘిక ఉద్యమాలచే ప్రభావితుడై గొప్ప

కవిత్వం వ్రాసిన ప్రజాకవి. పొట్లపల్లి రామారావుగారు కవిత్వం, కథానిక, వ్యాసం ఈ మూడింటిలో ఆరితేరిన సిద్ధహస్తులు. ప్రకటితము కావలసిన రచనలు వీరి వద్ద పుష్కలంగా ఉన్నవి; తమ ఊరిలో వ్యవసాయం చేసుకుంటూ అజ్ఞాతంగా ఉన్నారు. బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రిగారు ఆరోజులలోనే సకలాంధ్ర ప్రఖ్యాతిగాంచినారు. వీరికవితలో కొంత భావకవుల ధోరణి కనిపిస్తుంది. కవిత్వంలో ఎన్నో పోకడలైనా పోగలిగినవారు. కథానిక, కవిత, సాహిత్య విమర్శ మొదలైన వాఙ్మయ వీధులలో స్వేచ్ఛగా విహరించినారు. వీరు కూడా అకాలమరణానికి గురియైనవారు. డాక్టర్ దాశరథి శ్రీనాధుని వలె "చిన్నారి పొన్నారి చిరుతకూకటినాడె" కవితారంగంలో ప్రవేశించినారు. ఆయనది పండితకుటుంబం. బాల్యంలో తీవ్రమైన రాజకీయ అభిప్రాయాలు కలిగి, భారతదేశ స్వాతంత్రోద్యమంలో హైదరాబాదు రాష్ట్ర విమోచనోద్యమంలో పాల్గొన్న త్యాగమూర్తి. అనేక కావ్యాలు వ్రాసి యీనాడు సకలాంధ్ర ప్రఖ్యాతినే కాక సకల భారత ప్రఖాత్యిని కూడా పొంది అంతర్జాతీయ స్థాయిని అందుకోవడానికి కృషి చేస్తున్న మహాకవి. ఆనాటి తెలంగాణ ప్రజానీకాన్ని ఆయన కవిత్వం మేలుకొల్పినది. ఆనాడు ఆయన పీడిత ప్రజావాణికి మైక్ అమర్చినానని చెప్పుచున్నాడు. ఈనాడు ఆయన ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా ఉండడం సర్వవిధాల సముచితం, శోభాయమానం. పోలీసు చర్యకు పూర్వం తెలంగాణ సాహిత్యరంగం యొక్క సంగ్రహ స్వరూపం యిది. సాహిత్య సమావేశాలలో, కవి సమ్మేళనాలలో వీరందరితో కలిసి కాలక్షేపం చేయడం, భాషావికాసానికై పనిచేయడం నాకు లభించినటువంటి ఉత్తమ అవకాశం.

VII

పోలీసు చర్యకు పూర్వం నుండియే ఆంధ్ర, తెలంగాణల మధ్య కవిపండితుల రాకపోకలు జరుగుతుండేవి. ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతంలోని కవులు తెలంగాణ సమావేశాలలో పాల్గొంటుండేవారు. కొన్ని అపశ్రుతులు అక్కడ వినిపించినప్పటికిని అత్యధిక సంఖ్య యిందుకు భిన్నమైన అభిప్రాయమునే కలిగియుండిరి. హైదరాబాదు వీధులలోను, ఉన్నత కుటుంబాలలోను కొంతవరకు మధ్యతరగతి కుటుంబంలోను ఆరోజులలో గోచరించిన ఉర్దూ భాషా సంస్కృతుల ప్రభావం కొందరికి కొన్ని అపోహలు కలిగించేవి. మేధావిగా పేరు పొందిన రాజకీయవేత్తయైన ఆంధ్ర నాయకుడు

ఒకరు హైదరాబాదు రాష్ట్రంలో తెలుగు ఉన్నదా అని ప్రశ్నించినాడట. ఒక సంఘటన నాకు జ్ఞాపకం వస్తున్నది. 1953 అక్టోబర్ నెల ఒకటవ తేదీనాడు కర్నూల్ రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడినది. జవహర్‌లాల్ నెహ్రూగారు ప్రారంభోత్సవం జరిపిరి. రాజగోపాలాచారిగారు ఆ సభలో పాల్గొనిరి. ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రి. అప్పుడు రాజగోపాలాచారిగారు ఒకమాట అన్నారు. ఆంధ్రరాష్ట్రానికి కృష్ణాగోదావరి నదులు పెన్నిధులు. ఆ అదృష్టానికి తోడు త్రివేదివంటి పరిపాలనాదక్షులు యీ రాష్ట్రానికి గవర్నర్ కావటం అదృష్టకరమైన సంఘటన. అయితే ఈ పెన్నిధులను ఆంధ్రప్రదేశ్ పరిపాలకులు యెంతవరకు ప్రజాభ్యుదయానికి వినియోగించుకోగలిగినారనే ప్రశ్న సహజంగా ఉత్పన్నమౌతున్నది. ఆంధ్ర రాష్ట్ర ప్రారంభోత్సవంలో పాల్గొనడానికి తెలంగాణ నుండి చాలామంది మిత్రులం కర్నూల్‌కు వెళ్ళినాము. విశాలాంధ్ర మహాసభ కార్యదర్శి పాగ పుల్లారెడ్డిగారు ఏర్పాటులన్నీ చేసినారు. ప్రారంభోత్సవం నాడు సాయంకాలం ఒక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో అనంత శయనం అయ్యంగారు, అయ్యదేవరకాళేశ్వరరావు, బెజవాడ గోపాలరెడ్డి ప్రభృతులైన ఆంధ్ర నాయకులు పాల్గొన్నారు. హైదరాబాదు రాజధానిగా సమగ్ర ఆంధ్రప్రదేశ్ ఏర్పడవలెనని కొందరు ప్రసంగించినప్పుడు ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఒక అగ్రనాయకుడు హైదరాబాదు నగరం ఏమున్నదీ, ఆనగరంలో, ఆంధ్ర సంస్కృతి యెక్కడా కనిపించదు. అంతా ఉర్దూమయం అందుచేత ఈ పట్టణం రాజధాని ఎందుకు కావలెను? అని ప్రశ్నించగా నేను ఆయనతో – "మీరు ఉన్నతవర్గానికి, ధనిక వర్గానికి చెందినవారు. హైదరాబాదుకు వచ్చినప్పుడు ధనిక కుటుంబాలకు అతిథిగా ఉండి ఖరీదైనకార్లలో తిరిగినందువలన హైదరాబాదు స్వరూపం మీకు అవగాహన కాలేదు – అని గట్టిగా ప్రత్యుత్తర మీయవలసి వచ్చినది. నన్ను శ్రీమతి అమ్మన్నరాజాగారు బలపరిచినట్లు జ్ఞాపకం.

ఆ రోజులలో తెలంగాణకు రాకపోకలు చేసిన ఆంధ్రప్రాంత కవిపండితులు కొందరు ఉండేవారు. వీరు ఈ ప్రాంత రచయితలతో కలసిమెలసి ఉండేవారు. శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారు ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందే తెలంగాణకు వచ్చి పోతుండేవారు. డాక్టర్ రాధాకృష్ణన్‌గారు ప్రారంభించిన అలంపురం ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలలో పాల్గొన్నారు. కృష్ణమూర్తి శాస్త్రిగారు అప్పుడు ఆస్థానకవిగా ఉండినా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి మొదటి జనరల్ కౌన్సిల్‌లో సభ్యులుగా

కూడా ఉండినారు. భాషను గురించి వారికి తీవ్రమైన అభిప్రాయాలు ఉండేవి. ఆస్థానకవిగా పాఠ్యగ్రంథాల నిర్ణయం మీద తమకు కంట్రోల్ కావలెనని వారు అంటుండేవారు. అయితే వారికోరికకు ప్రభుత్వం ప్రాధాన్యం యిచ్చినట్లు కనిపించదు. నాకు ఆప్తులైన తణికెళ్ళ వీరభద్రుడుగారికి వారిపైన గౌరవభావము ఉండేది. 1953–54 ప్రాంతంలో అనుకుంటాను రాజమహేంద్రవరం కళాశాలకు శతవార్షికోత్సవం జరిగినది. గవర్నర్ శ్రీ ప్రకాశ్‌గారు సభలను ప్రారంభించగా అప్పటి విద్యామంత్రి మల్లవరపు వెంకట కృష్ణారావుగారు సభలకు అధ్యక్షత వహించిరి. ఆ సభలలో మాట్లాడమని నాకు ఆహ్వానం వచ్చింది. వీరభద్రుడు గారు కూడా సభలో పాల్గొనిరి. ఆ సందర్భంలో వీరభద్రుడుగారు, నేను కలిసి కృష్ణమూర్తిశాస్త్రిగారి యింటికి వెళ్ళగా వారు మమ్ములను ఎంతో ఆదరించిరి. శ్రీపాద కృష్ణమూర్తిగారి తరువాత కాశీ కృష్ణాచార్యులుగారు ఆస్థానకవులుగా నియమితులైనారు. కాశీ కృష్ణాచార్యులుగారు సుప్రసిద్ధ సంస్కృత విద్వాంసులు. అవధాన శిరోమణి. తిరుపతి వెంకటకవుల అవధాన సభలకు వారు అధ్యక్షులుగా ఉండేవారట. తిరుపతి శాస్త్రిగారి మరణానంతరం వెంకటశాస్త్రిగారితో కలిసి వారు అవధానాలు చేసేవారట. 1954 ప్రాంతంలో మరొకసారి హైదరాబాదుకు రాగా ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన ఏర్పాటుచేసిన సభలో యీ అవధానాలను గూర్చి వారు ప్రస్తావించినారు. అప్పటికేవారు చాలా వృద్ధులు – కౌపీనధారియే. ఒక ఉత్తరీయం వేసుకొని ఆనాడు వారు సభకు విచ్చేసిరి. తరువాత వారు ఆస్థాన కవియై కొన్ని సంవత్సరాలు జీవించిరి. శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రిగారి షష్టిపూర్తి సభలో పాల్గొనడానికి రెండవనాడు నేను రాజమహేంద్రవరం వెళ్ళినాను. సుబ్రహ్మణ్య శాస్త్రిగారు నా వచనరచనలను మెచ్చుకునేవారు. తప్పక నన్ను తమ షష్టిపూర్తి సభలో పాల్గొనవలసిందని కోరుతూ జాబు వ్రాసినారు. శివశంకరస్వామి ప్రభృతులైన నవ్యకవులు చాలామంది ఆ సభలకు వచ్చినారు. నన్ను సభలో మాట్లాడమన్నారు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి అభిప్రాయాలు, కృష్ణమూర్తిశాస్త్రిగారి అభిప్రాయాలకన్నా భిన్నమైనవి. వారు పూర్తిగా వ్యావహారిక భాషావాది. హిందీ వ్యతిరేకులు. హైదరాబాదుకు ఎప్పుడువచ్చినా సారస్వత పరిషత్తు కార్యాలయానికి విచ్చేసి నన్ను కలిసేవారు. శాస్త్రిగారికి గాఢమైన అభిప్రాయాలుండేవి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అంటే వారికి గిట్టేదికాదు. మొదట్లో సాహిత్య అకాడమి కార్యాలయం, సారస్వత పరిషత్తు ఆవరణలోనే ఉండేది. సుబ్రహ్మణ్య శాస్త్రిగారు

అకాడమిగదికి వచ్చేవారుకారు. సారస్వత పరిషత్తు కార్యాలయంలో కూర్చుండి నన్ను పిలిచేవారు. వ్యక్తిగతంగా నాపైన అభిమానం పూర్తిగా ఉండేది. వారు వ్రాసిన కార్డులు ఒకటి రెండు నావద్ద ఉన్నవి.

ఆధునిక యుగంలో తెలుగు భాషలో వచ్చిన మహా కావ్యాలలో "రాణా ప్రతాప్ చరిత్ర", "శివభారతం" చారిత్రక యితివృత్తాలుగల వీరకావ్యాలు. 1944లో వరంగల్‌లో జరిగిన సారస్వత పరిషత్తు వార్షిక సభలలో యీ రెండు కావ్యాలను గురించి నేనొక ప్రసంగం చదివినాను. శివభారత గ్రంథకర్తలైన వెంకట శేషశాస్త్రిగారు యీ ప్రసంగాన్ని పత్రికలలో చదివి హర్షించినట్లు నాకు తెలిసినది. వారు మా గడియారం రామకృష్ణశర్మగారికి పినతండ్రి. సారస్వత పరిషత్తు పక్షాన 1954-55 ప్రాంతంలో యేర్పాటుచేసిన ఆంధ్రమహాభారత సభలలో వారు పాల్గొని యుద్ధపర్వాలను గురించి గంభీరమైన ఉపన్యాసం కావించినారు. అది నాకు వారితో మొదటి పరిచయం. తరువాత వారు హైదరాబాదు ఎప్పుడు వచ్చినా ఆంధ్రసారస్వత పరిషత్తు కార్యాలయంలో మకాం చేసి మా అందరిని, విశేషించి నన్ను తమ ఆప్తజనంలో ఒకరిగా భావించేవారు. సొంత విషయాలను గూర్చి కూడా అప్పుడప్పుడు నన్ను సంప్రదించేవారు. వారు లెజిస్‌లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నప్పుడు కూడా సారస్వత పరిషత్‌లోనే వారివసతి. వారి తోడ్పాటు పూర్తిగా నాకు ఉండేది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి వారు ఒకటర్మ్ ఉపాధ్యక్షులుగా కూడా ఉండినారు. విశిష్ట సభ్యులుగా సన్మానం పొందినారు. మొదటి నుండి వారు అకాడమిలో సభ్యులు. ఎక్కడ ఉన్నావారు తమ మనిషిగా నన్ను భావించుకునేవారు. నేను విద్యార్థిగా ఉన్నప్పటి నుండి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి రచనలు చదువుతుండేవాడిని. 'నిగమశర్మ అక్క' అన్న వారి వ్యాసం 1937 సంవత్సరంలో కాబోలు భారతిలో చదివి దాని కటింగ్ భద్రంగా దగ్గర పెట్టుకున్నాను. అప్పటి నుండి వారిని చూడవలెననే కోరిక ఉండేది. కాని 1957వ సంవత్సరంలో సాహిత్య అకాడమి స్థాపన జరిగేవరకు ఆ కోరిక నెరవేరలేదు. మొదటిసారి వారిని నేను సాహిత్య అకాడమి స్థాపన సందర్భంలో చూచినాను. కొంత ఆశ్చర్యపడినాను. కారణమేమిటంటే నేను ఊహించిన మూర్తి కాదది. వారు వైష్ణవులని నేను అనుకోలేదు. తెల్లని ధోవతి, తీర్చిదిద్దిన ఊర్ధ్వ పుండ్రాలు, షర్టు ధరించక మీద వేసుకున్న ఉత్తరీయం, ప్రసన్నవదనం, సుందర ఆకారం ఆశ్చర్యం కలిగించి నన్ను ఆకర్షించినవి.

అంతకుముందు నేను ఏది వ్రాసి ప్రకటించినా వారికి పంపేవాడిని నా రచనలను అనంత కృష్ణశర్మగారు హర్షించేవారు. వారి హర్షామోదాలు ఏనుగునెక్కినంత సంతోషాన్ని నాకు కలిగించేవి. సాహిత్య అకాడమి స్థాపన తర్వాత వారు హైదరాబాదుకు అప్పుడప్పుడు వచ్చేవారు. ఎప్పుడు వచ్చిన సారస్వత పరిషత్తుకు వచ్చి గంటకు తక్కువకాకుండా నా వద్ద కూర్చునేవారు. వారి అన్నగారైన గోపాల కృష్ణమాచార్యులవారితో కూడ నాకు పరిచయం ఏర్పడి కొద్దికాలంలోనే ఆత్మీయతగా పరిణమించినది. గోపాలకృష్ణమాచార్యులుగారికి సాహితీపరునిగ అంత ప్రఖ్యాతి రాలేదు. కాని సాహిత్యంలో వారు తమ తమ్ముడైన అనంతకృష్ణశర్మగారికి ఎంతమాత్రం తీసిపోయే వారు కారు. అనంతకృష్ణశర్మగారు సంగీతాన్ని అభిమానించినట్లు, గోపాల కృష్ణమాచార్యులు గారు జ్యోతిష్యాన్ని అభిమానించినారు. తమ్మునివలెనే అన్నగారు కూడ మంచివచన రచన చేసేవారు. అనంతకృష్ణశర్మగారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి వార్షికోత్సవాల సందర్భంలో ఒక పర్యాయం అన్నమాచార్యుల కృతులను పాడి వినిపించినారు. సభ్యులంతా ఆనందించినారు. శర్మగారికి నాపైన ప్రత్యేకమైన అభిమానము ఉండేది. వారి "శాలివాహన గాధా సప్తశతి" తొలిసారి ఆంధ్రసారస్వత పరిషత్తు పక్షాన సమగ్రంగా ప్రకటితమైనది. పరషత్తు పట్ల వారికి ఎంతో ఆదరము ఉండేది. అనంతకృష్ణశర్మగారి మూర్తి సుందరమైనది. చిత్తవృత్తి కోమలమైనది. మాట మధురమైనది. శైలి లలితమైనది. హృదయం రసార్ద్రమైనది. వేషం పరిశుభ్రమైనది; శీలము నిష్కళంకమైనది. కొంతమంది ఎంత ప్రతిభావంతులైనను వారితో కలిసి ఎక్కువకాలం గడుపలేము. కాని అనంత కృష్ణశర్మగారితో ఎంతకాలం గడిపినను మరి కొంతకాలం వారి సమక్షంలో ఉండవలెనని హృదయం కోరుతుండేది. అనంత కృష్ణశర్మగారిచేత సారస్వత పరిషత్తు పక్షాన "వాల్మీకి రామాయణాన్ని" గూర్చి కొన్ని ఉపన్యాసాలు చేయించవలెనని అనుకొన్నాము. అందుకువారు సూత్రప్రాయంగా సమ్మతించినప్పటికి అనారోగ్యకారణం వల్ల ఆ పని జరుగలేదు. ఇంతలో వారు దివంగతులైనారు.

అనంతకృష్ణశర్మగారి వలెనే సంగీత సాహిత్యాలలో నిష్ణాతులు మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యులవారు. ఆచార్యులవారి "శివతాండవం" ఆంధ్రావళికి మోదం కలిగించిన నవ్యకావ్యాలలో ప్రముఖమైనది. ఆ కావ్యాన్ని ఆచార్యులవారు చదివినప్పుడు పరవశుడుకాని రసికుడు ఉండడు. బహుభాషా ప్రవీణులైన ఆచార్యులవారు

మహాప్రతిభావంతులు. కవిత్వము వచనరచన రెండింటిలో – సంగీతం, సాహిత్యం రెండింటిలోను ఆరితేరిన సవ్యసాచి వారు. సారస్వత పరిషత్తు పక్షాన అనేక ప్రసంగాలు చేసినారు. పోతన కవిత్వాన్ని గూర్చి రెండు ఉపన్యాసాలు చేసినారు. సారస్వత పరిషత్తు రజతోత్సవ సందర్భంలో తాళ్ళపాక అన్నమాచార్యుల సాహిత్యంపైన వారు చేసిన మహెూపన్యాసం సంగీత సాహిత్యాలలో నిష్ణాతమైన వారి వైదుష్యానికి నిదర్శనము. అయితే వారు జగమెరిగిన బ్రాహ్మణులు. అందుచేత నిదర్శనము అనే జందెము యెందుకు? తమిళం, మలయాళం, కన్నడం, ప్రాకృతం, సంస్కృతం, ఇంగ్లీషు, హిందీ మొదలైన అనేక భాషలలో వారు పండితులు. తెలుగు వారిలో యింతటి ప్రతిభావంతులు మరెవ్వరని ప్రశ్న యెవరికైనా కలిగితే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఆచార్యులవారికి విశిష్ట సభ్యత్వము యిచ్చినది. కేంద్ర సాహిత్య అకాడమి జాతీయ బహుమతి వారికి లభించినది. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారిని డాక్టరేట్ పట్టముతో సత్కరించినది. తిరుపతి దేవస్థానము వారికి భాగవత వ్యాఖ్యాన రచన బాధ్యతను అప్పగించినది. అయితే యీ గౌరవాలన్నీ కొంత ఆలస్యంగా వచ్చినవి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ప్రతిభను తగురీతిగా గుర్తించినట్లు కానరాదు. ఇది శోచనీయం. ఆచార్యులవారు నన్ను ఆత్మీయునిగా భావించుకుంటారు. ఈ భావన నాకు అత్యంత ఆనందకరమైనది.

పూర్వ సంప్రదాయానికి చెందిన పండితులుగా సాహితీ జీవనం ప్రారంభించి, గ్రాంధిక వాదులై తరువాత వ్యవహారిక భాషను పూర్తిగా సమర్థించి, వాడుక భాషలో వ్రాసి అభ్యుదయ భావాలు కలిగి అభ్యుదయ సాహిత్యానికి ఆప్తులై, పత్రికా సంపాదకులై ప్రసిద్ధ విమర్శకులై సాంఘిక సమస్యలపట్ల విప్లవ భావాలు కలిగి తమ అభిప్రాయాలకు అనుగుణంగా గ్రంధాలు వ్రాసి ఫిలింరంగంలో కూడా ప్రఖ్యాతిగాంచిన తాపీ ధర్మారావుగారిని గూర్చి నా చిన్నతనం నుండి నేను వింటుండేవాడిని. వారి గ్రాంధిక రచనలతో పాటు వ్యావహారిక రచనలను కూడా పత్రికలలో చదివినాను. ముఖ్యంగా "విజయవిలాస" వ్యాఖ్యానాన్ని గూర్చి వ్రాసిన వ్యాసాలు భారతిలో చదివేవాణ్ణి. ఈ విధంగా పరోక్షమైన పరిచయం వారితో ఉండినది. అయితే ప్రత్యక్షమైన పరిచయం 1956 తరువాతనే కలిగినది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత హైదరాబాదులో వారు స్థిరనివాసాన్ని కల్పించుకున్నారు. వారికి నాపైన అవ్యాజమైన అభిమానం ఉండేది. అప్పుడు స్వర్గీయ త్రిపురనేని గోపీచంద్‌గారు హైదరాబాదు ఆకాశవాణిలో

పనిచేస్తుండేవారు. గోపీచంద్‌గారికీ నాపట్ల స్నేహభావము ఉండేది. తాపీ ధర్మారావుగారి రచనలను అన్నింటిని ప్రకటించడానికి గోపీచంద్‌గారు, ఆవుల సాంబశివరావు, బాబుల్‌రెడ్డిగార్ల సహకారంతో కృషిని ప్రారంభించినారు. తర్వాత వారు అకాల మరణానికి గురియైరి. ఒకటి రెండు పుస్తకాలు వెలువడినా విజయ విలాస వ్యాఖ్యానం ప్రకటితంకాలేదు. ధర్మారావుగారు అప్పుడప్పుడు నా దగ్గరకు వస్తుండేవారు. ఒక పర్యాయం వారు నాతో యీ విషయాన్ని ప్రస్తావించినారు. విజయవిలాస వ్యాఖ్యాన ప్రకటనకు సినిమావారి సహకారం లభిస్తుందని వారు అనుకున్నారు. వాగ్దానము చేసినప్పటికి వారికి యీ సహకారం లభించలేదు. ఈ విషయంలో బాబుల్‌రెడ్డిగారు, సాంబశివరావుగారు నేను కలసి రెండుమూడు సార్లు సినిమావారిని చూడడం జరిగింది. కాని ఫలితం లేకపోయింది. మొత్తంమీద రాష్ట్ర ప్రభుత్వం సాహిత్య అకాడమీల సహకారంతో విజయవిలాస వ్యాఖ్యాన ప్రచురణకు నేను చేసిన కృషి ఫలించినది. ధర్మారావు ఎంతో సంతోషపడినారు. ధర్మారావుగారిని గురించి కొందరు పండితులు ఏమేమో చెబుతుండేవారు. కానీ ఆ మాటలలో సత్యము ఉండేది. తమ ఇంటివిషయాలను గూర్చికూడా అప్పుడప్పుడు ప్రస్తావించేవారు. మనుమరాలి వివాహం రిజిస్ట్రేషన్ సందర్భంలో నాతో సాక్షి సంతకం చేయించినారు. సాహిత్య అకాడమీ వ్యవహారాలలో నన్ను పూర్తిగా బలపరిచినారు. వారి మాట వినేవారందరిని నన్ను బలపరిచే వారిగా చేసినారు. రెండువారాలకు ఒక్కసారియైన వచ్చి నన్ను చూచేవారు. వృద్ధాప్యపు అశక్తతతో మీరు ఎందుకు వస్తారు. నేను వచ్చి చూస్తానన్నా ఉరుకునేవారుకారు. హైదరాబాదులో అభ్యుదయ కళాసమితి అను పేరుతో ఒకసాహిత్య సంస్థను స్థాపించి నిర్వహిస్తూ యువకులను ప్రోత్సహిస్తుండేవారు. ఆరోజులో విశ్వనాథ సత్యనారాయణగారు కరీంనగర్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. తమ శిష్యుల తోడ్పాటుతో ("జయంతి" అనే పేరుతో కొన్ని సంవత్సరాల క్రింద విజయవాడ నుండి సాహిత్య మాసపత్రికనువారు నడుపుతుండేవారు.) జయంతి సాహిత్యమాస పత్రికను పునఃప్రారంభించి గురజాడ మొ॥ కవులను గూర్చి విమర్శిస్తుండేవారు. అవి ధర్మారావుగారికి ఆగ్రహం కలిగించింది. హైదరాబాదులో ఆంధ్రయువతి మండలి హాలులో అభ్యుదయ కళాసమితి పక్షాన ఒక బహిరంగసభను ఏర్పాటుచేసి విశ్వనాథ రామాయణాన్ని గూర్చిన విమర్శను ఆరుద్రగారిచేత చేయించినారు. ఆరుద్రగారు నూరు పేజీల ప్రసంగం రాసుకొని వచ్చి అనేక భాషాదోషాలనుగూర్చి

ప్రస్తావించినారు. ధర్మారావుగారు ఆ సభకు నన్ను అధ్యక్షునిగా పెట్టినారు. ఉభయులు నాకు ఆప్తులే. అయితే వారు పరస్పరం ఉత్తర, దక్షిణ ధ్రువాలు. జీవితాంతం వరకు ఉభయులకు నాపైనా ఆదరాభిమానాలు సంపూర్ణంగా ఉండేవి. ఇది నా సుకృతం అనే చెప్పవలెను.

పూర్వకాలపు పండితులలో ఏ గ్రంథానికైనా సరియైన వ్యాఖ్యానం చేయగలిగిన కొద్దిమందిలో దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు ప్రముఖులు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పక్షాన పోతన భాగవతాన్ని ప్రామాణికంగా ప్రకటించవలెనని నిర్ణయించడమైనది. సంపాదక సంఘానికి రాయప్రోలు సుబ్బారావుగారు అధ్యక్షులు. తాపీ ధర్మారావుగారు దివాకర్ల వెంకటావధానిగారు, డా. రామరాజుగారు సభ్యులు. వ్రాత ప్రతి సిద్ధం చేసే సందర్భంలో ఈ సంపాదక సంఘం పిచ్చయ్యశాస్త్రిగారిని ప్రత్యేకంగా ఆహ్వానించినది. వారు రెండునెలలు హైదరాబాదులో ఉండి వ్రాతప్రతిని సిద్ధం చేసిరి. ఆ రెండు నెలలు పిచ్చయ్యశాస్త్రిగారితో కలిసిమెలసి ఉండే అవకాశం నాకు లభించినది. తెలుగు సాహిత్యంలో పిచ్చయ్యశాస్త్రిగారికి తెలియనిదిలేదు. ఆంధ్రకవుల రచనలన్నీ కరతలామలకాలు. కొన్నివేల పద్యాలు వారి కంఠస్థం. వారి ఉపాన్యాస కౌశలం గొప్పది. వారితో సంభాషణ విజ్ఞానపు విందు. ఆకారంలో వామనులు సాహిత్య వేదికమీద త్రివిక్రములు. నెల్లూరులో రెండుమూడు సభలలో ఉపన్యసించడానికి నేను వెళ్ళవలసివచ్చింది. ప్రతి సభలోనూ పిచ్చయ్యశాస్త్రిగారు ప్రత్యేకం. అంతటి పండితుడు నా ఉపన్యాసం వినడానికి ఎందుకు రావలెనని నేను అనుకుంటేండేవాణ్ణి అయినా నాపైన అభిమానం చేత వారు తప్పక వచ్చేవారు. నెల్లూరులో నా మిత్రులలో కోదండరామిరెడ్డిగారు విశిష్టమైన వ్యక్తి. ఆయనతో పరిచయం కొంత ఆలస్యంగానే కలిగినది. 1960 ప్రాంతంలో కాబోలు నేను సారస్వత పరిషత్తు ప్రాంగణంలో షేరువాణి పైజామాలు వేసుకొని నిలిచి ఉండగా శుద్ధమైన తెలుగు వేషంలో వచ్చి నన్ను కుశల ప్రశ్నలుగావించినారు. పరస్పర పరిచయమైనది. ఆ పరిచయం క్రమక్రమంగా కొన్ని సంవత్సరాలలోనే ఆత్మీయతగా పరిణమించినది. సాధారణంగా యేండ్లు మీదబడిన తర్వాత వ్యక్తుల మధ్య ఆత్మీయత వర్ధిల్లడం జరగదు. కాని నాకు కోదండ రామరెడ్డిగారితో కలిగిన మైత్రి యిందుకు అపవాదం. ఆయన ఇంగ్లీషు, తెలుగు, సంస్కృత భాషలలో గట్టి పండితుడు. మంచివక్త, అగ్రశ్రేణి వచన రచయిత. ఆయన వచనశైలి విశిష్టమైనది. నూటికి నూరుపాళ్ళు తెలుగుదనం ఉట్టిపడేది.

తరువాత ఆయన సాహిత్య అకాడమి జనరల్ కౌన్సిల్ సభ్యుడుగాను విశిష్ట సభ్యుడుగాను, కార్యవర్గ సభ్యుడుగాను, సాహిత్య అకాడమి ప్రచురణలను కొన్నింటికి సంపాదకుడుగాను, పీఠికా రచయితగాను పనిచేసినారు. ఏ పనిని అప్పగించినా మిక్కిలి సమర్థవంతంగా చేసినారు. నూటికి నూరుపాళ్ళు నాతో సహకరించినారు. ప్రత్యేకంగా నెల్లూరుకు పిలిచి నాచేత "తిక్కన" మీద ఉపన్యాసం చేయించినారు. ఎప్పుడు వెళ్ళినా ఇంటిలో మిత్రులందరిని పిలిచి విందులను యేర్పాటు చేసినారు. తమ గ్రంథాల తొలిపలుకులో నామీద పూలవాన కురిపించినారు. ఆయన హృదయంలో నాకు ప్రత్యేక స్థానం యిచ్చినారు.

"వస్తువులను గూర్చి" అంతరుపాధి యేదో
బహిరుపాధులచేత ఏర్పడదు ప్రేమ"

అని నేను కోదండరామరెడ్డిగారిని గూర్చి అనుకుంటాను.

పద్మశ్రీ డాక్టర్ బోయిభీమన్నగారు ఆంధ్రప్రదేశ్ యేర్పడిన తరువాత నాకు సన్నిహితులైన మిత్రులు. భీమన్నగారు బహుగ్రంథ రచయితలు, ప్రముఖ కవులు. హైదరాబాదు వచ్చినప్పటినుండి వారు నిర్వహించిన ముఖ్య కార్యక్రమాలు అన్నింటిలోను నాకు ప్రాధాన్యం యిచ్చినారు. గురజాడ శతవార్షిక ఉత్సవాలకు కార్యదర్శిగా ఉండి ఇంగ్లీషు, తెలుగు సంచికల సంపాదక బాధ్యతలను నాకు అప్పగించినారు. వారు హైదరాబాదు నగరంలో అనేక గ్రంథాలు రచించి, అంకితమిచ్చి ఆవిష్కరణలు చేయించినారు. అన్ని సభలతోను నాకు సంబంధం కల్పించినారు. "పాలేరు నుండి పద్మశ్రీ" అను గ్రంథంలో నాకు అమృతాభిషేకం గావించినారు. సాహిత్య అకాడమి కార్యక్రమాలలో నన్ను పూర్తిగా సమర్థించి ఒక టర్మ్ సహాయ కార్యదర్శిగా కూడా ఉండినారు. కొన్ని విషయాల మీద అభిప్రాయ భేదాలు కలిగినప్పటికి మా స్నేహానికి భంగం కలిగించలేదు. నిజమైన స్నేహం అంటే యిదేకదా! భీమన్నగారు నా మనిషి అని నేను యెప్పుడూ అనుకుంటాను. ఆయన నా పట్ల చూపిన అభిమానం అటువంటిది. శ్రీ పోతుకూచి సాంబశివరావు హైదరాబాదు నగర సాంస్కృతిక రంగంలో గణనీయుడు. "నవ్యసాహితి", "విశ్వసాహితి", "అఖిలభారత తెలుగు రచయితల సంఘం" మొదలైనవి ఆయన నిర్వహించిన వివిధ ఉద్యమాలు. ఈ అన్ని ఉద్యమాలతోను ఆయన సన్నిహిత సంబంధం నాకు కల్పించినారు. దీని నిర్వహణకు సంబంధించిన అనేక ఘట్టాలకు

సంబంధించిన మధురస్మృతులు ఎన్నో ఉన్నవి. శ్రీ సాంబశివరావు కవి, కథకుడు, నవలారచయిత, పత్రికా సంపాదకుడు, నటకుడు ఇంకా అనేక వ్యాసంగాలు కలిగిన కావ్యశీలుడు.

శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు సుప్రసిద్ధ విదుషీమణి. బహుగ్రంథ రచయిత్రి, మంచివక్త. ఆమెతో పరిచయం సుమారు 30 సంవత్సరాలకు పైబడినది. ఆమె వ్రాసిన "తెలుగుకవయిత్రులు" అనే గ్రంథానికి తెలంగాణ రచయిత్రులను గూర్చి కొన్ని వివరాలు తెలుపుమని ఆమె కోరడంతో మా పరిచయం ప్రారంభమైనది. ఆ పరిచయం క్రమక్రమంగా అభివృద్ధి చెందినది. సాహిత్య అకాడమి సభ్యురాలిగా ఆమె మరింత దగ్గరగా వచ్చినది. రచయిత్రుల సభల ఏర్పాటు, రచయిత్రుల సలహాసంఘ వ్యవహారాలు మొదలైన కార్యక్రమాలలో ఆమెతో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించినది. ఆమె ఎంత విదుషీమణియో అంత కార్యదక్షత గలది. రచయిత్రులను ప్రోత్సహించడం ఆమె తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్నది. ఆ లక్ష్యసాధనలో ఆమె చాలావరకు కృతకృత్యురాలైనది.

శ్రీమతి భానుమతి గారితో కూడా పరిచయం - నాకు కొంత ఆలస్యంగా గలిగినది. 1963 ప్రాంతంలో అఖిలభారత రచయిత్రుల సమావేశం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఏర్పాటు చేసినది. శ్రీమతి లీలావతి మున్షి అధ్యక్షురాలు. శ్రీమతి విజయలక్ష్మిపండిత్ ప్రారంభకురాలు. ఆహ్వాన సంఘానికి శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షురాలు; శ్రీమతి భానుమతి ఉపాధ్యక్షురాలు. శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కార్యదర్శిని, శ్రీమతి నాయని కృష్ణకుమారి సహాయ కార్యదర్శిని. ఈ సభల నిర్వహణకు శ్రీమతి భానుమతి సహకారం సంపూర్ణంగా లభ్యమైనది. ఇందులో పాల్గొనిన సుమారు 60 మంది రచయిత్రులను సన్మానించే ఆర్థికభారం పూర్తిగా శ్రీమతి భానుమతి స్వీకరించినది. ఈ సభల సందర్భంలో నేను ఆమెకు సన్నిహితుడనైనాను. ఆమెకు నాపైన సంపూర్ణవిశ్వాసం. తరువాత రచయిత్రుల సలహాసంఘ వ్యవహారాలలో సాహిత్య అకాడమి జనరల్ కౌన్సిల్ సభ్యురాలిగా ఆమె నాపట్ల సంపూర్ణమైన విశ్వాసం ప్రకటించినది. ఉదాత్త సంస్కృతిగల విదుషీమణి. తన సోదరునిపై యే విధమైన ఆదరాభిమానాలు చూపుతుందో అటువంటి ఆదరాభిమానాలను ఆమె నాపట్ల చూపించినది. మదరాసు వెళ్ళితే ప్రత్యేకంగా వచ్చి తీసుకొనివెళ్ళి ఆతిథ్యం యీయడం ఆమె నాపట్ల చూపిన మర్యాదలలో ఒకటి.

శ్రీమతి భానుమతి గొప్ప అభినేత్రియేకాదు, మంచిరచయిత్రి, ఉత్తమశ్రేణి గాయకురాలు. తమిళ చిత్రాలలో కూడ పలు పాత్రలు వేసినది. ఇంతటి సర్వతోముఖ ప్రతిభ కలిగిన సంస్కృతీపరులు తెలుగు దేశంలోనేకాదు భారతదేశంలోనే లేరని చెప్పితే అతిశయోక్తి కాదు. తన సొంత వ్యవహారాలలో కూడా నాపట్ల విశ్వాసం ప్రకటించిన శ్రీమతి భానుమతి నాకు ఆత్మీయురాలని చెప్పవలెను.

ఈ విధంగా నాలుగు రకాల కవిపండితులతో పరిచయం, సన్నిహితత్వం, కలిసి పనిచేసే అవకాశం నాకు లభ్యమైనవి. సకలాంధ్రదేశ విద్వాంసుల సహకారం సంపూర్ణంగా లభించినది. రాజకీయపు సరిహద్దులు ఎట్లా ఉన్నప్పటికిని తెలుగు వారందరు సాంస్కృతికంగా ఒకటేనన్న భావం గడచిన అయిదు దశాబ్దాలలో బలపడినది. వేర్పాటు ఉద్యమాలు వచ్చినప్పుడు కవిపండితులు ఎవ్వరూ అందులో పాల్గొనలేదు. ఇది గమనించదగిన విషయం.

హైదరాబాదు విమోచనోద్యమానికి నాయకత్వం వహించినవారు స్వామి రామానంద తీర్థగారు. హైదరాబాదు రాష్ట్ర ప్రజల స్వాతంత్ర్య కాంక్షలకు ఆయన చిహ్నంగా ఉండినారు. పోలీసు చర్యకాగానే హైదరాబాదు రాష్ట్రాన్ని, ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలుగా విభజించి ఆయా భాషా రాష్ట్రాలతో కలిపివేయవలెనని రామానందతీర్థగారు ఉద్ఘాటించిరి. తెలంగాణము, ఆంధ్రము కలిసిపోవలెననే భావాలు క్రమక్రమంగా ప్రబలినవి. గ్రంథాలయ సభలు, సాహిత్య సభలు యీ భావాలను బలపరిచినవి. 1946లో పుచ్చలపల్లి సుందరయ్యగారు "విశాలాంధ్రలో ప్రజారాజ్యం" అనే పుస్తకాన్ని వ్రాసి ఎన్నటికైనా తెలుగు మాట్లాడే వారంతా ఒకే రాజకీయ పరిపాలన కింద రావలెనని ప్రతిపాదించిరి. వరంగల్ నుండి నేను 1946 ప్రాంతంలో నడిపిన "శోభ" కూడ యీ ఆదర్శాన్నే కలిగి ఉండినది. 1948 సెప్టెంబర్‌లో పోలీసు చర్య జరిగినది. నవంబర్‌లో అయ్యదేవర కాళేశ్వరరావుగారు హైదరాబాదుకు వచ్చి కార్యకర్తల సమావేశం ఒకటి జరిపి విశాలాంధ్ర, సంయుక్త కర్ణాటక, ఐక్యమహారాష్ట్రుల స్థాపనకు కలిసి పని చేయవలెనని నిర్ణయించిరి. యువకులలో ముఖ్యంగా విద్యార్థులలో యీ భావాలు బాగా వ్యాపించినవి, 1950 మార్చి నెలలో నిజామాబాద్‌లో స్టేట్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఆ సమావేశం హైదరాబాదు రాష్ట్రాన్ని విభజించి ఈ మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేయవలెనని నిర్ణయించినది. బూర్గుల రామకృష్ణారావుగారితో పాటు రంగారెడ్డి, చెన్నారెడ్డిగార్లు కూడా యిందుకు ఆమోదించిరి. అన్ని రాజకీయ

పక్షాలు ఈ అభిప్రాయాన్ని సమర్థించినవి. విద్యార్థులలో ఈ అభిప్రాయాలు ప్రబలినవి. పోలీసు చర్య తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన ఆంధ్రాభ్యుదయోత్సవాలు అన్ని ఈ అభిప్రాయానికి అనుగుణంగానే జరిగినవి. డాక్టర్ బి.రామరాజు, డాక్టర్ సి.నారాయణరెడ్డి, డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం ప్రభృతులు విద్యార్థులుగా ఈ అభ్యుదయోత్సవాల కార్యదర్శులుగా ముఖ్య కార్యకర్తలుగా విశాలాంధ్ర లక్ష్య సాధనకు అనుగుణమైన కార్యక్రమాలను రూపొందించి నిర్వహించినారు.

డాక్టర్ రామరాజు, డాక్టర్ నారాయణరెడ్డిగార్లు విద్యార్థి దశ నుండియే నాకు మిత్రులు. రామరాజుగారు హనుమకొండ హైస్కూలు విద్యార్థిగా తెలుగు సాహిత్య సమితి ఉత్సవాలు జరిపినప్పుడు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించిన సందర్భము నాకు జ్ఞాపకమున్నది. తర్వాత వారు ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థిగా, లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా నిర్వహించిన అనేక సభలలో నన్ను అధ్యక్షునిగానో, ప్రారంభకునిగానో ఆహ్వానించి గౌరవించిన సందర్భాలు ఎన్నో ఉన్నవి. కొంతకాలం ఆయన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి సహాయ కార్యదర్శిగా కూడ నాకు తోడ్పడినారు. డాక్టర్ రామరాజుగారి వలెనే నా కన్న వయసులో చిన్నవారై విద్యార్థిగా నున్న రోజులనుండియే నాకు సన్నిహితంగా వచ్చినవారు డాక్టర్ సి.నారాయణరెడ్డిగారు. కరీంనగర్ మాండలిక భాషను మాట్లాడుతూ అప్పుడప్పుడే కవిత్వం వ్రాస్తూ ఇంటర్‌మీడియట్ తరగతి విద్యార్థిగా నాకు పరిచయం, ఆయన వ్రాసిన తొలిగేయం "నవ్వనిపువ్వు" చదివిన కవి సమ్మేళనానికి అధ్యక్షత వహించిన అవకాశం నాకు కలిగినది. ఆనాటి పరిచయం క్రమక్రమంగా అభివృద్ధి చెంది ఆప్యాయతగా, ఆత్మీయతగా పరిణమించినది. డాక్టర్ నారాయణరెడ్డిగారు, యీనాడు, సకలాంధ్ర, సకలభారత, సకల ప్రపంచ స్థాయి కలిగిన కవులుగా, విశ్వవిద్యాలయ ఆచార్యులుగా, బహు కావ్య రచయితలుగా, అధికార భాషా కమీషన్ అధ్యక్షులుగా తమ వ్యక్తిత్వాన్ని పరిపూర్ణంగా వికసింపజేసుకోవడం నాకు అత్యంత ఆనందదాయకం. డాక్టర్ దాశరథి, డాక్టర్ నారాయణరెడ్డిగార్లు సాహిత్యరంగంలో రామలక్ష్మణుల వంటివారు. ఈ ఉభయులు నాకు ఆప్తులు, సన్నిహితులు.

1950లో అయ్యదేవర కాళేశ్వరరావుగారి అధ్యక్షతన వరంగల్‌లో విశాలాంధ్ర మహాసభ జరిగి యిందుకు అనుగుణమైన తీర్మానాన్ని ఆమోదించినది. కాంగ్రేస్, కమ్యూనిస్టు, సోషలిస్టు పక్షాలు విశాలాంధ్రోద్యమాన్ని బలపరిచినవి.

విశాలాంధ్రోద్యమానికి కాళేశ్వరరావుగారు నాయకత్వం వహించిరి. మాడపాటి హనుమంతరావుగారి సలహాతో విశాలాంధ్ర మహాసభ హైదరాబాదు నగరంలో స్థాపించి హనుమంతరావుగారు, కాళేశ్వరరావుగారు ఉభయులు నన్ను యీ ఉద్యమంలో పని చేయవలసిందిగా కోరినందువలన మొదటి నుండి ఈ అభిప్రాయం నాకు ఉండినందువలన కాళేశ్వరరావుగారితో కలిసి పనిచేయడానికి పూనుకున్నాను. కాళేశ్వరరావుగారిది కాంగ్రేస్. విశాలాంధ్ర వారు కమ్యూనిస్టులను రాజకీయ కారణాల వలన తమ వేదిక నుండి దూరంగా ఉంచినారు. విశాలాంధ్ర స్థాపన కొరకు కమ్యూనిస్టులు తమ వేదిక నొకదానిని ఏర్పాటు చేసుకొని కృషి చేసినారు. నాకు యిటు కాళేశ్వరరావుగారితోను, అటు రావి నారాయణరెడ్డి, చంద్ర రాజేశ్వరరావు, దేవులపల్లి వెంకటేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య ప్రభృతులైన నాయకులతోను స్నేహసంబంధాలు ఉండేవి. అయితే పని చేయడం మాత్రం కాళేశ్వరరావుగారి వేదిక నుండియే. ఈ సందర్భంలో ఒకసారి నేను విజయవాడ వెళ్ళినప్పుడు విశాలాంధ్ర కార్యాలయంలో ఒక సభను యేర్పాటు చేసి కమ్యూనిస్టు అగ్రనాయకులు నన్ను గౌరవించిరి. నాకు విశాలాంధ్ర ప్రచురణలను బహూకరించిరి. హైదరాబాదులో కమ్యూనిష్టు నాయకులు ఒక పెద్ద సభను శ్రీశ్రీ అధ్యక్షతన ఏర్పాటు చేసి, ఆ సభకు ప్రేక్షకునిగా నేను వెళ్ళినాను. ఒకవిధంగా కాంగ్రేస్ కమ్యూనిస్టు వేదికల మధ్య నేనొక చిన్నవంతెనగా ఉండేవాడిని. కర్నూల్ రాజధానిగా 1953 అక్టోబర్ ఒకటవ తేదీనాడు ఆంధ్రరాష్ట్రం యేర్పడినది. క్రమక్రమంగా విశాలాంధ్ర దగ్గరకు వస్తుండగా కొండా వెంకట రంగారెడ్డి, చెన్నారెడ్డి గార్లు తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించిరి. మొదట విశాలాంధ్రోద్యమాన్ని బలపరిచిన రంగారెడ్డిగారు తమ వైఖరిని మార్చుకొనిరి. తెలంగాణ ఉద్యమం ప్రబలంకాగా బూర్గుల రామకృష్ణారావుగారు కొంతకాలం తటస్థవైఖరిని అవలంభించి తరువాత విశాలాంధ్ర ఉద్యమాన్ని బలపరిచిరి.

విశాలాంధ్రోద్యమానికి నవాబ్ మీర్ అహమదలీఖాన్ చిత్తశుద్ధితో కృషి చేసిరి. వారు నాకు మిత్రులు. మేము ఉభయులం మొట్టమొదటి నుండి విశాలాంధ్ర మహాసభకు తోడ్పడుతూ కాళేశ్వరరావుగారిని బలపరిచినాము. ఇదంతా ఒక పెద్ద చరిత్ర. పాగ పుల్లారెడ్డి, కొత్తూరి సీతయ్య గుప్తగార్లు మాతో కలసిపని చేసిరి. చిత్రమేమనగా రంగారెడ్డి, చెన్నారెడ్డిగార్ల నాయకత్వంలో తెలంగాణ ఉద్యమం ప్రబలంకాగా మమ్ములందరిని ఈ ఉద్యమంలో చేరవలెనని సలహాయిచ్చిన మాడపాటి

హనుమంతరావుగారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఒక అయిదు సంవత్సరాల పాటు ఉండవలెనని తరువాత విశాలాంధ్ర కావలెనని ఒక ప్రకటన చేసిరి. ఇది చాలామందికి ఆశ్చర్యంతో పాటు విచారం కలిగించినది. మాడపాటి హనుమంతరావుగారు మితవాది. రంగారెడ్డిగారి ఒత్తిడి ఈ ప్రకటనకు కారణం అని అనుకున్నాము - ఇటువంటి హృదయ దౌర్బల్యం అప్పుడప్పుడు వారు ప్రకటిస్తుండేవారు. తాము సంఘ సంస్కరణ కోరుతూ తమ కూతురుకు బాల్య వివాహం చేసిరి. ఇది హృదయ దౌర్బల్యం అని వారే ఒక పర్యాయం ఒప్పుకున్నారు. వ్యావహారిక, గ్రాంధిక భాషా వివాదంలో వారు తటస్థులుగా ఉండేవారు. అందుచేతనే ప్రతాపరెడ్డిగారు వారిని గురించి ఒకసారి వ్రాస్తూ "పంతులుగారు తమ విలువగల ఓటును యెవరికి ఈయరు" అని తెలిపినారు. తాము మాతృభాషల ద్వారా విద్యాబోధన జరుపవలెనని వేదికలమీద అందరికి చెప్పుతూ తమ కుమారునికి ఇంగ్లీషు ద్వారా చదువు చెప్పించిరి. హృదయంలో 'విశాలాంధ్ర' కావలెనని ఉన్నా ఎవరి ఒత్తిడికో లొంగి పంతులుగారు ఈ ప్రకటన చేసినారని చెప్పవలెను. స్వామి రామానంద తీర్థగారు మొదటి నుండి నిశ్చలంగా ఉండి చిత్తశుద్ధితో విశాలాంధ్రను బలపరిచిరి. బూర్గుల రామకృష్ణారావుగారు విశాలాంధ్ర వాదియే అయినప్పటికిని ముఖ్యమంత్రిగా ఉన్నందువలన నెహ్రూగారికి కోపం వస్తుందేమో అని కొంత తటస్థ వైఖరిని అవలంబించిరి. 1955 అక్టోబర్ 22వ తేదీనాడు జరిగిన ముఖ్యమంత్రుల సమవేశంలో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్ళేముందు విజయ దశమినాడు రాత్రి మేము వారిని కలుసుకున్నప్పుడు వారు ఉత్సాహంగా కనిపించలేదు. కేంద్ర ప్రభుత్వానికి విశాలాంధ్ర, తెలంగాణ రెండు వర్గాల అభిప్రాయాలు తెలియజేయగలనని అన్నారు. వారు ఢిల్లీ వెళ్ళి వచ్చిన తరువాత దీపావళినాడు తిరిగి మేము కలుసుకున్నప్పుడు విశాలాంధ్రను పూర్తిగా సమర్థిస్తూ మాట్లాడినారు. కేంద్ర నాయకుల అభిప్రాయాలను తెలుసుకొని వారు విశాలాంధ్రకు సుముఖులైనారని మేము అనుకున్నాము. రెండు ఉద్యమాలు కొనసాగినవి. ఫజల్ అలి కమిషన్‌ను నియమించి, భాషా రాష్ట్రాల సమస్యలను పరిశీలించి నివేదిక సమర్పించవలెనని కేంద్ర ప్రభుత్వం కోరినది. కమీషన్ ముందు మేమందరం వెళ్ళి మా అభిప్రాయాలను తెలుపడం జరిగింది. కమీషన్ విశాలాంధ్రను ఆమోదించి తాత్కాలికంగా తెలంగాణ యేర్పడవలెనని తన నివేదికలో సూచించినది. వాదం అనుకూలంగాను, తీర్పు వ్యతిరేకంగాను రావడం ఆశ్చర్యాన్ని కలిగించినది.

విశాలాంధ్ర, తెలంగాణ పక్షాలు మళ్ళీ ప్రబలంగా ఉద్యమాలు నడిపినవి. ఏమైనప్పటికి 1956లో నిజామాబాద్‌లో జరిగిన "భారతసేవక్ సమాజ్"ను ప్రారంభిస్తూ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూగారు విశాలాంధ్ర యేర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించినట్లు ప్రకటించిరి. ఈ విధంగా ఈ నాటకం శుభాంతమైనది.

విశాలాంధ్ర ఉద్యమ సందర్భంలో కొన్ని ఘట్టాలు మరువరానివి కొంతమంది వ్యక్తులు చిరస్మరణీయులు.

హైదరాబాదుపై పోలీసు చర్య జరిగి ప్రజలకు నిజాం నిరంకుశ పరిపాలన నుండి విముక్తి కలగగానే రాష్ట్రాన్ని విభజించవలెననే భావాలు బాగా వ్యాప్తి చెందినవి. విమోచనోద్యమానికి నాయకత్వం వహించిన స్వామి రామానందతీర్థ రాష్ట్రాన్ని విభజించవలెనని ఉద్ఘాటించి అందుకు తమ పూర్తి సహకారాన్ని యిచ్చినారు. కాళేశ్వరరావుగారి వంటి నాయకులు రాకపోకలు, కమ్యూనిస్టు నాయకుల కృషి, ఆంధ్రాభ్యుదయోత్సవాలు రాష్ట్ర విభజన ఉద్యమాన్ని బలపరిచినవి. 13వ ఆగస్టు 1953 నాడు మీర్ అహమదలీఖాన్, దేవులపల్లి రామానుజరావు, నందగిరి వెంకటరావుగార్లు ఉస్మానియా విశ్వవిద్యాలయ పట్టభద్రుల కార్యాలయంలో సమావేశమై హైదరాబాదు నగరంలో విశాలాంధ్రోద్యమాన్ని ప్రారంభించవలెనని నిర్ణయించిరి. ఈ ముగ్గురు పాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డిగార్లతో సంప్రదించి 1953 సెప్టెంబర్ 14వ తేదీనాడు ఒక సమావేశాన్ని యేర్పాటు చేసిరి. సమావేశపు నోటీసును సురవరం ప్రతాపరెడ్డిగారు ఇంగ్లీషులో వ్రాసిరి. జిల్లాల నుండి నూరుమందికిపైగా ప్రతినిధులు వచ్చి పాల్గొనిరి. తర్వాత మాడపాటి హనుమంతరావుగారు కొండావెంకట రంగారెడ్డిగారిని సంప్రదించి మీర్ అహమదలీఖాన్, రామానుజరావు గార్లను విజయవాడవెళ్ళి కాళేశ్వరరావుగారితో మాట్లాడి విశాలాంధ్రోద్యమాన్ని నడుపమని కోరిరి. ఈ విధంగా విశాలాంధ్రోద్యమము వ్యాపించి విజయవంతంగా కొనసాగినది.

ఆంధ్రనాయకులతో అయ్యదేవర కాళేశ్వరరావుగారు విశాలాంధ్రోద్యమానికి 1949 నుండి 56 వరకు పూర్తి సమయాన్ని యిచ్చి, చిత్తశుద్ధితో, ధైర్యంతో, పట్టుదలతో కృషి చేసిరి. అహమదలీఖాన్, రామానుజరావు మొదలైనవారు ఆయనను ఈ విషయంలో పూర్తిగా సమర్థించిరి. కాళేశ్వరరావుగారు విజయవాడలో న్యాయవాదిగా పనిచేసి తగినంత ద్రవ్యార్జన చేసినారు. టంగుటూరి ప్రకాశం, పట్టాభి

సీతారామయ్యగార్ల శ్రేణికి చెందిన స్వాతంత్ర్య యోధులు కాళేశ్వరరావుగారు. గాంధీజీ నాయకత్వాన జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని వీరు అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళిరి. తెలుగులో మంచిరచయిత. కొమర్రాజు లక్ష్మణరావుగారి "విజ్ఞాన చంద్రికామండలి" వీరి గ్రంథాలను ప్రకటించినది. సాహిత్యం, రాజకీయాలు రెండింటిలో వీరికి మంచి ప్రవేశం. విశాలాంధ్ర ఉద్యమాన్ని నడపడంలో వారు అనేక వ్యయ ప్రాయాసలకు గురియైనారు. కాళేశ్వరరావుగారు త్యాగానికి వెనుకాడేవారు కారు. తమ ద్రవ్యాన్ని పుష్కలంగా స్వాతంత్ర్య పోరాటంలోను, విశాలాంధ్రోద్యమంలోను ఖర్చు చేసిరి. ఇతరుల డబ్బును వారు ఆశించలేదు. నేను విజయవాడకు ఎప్పుడు వెళ్ళినా మాకు ఆతిథ్యం యిచ్చేవారు. విశాలాంధ్ర సాధనలో కాళేశ్వరరావుగారి కృషి గణనీయమైనది. 1953 అక్టోబర్‌లో టంగుటూరి ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రిగా ఏర్పడిన ఆంధ్రరాష్ట్రం మంత్రిమండలిలో తెన్నేటి విశ్వనాథంగారు ఆర్థికమంత్రిగా ఉండిరి. విశ్వనాథంగారు ప్రకాశం గారికి మిక్కిలి సన్నిహితులు, విశ్వాసపాత్రులు. హైదరాబాదులో జరిగిన విశాలాంధ్ర మహాసభలకు విశ్వనాథంగారు వచ్చి ఉద్యమాన్ని బలపరిచిరి. ఆర్థిక మంత్రిగా వారు హైదరాబాదు మీదుగా ఢిల్లీ వెళ్ళుతుండేవారు. హైదరాబాదులో ఆగిన ప్రతి సందర్భంలోను ఆంధ్రసారస్వత పరిషత్తు కార్యాలయానికి వచ్చి కొంతసేపు నావద్ద కూర్చుండి విశాలాంధ్ర కొరకు కృషి చేయమని ప్రోత్సహించేవారు. కర్నూల్‌లో రాజధానికి కావలసిన సౌకర్యాలు లేకుండెను. అందుచేత హైదరాబాదు విశాలాంధ్ర యేర్పడేవరకు ఆంధ్రరాష్ట్రానికి అతిథి రాజధానిగా ఉంటే బాగుండునని ఒక నాటి చర్చలో అనుకున్నాము. ఆవిధంగా నేను ఒక ప్రకటన కూడా, చేయడం జరిగింది. ఆ ప్రకటనను విశాలాంధ్రోద్యమ వాదులు హర్షించిరి. ఈ కాలంలో విశ్వనాథంగారిని పదేపదే కలుసుకోవడం వలన వారితో నాకు తగినంత చనువు యేర్పడినవి. ఆంధ్రనాయకులలో విశ్వనాథంగారు విశిష్టమైన వ్యక్తి; మేధావి; విజ్ఞాని; వక్త; రచయిత దేశ ఆర్థిక రాజకీయ సమస్యలను గూర్చి ప్రామాణికమైన అభిప్రాయాలు ఈయకలిగిన నాయకుడు తెన్నేటి విశ్వనాథం. చిరునవ్వు చిందులాడే వదనంతో, విసుగన్నదిలేక నిర్విరామంగా పనిచేసేవారు. ఆయన ఆకారం, వేషభాషలు, శీలం మచ్చలేనివి; నిష్కళంకమైనవి; పరిశుభ్రమైనవి. నిజానికి ఆయన ప్రతిభకు తగినంత గుర్తింపు రాలేదని చెప్పవలెను. రాజకీయాలలో ఉత్తమ సంప్రదాయాలను పాటించిన సంస్కృతీపరుడు విశ్వనాథంగారు. కాంగ్రేస్ పార్టీ నుంచి

ఆయన రాజీనామా చేసినప్పుడు ఆ పార్టీ టికెట్టు మీద గెలిచిన శాసన సభ్యత్వానికి కూడా రాజీనామా చేసి తిరిగి తన పార్టీ చిహ్నంతో నిలచి గెలిచిన ప్రజాస్వామ్యవాది విశ్వనాథంగారు. ఆధునిక భారతదేశంలో రాజకీయచరిత్రలో యిటువంటి సంఘటనలు రెండు, మూడింటికన్న యెక్కువలేవు. ఆరోజులలో పట్టాభి సీతారామయ్యగారు మధ్యప్రదేశ్ గవర్నర్‌గా ఉండేవారు. వారితో రెండు మూడు పర్యాయాలు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశం నాకు లభించినది. వారు కూడా విశాలాంధ్రోద్యమాన్ని పూర్తిగా సమర్థించిరి. 1955 డిసెంబర్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం స్నాతకోపన్యాసం ఈయడానికి డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారు హైదరాబాదు వచ్చినారు. ఆనాటి ఆయన స్నాతకోపన్యాసం ఆయన సర్వతోముఖ ప్రతిభకు ప్రతిబింబంగా ఉండినది. ఆ సందర్భంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆవరణంలో వారికి స్వాగతమీయడానికి ఒక స్వాగత సభ యేర్పాటు చేసినాము. అప్పుడు వారు మాట్లాడుతూ "త్వరలో మీరు, మేము అన్న భేదము తొలగిపోయి ఉభయులము మనము కాగలము" - అని చెప్పినారు. విశాలాంధ్ర తప్పక యేర్పడగలదన్న అసందిగ్ధమైన ప్రకటనగా దీనిని మేము భావించినాము. పట్టాభి సీతారామయ్యగారు భారతరాజకీయ నాయకులలో మహామేధావి; బహుముఖ ప్రజ్ఞాసమన్వితుడు; కాంగ్రెస్ చరిత్రకారుడు. వైస్యసూత్రకారుడైన గాంధీమహాత్మునికి పట్టాభి సీతారామయ్యగారు బ్రాహ్మణ భాష్యకారుడని ఆనాటి రాజకీయ వర్గాలలో అనుకుంటుండేవారు. పట్టాభి సీతారామయ్యగారు, సి.పి.రామస్వామి అయ్యర్‌గారు సహాధ్యాయులు తెలివి తేటలలో కూడా ఉభయులు సమానమైన ప్రజ్ఞకలవారు. జూన్ 1955లో ఫజల్ అలి కమీషన్ నివేదిక ప్రకటించపబడవలసి ఉండెను. కాని మూడు నెలలు ఆలస్యముగా ఈ నివేదిక వెలువడినది. నివేదిక వెలువడుటకు కొన్ని వారాల ముందుగా ఢిల్లీ నుండి కర్నూల్ వెళ్ళుతు మార్గమధ్యమున హైదరాబాదులో ఆగిన అప్పటి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డిగారు నిజాం కళాశాల తెలుగు సారస్వత సమితికి ప్రారంభోత్సవము కావించుచు హైదరాబాదు విభజన కాగలదనీ, విశాలాంధ్ర సమస్యను తెలంగాణ శాసనసభ్యుల నిర్ణయానికి వదిలివేయవచ్చునీ రాజకీయ జోస్యము చెప్పిరి. ఇది రాజకీయవర్గాలలో కొంత కలవరము కలిగించినది. మొత్తంమీద హైదరాబాదు విభజన తప్పక జరిగితీరగలదను సత్యము స్థిరపడినది. విశాలాంధ్ర ఏర్పాటుకు రాధాకృష్ణన్‌గారి తోడ్పాటు పూర్తిగా లభించినది. గోవింద

వల్లభ్ పంత్‌గారు అప్పుడు కేంద్రంలో హోంమంత్రిగా ఉండిరి. పంత్‌గారి రాజకీయ విజ్ఞతపట్ల జవహర్‌లాల్ నెహ్రూకు పూర్తి నమ్మకం. గోవింద వల్లభ్ పంత్‌గారు పెద్ద రాష్ట్రాలకు, హైదరాబాదు రాష్ట్ర విభజనకు, విశాలాంధ్ర యేర్పాటుకు సుముఖులు. రాధాకృష్ణన్‌గారి మాట అంటే గోవింద వల్లభ్ పంత్‌గారికి, జవహర్‌లాల్ నెహ్రూగారికి గౌరవం, విశ్వాసం. విశాలాంధ్రోద్యమం క్రమక్రమంగా బాగా వ్యాపించినది. అత్యధిక సంఖ్యాకులు ఆ ఉద్యమాన్ని బలపరిచినారు. కర్ణాటక, మహారాష్ట్రుల ఆమోదం లభించినది. విశాలాంధ్ర అవతరించినది.

తెలంగాణ ఉద్యమ విజృంభణతో గోలకొండ పత్రికతో నేను సంబంధము వదులుకొన్నాను. ఈ ఉద్యమం రాబోతున్నదని గ్రహించి కొంతముందుగానే అనగా 1952లో నేను పత్రికతో సంబంధము వదులుకొన్నాను. అయితే అందువలన రాజారామేశ్వరావు, నరోత్తమరెడ్డిగార్లతో స్నేహబంధాలకు భంగం కలుగలేదు. తీవ్రంగా యీ రెండు ఉద్యమాలు సాగేరోజుల్లో కూడా మేము కలుసుకుంటుండేవాళ్ళం. గోలకొండ పత్రిక పూర్తిగా తెలంగాణ ఉద్యమాన్ని సమర్థించినది. 1956లో విశాలాంధ్ర నిర్ణయం ప్రకటన తరువాత రాజారామేశ్వరరావు, నరోత్తమ రెడ్డిగార్లు ఒకరోజు ఉదయం వచ్చి కొంతకాలక్షేపం చేసిన తరువాత గోలకొండ పత్రికతో తిరిగి సంబంధం పెట్టుకోవలసిందని కోరిరి. ఆ విధంగా మళ్ళీ సంపాదకీయాలు వ్రాయడం ప్రారంభించి పత్రిక ఆగిపోయేవరకు కొనసాగించినాను. ఆశయాలలో అభిప్రాయాలలో భేదాలురావడం సహజం. అటువంటి విభేదాలు నిజమైన స్నేహానికి అడ్డురావు.

1956, ఒకటవ నవంబర్ నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినది. సంజీవరెడ్డిగారు ముఖ్యమంత్రి. బులుసు ప్రభాకర పట్టాభి రామారావుగారు విద్యామంత్రి. కేంద్ర ప్రభుత్వం అఖిలభారతస్థాయిలో మూడు అకాడమీలను నెలకొల్పినది. ఒకటి సాహిత్య అకాడమి, రెండవది సంగీత నాటక అకాడమి, మూడవది లలిత కళా అకాడమి. రాష్ట్ర ప్రభుత్వం కూడ యీ పద్ధతిలో మూడు అకాడమీలను నెలకొల్పవలెనని నిశ్చయించి 1957, ఆగస్టు నెల 7వ తేదీనాడు సాహిత్య అకాడమిని అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌గారి కరకమలాలచేత ప్రారంభింపజేసినది. అకాడమికి అధ్యక్షులు డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డిగారు, ఉపాధ్యక్షులు విశ్వనాథ సత్యనారాయణగారు, కార్యదర్శిని నేను. కార్యదర్శి పదవిని

కాటూరి వెంకటేశ్వరరావుగారు అపేక్షించినట్లు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు వారి పేరును ప్రతిపాదించినట్లు నాకు తెలిసినది. నార్ల వెంకటేశ్వరరావుగారు, కాళోజి నారాయణరావుగారి పేరును ప్రతిపాదించినట్లు తెలిసినది. అబ్బూరి రామకృష్ణారావుగారికి కూడా కార్యదర్శి తాను కావలెనని కోరిక ఉండినదని విన్నాను. నార్ల వెంకటేశ్వరరావుగారు, అబ్బూరి రామకృష్ణారావుగారు ఉభయులు పట్టాభి రామారావుగారికి సన్నిహితులు, సలహాదారులుగాఉండిరి. ఏ కారణం వల్లనో యీ ముగ్గురిపేర్లు ప్రభుత్వం యిష్టపడలేదు. తరువాత ఒకరోజు అబ్బూరి రామకృష్ణారావుగారు నా వద్దకు వచ్చినారు. అంతకుముందు నాకు వారితో పరిచయము లేదు. అదే తొలిపరిచయము. కొంతసేపు మాట్లాడిన తర్వాత సాహిత్య అకాడమి కార్యదర్శిగా నేను ఉంటే బాగుండునని అన్నారు. అప్పుడు నేను వారితో, ఎవరి వద్దకు వెళ్ళి అర్థించే స్వభావం నాకు లేదు. వారు కోరితే అంగీకరిస్తాను, నా అంతటనేను కావలెనని అర్థించను అని చెప్పినారు. తర్వాత రెండు రోజులకు పట్టాభి రామారావుగారి కారుతీసుకొని అబ్బూరి రామకృష్ణారావు గారువచ్చి మంత్రిగారు నన్ను ఆహ్వానించినారు అని తెలిపినారు. నేను వారి వెంట వెళ్ళి మంత్రిగారిని కలుసుకోగా మంత్రిగారు కార్యదర్శిగా ఉండడానికి అంగీకరించమని నన్ను కోరినారు. నేను అంగీకరించినాను. 22 సంవత్సరాల తర్వాత అనగా 1979, ఫిబ్రవరి 15వ తేదీనాడు నేను కార్యదర్శి పదవిని ఐచ్ఛికంగా వదులుకున్నాను. సభ్యులందరు నేను కొనసాగవలెననే ఉద్దేశం కలిగిన పరిస్థితులలోనే వదులుకొన్నారు. ఈ 22 సంవత్సరాలు సాహిత్య అకాడమి పురోగమించి సుమారు మూడునూర్లకుపైగా గ్రంథాలు ప్రకటించి, అనేక సమావేశాలు నిర్వహించి ప్రశంసనీయంగా కృషి చేసినది. సాహిత్య అకాడమి ద్వార సకలాంధ్ర కవిపండితుల పరిచయం నాకు కలిగినది. అందరి ఆదరాభిమానాలు లభించినవి. సాహిత్య అకాడమి కృషి యిటీవలి కథ. దానిని గురించి భవిష్యత్తులో సరియైన తరుణంలో వివరాలు చెప్పవలసి ఉంటుంది.

నాది ఎవరిని ఏమీ అడిగే స్వభావం కాదు. నాచేతనైన సహకారం అనేకులకు లభించినది. ఎన్నడూ ఎవరి ముందు తలవంచలేదు; చేయిచాపలేదు. అన్ని జాతీయోద్యమాలలో పాల్గొని ఆత్మగౌరవంతో జీవితాన్ని గడిపినాను.

"అనాయాసేన మరణం
వినాదైన్యేన జీవనం"

అన్నదే నా ఆదర్శం. దైన్యములేక జీవితం గడిచినది. ఆయాసములేక మరణము కలుగునో కలుగదో చూడవలసి ఉన్నది. 1960లో రాజ్యసభ సభ్యత్వము ఉప ఎన్నికలో నాకు అయాచితముగా లభించినది. నేను యెవరివద్దకు వెళ్ళలేదు. మిత్రులు నరోత్తమరెడ్డిగారు యిందుకు కృషి చేసిరి. 1962లో యీ సభ్యత్వకాలం పూర్తి అయినది. తిరిగి నాకు రావలసి ఉండెనుకాని అట్లు జరుగలేదు. అయినా నేను విచారపడలేదు. ఎవరినీ ప్రాధేయపడలేదు. నేను రాజ్యసభలో సభ్యునిగా ఉన్న కాలంలో అతిరథమహారథులు చాలామంది పార్లమెంటులో ఉండేవారు. ప్రముఖ చరిత్రకారుడు పరిశోధకుడు డాక్టర్ తారాచంద్ రాజ్యసభలో ఉండేవారు. ఆయనను అన్నిపక్షాల సభ్యులు గౌరవించేవారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలు కుంజ్రూగారికి కరతలామలకాలు. ఏ విషయాన్ని గూర్చి మాట్లాడిన సమగ్రంగా మాట్లాడేవారు. సభ్యులంతా ఆయన ప్రసంగాన్ని శ్రద్ధతో ఆసక్తితో వినేవారు. కుంజ్రూగారు గోపాలకృష్ణగోఖలే, శ్రీనివాసశాస్త్రి ప్రభృతులతో కలసి పనిచేసిన మితవాదులు. గొప్ప విజ్ఞాని; మేధావి. ఆ రోజుల్లో సి.పి.రామస్వామి అయ్యర్‌గారి కుమారుడు పట్టాభిరామన్‌గారు పార్లమెంట్‌లో ఉండేవారు. ఇందిరాగాంధీగారి భర్త ఫిరోజ్‌గాంధీగారు లోకసభ సభ్యులుగా ఉండేవారు. ఆయన స్వతంత్రభావాలు కలిగిన కాంగ్రేసు సభ్యుడు. ప్రధానమంత్రిగారిని విమర్శించడంలో వెనుదీసేవారు కారు. పగటి భోజన సమయంలో పార్లమెంటు సెంట్రల్‌హాలులో ఆయన కూర్చుంటే చుట్టూ స్వతంత్ర భావాలు గల సభ్యులు చేరేవారు. వారందరికీ ఆయన ఒక నూతనోత్తేజాన్ని కలిగించేవారు. ప్రభుత్వపక్షాన్ని విమర్శించవలసి వచ్చినప్పుడు వెనుకాడేవారుకారు. ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూకు యిష్టులైన మంత్రులను కూడ నిర్భయంగా విమర్శించేవారు. అందుచేత ఆయనకు పార్లమెంట్ సభ్యులలో ఒక విశిష్టత ఉండేది. జవహర్‌లాల్ నెహ్రూగారికి యిష్టుడైన టి.టి.కృష్ణమాచారి గారిని ఆర్థికమంత్రి పదవికి రాజీనామా చేయించడానికి కారణభూతమైన ఒక వ్యవహారాన్ని పార్లమెంటులో విజయవంతంగా వెలికిదెచ్చిన గౌరవం ఫిరోజ్‌గాంధిగారికి చెందినది. ఆయన మంచి పార్లమెంటేరియన్‌గా కీర్తిగాంచినారు.

1962లో ఒకనాడు నరోత్తమరెడ్డిగారు నా దగ్గరకు వచ్చి అప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా ఉండిన డి.ఎస్.రెడ్డిగారు నన్ను ఆహ్వానించినట్లు తెలిపి తమవెంబడి తీసుకొనివెళ్ళిరి. అప్పుడు సెనేట్ నుండి సిండికేట్‌కు ఒక సభ్యుని

ఎన్నుకోవలసి ఉండెను. డి.ఎస్.రెడ్డిగారు నన్ను యీ స్థానానికి పోటీ చేయమని చెప్పగా నేను పోటీచేసి యెన్నిక అయినాను. నాకు మొదటి నుండి విశ్వవిద్యాలయ వ్యవహారాలలో కొంత అభిరుచి, ఆసక్తి. 1953లో పట్టభద్రుల నియోజకవర్గం నుండి నేను సెనేట్‌కు ఏకగ్రీవంగా యెన్నికయైనాను. అప్పటినుండి మధ్య ఒకటి రెండు సంవత్సరాల అంతరాయంతో నేను సెనేట్‌లో సభ్యుడుగా ఉండినాను. 1962 నుండి 76 వరకు సిండికేట్‌లో సభ్యుడుగా ఉండినాను. అనగా సుమారు 22, 23 సంవత్సరాలు విశ్వవిద్యాలయ వ్యవస్థతో సంబంధము కలిగి ఉంటిని. 1972-76 మధ్యన నాలుగు అయిదు పర్యాయాలు తాత్కాలిక ఉపాధ్యక్షునిగా పనిచేసినాను. ఆ కాలంలో ఉపాధ్యక్షులుగా ఉండిన డా॥ డి.ఎస్.రెడ్డిగారు, రావాడ సత్యనారాయణగారు నన్ను అత్యంతము అభిమానించినారు. తరువాత విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులైన నరోత్తమరెడ్డిగారు నాకు చిరకాలం నుండి ఆప్తమిత్రులు. 1966-67 సంవత్సరాలలో కాబోలు విశ్వవిద్యాలయానికి ప్రభుత్వానికి మధ్య తీవ్రమైన అభిప్రాయభేదాలు ఉత్పన్నమైనవి. అప్పటి ముఖ్యమంత్రిగారు విశ్వవిద్యాలయం మీద పెత్తనం చెలాయించవలెనని పట్టుబట్టిరి. ఉపాధ్యక్షులైన డి.ఎస్.రెడ్డిగారు విశ్వవిద్యాలయం స్వయంపరిపాలన కలిగిన విద్యావ్యవస్థ; అందులో ప్రభుత్వం జోక్యం పనికిరాదని అభిప్రాయపడిరి. అప్పుడు ప్రభుత్వానికి ఆగ్రహం వచ్చినప్పటికిని నేను, నా మిత్రులు డి.ఎస్.రెడ్డిగారినే బలపరిచి స్వయంపరిపాలన అధికారాన్ని సమర్థించినాము. సెనేట్ ఎకాడమిక్ కౌన్సిళ్ళలో మా అభిప్రాయం నెగ్గినది. అయితే ప్రభుత్వ ప్రతినిధులు కొందరు డి.ఎస్.రెడ్డిగారితో ఉండిన మైత్రిని గూడా విస్మరించి ముఖ్యమంత్రిగారి పట్టుదలచే సమర్థించిరి. కాని వారి సమర్థన నెగ్గలేదు. ఈ విధంగా విశ్వవిద్యాలయంలో నేను, నా మిత్రులు స్వయం పరిపాలనాధికారానికి తోడ్పాటు యిచ్చినాము. ఆ తోడ్పాటు అధ్యాపకులలో అత్యధిక సంఖ్యాకుల ఆమోదం పొందినది. డి.ఎస్.రెడ్డిగారు సమర్థుడైన పరిపాలకుడు. విద్యారంగాన్ని గూర్చి కూలంకషమైన పరిజ్ఞానం, ధైర్యసాహసాలు కలిగిన విజ్ఞాని. ఆంగ్లంలో మంచి రచయిత. ఆయన శైలి విశిష్టమైనది. ఆయన ప్రసంగాలు రచనలు హాస్యోక్తులతో, ఛలోక్తులతో మనోరంజకంగా ఉండేవి. ఆయన కాలంలో విశ్వవిద్యాలయం బాగా అభివృద్ధి చెందినది. అనేక శాఖలు, అనేక భవనాలు నిర్మాణమైనవి. రాధాకృష్ణన్, రాజగోపాలాచారి, చాగ్లా మొదలైన మనీషులు ఆయనను అభిమానించేవారు. ఆయనకు నా పట్ల ఎంతో ఆదరాభిమానాలు ఉండేవి.

విశ్వవిద్యాలయం రాజకీయనాయకుల ప్రభావానికిలోనుగాక స్వయం పరిపాలన కలిగిన సంస్థగా విద్యావేత్తల అభిప్రాయాలకు అనుగుణంగా ముందడుగు వేయవలెనని నా దృఢాభిప్రాయం. ఇటీవలి సంఘటనలు నా అభిప్రాయాన్ని మరింత బలపరిచినవి. పదవులలో నున్నందువలన విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు సాహిత్య సంస్థలు తమ అడుగులకు మడుగులొత్తవలెననే రాజకీయ నాయకుల చిత్తవృత్తికి అనేక ఉదాహరణలు విశ్వవిద్యాలయరంగంలో కన్పిస్తున్నవి. ఇది విచారకరం. ఈ చిత్తవృత్తి, ఇందుకు అనుగుణమైన చర్యలు సాహిత్యానికి, సంస్కృతికి, విద్యాభివృద్ధికి గొడ్డలిపెట్టు అనే అభిప్రాయాన్ని గడచిన దశాబ్దాలలో జరిగిన సంఘటనలు బలపరిచినవి.

నా జీవితం పూర్తిగా తెలుగుభాషా సంస్కృతులకు అంకితము అయినప్పటికిని ఉర్దూభాష పట్ల నాకు అభిమానం. ఆ అభిమానంతో పోలీసు చర్య తరువాత అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ మొదలయిన సంస్థలలో సభ్యుడనై ఉర్దూకు న్యాయమైన స్థానం లభించవలెనన్న అభిప్రాయాన్ని బలపరిచినాను. ఈనాటికి నేను అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూసంస్థలో సభ్యుడను. ఈ సభ్యత్వ సంబంధము సుమారు ఇరువై సంవత్సరాలకు పైబడినది. మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో నేను మొదటి నుండి సభ్యుడను. ఉర్దూ అకాడమి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు మొదటి టర్మ్‌లోనే నేను జనరల్ కౌన్సిల్‌లోను కార్యవర్గంలోను సభ్యుడను. ఉర్దూ మిత్రులు నన్ను ఆదరించి అభిమానించినారు. నాపైన పూర్తి విశ్వాసం ప్రకటించినారు. సుమారు పది పన్నెండు (10, 12) ఉర్దూ సంస్థలలో నేను 20 సంవత్సరాలకుపైగా సభ్యుడనుగా ఉన్నాను. ఉర్దూ మాతృభాషగా గలిగిన మిత్రులు హైదరాబాదులో చాలామంది ఉన్నారు. నవాబ్ మెహదీ నవాజ్‌జంగ్ గారికి నాపైన అభిమానం ఉండేది. శ్రీ ఫజులుర్ రహమన్‌గారికి నాపైన అభిమానం. ఆయన మొదటి నుంచి జాతీయవాది. సరోజినీ నాయుడుగారి కుటుంబానికి సన్నిహితుడు. విద్యాశాఖకు డైరెక్టర్‌గాను, హైదరాబాదు రేడియోకు డైరెక్టర్‌గాను అలీగఢ్ విశ్వవిద్యాలయానికి ప్రో-వైస్ చాన్సలర్‌గాను ఆయన అనేక ఉన్నత పదవులను నిర్వహించినారు. సాహిత్య అకాడమి ఏర్పడినప్పుడు నాకోరిక మీద పట్టాభి రామారావుగారు ఆయనను జనరల్ కౌన్సిల్‌లోను, కార్యవర్గంలోను సభ్యునిగా నియమించిరి. ఆయనతో 30 సంవత్సరాల అనుబంధం ఆయన సహకారం నాకు పూర్తిగా లభించినది. ఆయన అన్నగారు అతావుర్ రహమాన్‌గారు నాపైన అభిమానం కలవారు. హైదరాబాదు నగరంలో

ఉర్దూ భాషకు గడచిన 30 సంవత్సరాలు తన జీవితాన్ని పూర్తిగా అంకితంచేసి, అంజుమన్‌తరక్కి ఉర్దూకు వెన్నెముకగా నిలిచిన హబీబుర్ రహమాన్‌గారు నాపైన అత్యంత ఆదరాభిమానాలు విశ్వాసం కలిగిన పెద్దలు. ఆయనకూడా ప్రభుత్వంలో ఉన్నతోద్యోగాలు నిర్వహించి కొంతకాలం ప్రభుత్వ కార్యదర్శిగా పని చేసి రిటైర్ అయిన ఉన్నతోద్యోగి. ఉర్దూభాషా సంస్కృతులకు పూర్తి సమయాన్ని వినియోగించినారు. అనేక ఉర్దూ సంస్థలను ఆయన స్థాపించి నిర్వహిస్తున్నారు. ఉదార భావాలు కలిగిన పరిపాలనాదక్షుడు ఆయన. మాడపాటి హనుమంతరావు వంటి క్రమశిక్షణ కలిగిన వ్యక్తి మరొకరు ఎవరైన ఉన్నారా అంటే నిస్సందేహంగా నేను హబీబుర్ రహమాన్‌గారి పేరు చెప్పగలను. వీరందరు నాకన్న వయస్సులో 20 సంవత్సరాలు పెద్దవారు.

హైదరాబాదు ఉర్దూ దిన పత్రికలో సియాసత్ ముఖ్యమైనది. ఈ పత్రిక 25 సంవత్సరాలకు పైగా నడుస్తున్నది. జాతీయభావాలు కలిగిన ఈ పత్రికకు సంపాదకుడు శ్రీ ఆబిద్‌అలీఖాన్. ఆయన విద్యాధికుడు; ఉన్నత కుటుంబానికి చెందినవాడు; విశాల దృక్పథం కలిగినవాడు. ఉర్దూ భాషా సంస్కృతుల వ్యాప్తికి నిరంతర కృషి చేస్తూ హైదరాబాదు సంస్కృతికి చిహ్నంగా ఉన్నాడు. తెలుగు భాష పట్ల అభిమానం కలవాడు. తన పత్రికలో తెలుగు భాషా సంస్కృతులను, తెలుగు రచయితలను పరిచయం చేయడంలో ఆసక్తి కలిగినవాడు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమిలో 10 సంవత్సరాలకుపైగా సభ్యుడుగా ఉన్నాడు. హైదరాబాదు నగరంలో యెక్కడ ఏ మంచి పని జరిగినా అందుకు కావలసిన సహకారం యీయడానికి సర్వదా సంసిద్ధుడు; విశేషించి నా ఉర్దూమిత్రులలో ముఖ్యుడు. శ్రీమతి జీనత్‌సాజిదా ఉర్దూ సాహిత్యంలో నిష్ణాతమైన పాండిత్యం గల విదుషీమణి, ఉత్తమ శ్రేణి రచయిత్రి, ఉదారభావాలు కలిగి యితర భాషలవారితో కలసిమెలసి ఉండే స్వభావం కలది. అంజుమన్ తరక్కీ ఉర్దూ అకాడమి మొదలైన అనేక సంస్థలతో ఆమెకు సంబంధం. సుమారు 30 సంవత్సరాలకుపైగా నాకు ఆమెతో పరిచయం. ఉర్దూలో "తెలుగు సాహిత్యచరిత్ర"ను ఆమెతో కలిసి రచించే అవకాశం నాకు కలిగింది. ఆ గ్రంధాన్ని అంజుమన్ తరిక్కీ ఉర్దూ ప్రకటించినది. శ్రీమతి జీనత్‌సాజిదా భర్త శ్రీ హుసేనీషాహీద్, ఉర్దూ ఆర్ట్సు కాలేజికి ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఈ ఉభయులు అభ్యుదయభావాలు కలిగిన విద్యావంతులు. వీరు నాకు ముఖ్యమైన మిత్రులు. ఇదే విధంగా హిందీ సంస్థలతో

కూడా నాకు సంబంధం ఉండినది. ఎల్.ఎన్.గుప్తగారు అధ్యక్షులుగా ఉండిన హిందీ ప్రచారసభలో నేను చాలాకాలం సభ్యుడిగా ఉంటిని. ఆయనతో హిందీ సంస్థలలోనే కాక కొన్ని సహకారసంస్థలలో కూడా కలిసి పనిచేసే అవకాశం నాకు లభించినది. Co-operative Trading Society, Co-operative General Insurance Society లలో గుప్తాగారి ప్రోత్సాహంతో పనిచేసినాను. హైదరాబాద్ నగరంలో శ్రీ ఎల్.ఎన్.గుప్త ఒక విశిష్టమైన వ్యక్తిగా ఉండేవారు. ఆయన సహకారం తెలుగు, మరాఠి, కన్నడ సంస్థలకు కూడా లభించినది. ఎవరైనా సహాయం అడిగితే కాదనే స్వభావం శ్రీ ఎల్.ఎన్.గుప్తగారిది కాదు. ఆయన సతీమణి శ్రీమతి ప్రేమలతాగుప్త. ఈమెకు అనేక విద్యాసంస్థలతోను, సాంఘిక సంస్థలతోను సంబంధము కలదు. ఈ సంస్థల అభివృద్ధికి ఆమె ప్రశంసనీయమైన కృషి చేసినది. ఎల్.ఎన్.గుప్తగారికి నాపైన ప్రత్యేకమైన అభిమానం ఉండేది. పండిత శ్రీరామశర్మ మొదలైన హిందీ రచయితలతోను, పండితులతోను నాకు స్నేహసంబంధాలు ఉన్నవి. ఇదే విధంగా మహారాష్ట్ర, కర్ణాటక సంస్థలలో కలిసి పనిచేసే అవకాశం నాకు దొరికినది. హైదరాబాదు సంస్కృతి ప్రత్యేకత ఇది. భాషా దురభిమానాలు లేకపోవడం, అన్ని భాషలపైన అభిమానం కలిగి ఉండడం, సకల భారత దృక్పథం కలిగి ఉండడం హైదరాబాదు సంస్కృతి ప్రత్యేకత.

కేంద్ర సాహిత్య అకాడమి తెలుగు సలహాసంఘంలో సుమారు 20 సంవత్సరాలనుండి నేను సభ్యుడుగా ఉన్నాను. 1962 నుంచి 78 వరకు జనరల్ కౌన్సిల్‌లోను, 1968-78 వరకు కార్యవర్గంలో సభ్యుడుగా ఉండడం జరిగింది. డాక్టర్ జాకీర్‌హుసేన్, డాక్టర్ సునీతి కుమార్ చటర్జి వంటి విజ్ఞానుల అధ్యక్షతలో నేను కార్యవర్గసభ్యుడుగా ఉండేవాడిని. కేంద్రసాహిత్య అకాడమి సమావేశాలలో భారతదేశభాషల రచయితలతో పరిచయం కలిగినది. పాఠ్యగ్రంథాల ప్రచురణ కొరకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యేర్పాటు చేసిన తెలుగు అకాడమిలో అది స్థాపితమైన నాటి నుండి యీనాటి వరకు సభ్యుడుగా ఉండి మాతృభాషలలో విశ్వవిద్యాలయస్థాయి వరకు పాఠ్యగ్రంథాల రచనకు సంబంధించిన సమస్యలను అవగాహన చేసుకొని ఆలోచించే అవకాశం కల్గింది. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు కోశాధ్యక్షునిగా పనిచేసినాను. అంతర్జాతీయ తెలుగు సంస్థ స్థాపించినప్పటి నుండి యిప్పటివరకు అందులో సభ్యునిగా ఉన్నాను. ఈ

విధంగా తెలుగుభాషా సంస్కృతుల వికాసంలో 40 సంవత్సరాలకు పైగా సంబంధం కలిగి పూర్తి సమయాన్ని అందుకు వినియోగించి యధాశక్తి కృషి చేసే అవకాశం నాకు లభించినది. 1941లో వరంగల్ పట్టణ స్థానిక గ్రంథాలయమైన శబ్దానుశాసన గ్రంథాలయానికి కార్యదర్శిగా ఎన్నికైనాను. 1943 నుంచి తెలంగాణ కంతటికి ప్రాతినిధ్యం వహించే సారస్వత పరిషత్తులో సభ్యుడనైనాను 1957లో ఆంధ్రప్రదేశ్ కంతటికి ప్రాతినిధ్యం వహించే సాహిత్య అకాడమికి, కార్యదర్శిని అయినాను. 1962 నుంచి సకల భారత దేశానికి ప్రాతినిధ్యం వహించే కేంద్ర సాహిత్య అకాడమికి తెలుగుసలహా సంఘంలోను, తరువాత జనరల్ కౌన్సిల్‌లోను, ఆ పిమ్మట కార్యవర్గంలోను, ఆ పిమ్మట కార్యవర్గంలోను సభ్యుడనైనాను. 1975 తెలుగు మహాసభల కోశాధ్యక్షుడనై అంతర్జాతీయ తెలుగు సంస్థలో సభ్యుడనైనాను. ఈ విధంగా పట్టణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయివరకు తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి యధాశక్తి కృషి చేసే అవకాశం నాకు లభించినది. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో 1981 ఏప్రిల్‌లో జరిగిన రెండవ ప్రపంచ తెలుగు సభల సందర్భంలో వెలువడిన ప్రత్యేక సంచికకు సంపాదకునిగా పనిచేసినాను.

జీవితంలో నాకు కల్గిన అదృష్టాలలో మిత్రుల సహకారం ఒకటి. నా చిన్ననాటి సహాధ్యాయులు నాపైన ప్రత్యేకమైన ఆదరాభిమానాలు చూపించినారు. హైదరాబాదు సివిల్ సర్వీస్‌లోచేరి కలెక్టర్ మున్నగు పదవులను నిర్వహించిన పర్సా వెంకటేశ్వరరావు భాషా సేవలో నాకు తోడ్పడినారు. మరొక సివిలియన్ ఉద్యోగి ప్రస్తుతం అంతర్జాతీయ తెలుగు సంస్థ డైరెక్టర్ ఎమ్.రామప్ప నాపైన సంపూర్ణమైన విశ్వాసం కలిగి ఏది చెప్పితే అదిచేసి నాకు ఆప్తవర్గంలో ఒక్కడై నేను నిర్వహించిన ఉద్యమాలకు తోడ్పడినాడు. రామప్ప హైస్కూలు నుండి నా సహాధ్యాయి. గణితశాస్త్రం, జ్యోతిష్యాలను ఆయన అభిమానించి, వానిలో ప్రావీణ్యము సంపాదించినాడు. ఫారసీ, అరబ్బీలలో తగినంత పరిచయం సంపాదించి సర్వమత గ్రంథాలను చక్కగా చదివినాడు. ఆయనది కూశాగ్రబుద్ధి, స్నేహితులపైన అపారమైన అభిమానం కలిగిన విశ్వాసపాత్రుడు. శ్రీ నరోత్తమరెడ్డి నామాటలో పూర్తి విశ్వాసం కలిగి నాతో సహకరించినాడు. స్వర్గీయ పులిజాల హనుమంతరావు, ధవళా శ్రీనివాసరావు ప్రభృతులు, గడియారం రామకృష్ణశర్మ మొదలైన మిత్రులు నన్ను పూర్తిగా బలపరిచి నావెంట ఉండినారు. ఉర్దూ మిత్రులకు నాపైన, నా మాటపైన పూర్తి విశ్వాసం. హైదరాబాదు

విశ్వవిద్యాలయ మొదటి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో నేను సభ్యునిగా ఉండినాను. అప్పటి ఉపాధ్యక్షులు గురుబక్షసింగ్. సింగ్‌గారికి నాపైన ఎంతో అభిమానం ఉండేది.

టాగూర్ శతవార్షికోత్సవాలకు అప్పటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అధ్యక్షులుగాను, నేను కార్యదర్శిగాను పనిచేసినాము. గురజాడ శతవార్షికోత్సవ సంఘంలో నేను సభ్యుడనై ఇంగ్లీషులో, తెలుగులోను రెండు సంచికలకు సంపాదకునిగా పనిచేసినాను. స్వర్గీయ దామోదరం సంజీవయ్య గారు విద్యాధికులు, నిరాడంబరులు, సజ్జనులు; మంచివక్తలు; కవులు; రచయితలు అనేక ఉన్నత పదవులను నిర్వహించిన పరిపాలనాదక్షులు. వారికి నాపైన సంపూర్ణమైన విశ్వాసం ఉండినది. ఆంధ్రప్రదేశ్ తొలి విద్యా మంత్రి అయిన పట్టాభిరామారావుగారు నన్ను అభిమానించేవారు. ఎమ్.ఆర్.అప్పారావుగారికి నాపట్ల అభిమానం ఆదరం ఉన్నవి. ఈ విధంగా నేను పనిచేసిన అనేక ఉద్యమాలలో ఎందరో సజ్జనుల ఆదరాభిమానాలు పొందగలిగినాను.

1957 తరువాత వివిధ ఉద్యమాలలోను, వివిధ సంస్థలలోను నాకు కొన్ని సమస్యలు ఎదురైనవి. వానిని పరిష్కరించుకోవడం కూడా జరిగింది. ఆ సందర్భంలో కొంతమందితో వ్యవహరించవలసి వచ్చినది. నాకు సంబంధం కలిగిన అన్ని సంస్థలలోను వాని అభివృద్ధికై నా శక్త్యానుసారం కృషి చేయడం జరిగింది. 1956-70 మధ్యన గల 14 సంవత్సరాల కాలంలో జరిగిన సంఘటనలను గూర్చి యెక్కువగా వ్యాఖ్యానించడం యిబ్బందితో కూడినపని. చాలామంది సమకాలికులు; సంఘటనలు చూచినవారు కూడా చాలామంది ఉన్నారు. అందుచేత యిప్పుడు వ్యాఖ్యానం చేయడం సమంజసం కాకపోవచ్చు. ఆ అవకాశాన్ని మరికొంత కాలం తర్వాత వినియోగించుకోవడం బాగుంటుందని నాకు తోచినది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు కొన్ని ప్రచురణలు

1.	ఆంధ్ర మహాభారతోపన్యాసములు	రూ.	100/-
2.	తెలుగు వాగ్గేయకారులు – అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం	రూ.	70/-
3.	తెనుగు సాహితి	రూ.	36/-
4.	స్త్రీల రామాయణపు పాటలు	రూ.	36/-
5.	సమీక్షణం	రూ.	36/-
6.	పరిణతవాణి – 1,2,3,4,5,6 సంపుటాలు (36,45,60,65,60,150)	రూ.	370/-
7.	ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు	రూ.	70/-
8.	ఇరివెంటి వ్యాసాలు	రూ.	30/-
9.	శాలివాహన గాథా సప్తశతీసారము	రూ.	15/-
10.	రాయప్రోలు రచనలు – తత్వవివేచన	రూ.	60/-
11.	తెలుగు సాహిత్యోద్ధారకులు	రూ.	40/-
12.	మల్లికా గుచ్ఛము	రూ.	8/-
13.	మన జాతినిర్మాతలు	రూ.	4/-
14.	సుమతి, వేమన, కృష్ణ శతకాలు	రూ.	24/-
15.	ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక	రూ.	50/-
16.	ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక	రూ.	250/-
17.	తెలంగాణాలో జాతీయోద్యమాలు	రూ.	10/-
18.	సంస్కృత పాఠవల్లరి	రూ.	4/-
19.	నా సాహిత్యోపన్యాసములు	రూ.	5/-
20.	గౌతమబుద్ధుడు – జవహర్‌లాల్ నెహ్రూ	రూ.	3-60
21.	విమర్శకవతంసులు	రూ.	45/-
22.	మన దేశం – తెలుగుసీమ	రూ.	7/-
23.	మన నదులు – కృష్ణా గోదావరులు	రూ.	3/-
24.	మధురభక్తి – ముగ్ధభక్తి	రూ.	80/-
25.	ప్రాచీన కవిత	రూ.	10/-
26.	ప్రసంగ వ్యాసాలు	రూ.	5/-
27.	దశరూపక సారం	రూ.	5/-
28.	భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం	రూ.	2/-
29.	నా రేడియో ప్రసంగాలు	రూ.	5/-
30.	సాహిత్యానువాదం : సమాలోచనం	రూ.	60/-
31.	శివరాత్రి మాహాత్మ్యము	రూ.	75/-
32.	తెలుగు రచన	రూ.	7/-
33.	ఆంధ్ర వాఙ్మయ చరిత్ర	రూ.	85/-
34.	సాహిత్య సోపానములు	రూ.	75/-
35.	మన హాస్యము	రూ.	100/-
36.	తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం	రూ.	100/-
37.	వ్యాస గుళుచ్ఛం (1, 2 భాగాలు)	రూ.	130/-
38.	తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం	రూ.	150/-